# యజ్ఞం

నవల

- సి.హెచ్.సీత



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 67

జనవరి 2012 నుంచి ఆగస్టు 2013 వరకూ

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా వచ్చిన నవల

# 1

**తీవ్రమైన వత్తిడి మనస్సు, బుద్ధి, అంతరంగాల మీద. ఇది నాకు మామూలే.** అందుకే ఎప్పటిలాగే ఈ పరుగు! పరుగులు నాకు కొత్తకాదు. పరుగులకీ నేను కొత్తకాదు.

భిక్షగాడు దుక్కడు నేనిచ్చిన రూపాయితో లాటరీ టిక్కెట్టు కొనడం చాటుగా చూసినప్పుడూ - పనిమనిషి లచ్చిమి అభిమాన హీరో సినిమాని బ్లాకులో టిక్కట్టు కొని చూసొచ్చినప్పుడూ - రిక్షా అప్పన్న అన్నం పెట్టే రిక్షాని తాకట్టు పెట్టి తాగొచ్చినప్పుడూ - గుమస్తా గుర్నాథం గుర్రప్పందాలాడ్డానికి వెళ్ళినప్పుడూ - మనస్సు బరువైనప్పుడు, మాటలు కరువైనప్పుడు, చూపులు ఆగినప్పుడూ, చేతలు సాగనప్పుడూ, అప్పుడు అప్పుడప్పుడూ ఇలా పరుగులు.. మానసిక అలసట తీరినదాకా, శారీరక శ్రమ తెలిసినదాకా!! అంతలో ఆటంకం..

"నమస్కారం రామారావు గారూ! "

"నమస్కారం.. మీరు..?"

"నా పేరు రచయిత. మీతో కొద్దిగా మాట్లాడాలని"

"అహహ్హాహ్హా"

"అదేంటండీ! అంతలా నవ్వారు?"

"మీరు పప్పులో కాలేశారు"

"ఏంటా తప్పు?"

"ఎవరైనా రచనలు చేసి రచయిత అవుతారు. మీరు తమపేరే రచయిత అంటేనూ"

"ఔను. నా పేరదే రచయిత. ఈ పేరు మా నాన్నగారి ఆశయం, వెరసి నే రచయితనే పిలవబడుతూ రచయితనయ్యాను"

"ఓ ఇప్పుడు చెప్పండి. మీరు నాతో ఏం మాట్లాడాలనుకున్నారు?"

"నేను మీ కథ వ్రాద్దామనుకుంటున్నాను.."

"ఎందుకు?

"అంటే?"

"ఎందుకు నా కథ వ్రాయాలనిపించింది? నాలో ఏం చూశారు? కోటీశ్వరుడిని కాను. క్రికెట్టు ప్లేయర్‌ని అస్సలు కాను. సినిమా హీరోని మరీ మరీ కాను. మధ్య తరగతివాడిని. అతిసామాన్యుడిని. ఇలాంటి నేను మీ కథకి హీరోని ఎలా అవుతాను?"

"ఇదే సామాన్యత, సాదాసీదాతనం. నేనేరకంగా హీరోనని అడిగిన తీరు, ఇంకా ఇంకా మీ చిన్న తనం నుండి మీరేంటో నాకు తెలుసు. అందుకే"

"చూడండీ! మీరు చెప్పిన ఈ లక్షణాలకన్నా ముఖ్య లక్షణం ఒకటుంటుంది అది లక్ష్యసాధన. మంచం మీద పడుకుని, కుర్చీలో కూర్చుని ఆలోచించడం తప్ప మరేం చేయలేకపోతున్నాను. ఇలాంటి నేను హీరోనికాను. కాలేను. నన్ను మన్నించండి. నాకథ వ్రాయద్దు. సారీ! ఉంటాను" పరుగు తీస్తున్నాను. ముందుకి - మున్ముందుకి.

●●●

నమస్తే. నేనండి. రచయితని. రామారావు రాయొద్దన్నారు తన గురించి. అతను ఒప్పుకుని ఉంటే, సరేననుంటే నేనాతని కథ వ్రాయను. అతను నిరాకరించారు. అందుకే ఈ కథ. అతని కథ. అసలాతని పుట్టుకే విచిత్రం.

'గర్భ సంచి చాలా చిన్నది. సంతానం కష్టం' అన్నారు డాక్టర్లు. 'పాపం!' జయ రామారావు తల్లి బాధపడింది. కానీ నెలతప్పింది 'గర్భం నిలవదు' అన్నారు. నిలిచింది. 'బిడ్డకి అంగవైకల్యముండచ్చన్నారు. లేదని తరువాత తేల్చారు. 'మళ్ళీ సంతానం క్షేమకరం కాదు' అన్నారు.

ఆపరేషన్ చేశారు. ఆ కుటుంబం చింత తీరింది 'వీడు చాలు' అనుకున్నారు. బాబుతో ఇల్లు చేరారు. మూడు నెలలు జయకి రెస్ట్. తరవాత మొదలయ్యింది కథ.

●●●

జయ సూర్యం గదిలోకి వచ్చింది అతను మితభాషి ఎక్కువగా పలుకడు.

"ఏమండీ" అంది. పేపర్లో నుండి కళ్ళు తిప్పాడు. 'చెప్పు' అన్నట్టుగా.

"రేపే బారసాల కదూ?" అడిగింది.

"ఊఁ!" అన్నాడు.

"బాబు పేరు ఏం పెడదాం? ఏమైనా ఆలోచించారా?" అడిగింది.

అతను తలూపాడు.

"చెప్పండి ఏం పేరు?" ఆమెలో ఉత్సాహం. కాఫీ సేవిస్తోందామె.

అతనామెవంక చూశాడు. పేపర్లో ముఖం పెట్టాడు. చెప్పాడు"రామారావు" .

ఆమెకి పొలమారింది. నోట్లోని కాఫీ నేలకి చిందింది. "ఏమిటీ?" అంది.

అతను పలుక లేదు.

"మామయ్య పేరా?" అంది.

ఏం జవాబులేదు.

"మామయ్యక్కూడా ఇష్టం లేదు" అంది.

"ఇదిగో కొత్త పేర్ల పుస్తకం దీన్లో చూసి చెప్పండి. ఆ పేరు వద్దు" అంది సమాధానం లేదు.

"హూ! గంటనుండి వాగుతున్నాను పట్టించుకోరేం?"

"..... "

"మీ అభిప్రాయం మారదా?"

అతనివంక ఓసారి చూసింది లేచివెళుతోంది. గుమ్మం దాకా వెళ్ళింది.

"జయా! ఇలారా! అన్నాడు."

ఆమె వెనక్కి వచ్చింది.

"మీ మామగారికి రాయబారం పంపించకు. ఆయన వస్తే, పేరు విషయం అడిగితే, మా తాత పేరుకూడా కలిపి వీర, వేంకట, శివ, నాగ, సాయిరాఘువేంద్ర, రామాంజనేయ, గణేశ, భాస్కర, వరప్రసాద రామారావ్ అని పెడతానని చెప్పు. ఇంకా ఏసయ్య,

హుస్సేనయ్య, బుద్ధయ్య, జైనయ్య, నానకయ్య బాకీ ఉన్నాయి. ఇవి మాతాత పేర్లుకావు, నాకు కొడుకు పుడితే ఆయన మొక్కుకున్న ఇతర మతదేవుళ్ళ పేర్లు. ఇక నువ్వెళ్ళచ్చు" మళ్ళీ పేపర్లో తలదూర్చాడు.

అతన్ని చురచుర చూసింది. బయటికి నడుస్తోంది జయ. "అభిప్రాయాలు మారుతాయి. నిర్ణయాలు అమలవుతాయ్" గదిలోని మాటలు గడపదాటి, ఆమె చెవులని సోకి, గాల్లో కలిసాయి.

"ఏమయిందమ్మా?" కోడలు రాగానే అడిగాడాయన. కోపం, అభిమానం కలిసున్న ముఖం. వంటగదిలోకి వెళ్ళింది. గిన్నెలో నీళ్ళు పోసింది. కత్తితో వంకాయలు తరుగుతోంది. కసిగా. ఆమె వెనకాల ఆయన.

"అవ్వడానికి యేముంది? మీ అబ్బాయికి.. రామ్మారావ్వ్ ప్పేరేబ్భాగ్గుం..దిట్ట" అక్షరాలన్నింటికీ ఒత్తులు పలికింది.

"ఎందుకట?"

"ఎందుకేంటి? తండ్రి పేరు పెట్టాడోయ్, గొప్పోడు, పితృవాక్య పరిపాలకుడు ఆహా! ఓహో అని అంతా పొగడొద్దూ? అందుకు. పైగా మీరెళ్ళి అడిగితే మీనాన్నగారి పేరుకూడా కలిపి".

"విన్నాను, విన్నాను. అది వినబడింది. మా నాన్నది మహాభారతమంత పేరు అదెట్లా గుర్తుంది వీడికి?" ఆశ్చర్యపోయాడాయన.

"ముంగిలా నోరుమూసుకునుంటే అన్నీ గుర్తుంటాయి. ఐనా నా పేరు పెట్టొద్దూ, నా కిష్టంలేదూ అని మీరు చెప్పచ్చుగదా?"

"ఎవరితో?"

"మీ అబ్బాయితో"

"అంతేనంటావా?"

"ఐతే సాయంత్రం వాణ్ణి రానీ తేల్చేస్తాను" స్థిరంగా అన్నాడాయన.

●●●

రాత్రి భోజనాలయ్యాయి. వక్కపలుకు వేసుకుని కొరికాడు సూర్యం. శుక్లపక్షపు వెన్నెల "సూర్యం!" అంటూ వచ్చాడు పెద్దాయన ఉపోద్ఘాతం ఏమీలేదు. "పిల్లాడికి నాపేరొద్దురా!" అన్నాడు.

"ఏం నాన్నా?" సూర్యం అడిగాడు.

"రామారావు పాతపేరురా!" తండ్రి చెప్పాడు.

"ఆధునికులు గొప్ప పేర్లు పెడుతున్నారు. పేర్ల పుస్తకం చూడు. నీ ఇష్టమొచ్చిన పేరు పెట్టు"

తండ్రి మాటలకి ఆయన వంక చూశాడు. ఈలోగా జయ వచ్చింది.

ఇది.. ఇది పేర్లు కావు నాన్నా! సగటు బ్రతుకులు. మధ్య తరగతి జీవితాలు. జీవన సమరాలు. తమని తామే మోసుకుంటున్న కావడులు. మిడిమేలపు జీవన చిత్రాలు. అందుకే మనం ఏంటో తెలియజేసే ఈ పేర్లు నాకెంతో ఇష్టం నాన్నా!"

"బాగానే ఉంది సంబడం. నాకొడుకు గొప్పవ్వాడవ్వాలి. ఎదగాలి. ధనవంతుడవ్వాలి. ఇలా కోరుకుంటారెవరైనా. ఇలా మధ్య తరగతి వాడై బ్రతకాలనీ, అలా నిలిచిపోవాలనీ కోరుకుంటారా?" అంది జయ.

"గొప్పవాడు అంటే ఏమిటో ముందు నువ్వు చెప్పు"

"పెద్ద చదువులు చదవడం, విదేశాలకి వెళ్ళడం, బాగా సంపాదించడం"

"ఇంకా?"

"కీర్తి ప్రతిష్టలు సంపాదించడం.. ఉన్న ఊరికీ, కన్నవారికీ పేరు తేవడం -"

"ఇంకా?"

"ఇంకేం ఉంటాయి? ఇవి చాలవా ఏంటి?"

"ఏముంటుంది? ఏమీ ఉండదు."

"నిజం ఏమీ ఉండదు. ఇన్ని చేశాక మనిషి తనని తాను కోల్పోతాడు. అప్పుడు ఇందాక నువ్వు వల్లెవేసినవన్నీ వృథా.

తనని తను, తనలో తను, తానైన తను, ఈ మూడు సూత్రాల ఆధారంగా నా బిడ్డని పెంచండి. ఇక పేరంటారా? మీరింతగా వ్యతిరేకిస్తున్నారు. మీ ఇష్టం వచ్చిన పేరుపెట్టుకోండి" అనేసి గబగబా మెట్లుదిగి వెళ్ళిపోయాడు సూర్యం.

"మామయ్యా! ఆయన మనసుని బాధపెట్టినట్టున్నాం కదూ?" అంది జయ.

"ఔనమ్మా! వాడి ఆలోచనలు తెలీలేదు. ఇలా అనుకుంటున్నాడని తెలీదు. తెలిస్తే ఇంత పట్టు పట్టి ఉండను" అన్నారు పెద్దాయన బాధపడుతూ.

"పేరులో ఉన్న పెన్నిధి ఏంటి? ఆయనిష్టమే మనిష్టం. ఆ పేరే పెడదాం" కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది జయ "అవునమ్మా! నామాటా అదే" అన్నాడాయన. అంతే! పిల్లవాడికి 'రామారావు' అని పేరు పెట్టబడింది.

●●●

ఆ రోజు ఆదివారం. మధ్యాహ్నపు కునుకు అయ్యాక సూర్యం వరండాలో చేరాడు. పేపర్లో తలదూర్చాడు. అంతలో జయ వచ్చింది. "మీకు కాఫీ తెస్తాను. అందాక వీణ్ణి చూడండి" చాపమీద పిల్లాణ్ణుంచి వెళ్ళింది. పిల్లాడి ముందు పెద్దబంతి. దాన్ని కొడుతూ కొద్దిసేపు ఆడాడు. ఫర్లేదు అనుకుని పేపర్లో దూరాడు సూర్యం.

ఉన్నట్టుండి పిల్లాడి అలికిడి లేదు. పేపర్ తీసి చూడబోయిన అతనికి ఉదయం వాడు పిడికిలితో పట్టి చింపిన చిల్లు కనిపించింది. చిల్లునుండి పిల్లాడు కనిపించాడు. అంతే! గుడ్లప్పగించి చూస్తున్నాడు సూర్యం.

బుజ్జి రామారావ్ బంతితో ఆడి, ఆడి కొద్దిముందుకి వెళ్ళాడు పాక్కుంటూ. అప్పుడు వెనక్కి చూసుకున్నాడు. బంతికి వీపుపెట్టి కూర్చున్నాడు నెమ్మదిగా లేచి నిల్చుని బంతివేపు వెనక్కి అడుగులు వేయటం మొదలెట్టాడు. చక్కగా, అనుభవమున్న మనిషిలా, తప్పటడుగు వెనక్కి వేస్తున్నాడు.

వాడువేసే అడుగులు చూశాడు సూర్యం. 'ఇలా నడవటం మొదటిసారికాదు' అనుకున్నాడు. వీడి బుడి బుడి అడుగులకోసం, నడక కోసం, నాన్న 'ఆంజనేయ ప్రదక్షిణ' బాలగోపాల పూజ' లాంటివి చేయిస్తుంటే వీడేమో సృష్టికి విరుద్ధంగా వెనక్కి నడుస్తున్నాడు. మామాకోడళ్ళిది చూడరాదు. చూస్తే గోల 'ప్రాయశ్చిత్తం. పూజలు జపాలు' అనుకుని పేపర్ తొలగించాడు. అంతే బుల్లి రామారావ్ కూర్చున్నాడు.

బంతిని ఒడిలోకి తీసుకుని చేతులు చాచాడు సూర్యం. పిల్లవాడు గబగబ బుల్లి అడుగులేసుకుంటూ తండ్రిని చేరాడు. వంటగదిలో నుండి వచ్చిన జయ, బయటనుండి వచ్చిన పెద్దాయన చూశారది. సంబరపడ్డారు

●●●

రామారావు పెరుగుతున్నాడు క్రమంగా. ఐతే ఈ పెరుగుదలలో అతన్ని చూసి కొన్నిసార్లు, తెలుసుకుని కొన్నిసార్లు, విని కొన్నిసార్లు ఉలిక్కిపడ్డానికి అలవాటుపడ్డారు ఇంట్లోవాళ్ళు. స్కూల్లో చేర్చాక ఈ ఉలికి పాటు ఎక్కువ సార్లు అవుతోంది.

శివరామారావుకి మంచి స్నేహితుడు. "ఆంటీ! ఇదిగో రామారావుకి బహుమతి వచ్చింది" కప్పు తెచ్చిచ్చాడు శివ.

"మావాడికా? ఎందులో?" జయ అడిగింది.

"పరుగు పందెంలో. విశేషం ఏమంటే అందరూ ముందుకి పరుగెత్తితే మీవాడు వెనక్కి పరుగెత్తి ఫస్టొచ్చాడు" అన్నాడు.

"మరి ప్రైజు వాడికే ఇవ్వలేదా?"

"బహుమతి ఇచ్చే సమయానికి వాడులేడు. ఎటు వెళ్ళాడో తెలీదు" - శివ పరుగుతీశాడు.

ఓ రోజు స్కూల్ ప్రిన్సిపల్ సూర్యాన్ని పిలిపించాడు. "మీవాడి తెలివితేటలు ఏమని చెప్పేది? ఓరోజు వాళ్ళకి ఇంగ్లీష్ క్లాస్ తీసుకుంటున్నాను. ఉన్నట్టుండి ఆఫీసు రూముకి వెళ్ళాల్సొచ్చింది. క్లాస్ ని చూడమని చెప్పాను రామారావ్‌కి నే వచ్చేసరికి అతను నా పాఠం చెబుతున్నాడు. నాకన్నా బాగా. మీరు అదృష్టవంతుడు" అన్నాడు

మరో రోజు ఓ స్త్రీ వచ్చింది. "అమ్మా రామారావ్ అనే కుర్రాడి ఇల్లు ఇదేనా?" అంది.

"అవును. ఏం చేశాడు?" అడిగింది జయ.

"మా వారు ఆఫీసుకి వెళుతూ గుండె నొప్పితో రోడ్డుమీద పడిపోయారు. మీ అబ్బాయి ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చి మాకు ఫోన్ చేశాడు" అంటూ కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిందామె.

●●●

"ఏరా! తాతయ్యా ఎక్కడికెళుతున్నావ్?"

"క్రికెట్టు ఆడుకోవడానికి తాతయ్యా!"

"స్కూలుకి శెలవా ఏంటి?"

"అవును తాతయ్యా"

"సరే దేవుడికి నమస్కారం పెట్టుకుని ఈ ప్రసాదం తీసుకుని వెళ్ళు."

"ప్రసాదమైతే తీసుకుంటాగానీ, నీ దేవుడికి నమస్కారం పెట్టుకోను".

"ఎట్లా? ప్రసాదం తీసుకుంటావు. నమస్కారం పెట్టుకోవా? ఎందుకని?"

"ఎందుకంటే ప్రసాదం కమ్మగా ఉంటుంది గనక తింటాను. నీ దేవుడికి నమస్కారం ఎందుకు పెట్టుకోవాలో తెలీదు. అందుకే పెట్టుకోను"

"ఓ అదా విను - నమస్కారం పెట్టుకుంటే నిన్ను దేవుడు ఆశీర్వదిస్తాడు. అందువల్ల నీకు చక్కగా చదువొస్తుంది. చదివాక మంచి ఉద్యోగమొస్తుంది. ఆరోగ్యం, ఐశ్వర్యం, ఒక్కటేమిటి? నీకు అన్నీ ఇవ్వగలవాడు దేవుడు. అందుకే ఆయనకి నమస్కారం పెట్టుకోవాలి"

"అలాగా? అయితే మన రామాలయం పూజారి రాఘవాచార్యులుగారు లేరూ? ఆయనా, ఆయన కుటుంబంవారంతా కలిసి వంద నమస్కారాలు పెడుతుంటారు నీ దేవుడికి. పెద్ద చదువులేవో చదివాడాయన కొడుకు.

రోజూ చెప్పులరిగేలా ఉద్యోగం కోసం తిరుగుతున్నాడు. అతని చదువుకి తగిన ఉద్యోగం ఇప్పించలేదేం నీ దేవుడు?

వాళ్ళ పెద్దమ్మాయికి పెళ్ళి సంబంధం కోసం కాళ్ళు అరిగేలా తిరుగుతున్నాడాయన. కట్నం అవసరం లేని ఒక్క పెళ్ళికొడుకునైనా చూపించలేదేం నీ దేవుడు?



కౌముది

రాధమ్మగారు పూజారి గారి భార్య. ఏదో జబ్బామెకి. ఆపరేషన్ చేయాలి. ఓ లక్షరూపాయలు కావాలి అది సాయం చేయడేం నీదేవుడు.

అదంతా పోనీ. వాళ్ళు వారంలో నాలుగురోజులే భోజనం చేస్తున్నారు. కనీసం ఇంటిల్లిపాదికీ కడుపునిండా భోజనమైనా పెట్టడేమి నీ దేవుడు?

పూటకి పదివేల నమస్కారాలు పెట్టుకునే వాళ్ళకే ఏమీ ఇవ్వని నీ దేవుడు.. తాతయ్య కోసమో, ప్రసాదం కోసమో నమస్కారం పెట్టుకునే  నాకేమి ఇస్తాడు? ఇవ్వడానికి నీ దేవుడి దగ్గర ఏమీలేదు.

తాతయ్యా! నా దృష్టిలో నమస్కారం చాలా పవిత్రమైనది. అది జన్మనిచ్చిన తల్లిదండ్రులకి, నన్ను ప్రాణంగా చూసుకునే నీకు తప్ప మరో చోట వృధాగా పెట్టడం నాకిష్టంలేదు. ఇపుడు చెప్పు. ప్రసాదం పెడతావా? వెళ్ళి ఆడుకోమంటావా?" తాతయ్య వంక చూస్తూ ప్రశ్నించాడు రామారావు.

ప్రేక్షకులూ, శ్రోతలుగా మిగిలిపోయారు ముగ్గురూ. ముందుగా జయ తేరుకుంది "ఏమిరా? తాతయ్యని అంతలేసి మాటలు అంటున్నావు?" అంది.

"అమ్మా! నేనన్నది తాతయ్యని కాదు"

"ఆయన పూజించే దేవుడినంటే ఆయన్ని అన్నట్టే కదా?"

"కానేకాదు. ఎందుకంటే నేను తాతయ్యని ఇష్టపడతాను. కానీ తాతయ్య ఇష్టాలని కాదు."

"అదెలా కుదురుతుంది? తాతయ్యని ఇష్టపడితే ఆయన ఇష్టాల్ని కూడా ఇష్టపడవలసి ఉంటుంది కదా?"

"అలాగా ఐతే ఒక్క నిముషం ఆ మాటమీద ఉండు. తాతయ్యకి నేనంటే చాలా ఇష్టం. కాని నాకిష్టమైన క్రికెట్టు ఆట ఇష్టమేమో కనుక్కో"

"ఇష్టముండకపోవచ్చు కానీ అది వేరు. ఇది వేరు. ఐనా ఆయన మనందరికన్నా పెద్దవారు.. ఆయన ఇష్టాలినీ, అభిప్రాయాలనీ గౌరవించాల్సిన బాధ్యత మనమీద ఉంది"

"అమ్మా! పెద్దరికం, ఈగౌరవం. ఇవన్నీ మనమివ్వాల్సింది వయస్సుకి. కాని వాదనకి కాదు. వాదనకి దిగావంటే ఆ బ్రహ్మనైనా నీ సృష్టి ఇలా తగలడిందేంటి? అని వాదించే హక్కు ప్రతివాదికి ఉంటుంది"

"బాబూ! నీ వాదనలో మా తలబొప్పి కట్టింది. నీవిక వెళ్ళి ఆడుకో"

"వెళుతున్నానమ్మా! నా మాటల్ని. అందులో నిజాల్ని తాతయ్యని ఆలోచించమను. అప్పటికి నాది తప్పనిపిస్తే తాతయ్య పూజించే దేవుడికి నమస్కారం పెడతాను. ఇష్టంలేని దేవుడికే నమస్కారం పెడతాననే నేను ఎంతో ఇష్టమైన తాతయ్యకి సారీ చెప్పనా? నే వచ్చాక అదీ చేస్తాను" అంటు బైటికి నడిచాడు.

"పిల్లలు లేరంటూ దేవుడికి మొక్కుకుంటే ఆయన పిల్లాణ్ణియక పిడుగునిచ్చాడేంటి?" స్వగతంలా పైకే అనేసింది జయ.

"జయా! వాడు పిల్లాడు కాడు. ప్రశ్నల పుట్ట. వాడు ప్రశ్నలకి సరైన జవాబు చెప్పగలిగినవాడే వాణ్ణి నాదేవుడికి మొక్కమంటాను" అంటూ కదిలాడు పెద్దాయన.

ముఖానికి పేపర్ అడ్డుగా పెట్టుకుని జరిగినదంతా గమనిస్తున్న సూర్యం, రామారావు వెళ్ళిపోగానే ప్రక్కనున్న గ్లాసందుకుని నీళ్ళు తాగేసాడు.

●●●

**రామారావు స్కూలు నుండి రాగానే జయ అంది** "రేయ్! నాయనా! తాతయ్య గుడికి వెళతానని ఉదయమనగా వెళ్ళారు. ఇంతవరకు రాలేదు. భోజనం కూడా చెయ్యలేదు. నే వెళ్ళి చూద్దామంటే గ్యాస్ (సిలిండర్) ఐపోయింది. బుక్ చేశాను. ఈ రోజు వస్తామన్నారు. నువ్వెళ్ళి కాస్త చూసి వస్తావా?" అని.

"ఆఁ వెళ్ళొస్తానమ్మా" అంటూ బట్టలు మార్చుకుని బైలుదేరాడు. గుడికి వెళితే అక్కడ చాలామంది భక్తులు హడావుడి పడుతూ అటు ఇటు తిరుగుతున్నారు. ఆడవాళ్ళు పూలని మాలలుగా కడుతున్నారు. మగాళ్ళు తోరణాలు కడుతున్నారు. రంగు కాగితాలు అంటించే వారు కొందరు. ఎలక్ట్రిక్ వర్క్ చేసేవారు కొందరు. ఏమీ చేయకుండా హడావుడి చేసేవారు కొందరు.

కొంతమంది చాపమీద కూర్చుని చెక్క పలకల మీద ఏదో వ్రాస్తున్నారు. అక్కడ రామారావుకి తన తాతయ్యకనిపించాడు. "తాతయ్యా!" అన్నాడు.

ఆయన చేతిలో పనాపి "ఏం నాన్నా ఇలా వచ్చావ్?" అనడిగాడు.

"ఉదయమనగా వచ్చావుట. ఏమీ తినలేదుట. అమ్మ పిల్చుకురమ్మంది"

"నేను శేఖరంగారి అబ్బాయితో కబురు పంపాను. నే వచ్చేసరికి సాయంత్రమవుతుందని ఎదురు చూడద్దని, భోజనం కూడా ఇక్కడే చేస్తాననీను"

"అమ్మకి వాళ్ళు చెప్పినట్టులేరు హడావుడి పడుతోంది..మరిప్పుడు రావా తాతయ్యా?"

"చేస్తున్నపని మధ్యలో వదిలి రావడం ఎందుకు? అదిగో ఇంకా ఆరుపలకలున్నాయి. అవికూడా పూర్తిచేసి ఓ గంటలో వస్తానని అమ్మకు చెప్పు. వెళ్ళు."

"ఇవి వ్రాయటమేనా? ఇంకా ఏమైనా పనుందా?"

"ఇంకే పనీలేదు. ఇదే"

"పోనీ! నేనూ కొన్ని వ్రాసేదా? త్వరగా ఇంటికి వెళ్ళచ్చు"

"ఆఁ వస్తే నిక్షేపమల్లే వ్రాయచ్చు. అదిగో అదొకటి తీసుకుని ప్రయత్నిస్తూ కూర్చో. ఈలోగా నేను మిగిలినవి పూర్తిచేస్తాను" అని తాతగారు ఓ పలకమీద వ్రాసేసరికి రామారావు నాలుగు పూర్తిచేసి ఐదో పలక తీసుకున్నాడు.

సూక్తులు వ్రాయడమే కాక ఒక్కోఒక్కో పలకమీద ఒక్కో రకం డిజైన్ వేశాడు. విస్తుబోతున్న తాతయ్యని చూసి చిర్నవ్వుతో అదికూడా పూర్తి చేసి "ఇంక పద తాతయ్యా!" అన్నాడు.

ఇంటికి వచ్చాక కోడలితో "అమ్మా! రేపటినుండి వారం రోజుల పాటు స్వామి జ్ఞానానందుల వారి ఉపన్యాసాలు ఉన్నాయి. అందుకే గుడికి రంగులు. హంగులూ సమకూరాయి. ఇందుకోసం జనం వేలాదిగా వస్తారని అనుకుంటున్నారు. ఎవరికి తోచిన ఆర్థిక, శ్రమసాయం వాళ్ళు చేస్తున్నారు. నేనూ ఓ ఐదువందలిచ్చాను. ఇంకా ఇలా పలకలమీద ధర్మసూక్తులు వ్రాసిచ్చి వచ్చాను" అన్నాడు.

"మంచిపని చేశారు. ఆ శేఖరం గారి అబ్బాయి చెప్పి ఉంటే నే కబురంపి ఉండను" అంది జానకి. అప్పుడే టిఫిన్ చేసి బైటికొచ్చాడు రామారావు. "తాతయ్యా! ఇలాంటి ఉపన్యాసాలకి జనం వేల సంఖ్యలో వస్తారు. ఎందుకు?" అన్నాడు.

"ఏముంది? మనకు తెలీని వేదాంత, భగవద్విషయాలు, కొత్తవి చెపుతారని"

"కాదు. ఆ మాటకొస్తే అక్కడికొచ్చే భక్తులలో కొందరు ఆ స్వామీజీ కన్నా మేధావులు, వక్తలు, వేదాంతులు ఉంటారు. ఐనా వస్తారు. ఎందుకో చెప్పుకో చూద్దాం"

"తెలీదు"

"విను. భక్తికి చాలా మార్గాలున్నాయి. అవి నవవిధ భక్తి మార్గాలు అంటారని నువ్వు నాతో చాలాసార్లు చెప్పావ్. శ్రవణం, దాస్యం, అర్చనం. ఇలా ఐతే ఈ నవవిధ మార్గాల్లో దేన్ని అనుసరించే భక్తుడైనా ఓ పద్ధతిని తప్పనిసరిగా అనుసరిస్తాడు. అదేంటో తెలుసా?"

"తెలియదు."

"అదే చాటుకోవడం. తనూ భక్తుడినని చాటుకోవడం ద్వారా. తాను దేవుణ్ణి కొలిచే విధానం ద్వారా పొందే ఆనందానికి రెట్టింపు ఆనందం పొందుతాడు. అందుకే ఇలాంటి ఉపన్యాసాలకు వెళ్ళి, తామూ భక్తులమని లోకానికి చాటుకోవాలనే కోరిక అంతర్లీనంగా ఉండి అది తీర్చుకోవడానికి అష్టకష్టాలూ పడుతూ ఐనా సరే ఇలాంటి ఉపన్యాసాలకి వెళుతుంటారు"

"ఛీ వితండవాది వెధవాని. వితండవాది వెధవ. అన్నీ వక్రంగా ఆలోచించడమే. నువ్వు చెప్పింది తప్పు. అలాంటి ఉద్దేశ్యంతో ఎవరూ వెళ్ళరు." జయ విసుక్కుంది.

"అలాగా? నాకో చిన్న ప్రశ్నకి జవాబు చెప్పమ్మా!"

"అడుగు"

"మనవీధి చివరున్న దేవాలయం. అదే వేణుగోపాలస్వామి ఆలయం మూడువందల ఏళ్ళనాటిది. మంచి మహిమగల దేవుడని కూడా పేరు మన కాలనీకి. ఆ మాటకొస్తే మన ఈ ప్రాంతానికి దూరంగా, క్రొత్తగా కట్టిన కృష్ణమందిరం ఏ రకంగానూ ఈ గుడికి సాటి రాదు. చివరకు ప్రశాంతంగా కూడా ఉండదు. అక్కడికి భక్తులు వందల సంఖ్యలో వెళతారు. ఈ ఆలయ పూజారి ఈగలు తోలుకుంటాడనుకో. అదికాదు మన చర్చ. నువ్వు కూడా గంటల తరబడి క్యూలో నిల్చుని ఆ గుడికే వెళతావెందుకు?"

"ఏముందీ? పదిమంది వెళ్ళే చోటికే మనమూ వెళ్ళాలి"

"ఎందుకు? ఇది గుడికాదా? ఇక్కడ దేవుడులేడా? మహిమలేదా? పోనీ దూరమా?"

"కావచ్చు, కానీ కొత్త ఒక వింతకదా?"

"రైటే. నేనొప్పుకుంటాను. కానీ గుడికట్టిన నాలుగేళ్ళకి కూడా నీకింకా కొత్తగా, వింతగా ఉందనడం ఏం సబబు చెప్పు. కనుక అది అసలు కారణం కాదు. నీ భక్తిని మరో పదిమంది భక్తులు గుర్తించకపోతే నువ్వు భక్తురాలివనే విషయం నీ మనస్సే ఒప్పుకోదు. ఇదే అసలు కారణం"

"చాలు బాబూ! చాలు నీతో వాదించాలంటే బ్రహ్మగారు రావల్సిందే నాకు పనుంది" జయ వెళ్ళింది. అదే రోజు రాత్రి దాదాపు ఎనిమిదింటికి ఎవరో తలుపు కొట్టారు. తలుపు తీసిన పెద్దాయన "రండి" అంటూ ఆహ్వానించాడు. వాళ్ళు ఆలయ నిర్వాహకులు.

"ఇందాక మీరు వ్రాసిన సూక్తులలో నాలుగైదు మీ మనవడు వ్రాశాట్టగదా?"

"అవునండీ ఏమైనా తప్పులు వ్రాశాడా?"

"కాదు. మీవాడు వ్రాసిన సూక్తులు, వేసిన డిజైన్‌లు బాగున్నాయి. ముఖ్యమైన చోట ఉంచవల్సిన నాలుగు పలకలు మిగిలిపోయాయి. మీకు అభ్యంతరం లేకపోతే ఈ నాలుగు కూడా మీవాడి చేత రాయించాలని వచ్చాం."

"ఎంతమాట? తప్పకుండాను. వాడిప్పుడు నిద్రపోతున్నాడు. పలకలు నాకిచ్చి వెళ్ళండి రేపటికి వ్రాయించి తెస్తాను"

"సరే అలాగే కానీండి" అంటూ పెద్ద పెద్ద చెక్కపలకలు అక్కడుంచి వెళ్ళారు. బ్రష్‌లూ, పెయింట్ డబ్బాలు మూలగా పెట్టారు.

"జయా! వాళ్ళ మాటని కాదనలేక తీసుకున్నానమ్మా. కానీ ఇదివాడు వ్రాస్తాడని నమ్మకం నాకు లేదు. అందుకే వాడు నిద్రపోతున్నాడని అబద్ధం చెప్పాను."

"ఔను మామయ్యా! వాడో కొరకరానికొయ్య. కదిలిస్తే కంపు. నాకూ అనుమానమే"

"సరే! తప్పేదేముంది? నేనే వ్రాస్తాను."

"ఏంటి మీ సమస్య?" రామారావు వచ్చాడు.

"ఏముందీ? మాకున్న సమస్య, పరిష్కారం రెండూ నీవే" అంది జయ.

"విషయం చెప్పమ్మా"

"ఏంలేదు. ఇందాక గుడిలో చెక్కపలకల మీద ఏదో వ్రాశావుట కదా? అలాంటిది మరో నాలుగు వ్రాసి పెట్టమని నిర్వాహకులు కోరుతున్నారు"

"సారీ! నాకిలాంటి సూక్తులంటే కచ్చగా ఉంటుంది"

"మరిందాక వ్రాశావు గదరా?" పెద్దాయన అడిగాడు.

"తాతయ్యా! నీ భోజనం చాలా నెమ్మది. అందుకే విందుభోజనాలకి వెళ్ళవు. వెళ్ళినా ఇంట్లో టిఫిన్ చేసి వెళతావు. అలాంటిది ఇంటి దగ్గర ఏమీ తిన్లేదు. అక్కడ భోజనానికి కూర్చున్నావ్ అంటే పట్టెడు మెతుకులైనా తినుండవు. త్వరగా అవి వ్రాస్తే ఇంటికొచ్చి కాస్త టిఫినైనా చేస్తావని వ్రాశాగాని, సూక్తులంటే ఇష్టపడి వ్రాయలేదు"

"సూక్తులకి ఏమొచ్చింది బాగానే ఉంటాయిగా. సత్యము పలుకుము. బాగుంది కదా ఇది"

"అమ్మా! ప్రపంచంలో పెద్ద హాస్యమే ఈ సూక్తి."

"ఏమి?"

"ఏమంటే ప్రపంచంలోని మానవులు ఈ సూక్తి ఆధారంగా సత్యం పలకడం మొదలెడితే ఈసరికి ప్రపంచ జనాభా పదో వంతు మాత్రమే మిగిలేది. కొంపలు తీసే సత్యన్ని పలుకమని ఎవరూ చెప్పరు."

"జీవహింస చేయరాదు - దీనికేమయింది?"

"ఇదో బహిరంగ హాస్యం. కోళ్ళు, గొఱ్ఱెలు, మేకలు వండుకు తింటూ పలురకాల మందుల్లో జీవజాలాన్ని వాడుకుంటూ - ఈ సూక్తిని పట్టి వ్రేలాట్టం దేనికి?"

"ఆచరణ లోపం ఉందని మంచినంతా వదిలేయడమేనా?"

"ఆచరించలేని విషయాల్ని వల్లించడం దేనికి? ఆత్మఘోష, శరీర శోష"

"ఐతే సూక్తులన్నీ వృధా అంటావా?"

"తాతయ్యా ఈ సూక్తులకి ఓ గొప్పదనం ఉంది. అవి తయారు చేసిన వారిని వదిలి, లేదా వ్రాసిన వారిని వదలి చదివిన వారిని తగులుకుంటాయి. ఐతే పఠిత కూడా మేధావియై అవి తమకి కూడా తగులుకోవని గ్రహించాడు"

"ఏమిటో అంతా గందరగోళంగా చెప్పావురా"

"వివరిస్తాను విను. ఉదాహరణకి 'సత్యము పలుకుము' అనే సూక్తి ఉందనుకో అది తయారు చేసిన మహానుభావునికి అది వర్తించదు. ఎందుకంటే సత్యము పలుకుతాను అనకుండా సత్యము పలుకుము అనికదా చెప్పాడు అందుకని తను ఆచరించే పనిలేదు. ఎదుటి వారు నిజం చెబితే చాలు. వ్రాసిన వాడిక్కూడా అంతే.

పోతే చదివిన వాడు కొన్ని రోజులు ఇబ్బంది పడ్డాడు. 'దీన్నుండి తప్పించుకోవడం ఎలాగా?' అని. వెలిగింది లైటు. అతనా వాక్యాన్ని పెద్దగా చదివాడు. అంతే అతని బాధ్యత కూడా వీడిపోయింది. అది విన్నవాడు మాత్రమే సత్యం పలకాలి. ఇలా అందరూ ఆ సూక్తిని వదిలించుకో జూశారు.

మంచిదైన ఈ సందేశం వృధాపోరాదని నిర్ణయించుకున్న కొందరు పెద్దలు సూక్తులుగా వ్రాయించి, గోడలమీదకి ఎక్కించారు. సూక్తుల పరమార్థం గోడలమీదకి ఎక్కడంతో పరిసమాప్తమైపోయింది.

నేనేమిటి? నన్ను నేను తెలుసుకోలేకపోతున్నాను. నా దిశానిర్దేశం ఎక్కడినుండి వస్తోంది? నన్ను నేను చూసుకోవాలంటే, నాలోనికి నేను తొంగి చుడాలంటే భయమేస్తోంది' వంటి ఉత్తమ పురుషలా చెక్కబడిన సూక్తులు నువ్వు ఎక్కడైనా చూశావా తాతయ్యా!"

"చాలు నాయనా! చాలు. ఇంకా మా బుర్రలు తినకు. మామయ్యా మా మనవడికి ఒంట్లో బాలేదంటూ ఆ పలకలన్నీ రేపు నిర్వాహకులకు ఇచ్చిరండి. పదండి భోజనానికి" అంది జయ.

"నాన్నా! ఖాళీ పలకలు ఇస్తే వాళ్ళు ఏమైనా అనుకోగలరు. నాకు ఆఫీసు పని కొంత ఉంది. అదయ్యాక ఎంత రాత్రయినా కూర్చుని వ్రాసేస్తాను" అన్నాడు. సూర్యం భోజనానికి లేస్తూ. ఐతే సూర్యం పని పూర్తయ్యేసరికి రాత్రి ఒంటిగంట దాటింది. తెల్లవారు ఝామునే లేచి వ్రాయచ్చని అలారం పెట్టుకు పడుకున్నాడు. అలారం విని లేచి పలకలు ముందేసుకున్న సూర్యం ఆశ్చర్యపోయాడు. పలకలపై వ్రాయడం ఆరబెట్టడం కూడా అయింది.

●●●

రామారావు పదో తరగతి పరీక్షలు వ్రాశాడు. ఉదయం సాయంత్రం క్రికెట్ ఆటకి వెళ్ళడం, మధ్యాహ్నం శివతో చదరంగం ఆడ్డం ఇవే అతని దినచర్యలు. వాళ్ళకి పెద్దగా బంధువులు లేరు. ఉన్నా వాళ్ళకి వీళ్ళతో రాకపోకలు పెద్దగా లేదు. "పోనీ తీర్థయాత్రలకైె వెళదాం" అన్నాడు పెద్దాయన.

"తాతయ్యా! నన్ను తీసుకుని నువ్వు తీర్థయాత్రలకి వెళితే నీకు పుణ్యం కాదు. పాపమొస్తుంది" అన్నాడు రామారావు.

"విహార యాత్రలకి వెళ్ళగలిగిన ఆర్థిక స్తోమత మనకు లేదురా" అన్నారాయన.

"ఎక్కడికీ వద్దు తాతయ్యా! ఇంట్లోనే బాగుంది" అన్నాడు.

సుదీర్ఘమైన ఆ శలవులని ఆటల్తో గడుపుతున్నాడు. ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి చదరంగం ఆటకి కూర్చున్నారు. జయ పడుకుంది. తాతగారు కూడా ఓ కునుకు తీసి లేచి వాళ్ళ ఆటని చూస్తూ కూర్చున్నారు.

"ఏమోయ్ శివా? రేపు మీ పరీక్షా ఫలితాలుంటున్నారు?"

"అవును తాతయ్యా!"

"ఎలా వ్రాశావు?"

"చాలా బాగా రాశా తాతయ్యా ఫస్ట్ క్లాస్ రావచ్చు"

నువ్వంత నమ్మకంతో చెబుతున్నావా? మాటాడు కనీసం పాసౌతానని కూడా చెప్పట్లేదు"

ఏరా? నిజమా?"

"ఏంటి నిజం? తప్పక పాసౌతావా? అనడిగాడు తాతయ్య. నే వ్రాసింది పేపర్ దిద్దే వాళ్ళకి నచ్చితే పాసౌతాను. లేదంటే ఫెయిలౌతాను అన్నాను."

"ఏం? బాగా వ్రాయలేదా?"

"నువ్వు కూడా అలా అడుగుతావేంట్రా? బాగా అనే పదానికి హద్దంటూ ఉందా? నీకొచ్చిందేదో వ్రాసొచ్చాను." విసుగ్గా అన్నాడు రామారావు.

"క్లాసులో ఫస్టొచ్చేవాడివి కదరా?"

"ఆఁ! ఏదో వచ్చేవాడిని. టీచర్ల దయవల్ల"

"ఏరా! నీ ప్రతిభ లేకుండానే నిన్ను ఫస్ట్‌క్లాసులో పాస్ చేయించారా?"

"పోనీరా గోల. ముందు ఆడు"

"పెరిగే కొద్దీ - పెద్దబావ కోతయ్యాడనీ. మావాడు రోజురోజుకీ చదువులో వెనుకపడుతున్నారు"

"వారం వెనక బడ్డం ఏంటి తాతయ్యా! బాగానే వ్రాశాడే"

"రాసుంటే చెబుతాడుగదా? ఐనా చదువులో ఇంత బండవెధవ పుడతాడని తెలిసి ఉంటే అసలు మనవడే వద్దనుకొందును?"

"ఔనా? మరామధ్య పరీక్షలో ఫెయిలౌతే, ఆత్మహత్యచేసుకుంటావని భయం"

"మరిందాక చదువులేని బండ మనవలు వద్దన్నావ్?"

"పుట్టద్దు. అన్నాను. కానీ పుట్టాక పోగొట్టుకుంటానన్నానా?"

"అంటే ఏంటి? నా చదువుకన్నా నేనే నీకు ముఖ్యమన్నమాట. ఔనా?"

"ఔను"

"మరలాంటప్పుడు నా చదువుమీద నాకే లేని బాధ నీకెందు? చదువు జ్ఞానం కోసం తాతయ్యా! కానీ చదువే విజ్ఞాన సర్వస్వమూ కాదు. నాకు వచ్చిందంతా పేపర్లో పెట్టొచ్చాను. తప్పుతానా? ఒప్పుతానా అనే ఆలోచన నాకు లేదు. "

అంతలో కాలింగ్ బెల్ మోగింది. "ఎవరో వచ్చినట్టున్నారు. వెళ్ళిచూడు" అన్నాడు పెద్దాయన.

"నే వెళ్ళను" అన్నాడు రామారావు ఏదో పావుని కదుపుతూ.

"నే వెళతా" నంటూ వెళ్ళి ఏదో ఉత్తరం తెచ్చిచ్చాడు శివ.

"ఈసారి నే వెళ్ళను" అన్నాడు శివ. రామారావు లేచి వెళ్ళి తలుపు తీశాడు. "ఎవర్రా?" అడిగాడు తాతయ్య.

"మా ఫ్రెండ్ ఏదో పుస్తకం కావాలని వచ్చాడు. ఇచ్చి పంపాను"

అంటూ ఆటలో నిమగ్నమయ్యాడు. కాస్సేపుండి బెల్ మళ్ళీ మోగింది. ఈసారి పిల్లల్నిద్దరినీ ఓ మారు పరికించి తనేవెళ్ళి తలుపుతీశాడు. అదిరిపడ్డారు.

"అక్కడంతా జనాలు. చేతిలో కెమెరాలుపుస్తకాలు. పెన్నులు."

"సార్! రామారావు ఇల్లు?"

"ఇదే"

"అతను మీకేమవుతాడు?"

"మనవడు"

"నమస్తే. మేం ఛానల్ వాళ్ళం"

"మేము - పత్రికవాళ్ళం"

"మీకు ఏం కావాలి?"

"మీ మనవడి ఇంటర్వ్యూ"

"అదెందుకు?"

"మీకు తెలీదా? మీ మనవడికి పదోతరగతిలో స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది"

ఆయన క్షణకాలం విస్తుబోయి "రండి రండి" అంటూ దారిచ్చాడు. అంతా బిలబిలమంటూ లోపలికి వచ్చారు. "హలో రామారావ్! మేమంతా వివిధ ఛానల్స్, ఇంకా పత్రికలా వాళ్ళం. నీకు తెలుసా? పదో తరగతిలో నీకు స్టేట్ సెకండ్ ర్యాంక్ వచ్చింది"

"ఆc! తెలుసు. ఇందాక ఫోన్ చేసి చెప్పారు."

తాతయ్య వంక చూసి చిలిపిగా నవ్వాడు రామారావు. కెమెరాలు ఆఫ్ చేసి "రామారావ్! మాక్కొన్ని ప్రశ్నలకి జవాబు కావాలి. కావాలంటే రాసుకుని అవి చూసి చదివినా పర్లేదు" అన్నాడు ఒకతను.

"పర్లేదు. మీ కెమెరాలు ఆన్ చేసుకోండి. మీరేం అడగాలో అడగండీ"

"ఇంత గొప్ప విజయం సాధించావు. ఎలా ఉంది నీకిపుడు?"

"విజయం గర్వాన్నిస్తుంది. ఆ భయం తప్ప కొద్దిగా ఆనందంగానే ఉంది."

"కాస్త సంతోషమా? పూర్తి సంతోషం కాదన్నమాట. ఫస్ట్ క్లాస్ రాలేదనా?"

"లేదు. ఈ హంగులూ, ఆర్భాటాలూ, ఇలా కెమెరాలు, అలా పత్రికలు నేనేదో గొప్పవాడినని ఇంటర్వ్యూ, ఇవినచ్చవు. నిజానికి మీ ఈ రాకని ఓ అరగంట క్రితం ఊహించి ఉంటే. నన్ను ఇంటర్వ్యూ చేసే శ్రమ మీకు తప్పించి ఉండేవాడిని" రామారావు జవాబుకి వచ్చిన వాళ్ళంతా తెల్ల ముఖాలు వేశారు.

కానీ వాళ్ళందరికీ ఉత్సాహంగా ఉంది. ఇలాంటి వ్యక్తిని వాళ్ళెప్పుడూ చూడలేదు. పదవ తరగతి పిల్లాడు పరిణితి చెందిన యువకుడిలా మాట్లాడ్డం వాళ్ళకి నచ్చింది. బోర్ ఇంటర్వ్యూలు వ్రాసి, వ్రాసి, చూపి, చూపి వాళ్ళకీ విసుగ్గానే ఉంది. వారి అనుభవంలో ఇలా మాట్లాడిన మొదటి వ్యక్తి రామారావే మరి. ''ఎలా చదవడం వల్ల నీకిన్ని మార్కులొచ్చాయి?''

''ఆ పుస్తకాల్లో ఏముందో తెలుసుకుందామని చదివిన దానిలో నాకు గుర్తున్నదంతా వ్రాసొచ్చాను.''

''రోజూ ఎన్నిగంటలు చదివేవాడివి?''

''రెండు?''

''రెండా?''

''ఒక్కోరోజు అదీ లేదు''

''నీ విజయానికి కారకులెవరని నీవనుకుంటున్నావు? మీ తల్లిదండ్రులా? మీ తాతగారా? స్కూల్లో టీచర్లా? ఇవేవీ కాక నీ కృషీ, పట్టుదలా? తెలివితేటలా?''

''నాపేపర్లు దిద్దిన నిజాయితీగల టీచర్లు''

''వ్వాట్?''

''యస్ దేశంలో నీతి, జిజాయితీ లేవో లేవని మొత్తుకుంటూ ఉంటారు. కానీ వాళ్ళు నిజాయితీగా మార్కులివ్వకపోయి ఉంటే ఒక సామాన్య విద్యార్థికి ఈ స్థితి వచ్చి ఉండదు''

''సరే నీ భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి ఏమవ్వాలనుకుంటున్నావు''

ఈ ప్రశ్నకి రామారావు ఏం చెబుతాడోనని జయ, తాతగారు కూడా ఎదురు చూస్తున్నారు. రామారావు మాట్లాడకుండా ఊరుకున్నాడు.

''చెప్పుబాబూ! ఇంజినీరా? డాక్టరా? ఐ.ఏ యస్, ఐపియస్. ఏది?''

''దీనికి సమాధానం మీకు ఏది తోస్తే ఏది మంచిదనిపిస్తే అది రాసుకోండి''

''మేం రాసుకోవడం ఏంటి? నీకు ఏదిష్టమో అది నువ్వే చెప్పాలికదా?''

''నేను చెప్పలేను''

''అంటే నీవు ఏమవ్వాలనుకుంటున్నావో ఆ విషయం మీద నీకు స్పష్టతలేదా?''

''నా గమ్యం గురించి నాకు చాలా స్పష్టత ఉంది. ఐతే గమ్యం వేరు, ఇష్టం వేరు''

''అదేంటి? ఇష్టాఇష్టాలను బట్టికదా గమ్యం నిర్ణయించుకుంటారు?''

''కావచ్చు కానీ నా విషయంలో నా ఇష్టం వేరు, గమ్యం వేరు.''

''గమ్యం గురించి చెప్పు. ఇష్టం గురించి చెప్పు''

''నా గమ్యం గురించి ఎవ్వరికీ చెప్పను. ఇష్టం గురించి చెప్పగలను''

''సరే చెప్పు. నువ్వు బాగామాట్లాడుతున్నావు. వాగ్ధాటి బాగుంది. అందుకని లాయర్ అవ్వాలనుందా?''

"కాదు. గూడ్స్ రైలు డ్రైవర్ అవ్వాలనుంది"

●●●

**అంతే! అందరికీ షాక్. ఓ వ్యక్తి తేరుకుని** "గూడ్స్ రైలే ఎందుకు? జనాలున్న రైలుకే డ్రైవరవ్వచ్చుకదా?" అన్నాడు.

"శూన్యంగా నిర్భలంగా ఉన్నా ప్రకృతిలోకి సూటిగా దూసుకు పోవడం నాకిష్టం. అందుకే రైల్ డ్రైవర్ నవ్వాలనుంది. జనాలున్న రైలు వద్దు. నన్ను మౌనంగా అనుసరించి వచ్చే గూడ్స్ బండి పెట్టెలు అంటే ఇష్టం. 'ఎంత లేటు?' అనవు. 'ఎందుకు ఆగావ్?' అనవు. విసుక్కోవు. నసుక్కోవు. తొందర పెట్టవు. అందుకే గూడ్స్ బండి పెట్టెలన్నా అసలా బండి అన్నా నా కిష్టం.

"భావితరమంతా గొప్ప చదువులంటున్నారు. ఉద్యోగాలంటున్నారు. రెక్కలు కట్టుకుని విదేశాన వాలుతున్నారు. నీవిందుకు విరుద్ధంగా..?"

"..క్షమించండి. నాకు గొప్పలక్ష్యాల్లేవు. జీవితం నాది. నే రాజీలేకుండా బ్రతకాలి. అదే నా కిష్టం. అలాగే బ్రతుకుతాను. ఇక గొప్ప లక్ష్యమంటారా? నాకొక స్నేహితున్నాడు. ఆయన వయస్సు డెబ్బై. ఆయనకి గొప్ప లక్ష్యం ఒకటుంది. అది మామిడి చెట్టు ఎక్కడం."

"అదేంటి?"

"నాలుగు తరాలుగా ఆ ఇంట్లో ఒకే సంతానం. మగపిల్లాడు. ఆయన ముత్తాతగారూ, తాతగారూ, నాన్నగారూ, మామిడి చెట్టు ఎక్కి, క్రిందపడి, చనిపోయారు. అందుకు తల్లి ఒట్టువేయించుకుంది. మామిడి చెట్టు ఎక్కనని. పల్లెవదిలినా, పట్నం వచ్చినా, ఎంతో డబ్బూ కీర్తి, సంపాదించినా ఆ లక్ష్యం ఉంది అలాగే. తల్లి చనిపోతే గాని ఆయన చెట్టెక్కలేరు. అలాగని తల్లిని అలక్ష్యం చేయలేదు. ఆమెకిప్పుడు తొంభై యేళ్ళు. చక్కగా తన పనులు చేసుకుంటున్నది. రోజూ ఉదయం లేవగానే కొడుకూ, కోడలూ ఆమెకి నమస్కరిస్తారు. 'ఇవ్వాళ కూడా మామిడి చెట్టు ఎక్కలేవు నాన్నా!' అంటుందామె. ఆయన నవ్వి 'నాకింకా కాళ్ళలో బలముందమ్మా' అంటాడు. ఇది మనందరికీ చిన్నవిషయం. మామిడి చెట్టు ఎక్కడం. ఆయన కది జీవిత లక్ష్యం."

"అది సరే. డెబ్బయి ఏళ్ళ వ్యక్తి నీ స్నేహితుడేంటి?"

"ఆయనకో తోట ఉంది. మామిడి చెట్లున్నాయి. కోకిల పాటకోసం నే వెళతాను. ఆ చెట్టుని చూస్తూ ఆయన కూర్చుంటాడు. అలా స్నేహమయింది"

"నీ మాటలు ఆలోచనలు బాగున్నాయి. ఆలోచింపజేస్తున్నాయి. చివరగా రెండు ప్రశ్నలు.. నీవు అదృష్టంగా భావించే విషయం ఏంటి?"

"మా తాతయ్యకి మనవడై పుట్టడం. నా పేరు కూడా అదే కావడం"

"నువ్వు తేలిగ్గా చేయగల్గిన పని?"

"ఆ విషయం నే చెబుతాను" శివ అన్నాడు. అందరి చూపు అటు. "మీ ప్రశ్నకి జవాబు ప్రయత్నించడం. వాడు తేలిగ్గా చేసేదదే. వాడి బుఱ్ఱే ప్రశ్నల మయం. వాడితో కాస్సేపుంటే చాలు ప్రశ్నలతో వేపుకుతింటాడు. వాడి ఒక్కో ప్రశ్నకి జీవితం చాలదు. జవాబు దొరకదు. ఇవి నా మాటలు కావు. మా స్కూల్ ప్రిన్సిపల్ మాట" అన్నాడు శివ.

"నిన్నూ ప్రశ్నిస్తాడా?"

"అక్షరాలని ఆయుధాలుగా, పదాలని ఆటంబాంబులుగా, గురి చూసి, గుండెలకి విసిరిన మహాకవి."

"శ్రీశ్రీ"

"ఆఁ! ఆయన కవితా పాఠాన్ని చెప్పారు మా మాష్టరు. "తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" ఆవేశంగా క్లాసులో పాఠం చెప్పారు. మర్నాడు వీడి నోట్ బుక్ ఏదో తిరగేస్తున్నాను. చివరి పేజీలో ఏం వ్రాసుందో చూడండి" పుస్తకాల గూట్లో నుండి ఓ నోట్ బుక్ తీసిచ్చాడు.

అందులో ఇలా ఉంది.

"తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?"

"అయ్యో! చరిత్ర గతించి చాలా ఏళ్ళయింది

వందల ఏళ్ళ వెనక్కి వెళ్ళాలి.

చెప్పడం కష్టం ఆధారాలు చిక్కడం కష్టం.

కాకపోతే చిన్ని ప్రశ్న.

కవితలు వ్రాసేందుకు తాముపయోగించిన కలం చేసిన కారకుడెవ్వరు?

సిరా చేయడానికి పరికిణీ ఖరాబు చేసుకున్న పేద కన్నెపిల్ల ఎవరు?

శకం మారని సంగతేగా?

శలవీయండి తమరు. "

అంతే! ఎవ్వరూ మాట్లాడలేదు.

ఓ నిమిషం తరువాత తేరుకున్నారు.

"వస్తాం! రామారావు" అన్నారు.

కానీ రామారావు లేడక్కడ.

"ఏడీ?" అన్నారు.

"లేడు ఇలా ఇంటర్వ్యూలివ్వడం, ప్రైజులు అందుకోవడం, సన్మానాలు, మెచ్చుకోళ్ళు నచ్చవు. మీ కెమెరా నా వేపు తిరగగానే వాడు మాయం" శివ నవ్వుతూ అన్నాడు.

●●●

ఇంటర్‌లో మా కాలేజీలో చేరండని ఒకరు, మాకు ఫీజు అక్కర్లేదని కొందరు 'స్టైఫండ్' కూడా ఇస్తామని కొందరు. క్యూలు కట్టారు. తల్లి ఎం.బి.బియస్ అని, గురువులు ఇంజినీరింగని, తాతయ్య కంప్యూటర్ కోర్సనీ బలవంతంగా ఒప్పించే ప్రయత్నం చేశారు.

రామారావు గవర్నమెంట్ కాలేజీలో చేరాడు. కామర్స్ గ్రూపు తీసుకున్నాడు. రెండు ఏళ్ళు మామూలుగా గడిచాయి. ఇంట్లో వారు క్రమంగా మారారు. అతని వాదన వినడానికి, ఔననడానికి, ఆలోచించడానికి అలవాటు పడిపోయారు.

రామారావుకి ఇంటర్ పరీక్షల్లో ఫస్ట్‌క్లాసొచ్చింది. కానీ కాలేజి ఫస్ట్ కూడా కాదు. శివ కాలేజీ ఫస్టని ఓసారి, యం.బి.బియస్‌లో సీటొచ్చిందని ఓసారి స్వీట్ తెచ్చిచ్చాడు. చదువు కోసం వేరే మహానగరానికి వెళుతున్నట్టు చెప్పాడు.

అతను వెళ్ళేరోజు వచ్చి "తాతయ్యా! నే వెళుతున్నాను మళ్ళీ ఓ సంవత్సరానికి గాని రాను. వెళ్ళే ముందు మీకో విషయం చెప్పాలి. నన్ను చూసి మీలో కలవరపాటు. వాడు నాలా చదవలేదని. ఈ బాధ మీలో కనబడుతోంది.

కానీ మీకు తెలుసా? వాడు కావాలనే చదవడు .బాగా పరీక్షలు వ్రాయడు. పాసైతే చాలంటాడు. అలాగే రాసొస్తాడు. ఈ విషయం నే గ్రహించాను. నిలదీశాను. అప్పుడు చెప్పాడు నిజమేనని. ‘ఈ హంగులు, ఆర్భాటాలు, ఈ ఆహ్వానాలు (కాలేజీలనుండి) ఇవి నాకు పడదు’ అన్నాడు. తాతయ్యా వాడెక్కడ? నేనెక్కడ? నన్ను వాడితో పోల్చకండి.

అది వాడికి అవమానం ఈ చదువులు, పదవులు, ఉద్యోగాలు, వాడి దృష్టిలో విలువైనవి కావు. వాడు అన్వేషిస్తున్నాడు. దేనికోసమో! అది ఫలిస్తే? వాడి ముందు మనం గరికపోచలమే. చిరుగరికలం. తెలుసుకోండి.

వాడు లేడని నాకు తెలుసు. వచ్చాక ఈ విషయాలేవీ చెప్పకండి. ఆశీర్వదించండి” నమస్కరించి వెళ్ళిపోయాడు శివ.

●●●

రామారావు బి.కాం. రెండవసంవత్సరంలో ఉన్నాడు. ఆరోజు కాలేజీ నుండి వచ్చాడు. తన ఇంటి దగ్గర జనం. ప్రక్కింట్లో నుండి అరుపులు, కేకలు. ఇంట్లోకి వెళ్ళాడు. తల్లి ఏడుస్తోంది. తాతయ్య ముఖం పాలిపోయి ఉంది. ”ఏంటి తాతయ్యా! ఏం జరిగింది?” అడిగాడు.

”ఏం లేదురా! మన ప్రక్కింట్లోకి ఓ కుటుంబం అద్దెకి దిగారు. పదిరోజులయింది. అతనుత్తి తాగుబోతు. ఈరోజుదయం అతను పెళ్ళాన్ని, ఈడొచ్చిన కూతుర్నీ కొడుతున్నాడు. పెళ్ళాం ఓర్చుకుంది. కూతురు భయపడింది. దెబ్బలు భరించలేకపోయింది కాళ్ళమీద పడింది.

వాడు కూతుర్ని వదిలాడు. మమ్మల్ని తిట్లందుకున్నాడు. ఉదయం నుండీ తిడుతున్నాడు. ఇప్పుడేమో నేను సారీ చెప్పాల్ట. వాడి కూతుర్ని అప్పగించాలట. లేదంటే కత్తితో నా తల నరుకుతాడట. అరుస్తున్నాడు” విషయం చెప్పాడాయన.

”సరే! మీరుండండి..” అంటూ పోలీసులకి ఫోన్ చేశాడు. అరగంటలో వాళ్ళు వచ్చారు. తీసుకుపోయారు. కారణం తెలీదుగానీ తెల్లవారి తల్లీ, కూతురూ ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

తరువాత రామారావన్నాడు ”ఆమె గేటులోకి రాగానే బయటికి పంపాల్సింది. ‘మీరు మీరు బయట తేల్చుకోండి‘ అనాల్సింది. ఒకళ్ళ విషయంలో మన జోక్యం కూడదు. అందుకే మనకీ మనస్తాపం కలిగింది” అని.

పై సంఘటన తరువాత. నాలుగు రోజులు గడిచాయి. ఓ రాత్రి రామారావు ఇంటికి వచ్చాడు. హడావుడిగా ఉన్నాడు. మరో వ్యక్తిని తీసుకొచ్చాడు. గేటు వీధి తలుపు తాళం వేశాడు.

”తాతయ్యా! అమ్మా! ఈ వ్యక్తిని మనం కాపాడాలి ఈరాత్రికి. మన ప్రాణాలు ఫణంగా పెట్టయినా.. మనమేమైనా, ఇతను గమ్యం చేరాలి చేరేట్టు చూడాలి. అతనితో పెరట్లోకి వెళ్ళాడు. అతన్ని ఎక్కడ దాచాడో తెలీదు. అర్ధరాత్రి దాటింది. అప్పుడు ఆరుగురు వచ్చారు. గూండాల్లా ఉన్నారు. బలవంతాన తలుపులు తోయించారు. ఇల్లూ, దొడ్డీ అంతా వెదికారు. చుట్టుప్రక్కల ఇళ్ళు వెదికారు. ఆ వ్యక్తిని కనుక్కోలేకపోయారు. మర్నాడుదయం ’స్వామి చుంచప్ప లీలలు‘ ‘విశ్వరూపాలు‘ ‘అసలు స్వరూపాలు‘ అంటూ పేపర్లో వార్తలు వచ్చాయి. ఆయనకి లోబడి ఉన్న అమ్మాయిలు పాతికేళ్ళు దాటని పడుచులు. మైకం లాంటి స్థితిలో ఉన్నారు.

ఇదికాక ఆయనకున్న నిధులు, నిల్వలు, అక్రమార్జనలు, అన్ని వివరాలు వ్రాశారు. ‘ఔరా‘! అనిపించారు. ఇందుకు పాత్రధారి ఆనాడు వచ్చిన వ్యక్తి. కానీ సూత్రధారి రామారావే. ఈ విషయం గ్రహించారు ఇంట్లో వారు.

”ఎందుకురా పెద్దాళ్ళతో గొడవ. ఆరోజు. ఆ పిల్లాడు పట్టుబడి ఉంటే?”

”ఏముంది? మనల్నందరినీ నరికేసి అతణ్ణి పట్టుకుపోయేవారు.”

”మనకెందుకతని గోల?”

"అదేంటి తాతయ్యా! అలాగంటావేం? నాకెందుకని గాంధీజీ ఊరుకుంటే మనకి స్వాతంత్ర్యం వచ్చేదా? నాకెందుకని సైంటిస్టులూరుకుంటే గొప్ప గొప్ప వాక్సిన్స్ పుట్టేవా? నాకెందుకని మధర్ థెరిసా అనుకుంటే? నాకెందుకని వీరేశలింగం పంతులుగారు అనుకుంటే? మహామహులంతా నాకెందుకనుకుంటే మనం ఎక్కడుంటాం?" అన్నాడు.

అంతలో జయ అంది "ఏం నాయనా ఆ రోజు మేమూ ఆడపిల్లను కాపాడాం. నిష్కారణంగా వాడు చంపబోయాడు. అపుడేమో మనకెందుకీ గొడవ అన్నావు. ఇపుడేమో 'పట్టించుకోకపోతే ఎలా' అంటున్నావు? తెలుగు పదాలు వచ్చునని ఎటు వీలైతే అటు పలుకుతావేంటి? నీకంటూ ఓ నియమం లేదా?"

రామారావు చప్పట్లు కొట్టి" అమ్మా! ముందు అభినందనలు అందుకో. ఎందుకో తెలుసా? ప్రశ్నించాలన్న సద్బుద్ధి కలిగినందుకు. పోతే నీ ప్రశ్నకి జవాబు విను. ఒకరి వ్యక్తిగత విషయం అనుకో. అపుడు ఆలోచించాలి 'మన జోక్యం అవసరమా?' అని

అదే సంఘానికి, సమాజానికి సంబంధించితే, సామూహిక విషయమైతే, నడుం బిగించాలి. దూసుకుపోవాలి. అపుడు ఆలోచనకూడదు. ఇది సామాజిక న్యాయం" అన్నాడు.

"కాదు. అవకాశవాదం. నువ్వు చేసింది మంచిదని, ఎదుటి వ్యక్తి చెపితే చెడు అనే ఆపద్ధర్మ వాదం" జయ ముఖం ముడుచుకుని వెళ్ళింది. చిరునవ్వు నవ్వాడు రామారావు. రామారావు మాష్టర్ రామారావు నుండి మిస్టర్ రామారావుగా ఎదిగాడు.

అతనిలో పెద్ద మార్పేమీ లేదు. కాకపోతే కళ్ళలో చిలిపిదనం, ముఖంలో చిరునవ్వూ ప్రవేశించాయి. అందంగా హుందాగా ఉన్న అతను ఆకర్షణీయంగా కనిపించసాగాడు. అంతే తేడా.

●●●

డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు ఇంకా రెండు నెల్లున్నాయి. అప్పుడు రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలు జరిగాయి. తాను వెళ్ళనని చెప్పినా రామారావు పేరు పంపించాడు ప్రిన్సిపల్. అక్కడ జరిగిన పోటీలో ఫైనల్స్ వరకు వెళ్ళాడు.

చివరగా వాళ్ళిచ్చిన విషయం - శ్రోతలు, పాఠకులు, ప్రేక్షకులు ముగ్గురిలో ఎవరు గొప్పవారు? ఎవరు అదృష్టవంతులు? ఎందువల్ల? అని పోటీలో ఉన్న ఐదుగురినీ ఉపవ్యాస స్థలానికి కొద్ది దూరంగా ఉన్న గాజు తలుపుల గదిలో ఉంచారు.

పోటీ దారులు ఒకరిలో ఒకరు మాట్లాడుకోకుండా విడివిడి గదుల్లో ఉంచారు. నలుగురూ వెళ్ళాక చివరిగా రామారావు పేరు పిలిచారు. న్యాయనిర్ణేతలకి అప్పటికి తల భారం మొదలయింది. మొదటి నలుగురూ ప్రేక్షకులే గొప్పవారని తేల్చేశారు. అప్పుడు వచ్చాడు రామారావు.

"శ్రోతలకన్నా, ప్రేక్షకుల కన్నా పాఠకులు గొప్పవారు. ఎందుకంటే శ్రోతలు వినగలరు. ప్రేక్షకులు చూడగలరు. కానీ పాఠకుడు వింటూ, చూస్తూ, అనుభూతి చెందగలడు" అంటూ ప్రారంభించాడు. అంతే! అక్కడి వారి మనస్సులకి గాలంవేశాడు. తనతో తీసుకువెళుతున్నాడు. వక్తల దగ్గరికి, వేదాంతుల దగ్గరికి, మేధావుల చెంతకి.

రచయితలతో పరిచయాలికి, విశ్వదర్శనానికి. అంతా పాఠకమయం ఎవరిని చూసినా పాఠకులే. ఎదుటివారి మనస్సుని చదవగలిగేవారు, కళ్ళులేకున్నా ప్రక్కవారి భావాలని చదువగలిగేవారు తల్లిమనసులోని, కళ్ళలోని చిరుకోపం చదవగలిగే పసిపిల్లలు, ఇలా ఎందరో పాఠకులని పరిచయం చేశాడు.

'ఇంతింతై వటుడింతై' పద్యం చదివాడు.

"చిన్నగా ఉన్న వామనుడు ఎదుగుతున్నాడు. పెరుగుతున్నాడు. క్రమంగా ఆకాశాన్ని, నక్షత్రమండలాన్ని, చంద్రుడిని, ధ్రువుడిని దాటుతూ వెళుతున్న విష్ణుమూర్తితో పాట పద్యం చదివే పాఠకుడు కూడా పెరుగుతాడు. ఆయన నిర్మించిన లోకాలన్నీ తాను దర్శిస్తాడు.

ప్రేక్షకులకి చదవాల్సిన అవసరం లేదు. పైగా రంగుల్లో ప్రత్యక్షంగా చూడచ్చు అనే అపోహ ఉంది. కానీ అక్కడ మీరు ప్రేక్షకులు మాత్రమే. ఎవరో చూపింది చూడాలి. అంతే కానీ ఇక్కడ మీరు సృజనకారులు. సృష్టికర్తలు. భావ చిత్రకర్తలు. ఇక్కడ వామనుడు ఎదిగి వెళ్ళిన చోటుకల్లా మీరూ వెళ్ళారు. ఊహలో. ఊహ ఉన్నంత గొప్పగా దృశ్యం ఉండదు.

ఎందుకంటే ఊహకి రూపకల్పనే దృశ్యం. కొంతకాలానికి స్మృతి నుండి తొలిగిపోతుంది. ఊహ అలాకాదు. కొంగ్రొత్త దృశ్యాలను సంతరించుకుంటూ మనిషి ఉన్నంత కాలమూ స్థిరంగా ఉంటాయి. చిరస్థాయిగా నిలుస్తాయి. దృశ్యానికి పరిమితి ఉంది. ఊహకి లేదు.

చెప్పే వరకే రచయిత బాధ్యత. చదివేప్పుడంతా పాఠకుని ఇష్టమే. ఎవరో చూపిన పరిమిత దృశ్యాన్ని చూసేవారికన్నా, తను సృష్టించుకున్న అపరిమిత దృశ్యాలని చూసిన వాడు గొప్పవాడు. దృశ్యంలో మరో చిక్కుంది. ఎవరో చూపిన వ్యక్తిని మనం హీరోగానో, దేవుడిగానో, ప్రకృతి గానో చూడాల్సి ఉంటుంది. పాఠకుడికి ఆ ఖర్మ లేదు. తనిష్టం వచ్చిన వ్యక్తిని, స్థలాన్ని, దృశ్యంగా వాడుకోవచ్చు.

పాఠకుడు ప్రేక్షకుడు, శ్రోత కాగలడు. కానీ శ్రోతలు, ప్రేక్షకులంతా పాఠకులు కాలేరు. అందుకు అర్హత ఉండాలి. అర్హత ఉన్నవారు అర్హత అవసరం లేనివారి కన్నా ఓ మెట్టు పైనున్నట్టే కదా? అందుకే ఎటు చూసినా పాఠకులే గొప్పవారు నా దృష్టిలో"

రామారావ్ ముగించిన పదిసెకనులుకి కానీ వారి మనసులకి తగిలించిన కొక్కాలు వీడలేదు. అప్పుడు మ్రోగాయి చప్పట్లు హాలంతా అదిరేలా. ఐతే ప్రథమ బహుమతి అందుకోడానికి మాత్రం రామారావు లేడు. అతనికి బదులుగా ప్రిన్సిపల్ అందుకున్నారు. "మన్నించాలి. రామారావుకి పొట్టలో నొప్పట. అందుకే హాస్పిటల్ కి వెళ్ళాడు" ప్రిన్సిపల్ చెప్పాడు.

అతన్ని గురించి చాలా విని ఉన్న ప్రిన్సిపల్ ఈ విషయాన్ని ఊహించాడు చాలా ముందుగానే. అందుకనే దిక్కులు చూడకుండా వెదక్కుండా అబద్ధం చెప్పి బహుమతిని అందుకున్నారు.

●●●

**జీవితం చిత్రమైనది. అనుకున్న పనులు ఆగిపోతాయి.** ఆగిన పనుకున్నవి సాగిపోతాయి. పేలవంగా ఉన్న జీవితం ఉన్నట్టుండి పరుగులు. పరుగులెడుతుందనుకున్నప్పుడు నిర్జీవమైపోవడం. ఇదే బ్రతుకు తీరు.

రామారావ్ ఇచ్చిన ఉపన్యాసం అతని జీవితాన్ని మార్చేసింది. మలుపు తిప్పింది. అప్పుడు ఉదయం ఎనిమిది గంటలు. రామారావ్ ఇంటి ముందు కారు ఆగింది. అప్పటికి సూర్యం వరండాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. జయ వంటగదిలో ఉంది. తాతగారు పూజగదిలో పారాయణ చేస్తున్నారు. రామారావు గెడ్డం చేసుకుంటున్నాడు ఈలపాట పాడుతూ. ఆగిన కారు వంక ఎవరూ చూడలేదు.

ఇస్త్రీ మడత నలగని కాటన్ షర్టు, ఖరీదైన పాంటూ వేసుకున్నతను దిగాడు. కార్లోనుండి డ్రైవర్ డోర్ తీసిపట్టుకున్నాడు. ఆయన దిగగానే ఏదో చెప్పాడు. రామారావు ఇంటివంక చూసాడు. తలూపాడు. నిల్చున్నాడు. ఆయన తలపంకించాడు. గేటు దగ్గరకెళ్ళాడు. సున్నితంగా గేటు మీద తట్టాడు.

సూర్యం వచ్చాడు. 'ఎవరు కావాలండీ?" అడిగాడు.

"నా పేరు చంద్రశేఖర్. మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడాయన. ఆయనకి యాభై ఐదేళ్ళుంటాయి.

సూర్యం గేటుతీసి "రండి" అన్నాడు.

వరండా కుర్చీలో నుండి పేపర్లు తీశాడు. "కూర్చోండి" అన్నాడు.

ఆయన కూర్చున్నాడు. సూర్యం తీసేసిన పేపరు వంక చూశారాయన. అది 'తొలిసంధ్య' పత్రిక.

సూర్యం ఇంట్లోకి వెళ్ళి చిక్కని, కమ్మని కాఫీ కప్పు తెచ్చాడు. "తీసుకోండి" అన్నాడు.

"నేను ఎందుకు వచ్చానో తెలుసుకోకుండానే కాఫీ ఇస్తున్నారే?" అన్నాడాయన కప్పు అందుకుంటూ.

"మీరు ఎందుకు వచ్చినా మా అతిథిగా వచ్చారు" అన్నాడు సూర్యం తను మరో కప్పు తెచ్చుకుంటూ.

"థాంక్స్" అన్నాడాయన.

అప్పుడు టవల్‌తో ముఖాన్ని తుడుచుకుంటూ వచ్చాడు రామారావు. అదీ వెనక తలుపునుండి. దేవుడి గదిలో నుండి వచ్చాడు పెద్దాయన. నిన్నటి పూలని తీసుకుని. ఇద్దరూ ఒకేసారి వరండాలో అభిముఖంగా ఎదురుపడ్డారు. అక్కడ కొత్త వ్యక్తిని చూసి ఓ క్షణం ఆగిపోయాడు – సూర్యం ఇద్దరినీ చంద్రశేఖర్‌కి పరిచయం చేశాడు. "నాన్నా! వీరు చంద్రశేఖరంగారు."

"చంద్రశేఖర్ గారూ! వీరు మా నాన్నగారు. వీడు నాపుత్రుడు. ఇద్దరి పేరూ రామారావ్ అనేది కొసమెరుపు" అన్నాడు.

పరస్పర నమస్కారాలు అయ్యాక తాతా, మనవడు అభిముఖంగానే తిరిగి ఇంట్లోకి వెళ్ళారు. "చెప్పండి నాతో ఏదో మాట్లాడాలన్నారు?" సూర్యం అడిగాడు.

"అవును. మీ అబ్బాయి రామారావ్ మొన్నా మధ్య జరిగిన రాష్ట్రస్థాయి ఉపన్యాసపోటీలో పాల్గొన్నాడు"

"అలాగా!"

"అలాగా అటున్నారు. మీకు మీ అబ్బాయి చెప్పలేదూ? "

"లేదు"

"అతనికి ప్రథమ బహుమతి కూడా వచ్చింది"

"అలాగైతే అస్సలు చెప్పడు. బహుమతులు రావడం, అందరిలో గొప్పగా కనిపించడం వారికి ఇష్టం ఉండదు. అసలు ఫస్ట్ ప్రైజ్ వస్తుందని తెలిస్తే వీడు ఆ పోటీలో పాల్గొనేవాడు కాదు"

"మీరన్నది నిజం. ప్రిన్సిపల్ గారు పట్టుబట్టడం వల్లనే అతనాపోటీలో పాల్గొన్నాడు"

"నా అంచనా ప్రకారం ఫస్ట్ ప్రైజ్ అందుకనే సమయానికి మావాడు అక్కడినుండి ఏదో సాకుతో తప్పించుకుని ఉంటాడు. ఔనా?"

"ఔను పొట్టలో నొప్పి.. అంటూ రెస్ట్ రూముకి వెళ్ళి అటునుండి ఎటో వెళ్ళిపోయాడు"

"సరే! ఇంక నే వచ్చిన విషయం వినండి. తొలి సంధ్య పత్రికని గురించి మీరెప్పుడైనా విన్నారా?"

"అదిగో మేం తెప్పించేది అదే పత్రిక. ఆ పత్రికని గురించి ఎవరికి తెలీదు చెప్పండి"

"ఆ పత్రికాధిపతి చంద్రశేఖర్‌ని నేనే"

అంతే! సూర్యం అదిరిపడ్డాడు "ఔనా?" అంటూ కుర్చీలోనుండి లేచి నిల్చున్నాడు.

"మీరు – మీరు.. మా ఇంటికి" మాటలకై తడబడ్డారు.

"ఔను వచ్చాను. ఎందుకో తెలుసా? మీ అబ్బాయి రామారావు మా పత్రికలో ఉద్యోగం చేస్తాడేమో కనుక్కుందామని వచ్చాను"

నిల్చుని ఉన్న సూర్యం నెమ్మదిగా కుర్చీలో కూర్చుండిపోయాడు. "ఇది నిజమా?" అన్నాడు.

"ఔన్నిజం. ఆ పోటీలు జరిగిన రోజున న్యాయనిర్ణేతలలో నేనూ ఒకడిగా అక్కడికి వెళ్ళాను. మీ అబ్బాయి పాఠకుడిని ఓ కొత్త కోణం నుండి పరిచయం చేశాడు. పాఠకుడు ఎలా గొప్పవాడో అనే విషయాన్ని అందంగా, ఆకట్టుకునేట్టు చెప్పాడు. అంతే. మీ వాడిని గురించి ఆరాతీయించాను. అతని ప్రవర్తనా, ఆలోచనలు అన్నీ తెలుసుకున్నాను. చిన్ననాటినుండి నేటి వరకు అన్నీ విచారించాను. నేను

ఎవరికోసం వెదుకుతున్నానో అతనే మీ అబ్బాయని తెలుసుకున్నాను. అందుకే ఉత్తరం వ్రాయకుండ, ఫోన్ చేయకుండ, స్వయంగా నేనే వచ్చాను''

''చాలా సంతోషం. మీవంటి వారు మా ఇంటికిరావడమే మా అదృష్టం. పైగా ఉద్యోగం ఇస్తాననడం. బహుశా ఈ శతాబ్దిలో ఇదే ప్రధమం అనుకుంటాను. కానీ వాడి ఉద్యోగం చేస్తాడని నేననుకోను. వాడి సిద్ధాంతాలూ, అభిప్రాయాలు అందరిలా ఉండవు''

''అందుకే నే వచ్చాను మీ అబ్బాయిని పిలిచారంటే అతనితోనే మాట్లాడతాను.''

''సరే! కూర్చోండి. ఇప్పుడే వస్తాను'' అంటూ వెళ్ళిన ఆయన రామారావ్‌ని పంపించాడు. కాని తను రాలేదు. తరువాత చాలాసేపు రామారావు, చంద్రశేఖర్ మాట్లాడుకున్నారు చివరికెలాగైతేనేం? రామారావు ఉద్యోగం చేయడానికి ఒప్పుకున్నాడు. కొన్ని షరతులు పెట్టి వాటికి ఒప్పుకుంటేనే ఉద్యోగానికి వస్తానన్నాడు.

చంద్రశేఖర్ అన్నిటికీ ఒప్పుకుని, రామారావ్‌ని ఒప్పించి బైలుదేరాడు. కారుదాకా వెళ్ళి ఓ క్షణం ఆగి ''మిస్టర్ రామారావ్ మీకు నేనో ముఖ్య విషయం చెప్పడం మరిచాను. నిన్ను గురించి నే చేసిందంతా నా ఇంటర్వ్యూ. అందులో నువ్వు నెగ్గావ్. ఫైనల్ ఇంటర్వ్యూ రేపు నా ఆఫీసులో ఉంది. నిన్ను ఇంటర్వ్యూ చేయబోయేది నా ప్రియమిత్రుడు. వాడు రైట్ అంటేనే నీకీ ఉద్యోగం - లేదంటే మనిద్దరికీ రాం రాం'' అన్నాడు. రామారావ్ చిన్నగా నవ్వి తలూపాడు.

●●●

సుమారు అరవై ఐదు, డెబ్బయి ఏళ్ళ క్రితం కలకత్తాకి చెందిన ప్రభాత్ ముఖర్జీ తన చిన్ననాటనే ఆలోచనలో పడ్డాడు. తనలాంటి వాళ్ళంతా వంగి వంగి సలాములు కొడుతూ మాట్లాడ్డం, తెల్లగానూ, ఎత్తుగా ఎరుపు రంగు జుట్టుతో ఉన్నవాళ్ళంతా తనకి తెలీని భాషలో మాట్లాడ్డం అధికార దర్పం చూపించడం నచ్చలేదతనికి.

ఐతే అతనింటికి వచ్చిన మేనమామ, వారు ఆంగ్లేయులని, వారి భాష ఆంగ్లమని, అది అందరూ నేర్చుకో వచ్చనీ చెప్పాక పట్టుబట్టి ఆ భాషని నేర్చుకోసాగాడు. కొంతకాలానికి ఎదుటివారు ఆంగ్లంలో మాట్లాడితే కొద్దికొద్దిగా అర్థం చేసుకునే స్థితికి వచ్చేశాడు. అప్పుడు ఓనాడు. తన బంధువులూ, తెలిసినవారూ ఇంకా ఎంతోమంది పెద్ద గుంపుగా చేరి ఏవేవో అరుస్తూ వెళ్ళడం కనిపించింది వాళ్ళు ఎందుకు అరుస్తున్నారో అతనికి అర్థం కాలేదు. వాళ్ళని అనుసరిస్తూ కొద్ది దూరం వెళ్ళాక వాళ్ళు ఎందుకు అరిచేదీ తెలిలేదు. కానీ తను ద్వేషించే తెల్లవాళ్ళని వాళ్ళూ ద్వేషిస్తున్నారని తెలుసుకుని సంతోషించాడు. తను కూడా వారితో కలసి నడిచాడు.

అలా కొంత దూరం వెళ్ళాక గుంపు చెల్లాచెదురయింది. అతనూ ఓ వేపుగా పరుగెత్తి ఇల్లు చేరుకున్నాడు. మర్నాడు తల్లిమాటల ద్వారా తెలిసింది. నిన్నటి 'తన'వాళ్ళందరినీ చీకటి గదిలో పెట్టారనీ, దాన్ని జైలు అంటారనీను. అంతే. తెల్లవారి మీద ద్వేషం పెరిగింది.

మళ్ళీ మామయ్య వచ్చినప్పుడు ''నువ్వేం చదవాలనుకుంటున్నావ్ రా'' అనడిగితే ''ఏ చదువు చదివితే తెల్లవాళ్ళని నా బానిసలుగా చేయగలనో, చూడగలనో ఆ చదువు'' అని చెప్పాడు.''

''ఏ చదువులు చదివినా వాళ్ళని నీవు బానిసలుగా చూడలేవు'' మామయ్య జవాబు

''ఎందువల్ల?''

''వాళ్ళు రాజులు''

''మనం?''

''బానిసలం''

అంతే! ఆనాటినుండి తల్లి చెప్పే రాజుల కథలు వినడం మానుకున్నాడు ప్రభాత్ ముఖర్జీ. అతని తీరు తల్లికి భయాన్ని కలిగించింది. భర్తలేడు. ఉన్నది ఒక్కగానొక్క బిడ్డ. వాడు ఏమైపోతాడోనని బెంగ పట్టుకుంది. ''నీపని నువ్వు చూసుకో ఆ తెల్లవాళ్ళ గోల

నీ కెందుక"ని నయాన భయాన చెప్పి చూసింది. అతను వినిపించుకోలేదు. అడపాదడపా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అప్పుడప్పుడూ జైలుక్కూడా వెళ్ళేవాడు.

ఈ పోరాట ఫలితంగా ఓ రోజు బ్రిటిష్ సైనికుడొకరు, మరణించిన సైనికుడి మరణానికి కారణమైన ఓ గుంపుకి నాయకుడు ప్రభాత్ ముఖర్జీ అని తెలియవచ్చింది. అధికారులు వెంటనే ఓ ఆజ్ఞని జారీ చేశారు. అదే అతను కనిపించితే కాల్చివేత ఉత్తర్వు. అప్పుడతను కౌమారదశలో ఉన్నారు. జరిగిందంతా విన్న తల్లి తనసోదరుణ్ణి పిలిపించి రాత్రికి రాత్రే తనకొడుకుని అతనితో పంపించింది.

అప్పటికే వ్యాపారం చేస్తూ విజయవాడలో స్థిరపడిన ఆ సోదరుడు మేనల్లుడితో సహా విజయవాడ చేరాడు. కొద్దిరోజులు మాత్రం అతన్ని తనింట్లో ఉంచుకున్నాడు. తరువాత ఉండడానికి ఓ చిన్నగది, భుక్తి గడవడానికో ప్రింటింగ్ ప్రెస్ అతనికిచ్చి " దీనితో లాభపడతావో, నష్టపడతావో నీ ఇష్టం. నేనూ పిల్లలుగలవాడిని. ఇంతకన్నా ఏమీ చేయలేను" అన్నాడు.

ప్రభాత్ ఆ ప్రింటింగ్ ప్రెస్‌ని అభివృద్ధి చేసుకున్నాడు. తల్లికిచ్చిన కఠినమైన వాగ్దానం వల్ల అతను మళ్ళీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదు. తెలుగు వ్రాయడం, చదవడం, చక్కగా మాట్లాడ్డం నేర్చుకున్నాడు. పెళ్ళిచేసుకుని ఓ బాబుకి తండ్రికూడా అయ్యాడు. ఈలోగా స్వాతంత్ర్యం రావడం, తెలుగుమాట్లాడేవాళ్ళకి ప్రత్యేక రాష్ట్రం రావడమూ జరిగింది.

సహజంగా భావకుడైన ఆ బెంగాలీ బాబు విజయవాడలోనే 'తొలిసంధ్య' అనే చిన్న స్థానిక మాసపత్రికని ప్రారంభించాడు. అతని కృషి, పట్టుదల కారణంగా పత్రికకి మంచి ఆదరణ లభించింది. అప్పుడు పక్ష పత్రికను కూడా విడుదల చేశాడు. దానికి పాఠకుల నుండి అపారమైన ఆదరణ లభించింది. పిదప వార, దినపత్రికను కూడా ప్రారంభించాలన్న తలంపుతో తమ మకాం హైదరాబాద్‌కి మార్చాడు.

అప్పటికి ఆయన కొడుకు చేతికంది వచ్చాడు. తండ్రి ఆశయాన్ని అనుసరించి అతనూ ముందడుగు వేస్తున్నాడు. ఐతే 'తొలిసంధ్య'ని వారపత్రికగా చూడకముందే ప్రభాత ముఖర్జీ గుండె పోటుతో కన్నుమూశాడు.

ఆయన బాధ్యతలని తనమీద వేసుకున్న కొడుకు చంద్రశేఖర ముఖర్జీ 'తొలిసంధ్య'ని వారపత్రికగా తీసుకువచ్చాడు. మధ్యలో ఆర్థిక పరమైన ఇబ్బందుల వల్ల దినపత్రికగా తెచ్చే ధైర్యం చేయలేకపోయాడు. "నా ఆశ, ఆశయం 'తొలిసంధ్య' దినపత్రికే" అని తరచూ తల్లితో అనేవాడు.

కొద్ది నెలలకే 'తొలిసంధ్య' దినపత్రికగా అవతరించింది. ఆ తరువాత మార్కెట్లో ఉన్న ఏ పత్రికా 'తొలిసంధ్య'ని దాటి వెళ్ళలేకపోయింది.

నాటినుండి నేటివరకు పత్రిక సాధించిన విజయాలు ఎన్నెన్నో. దానికి చంద్రశేఖర్ కృషి ఎంతగానో ఉంది. ఆయనదిప్పుడు మలిసంధ్య వయస్సే. ఐనా 'తొలిసంధ్య' కోసం ఇంకా కృషిచేస్తూనే ఉన్నాడు. పత్రికని నిత్యనూతనంగా తీర్చిదిద్దే విధానాలకోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నాడు.

'ఈ అన్వేషణలో నేనొక వజ్రాన్ని కనుగొన్నాను. ఆ వజ్రమే రామారావు.' కార్లో తలని వెనక్కి ఆన్చి ఆలోచిస్తున్న ఆయన రామారావుని గురించి ఈ మాటలు అనుకున్నాడు.

●●●

**మర్నాడుదయం 'తొలిసంధ్య' పత్రికాఫీసుకి వెళ్ళాడు రామారావు.** "సార్! అయ్యగారు బైటికి వెళ్ళారు. ఐదునిముషాల్లో వస్తానన్నారు. ఈలోగా మీరొస్తే కూర్చోమనీ, ఈ కాగితాలు చూస్తుండమనీ చెప్పారు" అంటూ ప్యూను కాగితాలిచ్చి కుర్చీ చూపాడు.

కూర్చుని కాగితాలు ముందరేసుకున్నాడు. చంద్రశేఖర్ వచ్చి విష్ చేశాక తెలిసింది తనొచ్చి నాలుగు గంటలయిందని. వచ్చేవారం అనుబంధ పత్రిక కొరకు వేయవల్సిన వ్యాసాలు, కథలు, కార్టూన్లు వగైరాలన్నీ ఆ కాగితాల్లో ఉన్నాయి.

"రామారావ్ నా ఆలస్యానికి సారి. నీ ఇంటర్వ్యూ ఆ గదిలో జరుగుతుంది వెళ్ళు" చంద్రశేఖర్ అన్నాడు. తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళిన రామారావ్ ఒకింత ఆశ్చర్యపడినా "నమస్తే సర్" అన్నాడు మామూలుగా.

"మిస్టర్ రామారావ్! మిమ్మల్ని ఎక్కువ ప్రశ్నలడిగి విసిగించను. 'వార్త' అంటే ఏంటో పది వాక్యాలకి మించకుండా క్లుప్తంగా, గుప్తంగా వ్రాయి" అన్నాడాయన. జేబులో నుండి పెన్ తీసి ఆయన అందించిన కాగితం మీద గబగబ వ్రాశాడు. వ్రాసి ఆయన చేతికిచ్చాడు. అదందుకుని చదివి ఆయన బెల్ నొక్కాడు. రామారావు బయటికి నడిచాడు.

"యస్సర్" అంటూ వచ్చాడు చంద్రశేఖర్. "రేయ్ చంద్రం నీ పత్రికలో పనిచేయడానికి బంగారం లాంటి కుర్రాడిని ఎన్నుకున్నావు. కానీ ఇతను బంగారం కాదు. 'ఒక్క నిమిషం ఆగి తిరిగి అన్నాడు "ఏ..మన్నావు?"

"ఇతను బంగారం కాదు"

"నిజం.. బంగారం కాదు. వజ్రం"

"మూర్తీ థాంక్యూరా" పెద్దగా నవ్వుతూ చెయ్యి అందించాడు. మూర్తి అనబడే ఆ వ్యక్తి కూడా నవ్వి "నేనిక..వస్తారా" అన్నాడు కుర్చీలో నుండి లేస్తూ.

"ఓకే పద ఇంటిదగ్గర, లేదా ఆఫీసు దగ్గర దింపుతాను."

"వద్దు. నే వెళ్ళవలసింది ఆఫీసుకే. ఆర్టీసీ బస్సులో వెళితేనే ఆఫీస్‌కి వెళ్ళిన అనుభూతి కలుగుతుంది. వస్తా" అంటూ బైటికి నడిచాడు.

"సరే పద క్రిందదాకా వస్తాను" చంద్రశేఖర్ వెంబడించాడు. కొన్ని మెట్లు దిగాక ఆగి "రేయ్ చంద్రం ఐదారేళ్ళ క్రితం నాకు గుండెపోటు వచ్చి బస్సులో పడిపోతే ఓ బాలుడు నన్ను హాస్పిటల్లో చేర్చాడు. ఆ తరువాత బైపాస్ సర్జరీ కూడా అయింది గుర్తుందా?"

"ఆఁ ఉంది ఉంది"

"ఆ బాలుడే ఈ యువకుడు. ఇక ఉండు నే వస్తాను" మూర్తి గబగబ అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. చంద్రశేఖర్ రామారావ్‌ని చేరి "రామారావ్ నువ్వు నీ కిష్టం వచ్చిన రోజునుండి డ్యూటీలో జాయినవ్వచ్చు" అన్నాడు.

"మీకు అభ్యంతరం లేకుంటే ఈ రోజే జాయినవుతాను" రామారావన్నాడు.

"సరే" అంటూ మేనేజర్ని పిలిచి "నే చెప్పిన రామారావు ఇతనే. ఇతనిక్కేటాయించిన గది చూపించి ఫైల్సవీ ఇవ్వండి. చాలు ఏం చేయవల్సిందీ అతనిష్టానికి వదిలేయండి" చెప్పాడు చంద్రశేఖర్ .

"సరే సర్" అంటూ రామారావుని వెంటతీసుకు వెళ్ళాడతను.

'మూర్తి వేసిన ప్రశ్నలేంటి? రామారావిచ్చిన జవాబులు ఏంటి?' మనస్సు చేస్తున్న ఆరాటాన్ని తట్టుకోలేక ఇందాకటి గదిలోకి వెళ్ళి కాగితం తీసి చదివాడు. మూర్తి వ్రాసిన ప్రశ్న కనిపించింది.

"వార్తని పది వాక్యాల్లో వ్యాఖ్యానించు". దానిక్రింద రామారావు వ్రాసిన జవాబు. తెల్లనికాగితంపై నీలాలు కురిసినట్టు అందమైన అక్షరాలు.

'మనిషిని కుక్కకరిస్తే అది నిన్నటి పాతవార్త.
మనిషి కుక్కని కరిస్తే అది రేపటి తాజావార్త.
మనిషిని మనిషి కరిస్తే అది నేటి సంచలన వార్త.

విషయాన్ని వివరంగా వ్రాస్తే అది నిన్నటి పాతవార్త,
విషయాన్ని విశ్లేషిస్తూ వ్రాస్తే అది రేపటి తాజా వార్త,
విషయాన్ని విషయంగా వ్రాస్తే అది నేటి సంచలన వార్త.
మనిషి దేవుడిలా ప్రవర్తిస్తే అది నిన్నటి పాతవార్త,
మనిషి దానవుడిలా ప్రవర్తిస్తే అది రేపటి తాజావార్త,
మనిషి మనిషిలా ప్రవర్తిస్తే అది నేటి సంచలన వార్త'

చదివిన చంద్రశేఖర్ ఓ నిమిషం కళ్ళుమూసుకుని అలా కూర్చుండిపోయాడు. 'నిజం నేను వజ్రాన్ని పొందాను' అనుకున్నాడు. అంతలో ఫోన్ "హలో" అన్నాడు.

"నేనురా మూర్తిని. నా ప్రశ్న, రామారావు జవాబు నీవీపాటికి చదివే ఉంటావు. అతను వజ్రమే. సందేహం లేదు. కానీ జాగ్రత్త. వజ్రం సంపదల్ని తెస్తుంది. ఆపదల్ని కూడా తేవచ్చు. అప్రమత్తతతో మెలుగు. ఉంటా" ఫోన్ పెట్టేశాడు మూర్తి.

●●●

'తొలిసంధ్య' ఆఫీసులో రామారావు సబ్ ఎడిటరు కాదు, ఎడిటర్ కాదు, మేనేజరూ కాదు. ప్యూను కాదు. 'ప్రత్యేక సలహాదారుడు' అంతే. తొమ్మిదక్షరాల ఈ పదవి అతనిలో పెద్దగా మార్పుని తేలేకపోయింది కాని అతనివల్ల పత్రిక స్వరూప, స్వభావాలే మారిపోయాయి.

వార్తల్లోని శైలీ, వ్యాఖ్యానాల్లోని వ్యంగ్యత, ప్రజల మనసులకి హత్తుకుంది. దిగజారిపోతున్న మానవత్వపు విలువల మీద 'రాం రాం' అంటూ అతను వ్రాసే వ్యాసాలు బహుళ ప్రజాదరణ పొందాయి. సంవత్సరానికంతా పత్రిక సర్క్యులేషన్ చంద్రశేఖర్ అంచనాల్ని మించిపోయింది.

అందుకు రామారావ్‌ని తన ఆఫీసు గదిలోకి పిలిపించి "రామారావ్ నీకీ రోజునుండి జీతం పెంచుతున్నాను" అన్నాడు.

"ఎవరెవరికి?"

"నీకు"

"ఇంకా"

"ఇంకా ఎవరున్నారు? నీకొక్కడికే"

"క్షమించండి. నాకా యోగ్యత లేదు. వస్తా" వెనుతిరిగాడు.

ఆయన విస్తుపోయి "ఆగు రామారావ్ నీ మనస్సులో ఏముందో చెప్పు. ప్లీజ్" అన్నాడు.

రామారావ్ వెనుదిరిగి వచ్చి "ఐతే వినండి. పత్రికని అభివృద్ధి చేసే ఆలోచన నాదైతే ఆచరణ శకుంతలగారిది. మీరు ఆమెని విడిచి నాకు జీతం పెంచడం నాకు నచ్చలేదు" అన్నాడు.

"మరిప్పుడు నన్నేం చేయమంటావ్?" కావాలనే అడిగాడు.

"మీరు నాకు పెంచదల్చుకున్న మొత్తాన్ని సగం చేసి, ఆమెకూ, నాకూ పంచడం న్యాయం"

"గుడ్ రామారావ్! ఈ సమాధానం నీ నుండి వస్తుందో, రాదో చూద్దామనే 'నన్ను ఏం చేయమంటావ్?' అనడిగాను. నే జీతం పెంచింది నీకొక్కడికే కాదు. ఆమెక్కూడా ఆమెని పిలిపించి నీకు చెప్పినట్టే చెప్పాను. విచిత్రం ఏంటో తెలుసా? మీరిద్దరూ ఒకేలా మాట్లాడి, ఒక్కలా ప్రవర్తించడం. థాంక్యూ. నీ వ్యాసాల్లో ఉన్న నిజాయితి నీలో ఉందా? లేదా? చూద్దామనుకున్నాను. చిన్న పరీక్ష పెట్టాను. పరీక్షలో నన్నోడించి, నా విశ్వాసాన్ని గెలిపించారు మీరిద్దరూ" అన్నాడు సంతోషంగా.

●●●

"పోస్ట్" అన్న కేకవిని వాకిట్లో మొక్కలకు పాదు చేస్తున్న తాతగారు ఉత్తరాన్ని అందుకుని వ్రాసిన వారి చిరునామా చదివి "బాబోయ్" అన్నాడు ఆశ్చర్యంగా. ఉత్తరం చించి, చదివి పరుగులాంటి నడకతో గబగబ ఇంట్లో కొచ్చి "అమ్మాయ్! జయా" అంటూ పిలిచాడు.

"ఏంటి మామయ్యా?" కూర కలుపుతున్న గరిటనలాగే పట్టుకు వచ్చింది జయ.

"జయా మనమంతా ప్రశాంతంగా ఉండటం సహించలేని దేవుడు మనింటికి ఓ తుపానుని పంపించబోతున్నాడు" కంగారుగా అన్నాడు.

"తుఫాను మనింటికి రావడమేమిటి?"

"తుఫాన్ మనింటికే రాబోతుంది. ఆ తుఫాను పేరు సుబ్బాయమ్మ"

"ఎవరూ?"

"మా వదిన సుబ్బాయమ్మ. మీ ఇంటికి వస్తున్నానబ్బాయ్. అంటు వ్రాసింది"

"ఎవరూ? మీ సవత్తల్లి కోడలే?"

"సాక్షాత్తూ ఆవిడే"

"మిమ్మల్ని కట్టుబట్టల్తో బైటికి పంపించింది కదా? ఇపుడు ఏ ముఖం పెట్టుకుని మీ ఇంటికి వస్తుంది మామయ్యా?"

"నవ్వు ముఖం. అరటి పండు అడ్డంగా పట్టేట్టు మూతిని అడ్డంగా సాగదీసుకుని మరీ వస్తుంది"

"అది సరే.. ఆవిడ ఇపుడు ఎందుకొస్తున్నట్టు?"

"అదే ఉత్తరం చదివిన్నుండి ఆలోచిస్తున్నా. అర్థంగావడంలేదు"

"సరే రానివ్వండి. వచ్చే విపత్తుని రాకుండా ఆపడం ఎవరి తరం?"

వాళ్ళు భయపడుతున్న విపత్తు మర్నాటికల్లా ఇంట్లో వాలింది. "ఎలా ఉన్నావబ్బాయ్?" అంటూ ఆప్యాయంగా పలకరించింది. "నీ కోడలి గురించి అంతా చెబితే ఏమో అనుకున్నాను. ఎంత సున్నితమైన చక్కదనం. ఇంతమంచి గుణం. ఎలాగైనా నీవు అదృష్టవంతుడివి" అంటూ మొదలెట్టింది. వంటగదిలో దూరి జయకి సాయం చేసింది.

గోగునారతో మంచం నేసిపెట్టి సూర్యం దగ్గర మార్కులు కొట్టేసింది. కమ్మని నెయ్యి తెచ్చింది. అరిశలు, మినప సున్నుండలు తెచ్చింది. ఖాళీగా ఉన్న సీసాలనిండా కమ్మని పచ్చళ్ళు, పొళ్ళు నింపింది. 'ఈ వయసులో కూడా వదిన చేతిరుచిపోలేదు' అనుకున్నారు తాతగారు. నాల్రోజులున్నాక ఐదో రోజు కమ్మని భోజనం పెట్టింది. యాలుకులు, లవంగాలు వంటి పదహారు సుగంధ ద్రవ్యాలతో తను తయారు చేసి తెచ్చిన పొడిని – చిలకల్లా చుట్టిన తమలపాకుల్లో వేసి అందరి ముందుంచింది.

'భార్య భర్తకి ఇంతకమ్మని భోజనం, ఇన్ని రకాల రుచులు అలవాటు చేస్తే ఆ మొగుడు తమ్ముడినేంటి? ప్రపంచాన్నే కాదని ఆమెతో ఉండిపోతాడు' అనుకున్నారు తాతగారు. 'అందుకే ఆనాడు తనంటే ఎంతప్రేమ ఉన్నా అన్నయ్య ఆమె మాటని దాటలేకపోయాడు'. ఆయన ఆలోచనలతో ఉండగానే బాంబు పడింది.

అదీ ఆయన గుండెల్లో. "అబ్బాయ్. నాకు ఉపోద్ఘాతాలు, నాన్చుడాలు రావు. చల్లకని వచ్చి ముంతదాచడం దేనికి? నాకున్న ఒక్కగా నొక్క కూతురు రమ. దానికిద్దరు పిల్లలు. పిల్లాడు పెద్దాడు. వాడి పెళ్ళయింది. ఢిల్లీలో ఉంటున్నాడు. అమ్మాయి చిన్నది. దానిపేరు మేఘ. నీ మనవడు రామారావ్‌కి ఏ మాత్రం తీసిపోకుండా ఉంటుంది. అందుకే దాన్ని నీ మనవడికి ఇస్తానని అడగడానికి వచ్చాను" అంది.

వేసుకున్న చిలకలు గొంతుకి అడ్డం పడిన భావన. ఏమంటాడు మరిదిగారు. ఆ రోజు బుధవారం. రామారావ్‌కి వీక్లీ ఆఫ్. తనగదిలో కుర్చుని కాగితాలేవో చూసుకుంటున్నాడు. అప్పుడే తాతయ్య నుండి పిలుపు.

"వస్తున్నా తాతయ్యా" అంటూ వచ్చి "ఏంటి తాతయ్యా? " అనడిగాడు.

"అలా కుర్చీలో కూర్చో.. నీతో మాట్లాడాలి"

కూర్చున్నాడు. "చెప్పు తాతయ్యా?"

"మా అన్నయ్య కూతురు రమ. ఆమె కూతురు మేఘ ఆమెని నీకిచ్చి పెళ్ళిచేయాలని పెళ్ళిమాటలకి వచ్చింది మా వదిన."

"అలాగా? ఐతే నువ్వేమన్నావ్?"

"ఏమంటాను? పోయిన అన్నయ్య ఎలాగూ పోయాడు. ఉన్న బంధం కలుపుకోవాలనుకుంటాను."

"నాకిష్టం లేదంటే?"

"అలా ఎలాగంటావ్? పెద్దవాణ్ణి. నీ బాగోగులు చూడాల్సిన వాణ్ణి నా మాటెలా కాదంటావ్?"

"అంటే" రామారావు రెట్టించాడు.

"అంటే?" ఏముంది? ఈ ఇంట్లో నువ్వో నేనో తేలిపోవాలి"

"విషయం కాస్తా బెడిసి కొడుతున్నట్టు అనిపించి కంగారుగా అంది సుబ్బాయమ్మ. "అయ్యో..అదేంటబ్బాయ్ ఇంత చిన్న విషయానికి అంత పెద్దమాటలంటావ్?" అడ్డుతగిలింది.

"నువ్వుండొదినా ఈ రోజు వీడో, నేనో తేల్చుకుంటాను. చిన్ననాటినుండీ ఏదో విషయంలో నాతో గొడవే. చూడు. మనవడివైతే తరువాత. ముందిది తేల్చు. మా వదిన మనవరాల్ని చేసుకోవాలనుంది. అమ్మాయి అందంగా ఉంటుంది. ఏం వదినా?"

"ఔనయ్యా చాలా బాగుంటుంది"

"పనిమంతురాలు. ఏం వదినా?"

"పనా? అది నాకే పనులు నేర్పుతుంది"

"కమ్మని వంటలు చేయగలదు.. ఏం వదినా?"

"ఔను. అదేదో హోటళ్ళ వంటి ట్రైనింగు కూడా తీసుకుంది"

"చదువుకుంది కూడాను. ఏం వదినా?"

"ఎం.సి.ఏ చేసిందయ్యా?"

"కాస్తో కూస్తో కట్నం కూడా ఇస్తారు. ఏం వదినా?"

"పది లక్షల నగదు, పాతికెకరాల మాగాణి, రెండెకరాల కొబ్బరితోటా ఇస్తాను."

"తాతయ్యా ఇంత మంచి అమ్మయికి నేనెందుకు? ఏ ఐ.ఏయస్ ఆఫీసరో వస్తాడు. నాలాంటి బికారిని చేసుకుని ఏం సుఖపడుతుంది"

"మాకు నువ్వేకావాలి. చేసుకుంటావా? లేదా"

"చేసుకోను"

"మరోసారి ఆలోచించు"

"అక్కర్లేదు. నాకు మొదటి ఆలోచనే చివరి ఆలోచన"

"సరే నా మాట చెల్లని ఇంట్లో నేనుండడం దేనికి? నాదారేదోనే చూసుకుంటాను"

"ఆగు తాతయ్యా ఈ ఇల్లు నీది. ఇక్కడి ప్రతి ఇటుకా నీ కష్టంతో కట్టినదే. నిన్ను వెళ్ళగొట్టానన్న అప్రతిష్ట నాకెందుకు? నేనే వెళ్ళిపోతాను' అంటూ గబగబా వెళ్ళి సూట్ కేసు సర్దుకుని వచ్చాడు. జయ, సుబ్బాయమ్మ ఎంతగా బ్రతిమాలినా వినకుండా బైటికి నడుస్తూ "వెళుతున్నా తాతయ్యా" అన్నాడు.

"నేను నిన్ను వెళ్ళిపొమ్మనడంలేదు" కోపంగా అన్నారు తాతగారు.

"ఉంటే నీ మాట వినాలి. అంతకన్నా వెళ్ళడమే మంచిది" విసవిసా బైటికి నడిచాడు రామారావు. పరిస్థితి చేయి దాటిందని గమనించిన సుబ్బాయమ్మ నిజంగానే బాధపడింది. పేరు పేరునా క్షమించమని అడిగి ఆ రాత్రే బండి ఎక్కింది. ఆ రాత్రే సూర్యంతో అంది జయ "మామయ్య తొందరపడ్డారు" అని.

"ఆయనలా తొందరపడరు. ఎందుకలా చేశారో తెలీదు" అన్నాడు సూర్యం.

"ఉదయం అనగా వెళ్ళిన పిల్లాడు ఇంతవరకు ఇంటికి రాలేదు. అసలు వస్తాడో? రాడో"

"తప్పు తెలుసుకుని వాడే వస్తాడు"

"రాడు.. వాణ్ణి విడిచి నేనుండలేను."

పుస్తకాల షెల్ఫ్‌లో ఏదో వెదుకుతున్న సూర్యం అడిగాడు. "జయా వాడికి ఎన్నేళ్ళు?" అని.

"ఇరవై రెండు" అంది.

"నాకెన్నేళ్ళు?"

భర్త ప్రశ్న అర్ధంకాకపోయినా జవాబిచ్చింది. "నలభై ఐదు"

అంతే చేతిలోని వస్తువుని గూట్లోకి గిరాటేసి వచ్చి జయ గడ్డాన్ని కుడిచేత్తో పట్టుకుని కోపంగా అన్నాడు. "చూడు వాడితో నీ బంధం ఇరవై ఏళ్ళది. నాన్నతో నా అనుబంధం నలభై ఏళ్ళది. వాణ్ణి విడిచి నువ్వే ఉండలేనన్నావు. నాన్నని విడిచి నేనెలా ఉండగలను? నీ కొడుకు నీ ఇంట్లో నుండి వెళ్ళి మంచిపనిచేశాడు. మా నాన్నే వెళ్ళి ఉంటే మిమ్మల్నిద్దర్నీ కట్టగట్టి బైటికి విసిరేసేవాడిని" అంటూ చేతిని విసురుగా విడిచి బైటికి వెళ్ళిపోయాడు.

భర్తలో అంత కోపాన్ని చూడని జయ భయపడిపోయింది. తరువాత నాలుగు రోజులకి పాలు పోసే కుమార్ అన్నాడు. "అమ్మా మీ అబ్బాయిగారు వరంగల్‌లో ఉన్నారు. 'ఏంటి బాబూ ఇంటికి రారా' అంటే నవ్వుతూ 'రాను' అన్నారు" అని చెప్పాడు.

భర్తకి భయపడి అతనితో చెప్పలేక నిద్రాహారాలు మాని దిగులుగా కూర్చుంది జయ.

తరువాత రెండో రోజు వచ్చాడు రామారావు. తాతగారు ఎటో వెళ్ళారు. సూర్యం ఆఫీసుకి వెళ్ళాడు. సూట్ కేసు క్రింద పెడుతూనే "ఏంటమ్మా అలా ఉన్నావ్?" అడిగాడు రామారావు.

"ఏరా మామీద కోపం పోయిందా?" అంది జయ కోపంగా.

"మీ మీద కోపమేమిటమ్మా?" చిరునవ్వుతో అడిగాడు.

"అందుకేగా ఇల్లు వదిలి వెళ్ళావ్?" అడిగింది.

"ఓ తాతయ్యతో పోట్లాడి వెళ్ళాననా? అదంతా సుబ్బాయమ్మగారిని వెనక్కి పంపడానికి తాతయ్యా, నేనూ ఆడిన నాటకం. నేను కాంప్‌కి వెళ్ళనున్నట్టు తాతయ్యకి ముందే తెలుసు. 'నువ్వో నేనో తేలాలి' అని తాతయ్య అనగానే నన్ను వెళ్ళమంటున్నాడని గ్రహించి ఓ పూట ముందుగానే వెళ్ళిపోయాను. ఈ విషయం సుబ్బాయమ్మగారు వెళ్ళిపోగానే నీతో చెప్పి ఉండాలే"

"లేదురా నిన్ను వెళ్ళగొట్టారని కోపంతో నేను తాతయ్యతో పల్కడం మానేశాను. అంతేకాదు. ఎన్నడూ లేని విధంగా మీ నాన్న కోపానికి గురయ్యాను" అంటూ జరిగింది చెప్పింది.

"తాతయ్యని అనుమానించి తప్పుచేశావమ్మా" అంతే అన్నాడు. పశ్చాత్తాపంతో కూలబడిపోయింది జయ. రామారావ్ తన గదిలోకి వెళ్ళాడు. మనస్సంతా గజిబిజిగా ఉంది.

"తాతయ్యని తండ్రిలా చూసిన తల్లి ఆయన్ని ఎందుకు అనుమానించింది? మనుషుల మధ్యనున్న బంధాన్ని కడదాకా కట్టిపడేసే సూత్రం ఏంటి? ప్రేమ, అనురాగం? ఆప్యాయత? ధనం? నమ్మకం? ఏది? ఏది?' అలా ఆలోచిస్తూ ఎంతసేపు గడిపాడో తెలీదు. హాల్లో నుండి మాటలు వినిపించాయి.

"క్షమించాల్సిన తప్పు నీదేమీ లేదమ్మా. మా వదిన ఘటికురాలు. ఇక్కడ సి.ఐ.డిల వంటి వారిని ఉంచి వెళ్ళింది. నిన్నరాత్రి వాళ్ళూ వెళ్ళిపోయారు. ఈరోజు పనుండి అలా వెళ్ళాను. రాగానే చెబుదామనుకున్నాను. ఈలోగా మనవాడే వచ్చాడు" అన్నాడు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు రామారావు.

●●●

ఇంటిముందున్న చిన్న తోటలో జయ, సూర్యం, తాతగారు కుర్చీల్లో కూర్చున్నారు. తోట పెంపకం, సంరక్షణ అంతా తాతగారి పనే. ఉన్న చిన్న స్థలాన్ని అందమైన తోటగా మార్చింది ఆయనే. తీరిక దొరికినప్పుడల్లా ఆయన చేసేవి రెండే పనులు. ఒకటి భాగవతం చదవడం, రెండు మొక్కలకి సేవచేయడం.

సాయం వేళ ఇంట్లోని నలుగురూ అక్కడ కూర్చుంటారు. కాఫీ తాగుతూ లేదా చిరుతిండి తింటూనో గడుపుతారు. 'తొలిసంధ్య'లో చేరాక రామారావు ఆలస్యంగానే వస్తున్నాడు. మిగిలిన ముగ్గురూ ఆ సమయాన్ని అలాగే గడుపుతున్నారు.

దినపత్రికతో సూర్యం, వారపత్రికతో జయ, భాగవతంతో తాతగారూ అక్కడే కూర్చుని ఉన్నారు. అంతలో గేటు శబ్దం. ఇద్దరు మగపిల్లలు గేటు తీసుకుని లోపలికి వచ్చారు. పెద్దపిల్లాడి వయస్సు ఇరవైఏళ్ళకి పైనా, చిన్నవాడు పన్నెండేళ్ళలోపు ఉన్నారు. పోలికలు ఇద్దరివీ ఒకరకంగా ఉన్నాయి. ఇద్దరూ గోధుమ రంగు లాల్చీ, పైజమా ధరించి ఉన్నారు.

వీళ్ళున్న చోటుకి వచ్చి "ఆంటీ, అంకుల్, తాతయ్యా నమస్తే" అన్నాడు పెద్దవాడు. తరువాత చిన్నవాడు కూడా నమస్కరించాడు "మీరు"? అంది జయ. "మీ ఎదురింట్లో ఉంటామాంటీ" అన్నాడతను.

"ఓ కొత్తగా అద్దెకి వచ్చారా?"

"లేదాంటీ అద్దెకున్నవాళ్ళని ఖాళీచేయించి, మా ఇంట్లోకి మేం వచ్చేశాం"

"అలాగా కూర్చోండి బాబూ మీ పేరు?"

"నా పేరు సిరియాళ్. వీడు నా తమ్ముడు. పేరు అంబరీష్"

"పేర్లు బాగున్నాయి. మీరే కదూ ఉత్తర భారతదేశంలో ఉంటున్నారని విన్నాను."

"అవునాంటి మా నాన్నగారు పోయాక ఆ ఉద్యోగం అమ్మకు ఇచ్చారు. ఇప్పుడు అమ్మ కూడా వాలెంట్రీ రిటైర్మెంటు తీసుకుంది. అందుకని మా ఇంటికి మేం వచ్చేశాం"

"కూర్చోండి బాబూ కాస్త నిమ్మరసం తెస్తాను"

"వెళ్తాం ఆంటీ. మీతో కాస్త పనుండి వచ్చాం."

"ఏం పని బాబూ. అడుగు."

"కరివేపాకు కారం ఎలా చేస్తారో తెలుసుకుందామని"

"అలాగా" అంటూ చెప్పింది కరివేపాకు కారం తయారీ గురించి. "థాంక్స్ ఆంటీ ఇంక వెళ్ళొస్తాం" అంటూ వెళ్ళబోయిన వాడల్లా ఆగిపోయి "ఆంటీ మేం అప్పుడప్పుడు మీ ఇంటికి రావచ్చా అఁహఁ ఏంలేదు. మేం ఇన్నిరోజులు వేరే రాష్ట్రంలో ఉన్నాం. ఇక్కడి కూరలు, వంటలు మాకు కొత్త. అప్పుడప్పుడు వచ్చి నాకు ఔటనిపించిన వంటకం గురించి నేర్చుకోవాలని.."

"మంచివాడవే. ఈ మాత్రం దానికి సందేహిస్తావెందుకు? అప్పుడప్పుడు కాదు. ప్రతీ రోజూ రా బాబు. మీ అమ్మగారిని కూడా తీసుకునిరా.

"అలాగేనాంటీ థాంక్స్" వెనుతిరగబోయిన అతను ఆగిపోయాడు.

"సిరియాళ్‌జీ" అనే తమ్ముడి పిలుపుతో "జీ" అన్న జవాబు "మంచివాడంటే?" తమ్ముడి ప్రశ్న. "మంచివాడంటే ఏం లేదు. మనస్సులో దాగున్న కుళ్ళుని ఇతరులకు కనిపించకుండా ప్రవర్తించే వాడు" తమ్ముడికి చెప్పి "సారీ ఆంటీ మా తమ్ముడు ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాడు. వాడికి తెలీని పదాలు వినబడితే అలా అర్థం అడుగుతుంటాడు" అని జయతో చెప్పాడు.

"అప్పుడు నువ్వు అర్థాలకి బదులు ఇలా విపరీతార్థాలు చెబుతావన్నమాట"

జయ మాటలకి సిరియాళ్ చిన్నగా నవ్వి తమ్ముడిని తీసుకుని వెళ్ళిపోయాడు.

మర్నాడు రాత్రి భోజనాలు చేస్తుండగా వచ్చాడు "ఆంటీ గోంగూరపులుసు ఎలా చేయాలి?" అంటూ కాస్సేపుండి "మార్కెట్‌కి వెళ్ళొచ్చేసరికి ఆలస్యమయింది" అన్నాడు.

"గోంగూర పులుసు రేపు చేసుకోవచ్చుగానీ కూరా, పులుసూ, పచ్చడీ ఉన్నాయి. నే పెట్టిస్తాను నీకు అభ్యంతరం లేకుంటే తీసుకు వెళ్ళు" అంది.

"అదీ.. అమ్మ..!?" అతను నసిగాడు.

"మీ అమ్మగారు ఏమైనా అంటే ఆంటీ బలవంతంగా ఇచ్చారని చెప్పు. సరేనా?" అంటూ చిన్న చిన్న బాక్సులతో వచ్చింది" కరివేపాకు కారం కూడా ఉందిందులో" అంది.

"ఆఁ అన్నట్టు ఇందాక ఆంజనేయస్వామికోసం చేసిన చిట్టిగారెలున్నాయి. దేవుడి ప్రసాదం. అంటూ మరో బుల్లి డబ్బా కూడా తెచ్చిచ్చింది.

"సిరియాళ్ జీ"

"జీ"

"దేవుడంటే?"

"దేవుడంటే ఏంలేదు. మానవుడు చేయబోయే మంచిపనులకి ధైర్యాన్ని, చెడుపనులకి అధైర్యాన్ని కలిగింప చేసే గొప్ప ఆలోచనాతరంగమే దేవుడు."

"బాగుందబ్బాయ్ చక్కగా చెప్పావ్" అంది జయ. అలా ప్రతిరోజు ఏదో ఒక సమయంలో వచ్చేవారు. వయస్సులో తారతమ్యాలున్నా అన్నాతమ్ములిద్దరూ విడిగా ఎప్పుడూ కనిపించలేదు. ఆ రోజు అర్ధరాత్రి ఎవరో తలుపులు బాదితే రామారావు వెళ్ళి తలుపుతీశాడు. ఈలోగా జయ, సూర్యం, తాతగారూ వచ్చారు. గుమ్మం అవతల ఓ స్త్రీ నిల్చుని ఉంది.

"ఎవరు మీరు?" అడిగాడు రామారావు. ఆ ప్రశ్నని వినిపించుకోకుండా "బాబూ మా సిరియాళ్‌ని చూశారా? వాడిక్కడికి వచ్చాడా?" అనడిగింది. "లేదండీ రెండురోజులుగా అతను మా ఇంటికి రావడంలేదు" అంది జయ. ఆమె నిలవడానికి ఓపిక చాలనట్టు గోడని పట్టుకుని క్రింద కూర్చుంది.

"అవును. వాడు రాడు. వాణ్ణి నానా మాటలూ అన్నాను. అంటూ దుఃఖించసాగింది. జయ గబగబ ఆమె దగ్గరకి వెళ్ళి "ఏంటలా క్రింద కూర్చున్నారు? ఒంట్లో బాలేదా? లేదండి. రండిలా" అంటూ బలవంతాన ఆమెని లేపి ఇంట్లోకి తీసుకు వచ్చి కుర్చీలో కూర్చోబెట్టింది. అప్పుడు పరీక్షగా చూశారంతా. ఆమె చాలాకాలం నుండి అనారోగ్యంతో ఉన్న మనిషిలా ఉంది "నాకేదో గుండెజబ్బుట. ఆపరేషన్‌కి డబ్బుకోసం ఇల్లు అమ్ముతానన్నాడు. నేను వద్దని తిట్టాను. ఒకటి కొట్టానుకూడా." ఆమె ఆగింది ఓ క్షణం.

ఆయాసం తీర్చుకుని తిరిగి అన్నది "మరేం చేయను? వాడి మాటని కాదనలేక బంగారం, వెండి తాకట్టు పెట్టాను. బ్యాంక్‌లో డబ్బంతా నా జబ్బుకి పెట్టాను. చివరకు పదిరోజుల క్రితం మా అక్కయ్య పట్టుచీర.. పదివేల రూపాయల చీర వెయ్యిరూపాయలకి అమ్మి, మందులు తెస్తే కాదనలేదు. ఇప్పుడేమో ఇల్లు అమ్మి నాకు ఆపరేషన్ చేయిస్తానని కూర్చున్నాడు. వద్దన్నాను. తిట్టిపోశాను. వాడి ఎక్కడికో వెళ్ళాడు."

"మీ అక్కయ్యగారు ఎవరు?"

"మా అక్కయ్య సిరియాళ్ వాళ్ళమ్మగారు. అంబరీష్ నా కొడుకు. మీ కాళ్ళుపట్టుకుంటాను. వాడు ఏం చేసినా కాదనను. దయచేసి వాణ్ణి వెదికి పెట్టండి. వాణ్ణి చూడకుండా నేనుండలేను. దయచేసి నా బాబుని వెదికిపెట్టండి" అంది కన్నీళ్ళతో.

"బాబోయ్. ఈవిడకి జ్వరంగా ఉంది" అంది జయ. రామారావ్ వెంటనే స్కూటర్ మీద బయటికి వెళ్ళాడు. ఆటో తెచ్చాడు. అప్పటికి ఆమె నీరసంతో కళ్ళుమూసుకుని ఉంది. ఆమెని హాస్పిటల్లో చేర్చారు. రెండురోజుల్లో ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు.

తాతగారి మిత్రుడొకాయనకి పరిస్థితి వివరిస్తే "నేను ఆర్థికంగా సాయం చేయలేను. కాని పేదవారికి ప్రభుత్వం ఇచ్చే సహాయం ద్వారా ఆపరేషన్ ఖర్చు లేకుండా చేయగలను" అన్నారు.

"అదే మహద్భాగ్యం" అన్నారు తాతగారు.

మొత్తం మీద సిరియాళ్ వాళ్ళమ్మకి ఆపరేషన్ విజయవంతమైంది. మందులకూ, మిగిలిన ఖర్చులకీ రామారావ్ వాళ్ళు సాయం చేశారు. ఆమె పేరు లత.

తల్లి ఇంటికి వచ్చాక సిరియాళ్ అన్నాడు "రామారావ్ భయ్యా ఏం చేసి మీ ఋణం తీర్చుకోను?" అని.

"మాకేమీ చెయ్యద్దు. మీ అమ్మగారిని బాగా చూసుకో చాలు" రామారావ్ అన్నాడు.

"చూసుకుంటాను భయ్యా. నాకు బొమ్మలు వేయడం తప్ప మరో పనిరాదు. ఒకాయన్ని కలిశాను. సినిమా వాల్ పోస్టర్లు వేయమన్నారు. ఎల్లుడినుండి రమ్మన్నారు."

"నువ్వు బొమ్మలు వేస్తావా? కార్టూన్లు వేయగలవా?"

"వేస్తాను భయ్యా. అక్కడి లోకల్ పత్రికల్లో కొన్ని అచ్చయ్యేవి కూడా"

"ఎక్కడ?"

"మహారాష్ట్రలో. నాకూ తమ్ముడికీ చిరుతిళ్ళ ప్యాకెట్ మనీ నేనే సంపాదించుకునేవాడిని. అమ్మని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేకపోయింది"

"గుడ్ 'తొలిసంధ్య'లో కార్టూనిస్ట్ కోసం చూస్తున్నారు. మంచి కాన్సెప్ట్‌తో కొన్ని కొత్తవి వేసుకుని పాతవాటిల్లో నీకు నచ్చినవి తీసుకునిరా. ఎల్లుండి ఇంటర్వ్యూ ఉంది"

"సరే భయ్యా"

"కాని ఒక్క విషయం విను. నేను నిన్నక్కడ పరిచయం చేస్తాను. రికమెండేషన్ చేయను. నీలు ప్రతిభ ఉంటేనే ఉద్యోగం వస్తుంది. లేదంటే అవకాశం పోతుంది. ఉద్యోగానికి నన్ను నమ్ముకుని రావద్దు. నిన్ను, నీ కళని, శక్తిని నమ్ముకునిరా. అవి నీలో లేవనుకుంటే రాబోకు"

"సరే భయ్యా"

"అసలిలా పరిచయం చేయడం కూడా నా స్వభావానికి వ్యతిరేకం. కానీ మీ కుటుంబ పరిస్థితిని చూసి నీకీ సాయం చేయదల్చుకున్నాను."

"భయ్యా.. నా చేతయినంత ప్రయిత్నిస్తాను. తరువాత దేవుని దయ"

"అవును సిరియాళ్ ఆ రోజు అమ్మగారి మీద అలిగావుట. ఎందుకు?"

"అమ్మ మీద ఎవరైనా అలుగుతారా భయ్యా? ఇల్లు అమ్మకూడదంది. అందుకే అప్పుకోసం ఊరంతా తిరుగుతూ కూర్చున్నాను. అదీ మంచిదే అయింది. ఆమెకి ప్రాణగండం పోయింది మీవల్ల."

"ముందు ఆ పొగడ్తలు ఆపు. కాగల కార్యం చూడు" అన్నాడు రామారావ్.

"సరే భయ్యా నాకల్లో ఉన్న కార్టూన్లన్నీ కళ్ళముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తాను" అన్నాడు సిరియాళ్.

●●●

"రామారావ్ నువ్వో కార్టూనిస్ట్‌ని తెచ్చావంటే పర్లేదు కాస్తో కూస్తో ప్రతిభ ఉంటుందనుకున్నాను. కానీ అతను ప్రతిభతోనే పుట్టాడని తెలుసుకున్నాను" సిరియాళ్‌ని అపాయింట్ చేస్తూ రామారావుతో అన్నాడు చంద్రశేఖర్. అంతే ఆనాడే 'తొలిసంధ్యలో 'సిరి ఆలం' అనే రాజకీయ కార్టూన్ ప్రత్యక్షమయింది.

'తనమీద తాను వేసుకున్న గ్రేట్‌జోక్' అన్న నానుడి ప్రకారం తనదే తన కార్టూన్‌కి ఎన్నుకున్నాడు సిరియాళ్.

ఎత్తునుదురు, గొప్పచెవులు, మిడిగుడ్లు లావు పెదవులు, కుంచించుకుపోయిన మెడ, బానపొట్ట సన్నని చేతులు. ఇదీ ఆ రాజకీయనాయకుడి అవతారం. ఆయన పేరు ఆలం. ఆవుదూడల లంకయ్య. ఆయన పి.వి.సిరి. వెరిసి సిరిఆలం. ఆలం చెప్పే రాజకీయ సూత్రాలు విని సిరికి తరచూ తలవాచి పోతూ ఉంటుంది. ఒక్కోసారి కళ్ళు తిరిగి క్రింద పడిపోతూ ఉంటుంది.

క్రిందపడిన వ్యక్తి తనంతట తానే లేవాలి. మరొకరు లేవనెత్తరాదు. ఇది రాజకీయ పునరుక్తి అంటాడు ఆలం. రాజకీయ వింతలు, వివరాలు, విశేషాలు తెలుపుతుంటాడు. తరచుగా పాఠాలు, అరుదుగా సూక్తులు చెబుతుంటాడు. ఎనిమిది వంకరలు కలిగిన 'ఆలం'లో సిరియాళ్ పోలికలు కనబడ్డం కొసమెరుపు.

ఆనాటి నుండి 'తొలిసంధ్య' పాఠకుల కళ్ళు 'సిరిఆలం' కోసం వెదకడం మొదలెట్టాయి. మరో దినపత్రికలో 'సిరిఆలం' ఉండదని ఈ పత్రికని వేసుకునే పాఠకులు తయారయ్యారు. పాఠకుల స్థాయిని రామారావూ, పత్రిక స్థాయిని సిరియాళ్ పెంచేశారు.

సిరియాళ్ తమ్ముడు అంబరీష్‌ని స్కూల్లో చేర్చాడు. తాకట్టులో ఉన్ననగలు, వెండి తెచ్చేసుకున్నాడు. ఇల్లు రిపేర్ చేయించాడు. ఫర్నీచర్ కొన్నాడు. "రెండేళ్ళ వరకూ మీ అమ్మగారికి రెస్ట్ అవసరం. ఆవిడ బలహీనంగా ఉన్నారు" అన్నాడు డాక్టరు. అందుకోసం ఓ పనమ్మాయిని ఏర్పాటు చేశాడు. ఉదయమంతా ఆమె చూసుకునేది లతని. సాయంత్రం అన్నదమ్ములు చూసుకునేవారు. ఆఫీసు నుండి రాగానే అందరూ రామారావు వాళ్ళ చిన్నతోటలో చేరేవాళ్ళు.

ఆ రోజు రాత్రి ఎనిమిదయింది. ఇంకా ఏదో విషయం మీద వాడివేడి చర్చ జరుగుతోంది. చాలాసేపు వాళ్ళవంక చూసిన అంబరీష్‌కి బోర్ కొట్టింది. "సిరియాళ్‌జీ" అన్నాడు. "జీ" అన్నగారి జవాబు.

"ఆకలి అంటే?" అడిగాడు వెంటనే. "ఆకలి అంటే ఏం లేదు బ్రతికున్న వాడి పొట్టలో నిప్పులేని మంట" సిరియాళ్ జవాబు చెప్పి మళ్ళీ చర్చలో పాల్గొనబోయి తమ్ముడి వంక చూశాడు.

"సిరియాళ్ జీ ప్రస్తుతం నా పొట్టలో అదే" అన్నాడు. సిరియాళ్ వెంటనే తమ్ముణ్ణి దగ్గరకి తీసుకుని "పదినిమిషాల్లో భోజనం పెడతా" అంటూ లేచాడు.

●●●

**వాకిట్లో ఆటో ఆగింది. తుషార బిందువు లాంటి** ముగ్ధ మోహన అందులో నుండి దిగింది. ఆటో వెళ్ళిపోయాక ఇంటి నంబరు, పేరు చూసుకుని తలపంకించి, గేటు తీసుకుని, సూట్ కేసుతో ఇంట్లో ప్రవేశించింది. ఆమె వసారాలోకి వచ్చేసరికి కుటుంబ సభ్యులు ఒకరొకరుగా అక్కడికి చేరుకున్నారు. అంతా ఆమె వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఆమె సూట్‌కేస్‌ని క్రిందపెట్టి "ఎవరీ అనుకోని అతిధి అనుకుంటున్నారు కదూ? నేను మీ బంధువుల అమ్మాయిని. ఇది నా పరిచయంలో సగం. ఇక మీరు రామారావు తాతయ్య, శోభన్ బాబులాంటి మీరు సూర్యం మామయ్య, అమృతం తాగినట్టు నిత్య యవ్వనంలో ఉన్న అత్తయ్య జయ. ఇక తమరు డైనమిక్ హీరో రామారావ్ బావ.. అవునా కాదా?" అడిగింది.

"ఏయ్ అమ్మాయ్ నువ్వెవరు? ఏ ఊర్నుండి వచ్చావ్? మాకెలా బంధువౌతావు? అసలు ఎందుకు వచ్చావు? అన్ని వివరాలూ చకచకా చెప్పేసెయ్" అన్నారు తాతగారు.

"తాతయ్యా నా పేరు మేఘమల్హరి. అంతా మేఘ అంటారు. నేను చక్రధర పాలెం నుండి వచ్చాను. మీ అన్నగారి కూతురికి స్వయానా కూతుర్ని అందుకని తమకు మనవరాలి వరసౌతాను. పోతే ఈ సౌభాగ్యనగర్‌లో ఉద్యోగం సంపాదించాను. కనుక ఉద్యోగం చేస్తూ గోల్కొండ నవాబులా ఈ ఊరేలదామని వచ్చాను"

"ఎవరూ? నువ్వు మా వదిన సుబ్బాయమ్మ మనవరాలివే?"

"అవును. స్వయంగా తత్ శాల్తిని నేనే."

"కాస్త నువ్వుండమ్మా ఈ అమ్మాయి గొడవలో పడి మరచే పోయాను. ఇందాక మనకి గొడవ జరుగుతోందా? అప్పుడు పానకంలో పుడకలా ఈ అమ్మాయి వచ్చిందా? ఎవరో వస్తున్నారని నేను గొడవ ఆపి బయటికి వచ్చానా? అప్పుడే అలా వచ్చేముందు నువ్వేమన్నావు? ఆఁ గుర్తొచ్చింది. నాకు మతిలేదు అన్నావా? లేదా?" తాతగారు రామారావ్‌ని కోపంగా చూస్తూ ప్రశ్నించారు.

"ఔను. అన్నాను" అన్నాడు రామారావు.

"ఏదో పోనీ పిల్లాడు - బ్రతిమాలాడు గదాని నిన్నింట్లోకి రానిస్తే నాకే మతిలేదు అంటావా? తక్షణం నా ఇంట్లోనుండి వెళ్ళిపో."

"మహారాజులా వెళ్ళిపోతాను. ఈ దిక్కుమాలిన ఇంట్లో నువ్వే ఉండు. అసలు నీ వల్లనే ఈ ఇల్లంతా ముసలి వాసన కొడుతోంది."

"ఏంటీ? నేను ముసలాడినా?"

"కాదు. పన్నెండేళ్ల బాలాకుమారుడు పాపం!"

"స్టాప్ స్టాప్ చూడండి తాతామనవళ్లలారా! మీ ఉత్తుత్తి జగడానికి హడలిపోయి పారిపోవడానికి నేనేమీ పల్లెటూరి గబ్బిలాయమ్మ సుబ్బాయమ్మని కాదు. తాతకి దగ్గులు నేర్పినట్టు, చేపకి ఈత నేర్పినట్టు, పూవుకి పరిమళం నేర్పినట్టు ఈ మహానటి మేఘ ముందు మీరు నటించడం ఏమీ బాగోలేదు. ఆపేయండి"

"అదేంటమ్మా అలాగంటావు?"

"తాతయ్యా మా అమ్మమ్మ హైదరాబాద్ నుండి రాగానే జరిగినదంతా చెబుతూంటే మా వాళ్లంతా పిచ్చిమొద్దుల్లా 'అయ్యో పాపం' అంటూ విన్నారు. నాకు మాత్రం ఎక్కడో, ఏదో అపశృతి అనిపించింది. నీ మనవడి హీరోయిజమ్ గురించి ఆనోట, ఆనోట విని ఓ చూపు చూడాలనీ అనిపించింది. అందుకని పట్టుదలతో ఉద్యోగం వెదుక్కుని మరీ ఈ ఊరొచ్చాను." నవ్వుతూ అంది మేఘ. అంతే అంతా ఆమెవంక చూస్తున్నారు అదోలా.

కొద్దిక్షణాలాగి అందామె. "తాతయ్యా నీ మనవడు ఈ రామారావు బావ గనక నాకు నచ్చివుంటే మూడే మూడు రోజుల్లో లవ్ లైన్ మీదికి అతన్ని లాక్కొచ్చేదాన్ని. కానీ నేను మీకు చెప్పే శుభవార్త ఏమంటే ఈ రామారావు నాకు నచ్చలేదు."

"ఏంటీ? నా మనవడు నచ్చలేదా?" తాతగారి అదిరిపాటు.

"ఔను తాతయ్యా ఇది నిజం. వివరాలు తరువాత చెబుతాను. నేను రావడం మీ అందరికీ బాధ కలిగించినా, వచ్చాక మీకు నచ్చిన శుభవార్త చెప్పా గనక ఇప్పటికైనా నన్ను ఇంట్లోకి రమ్మనీ, స్నానం చెయ్యమనీ, ఓ కాఫీ ఇస్తామనీ అనడం మీ ధర్మం ఏమంటావత్తయ్యా?" చివరి మాటలు జయతో అంది.

జయ తేరుకుని "గడుసుదానివే. రారా!" అంటూ సూట్ కేసు అందుకుని ఇంట్లోకి నడిచింది. మేఘ ఆమెని అనుసరించింది.

●●●

రాత్రి భోజనాల దగ్గర అడిగింది జయ "ఇప్పుడు చెప్పు మావాడు నీకు నచ్చలేదన్నావ్?" అని "ఔనౌను హీరోలా, అమ్మాయిల కలల రాకుమారుడిలా ఉండే నా మనవడు నీకు ఎందుకు నచ్చలేదు. సరైన కారణం చెప్పకుండా ఊరుకునేది లేదు" అన్నారు తాతగారు.

"చూశావా తాతయ్యా! మా అమ్మమ్మ మీ ఇంటికి వియ్యానికి వస్తే మీరిద్దరూ కయ్యం నటించి ఆమెని పార్రదోలారు. అదే ఇపుడు నేను నచ్చలేదనే సరికి మీలోని అహం తట్టుకోలేక నన్ను ప్రశ్నిస్తోంది. ఇందుకు కారణం తెలుసా? ఈ సభ్య సమాజంలో పెళ్లి సంబంధం కాదనే హక్కు మగపెళ్లి వారికే కానీ ఆడపెళ్లివరికి ఉండరాదనే ధీమా? ఔనా?"

జయకొద్ది సేపు మౌనంగా ఉండి అంది "ఔను మేఘా! నువ్వు చెప్పేవరకు ఈ లోపం నాకు తెలియనే తెలియదు. సారీ!"

మేఘ తినడం ఆపి ఓ నిమిషం అందరి వంకా చూసింది. రామారావు తప్ప అందరి ముఖాల్లోని భావాలని కొద్దిగా చదువగలిగింది. "సరే! ఇప్పుడు కారణాలు చెబుతావినండి. అత్తయ్యా ముఖ్యంగా నువ్వే విను. మీ అబ్బాయి నాకన్నా అందంగా ఉన్నాడు. నాక్కాబోయే భర్తకి ఉండకూడని మొదటి లక్షణం ఇదే. నా భర్త అందంగానే ఉండాలి. కానీ ఎలాంటి పరిస్థితిలోనూ నాకన్నా అందంగా ఉండకూడదు. అందంతో నా భర్తని నా కడకొంగుకి కట్టేసుకోవచ్చు అనే చిన్ని ఆనందం కోసమే నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను.

నా భర్తా, నేనూ కలిసి వెళుతుంటే మగాళ్లంతా వెనుతిరిగి చూడాలిగానీ ఏ ఆడపిల్లా క్రీగంటనైనా చూడరాదు. నీ కొడుకుని గానీ కట్టుకుంటే చూడ్డం ఏం ఖర్మ? 'ఎన్ని కోట్లకి కమిటైపోయావు బాస్?' అని కామెంట్సు కూడా చేస్తారు.

పోతే రెండో కారణం తెలివితేటలు. బాబోయ్ ఇంతటి తెలివితేటల్ని తట్టుకునే శక్తి ఈ చిన్ని గుండెకి లేదు. ఈ బావ తెలివిలో పైసావంతు తెలివున్న వాడు చాలు నాకు. ఓ రకంగా చెప్పాలంటే నీ కొడుక్కి అన్నీ ఎక్కువే అత్తయ్యా! ఆ ఎక్కువ మామూలు ఎక్కువకాదు. చాలా, చాలా ఎక్కువ. అందం, ఆలోచనల స్థాయీ, వాక్చమత్కారం, సంస్కారం, తొడిమా, తొడారం, అన్నీ ఎక్కువ. ఇలా ప్రపంచంలోని అన్ని గుణాలూ చాలా ఎక్కువగా వచ్చిపడ్డాయి మీ అబ్బాయిలో. అబ్బో ఇంత భారాన్ని మోసేందుకు ఏ భూదేవో రావాలిగానీ. ఆకాశంలో అలల విహంగంలా తేలిపోతూ ఆనందలోకాల్లో విహరించే ఈ మేఘ అంత భారాన్ని మోయలేదు మరి" అంటూ తన సుదీర్ఘ ఉపన్యాసం ముగించింది.

తన మనవడినిలా తేల్చి పారేసే సరికి తాతగారికి నిజంగానే కోపం వచ్చేసింది. "ఎవరైనా నా మొగుడు అందగాడూ, తెలివైన వాడూ కావాలనుకుంటారుగానీ ఇలా వెధవో, వాజమ్మో కావాలని కోరుకోరు" అన్నాడు.

"తాతయ్యా! వెధవలో, వాజమ్మలో ఉన్న సద్గుణాలు ఇలాంటి మేధావులలో ఉండవు. ఎలాగంటావేమో విను. ఈ రామారావు బావ పుట్టినప్పుడు మంచిపేరు పెట్టాలని రకరకాల పేర్లు వ్రాసి లిస్ట్ తయారు చేశారు అత్తయ్యా, నువ్వూను. అంతేకాక 'మీ పిల్లలకు అందమైన పేర్లు' అనే పుస్తకాన్ని ఆ రోజుల్లో యాభై రూపాయలు పెట్టి కొనుక్కొచ్చావు. కానీ మేధావి వర్గానికి చెందిన ఈ సూర్య మామయ్య ఏంచేశారు? ఒకే ఒక మాటతో మీ యాభై రూపాయలకి చెల్లుపెట్టారు. మీ ఇద్దరి ఆశలకి చిల్లుపెట్టారు. మీ చేత తీయని ఊహలకి తిలోదకాలు ఇప్పించేశారు."

"ఏయ్! మేఘా ఉన్నటుండి నన్ను విలన్ని చేశావేంటి?" సూర్యం ఉలిక్కిపడి నవ్వుతూ ప్రశ్నించాడు.

మేఘ నవ్వి "మేధావులంతా మెదడు లేని వాళ్ల పాలిట విలన్లే మామయ్యా!" అంది.

అంతా నవ్వారు.

మేఘ తిరిగి అంది. "సో! నా సంబంధం తప్పిపోయిందని మీరంతా తెగ సంబర పడిపోకండి. ఈ గంతకి తగిన బొంతని వెదక వలసిన బాధ్యత మీ అందరిదీను. ఇంత మంది మేధావులున్న ఈ ఇంట్లో ఈ అల్పప్రాణికి ఓ అర్భకుడిని వెదికి పెట్టగలరనే నమ్మకంతో ఆ బాధ్యతని మీకు వదిలేస్తున్నాను. నన్ను నిర్లక్ష్యం చేశారంటే జాగ్రత్త. ఎవరో ఒకరు అని సరిపెట్టుకుని ఈ కొరివితోనే తలగోక్కుంటాను" అంది రామారావుని చూపిస్తూ.

రామారావు గుటకలు మ్రింగి "తల్లీ! అంతపని మాత్రం చేయకు. నే వెదికి తెస్తాగా? నీ వర నిర్ణయ పట్టిక సమర్పించు" అన్నాడు.

"ఏముంది? నాకు కావల్సింది మాన్యుడుకాదు - సామాన్యుడు. మేధావి కాదు - మెతకవాది. బృహస్పతి కాదు - మేఘపతి. వాక్చమత్కారి కాదు. నా వాలు చూపులకై తపించే వాత్సాయనుడు" అంది.

"ఛీ! సిగ్గులేని పిల్ల" అంది జయ. మజ్జిగ పోసుకుంటున్న మేఘ చేతిలో గరిటనలాగే పట్టుకుని

"సిగ్గంటే సిగ్గుకే భయం - మొగ్గలాగే ఉండదు పుష్పం -

ఆలోచనలు అణువులుగా - విడిపోయి విస్తరిస్తే

అంతరంగాన అనంత సాగర మథనం -

ఆవిర్భవించునేమో ప్రేమాణ్వస్త్రం" అంటూ కవిత చదివింది.

"అబ్బో కవిత చాలా బాగా చెప్పావే?" అన్నారు తాతగారు. "తాతయ్యా! ఓ రహస్యం చెబుతాను విను. పదాలు కొద్దిగా గమకంగా ఉన్నా ఒకదానికి ఒకటి సంబంధంలేదు. అక్షరాలా హంగామా తప్ప మరేం లేదు. అసలీ కవితకి అర్థమే లేదు' అంది చెయ్యి కడుక్కుంటూ.

●●●

యం.బి.బియస్ రెండవ సంవత్సరంలో ఉండగా శివకి పెళ్లిచేశారు. అదీ మేనమామ కూతురు దివ్యతో. "నాకిప్పుడు పెళ్లేంటి? పైగా డాక్టర్ కోర్సు చదువుతూ మేనరికం చేసుకోవడమేంటి? ఠాట్! వీల్లేదు" అన్నాడు. మొదట్లో ఐతే అతని అమ్మమ్మ అలిగి నిరాహార దీక్ష పట్టింది. చిన్నప్పటి నుండి ఏదికావాలంటే అదిచ్చి, ఏది అడిగితే అది కొనిపెట్టి, చివరికి యం.బి.బి.యస్ చదవడానికూడా నేనంటూ అండగా నిల్చిన ఏకైక ప్రాణి ఆమె.

బుజ్జగించి, బతిమాలి, భయపెట్టి ఆమె లొంగకపోయేసరికి తనే లొంగిపోయాడు శివ. తలంబ్రాలు అలా దులుపుకుని ఇలా చదువుకోసం వెళ్లాడు. మంచి మార్కులతో యం.బి.బియస్ పాసై ఊరిలోనే ప్రాక్టీసు పెట్టాడు. కోడల్ని కాపురానికి తీసుకువచ్చారు శివ

తల్లిదండ్రులు. స్నేహితుడు వచ్చాడని తెలిసినా ఆఫీసులో పని ఒత్తిడి వల్ల రామారావూ, ప్రాక్టీసు పెట్టే హడావిడిలో శివ ఒకర్నొకరు కలవడానికి వెళ్లలేక పోయారు.

వారం రోజుల తరువాత తీరిక చేసుకుని వెళ్లాడు రామారావు. "దివ్యా! నే చెబుతుంటానే నా స్నేహితుడు రామారావనీ వాడేవీడు" అన్నాడు శివ.

"నమస్తే" అంది దివ్య.

ప్రతి నమస్కారం చేయబోతున్న రామారావు చేతుల్ని ఆపి "నమస్కారం గిటా చేయకు. వీడు నాకన్నా చిన్నవాడు. నాకు తమ్ముడు" అన్నాడు. ఆ పూట రామారావుని కదలనీయలేదు, ఇరువురూ ప్రతీదానికీ వాదించుకోవడం, ఆడవాళ్ళిలా అంటే మగాళ్లిలా అని. భోజనానిక్కూడా ఆపేశాడు.

అంతసేపు వాళ్లతో గడిపిన రామారావుకి ఆశ్చర్యమేసింది. ఏమంటే భార్యాభర్తలిరువురూ ప్రతీదానికీ వాదించుకోవడం, ఆడవాళ్లిలా అంటే మగాళ్లిలా అని దెప్పుకోవడం ఒకళ్ల లోపాలని ఒకళ్లు వేలెత్తి చూపుకోవడం 'ఏంటి వీళ్లు భార్యాభర్తలా? బద్ధశత్రువులా?' అనుకున్నాడు.

"ఏంటి అలా తెల్లబోతున్నావు? వీళ్లు భార్యాభర్తలా? బద్ధశత్రువులా అనుకుంటున్నావా? బాబూ! నిరాహార దీక్ష చేసి నేనీ పెళ్లి చేసినందుకు ఇప్పుడు బాధపడుతున్నాను. ఇద్దరికీ మేనరికం పట్ల ద్వేషం. సర్దుకుపోయే స్వభావం శూన్యం. ఇద్దరిదీ ఒకే మనస్తత్వం. సజాతి ధ్రువాలు వీళ్లు. అందుకే ఈ వికర్షణ." శివవాళ్ల అమ్మమ్మ బాధగా అంది.

అంతే! ఇద్దరూ ఆమెమీద 'గయ్యి'మని లేచారు. కళ్లనీళ్లు తుడుచుకుంటూ ఆమె అక్కడినుండి వెళ్లిపోయింది. కాస్సేపుండి ఇంటికి వచ్చాడు రామారావు. అతను వచ్చేముందు అన్నాడు శివ. "రేయ్ నువ్వు రోజూ నాక్కనిపించాలి. నన్ను రమ్మన్నాసరే. నువ్వొచ్చినా సరే. నీకోసమే, నీ స్నేహాన్ని శాశ్వతం చేసుకోవడమే నేనీ వృత్తిని ఎంచుకున్నాను. ట్రాన్స్‌ఫర్లూ, ప్రమోషన్లు ఉండవు. నాకు నచ్చినచోట ప్రాక్టీసు పెట్టచ్చు. జీవితాంతం నీకు దగ్గరగా ఉండాలనీ ఇన్నాళ్లూ నీకు దూరంగా ఉన్నాను.

ఇంకా డిగ్రీలు పాసవ్వాలనికాని, ఎం.డి చేసి ప్రాక్టీసు పెంచాలని గానీ నాకులేదు. భుక్తి గడిస్తే చాలు. అది సజావుగా గడిచే సూచనలే కనిపిస్తున్నాయి. ఉదయమంతా క్లినిక్‌కి వెళ్లి సాయంత్రం నువ్వొచ్చాక నీతో గడపాలి. ఇదే నా కల. లక్ష్యం కూడాను. అందుకే పైకి చెప్పుకోలేకపోయానుగానీ అమ్మా, నాన్న మీదపడని, కలగని దిగులు నీమీద కలిగేది" అన్నాడు

కన్నీళ్ళతో రామారావుని కౌగిలించుకుని "రేయ్ నిన్ను విడిచి నేనెక్కడికి వెళతాను? నా కోరిక కూడా అదే" అన్నాడు రామారావు.

ఐతే ఇంటికి వచ్చిన అతనికి ఆ రాత్రి నిద్రదూరమైంది. 'ఏంటి వీడి దాంపత్యం. వాళ్లిద్దరూ కలిసి ముసలామె మీద కక్షసాధిస్తున్నారా? ఒకరంటే ఒకరికి నిజంగానే ఇష్టంలేదా? వీళ్లిద్దరినీ సరిచేసే దారి ఏంటి? దివ్య తనకి కొత్త. కానీ వీడు? తను చెబితే వింటాడు. వినేట్టుగా తాను చెప్పగలగాలి. అంతే. కానీ ఎంత స్నేహమైనా దాంపత్య జీవితంలో చోటు చేసుకుంటే బాగుంటుందా? వాడు సహిస్తాడా? ఏమో! ప్రయత్నం చేసి చూడాలి' అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

●●●

"జయా! కాస్త నెయ్యి వడ్డించుకో" అంది శివ వాళ్ల అమ్మమ్మ. "వద్దండీ ఇప్పటికే మాజీ సినీ హీరోయిన్‌లా అడ్డంగా ఊరిపోయానా? నెయ్యికూడా తిన్నానంటే గుమ్మాలన్నీ మార్చుకోవాలి" అంది జయ.

ఆరోజు శివ పుట్టినరోజు. అందుకని రామారావు కుటుంబానికి శివ ఇంట్లో విందు. మేఘని కూడా తీసుకు రమ్మని గోలెట్టారు. ఆమె తనకి కుదరదంది.

"అన్నయ్యగారు! మీరు ఒక్క జిలేబీ ఐనా వేయించుకోవాలి" దివ్య రామారావుతో అంది.

"వద్దమ్మా" రామారావు మాటలు పూర్తికాకుండానే "అమ్మమ్మా!" అన్నాడు శివ.

"ఏరా?" అంది ఆవిడ.

"ఆడవాళ్లు తమ భర్త స్నేహితుడిని అన్నయ్యా! అంటారెందుకు?" అంటం ఆపి విలాసంగా ప్రశ్నించాడు శివ.

"పుట్టింది చిచ్చు" స్వగతంలా పైకే అనేసిందావిడ "నాకు తెలీదు" అంది ఎటో చూస్తూ.

"విను. భర్తగానీ, భర్తగారి సదరు స్నేహితుడి భార్యగానీ తమని అనుమానించకుండా ఉండటానికి గాను భర్త స్నేహితుడిని 'అన్నా' అంటారు." శివ జవాబుకి దివ్య అతనివంక కొరకొర చూసింది.

"అలా చూడకు. నేముందే చెప్పాను. వీడు నాకన్నా చిన్నవాడూ నా తమ్ముడూ అని. నా తమ్ముడు నీకు మరిది అవుతాడు. నాకు అనుమానపు రోగంకానీ, వాడికి పెళ్లాంగానీ లేదు. అంచేత వాణ్ణి రామారావు అని పిలు" అన్నారు చిరునవ్వుతో.

"అల్లాగే అతన్నేమిటి? ఈ ఇంట్లో వాళ్లు సరేనంటే తమర్ని శివా అనమన్నా అంటాను. నాకేం అభ్యంతరం లేదు" కోపంగా అంది దివ్య.

"ఆ రోజు రావాలంటే మా అమ్మా, నాన్నా, నన్ను కొరకొరా చూస్తున్న ఈ ముసలమ్మగారూ బాల్చీతన్నాల్సిందే" అన్నాడు శివ.

"తన్నడానికి మేం ముగ్గురం తయారుగానే ఉన్నాం. ఎటొచ్చీ తిరునామాలవాడు ఇంకా కనికరించట్లేదు" శివ వాళ్ళ నాన్న చిరునవ్వుతో జవాబిచ్చాడు.

"ఈ వాదనలు ఎప్పుడూ ఉండేవే, దివ్యా! ఆ టీవీ పెట్టు సినిమా ఏదో వచ్చేటైమైంది" అంది శివవాళ్ల అమ్మ.

టీవీ ఆన్ చేయగానే "సతీ అనసూయ" అని సినిమా పేరు పడిందప్పుడే ఐతే పేర్లు కూడా పూర్తిగా రాకముందే కరెంటు పోయింది. "కృష్ణార్పణం" అన్నాడు శివ. "హుం! అప్పట్లో సూపర్ హిట్ సినిమా. మంచి సినిమాలు వేయరు. ఎప్పుడేనా వేశారంటే కరెంటు ఉండదు" అంది శివ వాళ్ల అమ్మమ్మ.

"పాటలన్నీ సూపర్ హిట్"

"ఔనా? ఓసారి చూస్తే పోయేది వెధవ కరెంటు" అంది దివ్య.

"ఆడవాళ్లు తాము పతివ్రతలుగా ఉండాలనుకునే కన్నా, పతివ్రతలుగా ఉండాలనే భావనని ఎక్కువగా ప్రేమిస్తారు. అందుకే ఇలాంటి సినిమాలు చూసి హిట్ చేస్తారు" అన్నాడు శివ.

"నే విన్నంతవరకు ఈ సినిమాలో పాతివ్రత్యం కన్నా ఓ స్త్రీ వ్యక్తిత్వాన్ని గొప్పగా చూపారు. ఐనా మగాళ్లు వ్యక్తిత్వం గల ఆడవాళ్ళని భరించలేరు. వ్యక్తిత్వం లేని ఆడవాళ్లని క్షమించలేరు" అంది దివ్య.

"ఆర్డర్ ఆర్డర్!! వాదప్రతివాదనలు విన్నమీదట ఈ కోర్ట్ న్యాయవాదులిద్దరికీ సినిమా శిక్షని విధించింది. ఖర్చు రామారావుని భరించమనీ, తోడుగా కుటుంబ సభ్యులందరూ హాజరవ్వాలని తీర్పు ఇవ్వడమైనది" అన్నాడు రామారావు.

అంతా కలిసి సినిమాకి బయలుదేరారు.. వాళ్లు వాకిట్లోకి రాగానే సిరియాళ్ ఎదురయ్యాడు.

"భయ్యా! తమ్ముడిని అలా షికారుకి తీసుకు వెళదామని త్వరగా ఆఫీసు నుండి వచ్చాను" అన్నాడు.

"మేమంతా సినిమాకి వెళ్తున్నాం. మీరుకూడా రండి" అన్నాడు రామారావు.

"సిరియాళ్ జీ!"

"జీ"

"సినిమా అంటే ఏమిటి?"

"నిజంగా నీకు తెలీదు?"

"తెలుసు. కానీ వివరం కోసం అడిగా"

"అలాగా ఐతే విను. సినిమా అంటే ఏంలేదు విలాసంగా చూస్తే వినోదాన్ని, విమర్శగా చూస్తే వికారాన్ని, విశ్లేషిస్తూ చూస్తే విషాదాన్ని పంచే చిత్రం" అన్నాడు సిరియాళ్.

"బాగానే చెప్పావ్ గానీ పదండి" అన్నాడు రామారావ్ ముందుకి నడుస్తూ.

●●●

రాత్రి ఏడవుతోంది. పుస్తకాలేవో ముందరేసుకుని కూర్చున్నాడు రామారావు. సూర్యం బజారుకెళ్లాడు. తాతగారూ, జయ టీవీ చూస్తున్నారు. "బావా! బావా" అంటూ సుడిగాలిలా వచ్చింది మేఘ. రామారావు వాళ్ళెంతగా చెప్పినా వినకుండా వాళ్లింటికి కొద్దిదూరంలో ఉన్న సింగిల్ బెడ్ రూం పోర్షన్ అద్దెకి తీసుకుంది మేఘ. ఆఫీసునుండి రాగానే స్నానం, కాఫీ కానిచ్చి వచ్చి కాస్సేపు కబుర్లు చెప్పి వెళుతుంది రామారావు తలెత్తి చూసి "ఏమిటా హడావుడి?" అన్నాడు.

"హడావుడే వినమరి..

ఉ. కంటిని వేడు చిత్రమును కంటిని నామది కోరువాని నినే
కంటి విశాల నేత్రములు కంటిని కంఠము మీద మచ్చ నే
కంటిని కొంటె మన్మధుని కంటిని పూవుల వింటికాని ము
క్కంటి యె చూపెనేమొ దయ కంటిని వానిని వానితమ్మునినే"

అంటూ పద్యం చదివింది.

రామారావు నవ్వి "కంచర్ల గోపన్నను కాపీ కొట్టావా?" అనడిగారు.

"బావా! సూర్యుడికి చంద్రుడు కాపీ, చంద్రుడికి నక్షత్రాలు కాపీ, సముద్రానికి నదులు కాపీ, నింగికి నేల కాపీ, పరమాత్మునికి ప్రకృతి కాపీ, మహా మహావాళ్ళంతా కాపీ మాస్టార్లే లేవయ్యా" అంది మేఘ.

"ఇంతకీ ఏమంటావిప్పుడు?"

"తాతయ్యా, నువ్వూ కలిసి ఆడిన నాటకం నేను మా అమ్మమ్మ దగ్గర బైటపెట్టద్దంటే నే వలచిన వాడి చిరునామా నువ్వు పట్టుకోవాలి"

"ఇది చాలా అన్యాయం. క్షణానికి గజం చొప్పున విస్తరిస్తున్న ఈ భాగ్య నగరంలో అతను ఎక్కడున్నాడని పట్టుకోను?"

"అదంతా నాకు తెలీదు సకుటుంబ, సపరివార సమేతంగా సుబ్బాయమ్మ మీ ఇంటిమీద దండెత్తి రావద్దంటే నీవీ రిస్కు తీసుకోవాలి మరి"

"నన్నే బ్లాక్ మెయిల్ చేస్తావా? నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో"

"బావా! బాగా ఆలోచించుకో. నే కోరిన వరుణ్ణి మా వాళ్లకి ఆరు నెలల్లోగా చూపాలి. లేదా వాళ్లు చెప్పిన వాడిని పెళ్లాడాలి. ఇదీ మావాళ్ల నియమం. 'నే కోరినవాడివి నీవే అన్నా, మీరు కోరిన వాణ్ణి తెండి" అన్నా గురి నీమీదే ఉంటుంది. ఆపైన నీ ఇష్టం"

"బాబోయ్! నీ వంటి గయ్యాళిని కట్టుకునే కన్నా ఆ వరుడు మహాశయుణ్ణి వెదకడం తేలిక. ఇంతకీ పద్యం మళ్లీ చదువు"

మేఘ పద్యం చదివింది.

"దొరికాడు" అన్నాడు రామారావు. "నీవిక నిశ్చింతగా ఉండు. అతని అభిప్రాయం కనుక్కుని నీకు చెబుతాను."

"నిజమేనా? నాపీడ వదిలించుకోవాలని అంటున్నావా?"

"నిజం. నీగయ్యాళితనం మీద ఒట్టు. కానీ అతనో మొండివాడు. 'యస్' అనచ్చు 'నో' అనచ్చు. ఆ పూచీనాది కాదు."

"అతను నో అంటే సుబ్బాయమ్మ చేతికి పాతిక బంగారు గాజులు వేసుకున్నా గాజులేసుకున్నట్టు కూర్చుంటుందేమిటి?" అంది మేఘ నవ్వుతూ.

"అది సరే కంటిని, కంటిని అని అన్నిసార్లు చెప్పావ్, ఎక్కడ కంటివి? ఎప్పుడు కంటివి?"

"నిన్న, సిటీబస్‌లో తోసుకుని, రాసుకుని, పూసుకుంటూ వెళ్లాడు. వస్తా" మేఘ వెళ్ళిపోయింది. తాతగారూ, జయ టీవీ కట్టేసి వీళ్ళ మాటలే వింటున్నారు. హాల్లో కూర్చున్న వాళ్ళకి మేఘ, రామారావు మాటలు స్పష్టంగా వినబడ్డమేకాదు, గుమ్మంలో నుండి కనబడుతోంది కూడా. మేఘ వెళ్ళిన కొద్దిసేపటికి సన్నని మాటతో అంది జయ. "మామయ్యా! 'సుబ్బాయమ్మగారిని హడలగొట్టి మనం పొరపాటు చేశామేమో' అనిపిస్తుందిప్పుడు" అంది.

"ఔనమ్మా! ఈ మాటని మేఘని చూసిన రోజే అందామనుకున్నాను. కానీ 'మామయ్యకి అన్నగారి కుటుంబంపై అనురాగం ఇంకా పోలేదు' అనుకుంటావని పైకి అనలేకపోయాను" అన్నారు తాతగారు.

పుస్తకాలు సర్దుకుని హాల్లోకి రాబోతున్న రామారావు వీళ్ళ లోగొంతుక మాటలు గుమ్మంలోనే విని వెనక్కి వెళ్ళి వరండాలో కూర్చుని కొద్దిసేపటికి పుస్తకాల్లో లీనమైపోయా డు.

"అమ్మమ్మగారూ శివలేడా?"

"ఎవరూ? రామారావా? రా బాబూ.. అలా కూర్చో"

"వీడు లేడా?" కూర్చుంటూ అడిగాడూ రామారావు.

"లేరు. ఇద్దరూ కలిసి ఉదయమే వెళ్ళారు" అంది.

"దివ్యా, వీడూ కలిసే?"

"అదే విచిత్రం. ఇంత పోట్లాడుకున్నా బైటికి వెళ్ళాలంటే ఇద్దరూ కలిసే వెళతారు. ఏ ఒక్కరికి కుదరకపోయినా ఇద్దరూ మానేస్తారు.

"ఔనా?"

"ఆ చిత్రం ఏంటో తెలుసా? ఈ మధ్య డిస్పెన్సరీకి కూడా తీసుకు వెళ్తున్నాడు. మందులూ, ఇంజెక్షన్లూ ఇవ్వడం నేర్పిస్తున్నాడు. కలిసే వెళ్ళి కలిసే వస్తున్నారు. రాగానే మొదలు రామ, రావణ సంగ్రామం. ప్రత్యక్ష ప్రసారం మాకు. పట్టుచీర కట్టుకుని వెళ్లింది. బహుశా పెళ్ళికై ఉంటుంది. మేం ముగ్గురం ఎక్కడికనిగానీ, ఏమని కానీ అడగము. వాళ్ళు చెప్పనూ చెప్పరు."

అంతలో వాకిట్లో బైక్ ఆగింది. "అదిగో వచ్చినట్లున్నారు" అంటూ అమ్మమ్మగారు లోనికి వెళ్ళారు.

"ఏరా ఎప్పుడొచ్చావ్?" రామారావుని పలకరించి అతని పక్కనే కూర్చున్నాడు శివ.

"ఇప్పుడే" అన్నాడు జవాబుగా.

"మా స్నేహితుడి పెళ్ళికి వెళ్ళాంరా. అక్కడికి వీళ్ళ మేనమామ వచ్చాడు. మహానుభావుడు. ఇప్పటి వరకు మమ్మల్ని వదలలేదు" శివ గుసగుసగా అంటూ చిన్నగా నవ్వాడు.

"ఔను. వదల్లేదు. తాను లక్షరూపాయలు వదిలించుకునే వరకు" అంటూ వచ్చింది దివ్య.

"ఇదిగో నాకీ నెక్లెసూ, ఆయనకి బ్రేస్‌లెట్టూ, చెరో ఉంగరమూ ఇప్పించే వరకూ వదల్లేదు. మా పెళ్ళికి దుబాయిలో ఉన్నాడు. అందుకని ఇప్పుడు ఇప్పించాడివి" అంది. అందరికీ చూపించింది

"బాగున్నాయి" అన్నాడు రామారావు.

"అదేంటమ్మా! ఇంటికి రమ్మనలేదూ?" అంది శివ వాళ్ళమ్మ.

"అనడమేంటి? బ్రతిమాలింది కూడాను. కానీ అర్జంటు పనుందని అడ్రసు తీసుకు వెళ్ళాడు. మరోసారి వస్తానన్నాడు"

"అబ్బాయి చాలా మంచివాడు దివ్యా. మీ నాన్న అదే నా కొడుకు పోయినప్పుడు ఆ ఉద్యోగం మీ అమ్మకి ఇప్పించడానికి కానీ, ఆర్థికంగా ఆదుకోవడానికి కానీ ఉద్యోగానికి శలవు పెట్టి తిరగటానిగ్గానీ అతను చూపిన ఓర్పు, నేర్పు, సాటిలేనివి. చిన్నజీతంతో, ఇద్దరు పిల్లలతో మీ అమ్మ పడే బాధలు చూడలేక నేనిక్కడికి వచ్చేశాను. అనరాని మాటలు పడుతున్నాను గానీ మీ అమ్మకూడా అదే పోలిక. ఏనాడూ పల్లెత్తు మాట అని ఎరగదు " అంది ముసలమ్మగారు.

మాటలు పడుతున్నది తనతో అని శివ గ్రహించాడు. దివ్యా గ్రహించింది. రామారావుతో కబుర్లలో పడిపోయాడు శివ. వాళ్ళ కబుర్లకి కాఫీ రూపంలో బ్రేక్ పడింది. దివ్య, అమ్మమ్మగారూ ఆ మేనమామ గురించి మాట్లాడుకుంటున్నారు.

ఉన్నట్టుండి అన్నాడు శివ "ఆడవాళ్ళు వ్యక్తిత్వంకన్నా ఎక్కువగా వ్యక్తుల్ని ప్రేమిస్తారు. అందుకే అమ్మగారి వేపు బంధువుల్ని అడ్డదిడ్డంగా పొగిడేస్తారు" అని.

దివ్య తలని ఒక్కసారిగా ప్రక్కకి తిప్పి శివవంక గుర్రుగా చూసి "మగవాళ్ళకి తల్లితండ్రులవేపు బంధువులు నచ్చరు. భార్యవేపు బంధువులు గిట్టరు. నేనూ, నేనన్న అహంతో వారి జీవితకాలమంతా గడిచిపోతుంది" అంది.

రామారావు చిన్నగా దగ్గి "ఇపుడు నే మాట్లాడతాను. మీరిద్దరూ యావత్ స్త్రీ, పురుషజాతిని విమర్శిస్తున్నారా? ఒకర్నొకరు విమర్శించుకుంటున్నా రా? ఒకరినొకరు అని మీ జవాబైతే ఫరవాలేదు. కానీ స్త్రీ పురుషజాతిని అన్నారనుకోండి. ఆపదలో పడతారు. ఎందుకంటే ఓ స్త్రీని ప్రాణప్రదంగా ప్రేమించే పురుషుడూ ఓ పురుషుణ్ణి ప్రాణాధికంగా ప్రేమించే స్త్రీ మన సమాజంలో కో కొల్లలుగా ఉన్నారు. వాళ్ళు మీ మాటలు వింటే ఊరుకోరు" అంటూ ఇంటిముఖం పట్టాడు.

●●●

"హల్లో భయ్యా!" సిరియాళ్ తమ్ముడితో వస్తూ అన్నాడు. "రా సిరియాళ్! నీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడు రామారావు. ఇద్దరూ సోఫాలో కూర్చున్నాక "అమ్మగారికి ఎలా ఉంది?" అడిగాడు

"బాగుంది. నీరసంగా ఉంటోంది అంతే. ఏమిటి మాట్లాడాలన్నారు? ఏమైనా విశేషమా?"

"ఆఁ అలాంటిదే"

"ఐతే వినాల్సిందే మరి"

ఐతే ముందో మాట చెప్పు. నీ వెప్పుడైనా ప్రేమలో పడ్డావా?"

"ఎప్పుడైనా పడ్డానికీ, పడితే లేచి దులుపుకుని మళ్ళీ పడడానికి అదేమైనా తలదువ్వుకునే దువ్వెనా? పడటం ఒకేసారి సఫలమైతే పూల బట్టలో పడ్డట్టే. విఫలమైతే బురదగుంటలో పడ్డట్టు. అంతే"

"ఐతే పడలేదంటావు?"

"లేదు."

"పోనీ నీ మీద ప్రేమలో పడ్డారనుకో ఎవరైనా అప్పుడు?"

"భయ్యా నా ఫేస్‌ని నేను రోజూ అద్దంలో చూసుకుంటూనే ఉన్నాను. పోతే నువ్వే కళ్ళ డాక్టర్ దగ్గరికి వెళ్ళడం మంచిదని నా సలహా"

"బోడి ఫోజులు కొట్టకు గాని నీ మీద ప్రేమలో నిలువునా కూరుకుపోయిందో అప్సరస"

"అయ్యో పాపం కళ్ళులేవా?"

"చెత్తవాగుడు ఆపు"

"సిరియాళ్ జీ"

"జీ"

"ప్రేమ అంటే?"

"ప్రేమ అంటే ఏం లేదు. అడ్డాలనాడు అర్థం కానిదీ, గడ్డాలనాడు గుడ్డి కలలు కనిపించేది, పెద్ద వయసులో పేలవంగా తోచేదీ ఐన మానసిక ప్రకంపన."

"సరే బాగానే చెప్పావ్ గానీ ఆ అమ్మాయిని నువ్వు చూస్తావా? వాళ్ళ పెద్దవాళ్ళని పిలిపించమంటావా?" రామారావు అడిగాడు.

"బాబోయ్ మనకేదో బాడ్ టైం వచ్చేసిందిరా! అందుకే భయ్యా ఇలా భయపెడుతున్నాడు. పదరా వెళ్దాం. మార్కెట్‌కి వెళ్దామనుకున్న వాళ్ళం గ్రహచారం బాగోక ఇలా వచ్చాం త్వరగా పదరా" సిరియాళ్ లేచి తమ్ముడిని బలవంతంగా లేవదీశాడు.

ఐతే సోఫాలో బిగుసుకుపోయి నిల్చున్నాడు అంబరీష్

"సిరియాళ్ జీ"

"జీ"

"గ్రహచారం అంటే?"

"గ్రహచారం అంటే ఏం లేదు. ఖగోళంపై తిరుగుతున్న తొమ్మిది గ్రహాలకీ, భూగోళంపై నివసిస్తున్న మానవులకీ కనబడకుండా సాగే కనెక్షన్" అంటూ తమ్ముణ్ణి ఎత్తుకుని బైటికి నడిచాడు. ఐతే గుమ్మంలోనే అతనికి ఎదురుపడింది మేఘ. ఆమెని చూసి, నుదురు తడుముకుని పరుగు అందుకున్నాడు సిరియాళ్.

సిరియాళ్ వెళ్ళిన వంక చూస్తూ "బావా బావా! నా ప్రాణనాధుడు" అంది మేఘ.

"ఔను నీ ప్రాణ నాధుడు. పారిపోవుచున్నాడు."

"ఏల?"

"ఏముంది? నీ ప్రేమ సంగతి చెప్పాను. పెద్దవాళ్ళని పిలిపించమంటావా? అనడిగాను. బాడ్ టైమంటూ, గ్రహచారం బాగోలేదంటూ పరుగు తిడుచున్నాడు."

"బావా! కింకర్తవ్యం?"

"ఏముంది? సుబ్బాయమ్మగారిని రంగ ప్రవేశం చేయించడమే!"

"ఐతే రేపు నేనిక్కడ మాయమై సుబ్బాయమ్మ దగ్గర తేలుతాను.. అత్తయ్యా!" అంటూ వంట గదిలోకెళ్ళింది.

●●●

**వారం రోజులు గడిచాక వచ్చింది మేఘ. ఆటోనుండి** ఆమె వెనకాల మరో యువకుడు దిగడం గమనించారు రామారావు కుటుంబం. అతనూ, మేఘా ఇంట్లోకి వచ్చారు. జయ అందరికీ కాఫీ ఇచ్చింది. ఆఫీసుకి వెళ్ళడానికి తయారవుతూ రామారావు అన్నాడు "సుబ్బాయమ్మగారిని తీసుకు వస్తానని అట్టహాసంగా వెళ్ళావ్? వారం రోజులు అక్కడే ఉండి డీలాపడిపోయి వచ్చావేంటి?"

"బావా! సుబ్బాయమ్మ మృత్యువుతో పోరాడి, గెలిచి ప్రస్తుతం ఆ అలసట తీర్చుకుంటున్నది. ఆరు నెల్లదాకా ఆమెని కదిపితే కాల్చేస్తానని డాక్టరు హెచ్చరించాడు. అందుకే డీలాపడి వచ్చానిలా. ఆఁ బావా వీడు మా చిన్నాన్న కొడుకు. నా కన్నా ఓ మూడునెల్లు చిన్నవాడు. నిరుద్యోగిగా ఉన్నాడు. చిరుద్యోగమేదో వెదుక్కోవాలని ఈ ఊరొచ్చాడు. వీడి"

"ఆగు మేఘూ నా పరిచయమేదో నేనే చేసుకుంటాను. ఆ! రామారావ్ బావగారూ అచ్చుల్లో నా పేరు విభీషణ. హల్లుల్లో నిరంతరాన్వేషణ."

"ఆగాగు. అచ్చుల్లో విభీషణ హల్లుల్లో నిరంతరాన్వేషణా? ఇది కొత్త తెలుగా? లేకపోతే తెలుగుని ప్రహేళన చేశారా?"

"అదేం కాదు. అచ్చుల్లో అంటే అమ్మా నాన్నా పెట్టినపేరు. హల్లుల్లో అంటే వారి స్వభావాలకనుగుణంగా నేపెట్టిన పేర్లన్నమాట."

"వీడంతే బావా. ఉత్తి అల్లరి హచ్చుల్లో, హల్లుల్లో అంటూ ప్రతీవాళ్ళకీ పేరు పెడతాడు. విచిత్రం ఏమంటే వీడు పెట్టిన వారిపేర్లకి ప్రాసకలిసేట్టు, స్వభావాల్ని అతికినట్టూ ఉంటాయి" అంది మేఘు.

"ఇక నువ్వు చెప్పవోయ్ విభీషణ. నీ నిరంతరాన్వేషణ దేనికొరకు?"

"మంచి కొరకు, మమత కొరకు, మనసు కొరకు, మానవతకొరకు."

"అబ్బో! పెద్ద లిస్టే ఉంది. వీటికోసం ఎక్కడ అన్వేషిస్తావ్?"

"ఎక్కడేంటి బావగారూ ఈ జనారణ్యంలో"

"బాగుందోయ్ విభీషణా! నీ పేరు, అన్వేషణా అన్నాను. నీకు 'మ'కారం మీద మమకారం ఎక్కువనుకుంటానూ. నీ పాండిత్యాన్ని మరోమారు పరికిస్తా. వస్తా" రామారావు వెళ్ళిపోయాక "మేఘూ అచ్చుల్లో ఆయన రామారావ్. హల్లుల్లో మాటల్లేవ్. ఇలా జరగడం మొదటిసారి" అన్నాడు విభీషణ.

"ఔనురా. వంక పెట్టలేని వ్యక్తిత్వం బావది" అంది మేఘు.

●●●

'తొలి సంధ్య' ఇప్పుడో వినూత్న దినపత్రిక. ఏ పత్రికలో లేని నిండుదనమేదో ఆ పత్రికలో ఉంది. మనస్సుని హత్తుకునే శీర్షికలతో, పత్రిక 'మాస్' ముసుగుని దాటి క్లాస్ అనిపించుకుంది. ఇందుకు రామారావ్ వార్తలని సరిచేసి అందించే తీరూ, 'వాంటెడ్' అనే కాలమ్ 'గ్రామసభలు' అంటూ రోజుల్లో పల్లెస్థితిగతులు, అక్కడి వార్తా విశేషాలు తెలుపటం. ఇలా పత్రిక నిత్యనూతనంగా అనిపిస్తూ ముందుకుసాగిపోతోంది.

ఇక రెండవ కారణం సిరియాళ్. మాములుగా పత్రిక చేతిలోకి తీసుకున్న పాఠకులు మొదటి పేజీలోని హెడ్డింగ్స్ చదువుతారు. కానీ 'తొలిసంధ్య' పాఠకుడు మూడవపేజీలోని కుడివైపు భాగన అతుక్కుపోతాడు ఐదు నిమిషాలు. 'సిరి - ఆలం'కి అంతటి ఆదరణ కలిగింది.

"మూడు సూత్రాల పథకమా ఏంటిసార్ అది?" సిరి అడిగింది.

"అప్పివ్వకు, అప్పడగకు, అప్పుచ్చుకోకు" అంటాడు ఆలం -

"మీమీద కావాలనే సి.బి.ఐ ఎంక్వయిరీ వేయించుకున్నారా? ఎందుకు సార్?" సిరి అడిగింది.

"నా పుత్రుని వెధవ పనులకి ఆస్తి కరిగిపోయింది. నీతివంతుడనే పేరైనా దక్కుతుందని"ఆలం జవాబు.

ఇలా 'సిరి ఆలం' 'తొలిసంధ్యకి' ఆయువుపట్టుగా మారింది.

ఇక మూడవ వ్యక్తి శకుంతల. రామారావు తరువాత అంతటి ప్రతిభాశాలి ఆమె. సహనం, నిదానం కలిగిన శకుంతల రామారావుతో సమానంగా కష్టపడుతుంది.

ఈ ముగ్గురుకీ బెదిరింపు లేఖలు చాలాసార్లు వచ్చాయి. ఉద్యోగాలు వదలాలనీ, ఊరు విడిచి వెళ్ళాలని. ముగ్గురూ లెక్కచేయలేదు. ఫోన్ కాల్స్ వస్తుంటాయి. ముగ్గురూ పట్టించుకోరు.

●●●

ఆ రోజు ఉదయం నుండి తన ఆఫీసుగదిలోనే ఉండిపోయాడు రామారావు. ఓ రాజకీయ వ్యాసం తయారు చేయడంలో మునిగి ఉన్న అతను మధ్యాహ్నం వరకు పూర్తిచేసి తుదిమెరుగులు దిద్దుతూండగా ఫోన్ మ్రోగింది. "రామారావ్ హియర్!" అన్నాడు.

"ఆ సంగతి తెలుసుగానీ నీకీ సంగతి తెలుసా? మీ అమ్మ, నీకు జన్మనిచ్చిన తల్లి ఇపుడు నా ఆధీనంలో ఉంది. మీ అమ్మ కావాలంటే నీ సీటొదిలి వెంటనే ఈ సోటుకిరా"

ఈ బెదిరింపుకి రామారావు కలవరపడ్డాడో నిమిషం. వెంటనే తేరుకుని "చూడు రౌడీ బాబూ! నాకు మా అమ్మకన్నా ఉద్యోగమే ప్రియమైనది" అంటూ ఫోన్ పెట్టేశాడు.

ఓ నిమిషానికి ఫోన్ తిరిగి మ్రోగింది "హలో రౌడీగారూ ఆ మా నాన్న ఫోన్ నంబరు కావాలా?" రామారావు అడిగాడు.

"లేదు. మీనాన్న కూడా మాకాడ్నే ఉన్నడు"

"అల్లాగా! వీళ్ళిద్దర్నీ ప్రాణంగా చూసుకునే ముసలాయన ఒకడున్నాడు. ఆయనకి చేసుకోండి" అంటూ ఫోన్ పెట్టేశాడు. తిరిగి ఫోన్ మ్రోగింది. "ఏంటయ్యా! నీ గోల?" కసిరాడు.

"ఏం? తిక్కతిక్కగా ఉన్నదా? మీ అమ్మా, అయ్యా, తాతా, మరదలూ, ఇంకా ఆడిపేరేంట్రా?" అంటూ ఆగి 'ఆడిపేరేంటో కనుక్కోండ్రా' అన్నాడు. ఇబీసనుడంటన్నా" దగ్గర్నుండి వినిపించింది.

"ఈడేంట్రా పల్కనీకి కష్టమైన పేరెట్టుకున్నడు. గూబమీద లాగోటి ఇయ్యండ్రా! ఇన్నవా ఇబీసనుడంత. ఆడూ, అంబరీసనే పోరగాడూ అంతా నాదగ్గరున్నరు. తలా ఓ పోటు పొడిచి పల్కరిస్తున్నా" అన్నాడు.

"ఇంతకీ నీకేం కావాలో చెప్పు"

"ఏం లేదు నీతో మాట్లాడ్తా! పన్లన్నీ పక్కన పెట్టి ఓపాలి వచ్చెయ్ చాలు ఆం పోలిసోలని తెచ్చుకున్నా పర్లేదని చెప్పాల్నా?"

రామారావు తన ఆఫీసు గది వదలి బైటికి వచాడు. శకుంతలతో మాట్లాడి, చెప్పవల్సింది చెప్పి రోడ్డు మీదకి వచ్చాడు. అతనికోసమే కాచుకున్న ఓ ఆటోవాలా వచ్చి

"సార్ మీ పేరు రామారావు అయితే ఆటో ఎక్కండి. మిమ్మల్ని ఎల్లమ్మ గుడిదగ్గరికి తీసుకుని రమ్మని ఒకతను డబ్బులిచ్చాడు" అన్నాడు.

మారుమాట్టాడక ఆటో ఎక్కాడు రామారావు. అరగంట ప్రయాణించిన ఆటో గుడి దగ్గరకి చేరింది.

రామారావు ఆటో దిగగానే అతని కుటుంబ సభ్యులందరూ కనిపించారు.

"ఏరా! నువ్వు బాగున్నావా?" అంది జయ ఆత్రంగా.

"నాకేమయింది?" అన్నాడు రామారావు.

"నీకు ఒంట్లో బాగాలేదనీ, హాస్పిటల్లో ఉన్నావనీ ఓ మనిషి ఇంటికి వచ్చి చెప్పాడు. అప్పటికి అంతా మనింట్లోనే ఉన్నారు. అంతే. అందరమూ బైలుదేరాం ఏదో ఆటో కనబడింది. అందులో ఇరుక్కుని కూర్చున్నాం. భయపడుతూ ఆలోచిస్తూ ఉన్న మేము ఆటో ఎటు వెళ్తున్నదీ గమనించలేదు. ఆటో ఓ పాడుపడిన ఇంటిముందు ఆగింది. అందరినీ అందులోకి నెట్టి రాక్షసుల్లాంటి వాళ్ళు కాపలా ఉన్నారు. ఇదిగో ఓ అరగంట క్రితం మళ్ళీ ఆటోలో ఎక్కించి ఇక్కడ దించి వెళ్ళారు" చెప్పింది జయ.

"అర్థం పర్థం లేకుండా ఎవరేది చెప్పినా నమ్మి వచ్చేయడమేనా?" కోపంగా అన్నాడు రామారావు.

"ఒక్కళ్ళుంటే అబద్ధం చెబుతారుగానీ. ఇంతమంది ఉండగా అబద్ధం చెబుతారనుకోలేదు" అన్నాడు సూర్యం.

"సరే పదండి అంతా ఇంటికి వెళదాం" అన్నారు తాతగారు.

రామారావు ఆలోచిస్తున్నాడు. 'వాళ్ళు తనని బైటికి ఎందుకు పిలిపించారు? తీరా తను రాకముందే తన వాళ్ళని ఎందుకు విడిచిపెట్టారు? తనని చూసి భయపడ్డారా?' నవ్వొచ్చింది. తనేమైనా వస్తాదా? కుస్తీ పోటీలవీరుడా? తనని చూసి ఎందుకు భయపడతారు? మరెందుకు తనవాళ్ళని విడిచారు? తనకి గానీ, తనవాళ్ళకి గానీ అపకారం చేయడం వాళ్ళ ఉద్దేశ్యంకాదు.

మరేమిటి? తనని ఆఫీసు నుండి బైటికి పంపించడం ఎందుకు?

"ఏం బావా?" అంది మేఘ.

"ఏంటి?" అన్నాడు రామారావు

"ఎలాగూ ఇంతమంది కలిసివచ్చాం. ఒకేసారి సినిమా చూసి వెళదాం" అంది.

"మీరంతా వెళ్ళండి. నే రాను. నే మళ్ళీ ఆఫీసుకి వెళ్ళాలి" అన్నాడు రామరావ్.

"ఔను ఇప్పుడేం ఆఫీసు? నువ్వు ఆఫీసు నుండి వచ్చే టైమైంది" అంది జయ.

"ఔను ఇప్పుడు నే వెళ్ళి చేయగలిగింది ఏముంది? శకుంతలగారికి అప్పగించి వచ్చాకదా?" అనుకున్నాడు. వాళ్ళతో పాటు సినిమా హాల్‌కి నడిచాడు.

●●●

సినిమా నుండి ఇంటికి వచ్చేప్పటికి తలనొప్పిగా అనిపించింది భోజనం చేయకుండా పడుకున్నాడు రామారావు. ఓ అర్ధరాత్రికల్లా జ్వరం పట్టుకుంది. నిద్రలోనే మూలుగుతున్న రామారావ్‌ని తట్టిలేపడానికి ఒంటి మీద చెయ్యి వేసిన తాతగారు "అమ్మా! జయా!" అని అరిచారు. జయ సూర్యం పరుగెత్తుకు వచ్చారు. "వీడికి చాలా జ్వరంగా ఉంది" అన్నారు. వాళ్ళిద్దరూ వచ్చి తాకిచూసి కంగారు పడ్డారు. అంత జ్వరం రామారావుకి ఎప్పుడూ రాలేదు. హాస్పిటల్‌కి తీసుకువెళితే "జ్వరం చాలా ఉంది జాయిన్ చేయండి" అన్నాడు డాక్టరు.

హాస్పిటల్లో జాయిన్ చేశారు. అతనికి ఒంటిమీద స్పృహకూడా లేదు. డాక్టర్ల మందులు, ఇంజక్షన్ల వల్ల కాస్త తగ్గాక కళ్ళు తెరిచాడు. కొద్దిగా ఓపిక వచ్చింది మధ్యహ్నానికి.

"ఏమ్మా! కాస్త జ్వరానికే ఇంత హడావుడి చేశావేంటి?" అన్నాడు రామారావు.

"కాస్తేంటిరా. డాక్టర్లే హడావుడి పడిపోతేనూ" అంది జయ.

"డాక్టర్లంతే ఫీజు దండిగా ముడుతుందని హడావుడి చేస్తారు. నిన్నరాత్రి సినిమాహాల్లోనే ఒళ్ళు కాస్త వేడిగా అనిపించింది. నీకు చెబితే హడావుడి పడి ఇలాగే నలుగురినీ హడావుడి చేస్తావని చెప్పలేదు" అన్నాడు రామారావు నవ్వుతూ.

"జ్వరం తగిలితే చెప్పకుండా ఎలా? ఐనా నిన్న అంటావేంటి? మనం సినిమాకి వెళ్ళింది మొన్నకదా?"

"అంటే నిన్నంతా"

"ఆఁ జ్వరంతో కళ్ళు తెరవకుండా పడుకుని ఉన్నావ్. సెలైన్ ఎక్కడమైనా నీకు తెలిసిందా?"

"లేదు. అంటే నిన్నంతా నేనిలాగే పడుకుని ఉన్నానా?"

"ఆఁ ఒంటి మీద స్పృహ లేకుండా మందులు, ఇంజెక్షన్ల వల్ల ఈ రోజు కోలుకున్నావు"

"మరి... నా ...ఆఫీసు?" పక్క మీదనుండి లేవబోయాడు.

"ఆఫీసు అక్కడే ఉందిగానీ నువ్వు కదలబోకు. నిన్నరాత్రి మీ చంద్రశేఖర్ గారు వచ్చి వెళ్ళారు."

"ఆయన వచ్చారా?"

"ఔను. నీ కోసం రెండుసార్లు ఫోన్ చేశారు. జ్వరమనీ హాస్పిటల్లో చేర్చామని చెప్పాం. నిన్న రాత్రివచ్చారు వచ్చారు. అప్పటికింకా జ్వరంగానే ఉంది. ఒంటిమీద చేయివేసి చూసి 'చాలా జ్వరంగా ఉంది' అంటూ డాక్టర్‌తో మాట్లాడి వెళ్ళారు. అప్పటినుండి డాక్టర్లంతా నీ చుట్టే ఉన్నారు."

రామారావు ఆలోచిస్తున్నాడు. జ్వరం గురించి కాదు. హాస్పిటల్ గురించి కాదు. డాక్టర్లు గురించి కాదు. చంద్రశేఖర్ గురించి. ఆయనరాక గురించి. ఎందుకు వచ్చారాయన? ఫోన్ ఎందుకు చేశారు? తను ఆఫీసుకి వెళ్ళకపోవటానికీ, ఆయన రాకకీ సంబంధం ఉందా? తనకీ జ్వరం ఎందుకు వచ్చింది? రౌడీలు ఎందుకు పిలిచారు తనని? తీరా పిల్చాక తన వాళ్ళని ఎందుకు విడిచారు?

అదే రోజు జ్వరం ఎందుకు వచ్చింది. ఇంత జ్వరం ఎప్పుడూ రాలేదు. ఇప్పుడూ ఎందుకు వచ్చింది? తన ఉద్యోగానికీ, రౌడీలకీ, జ్వరానికీ, చంద్రశేఖర్‌గారి రాకకీ ఏదో సంబంధం ఉంది అదెటువంటిది? కాస్సేపు ఆలోచించేసరికి తలనొప్పి వచ్చేసిందతనికి. అది ఎక్కువై కళ్ళు మూసుకున్నాడు.

అంతే. జ్వరం మళ్ళీ తగులుకుంది. మర్నాటికి గానీ తగ్గలేదది. జ్వరం తగ్గి ఏ బ్రెడ్డు ముక్కో తిని ఆలోచనలో మునిగిపోయేవాడు. తిరిగి జ్వరం మొదలు. అలా వారం రోజులు గడిచాక డాక్టర్ చెప్పాడు. "మిస్టర్ రామారావ్! మీరు ఆలోచనలు మానితేగానీ మీ జ్వరం తగ్గదు" అని.

"ఆలోచనలకీ జ్వరానికీ సంబంధం ఏమిటి?" అడిగాడు రామారావు.

"మేం ఇన్ని మందులు వాడినా వాటి ప్రయోజనం జ్వరతీవ్రతని తగ్గించడానికే తప్ప జ్వరాన్ని తగ్గించడానికి ఉపయోగపడ్డంలేదు. ఇందుకు కారణం మీ మనసు ప్రశాంతంగా లేకపోవడమే. అందువల్ల మీరు హాయిగా నవ్వుతూ, ఆలోచనలు మాని ఉంటూండండి. మూడోనాటికల్లా మిమ్మల్ని డిశ్చార్జి చేస్తాం" అన్నాడు డాక్టర్. ఈ మాటలు ఇంట్లో చెప్పింది జయ. అంతే ఇంటిల్లిపాదీ హాస్పిటల్లో మకాం వేశారు.

చంద్రశేఖర్ వచ్చివెళ్ళాక రామారావుని వేరే రూములోకి మార్చారు. అన్ని వసతులూ కలిగిన సింగిల్ రూముకి. రూమ్ అని పేరే కానీ విశాలంగా ఉంది హాల్‌లా. ఒక్క సూర్యం తప్ప రామారావు ఆప్తులంతా అక్కడ చేరారు. తాతగారూ, జయ, మేఘ విభీషన, శివ, అతని భార్య దివ్య, సిరియాళ్, అంబరీష్, అంతా రామారావు మంచం చుట్టూ చేరి కబుర్లు ప్రారంభించారు.

"ఏంటి సంగతి? అంతా కట్టకట్టుకు వచ్చారు?" అడిగాడు రామారావు.

"ఏముంది? ఇక్కడున్నవారందరికీ నువ్వు కేంద్రబిందువువి. బిందువెక్కడ ఉంటే వృత్తం అక్కడేగా ఉండేది?" అంది మేఘ.

"అది సరేరా డాక్టరూ! నాకు జ్వరం తగిలితే నువ్వే ఏ మందుబిళ్ళలో నాలుగువేస్తే సరిపోయేది. ఈ హాస్పిటలూ, డాక్టర్లు, జనాలూ ఇక్కడికి వచ్చేశ్రమా తగ్గేదికదా?" రామారావు శివని అడిగాడు.

"రేయ్ అదేదో డాక్టర్ల జోకు వినలేదు. ఖరీదైన బట్టలేసుకున్న ఒకాయన డాక్టర్ దగ్గరకి వెళితే "అయ్యా నా కొడుక్కి ఇలాంటి జబ్బే వస్తే నేను పక్కవీధిలో డాక్టర్ దగ్గరికెళ్ళాను. ఆయన మందుల్తో తగ్గింది. తమరు అక్కడికే వెళ్ళండి" అంటే 'ఆ పక్క వీధి డాక్టర్ నా తండ్రే . అందుకే మీ దగ్గరికి పంపాడు' అన్నాట్ట. నేను డాక్టర్ నైనా నీ ప్రాణాలు నాకు తీపే కదరా!" అన్నాడు శివ.

"దివ్యా! వాడలాగే అంటాడు. నువ్వైనా నాకు మందు బిళ్ళలు ఇవ్వకూడదూ?" అన్నాడు దివ్యతో.

"ఇవ్వచ్చు. కానీ ఆయనకి అసిస్టెన్సీ చేసి, నే నేర్చుకున్నదంతా ఓ పుస్తకంలో వ్రాసి పెట్టాను. అది కాస్తా ఓ కప్ప మింగేసింది. కప్పని వెదుక్కుంటూ నేను వెళ్ళాను. నిన్ను హాస్పిటల్లో చేర్చారు" అంది దివ్య నవ్వుతూ.

"కప్ప నోట్లో పట్టేంత పుస్తకంలో వ్రాయడం తప్పు." అంది అమ్మమ్మగారు నవ్వుతూ.

"నానమ్మా! నేనాయన దగ్గర నేర్చుకున్నది అంతవరకే మరి" అంది దివ్య.

"నానమ్మా ఆ పెళ్ళికి బహుమతిగా వచ్చిన పట్టుచీరలు, నగలతో పాటు తెలివితేటల్ని కూడా అక్కడి బీరువాలో పెట్టి అత్తగారింటికి వస్తే అంతకన్నా ఎక్కువ ఏం నేర్చుకొగలరు చెప్పు" అన్నాడు శివ.

"నీతో కాపురం చేయడానికి తెలివితేటలెందుకురా నోరుంటే చాలు. అందుకే అది మాత్రం తెచ్చుకుంది" అంది శివ వాళ్ళ అమ్మమ్మ. దివ్య ముభావంగా ఉండటంతో ఆడాళ్ళంతా శివ విరుచుకు పడ్డారు.

"శివా! ఇంత తెలివైన భార్యని కట్టుకునికూడా నువ్వంత మాటన్నావ్. నా వంటి తెలివితక్కువ మేళాన్ని కట్టుకుని మీ అంకుల్ చిన్నిమాటని ఎరగరు" అంది జయ.

"శివగారూ మీ పెళ్ళి దివ్యతో చేసి మీవాళ్ళు మీకు న్యాయం చేశారు. కానీ దివ్య పెళ్ళి మీతో చేసి వాళ్ళ వాళ్ళు తనకి అన్యాయం చేశారు" అంది మేఘ పకపకనవ్వుతూ.

"బాబోయ్! బాబోయ్! ఆపండి" శివ చెవులు మూసుకున్నాడు. "రేయ్ రామం. స్త్రీకి స్త్రీయే శత్రువనేది శుద్ధ అబద్ధం. కావాలంటే చూడు. 'మహిళా సంఘాలు' వర్ధిల్లినంతగా 'మగ సంఘాలు' వర్ధిల్లడంలేదు" దివ్యని ఓరగంట చూస్తూ అన్నాడు శివ.

"రామారావుగారూ! మగవారి జీవితంలో ఎప్పుడూ ఇంకొకరికి అవకాశం ఉండదు. బాల్యంలో నేనూ - నా ఆటలు, కౌమారంలో నేనూ - నా చదువూ, యవ్వనంలో నేనూ నా వృత్తి, వృద్ధాప్యంలో నేనూ నా బాల్య స్మృతులు అనుకుంటారు. మనుషులతో కలిసి జీవిస్తే కదా మగ సంఘాలు వర్ధిల్లేది"

"ఆపండాపండి. మీరిద్దరూ ఇపుడు కురుక్షేత్ర సంగ్రామం చూడద్దు" అన్నాడు విభీషణ నవ్వుతూ

"హాయ్ విభీషణా! నీ 'మ'కారాలవేట ఎంతవరకు వచ్చిందోయ్!" రామారావు అడిగాడు.

"బావా! ఇది నిరంతరన్వేషణ. కొన్ని చోట్ల కాస్త దొరుకుతుంది. ఆ ఊపుతో ఇంకాస్త ముందుకు వెళ్ళడం. అంతే"

"ఔనూ! ఎందుకు మీకు మకారం మీద అంత మక్కువ?" శివ అడిగాడు.

"ఎందుకో తెలీదు గానీ చిన్నతనం నుండి నాకు 'మ'కారం మీద మక్కువ ఎక్కువ. అక్షరాల్లో ఇలాంటి గొప్ప అక్షరం కనిపించదు. ఒక సున్నా, ఒక తలకట్టు, ఒక కొమ్ము విడి విడిగా కలిసి కనిపించే ఏకైకాక్షరం 'మ' అన్నాడు విభీషణ.

"అదేంటి? ఏ, ఘ, ప, య, వ, షహలు ఉన్నాయిగా?" దివ్య అడిగింది.

"ఉన్నాయి. కానీ అన్నింటికీ తలకట్టు ఆకాశంలో, అక్షరం భూమండలంలో. ఒకే సంసారంలో మనసులు కలవని భార్యాభర్తల్లా ఒకే అక్షరంలో దారులు కలవని స్వతంత్రత."

"కొయ్యి కొయ్యి కోతలు అ,వలు లేవేంటి? అంది మేఘ.

"ఉన్నాయి కాని 'య'కారానికి ఎత్తులోపం, 'వ'కారానికి కొమ్ములోపం. ఎత్తుగా ఠీవిగా ఉన్న 'మ'కారాన్ని పలికేందుకు కంఠస్వరం, పెదవులు, ముక్కు మూడు కలిసి పనిచేయాలి. ఈ మూడింటిలో ఏ ఒక్కటి పనిచేయకపోయినా ఆ అక్షరం మనకి 'అ'కారంలానో, 'వ'కారంలానో 'ఒ'కారంలానో వినబడుతుంది. మనో, వాక్కాయ, కర్మల సమ్మేళనంలా బుద్ధి, మనస్సు, ఆత్మల సమ్మేళనం 'మ'కారం అనిపిస్తుంది నాకు."

అతనీమాట చెప్పగానే అక్కడున్న వాళ్ళందరూ ముక్కుమూసుకుని, పెదవులని దూరం చేసి 'మ'కారాన్ని పలికి చూశారు. మేఘ కూడా అలా చేసి "బాబోయ్! 'మ'కారం మీద రీసెర్చి చేసినట్టున్నావేం?" అంది.

"ఓ విచిత్రం తెలుసా? మన తెలుగులో మనమూ, మనదీ, మనకి అనే సామూహిక ఏకత్వాన్ని సూచించే పదాలు మకారంతోనే ప్రారంభమవుతాయి. మాది, మేము మాకు - మీది, మీరు మీకు వంటి విడగొట్టే మాటలున్నా, నేను, నది, నాకు - నీవు, నీది, నీకు

వంటి ఏకపాత్రలకన్నా కొంచెం నయం కదు? 'నేను'లో ఉన్నది ఒక్కటే. అంటే అహం. మేములో ఉన్నది కనీసం ఇద్దరు. అంటే మరొకరిని కలుపుకునే కొంత సహనం మేలు కదూ?" అన్నాడు విభీషణం.

"నిజమే" అన్నది మేఘ.

"మరో విశేషం విను సప్తస్వ రాలతో మూడటు, మూడిటు కాగా మధ్యమంగ ఉన్న 'మ'కి స్వరనామం కూడా మధ్యమం. 'మ'" అన్నాడు

"బాబోయ్ నీకిలా అవకాశం ఇస్తే మాకు 'మ'కారయణం చెప్పేట్టున్నావుగానీ వదిలేయ్!" నమస్కారం చేస్తూ అంది మేఘ.

"అలాగే మనోవాంఛిత మనువు సిద్ధిరస్తు" ఆశీస్సు ఫోజు పెట్టాడు.

"నిన్ను చూస్తే 'మ'కారాయణం చెబుతావు. మేఘని కదిలిస్తే కవితలు, ఉత్పలమాల పద్యాలూ చెపుతుంది. మీది పండితుల వంశమేంటి?" రామారావు అడిగాడు.

"పండిత పుత్రః పరమ శుంఠః అనేది సామెత. పరమ శుంఠః పండిత సంతానం, అది మేము' అంది మేఘ.

అంతా నవ్వారు. సిరియాళ్ తప్ప. అతనికి ఇబ్బందిగా ఉంది. మేఘ తనని ప్రేమించడం అతనికి తెలుసు. ఆమె పట్ల తన మనసూ ఆకర్షించబడుతున్నదనీ తెలుసు. కానీ మేఘ అంటే అతనికెందుకో భయం. ఆమె అన్నింటా అతనికన్న ఓమెట్టుకాదు. వంద మెట్లు పైనున్నది. పెద్దవాళ్ళు కాదన్నా, మేఘ మనసు మారినా తనకి తరువాత బాధ తప్పదు. దూరంగా ఉండటం ఎందుకైనా మంచిదని అతని అభిప్రాయం.

మేఘ కూడా ఎప్పుడూ ఎదురుపడి అతన్ని పలకరించదు. కానీ బాహాటంగా చమత్కారాలాడుతుంది. "బావా! కార్టూన్లు వేసేవాళ్ళకి నోట్లో నాలుక ఉందదుగానీ, చేతిలో పెద్ద నోరుంటుంది" అంటుంది రామారావుతో.

"అత్తయ్యా! లక్ష్మణుడుతోడుగా లేని బ్రహ్మచారి రాముడి ఫోటో కావాలి నాకు "అంటుంది జయతో.

"తాతయ్యా బ్రహ్మచారీ శతమర్కటః అనేది లోక సహజం. కానీ నా కలలో ద్విమర్కటాలు వస్తున్నాయి" అంటుంది తాతగారితో.

అన్నీ సిరియాళ్ ముందే అతను వినేట్టు అంటుంది. తలవంచుకుని ఉంటాడతను. అతనికీ అల్లరి చేయాలని ఉంటుంది. ఆమెని ఏడిపించాలనీ ఉంటుంది కానీ భయం.'వాళ్ళంతా గొప్పవాళ్ళు. తాను ఏ రకంగానూ వాళ్ళతో సరిపోడు. అనవసరమైన ఆశలు పెట్టుకోవడం, తరువాత భాధపడ్డం ఎందుకు' అనేది అతని అభిప్రాయం. అందుకే రామారావు ఎన్నిసార్లు కదల్చడానికి చూసి "భయ్యా! ఆ విషయం వదిలేయ్. ఆకాశ ఫలం మీద ఆపేక్ష లేదు నాకు" అంటాడు.

అంతా కబుర్లలో పడ్డారు. రోగాలు, హాస్పిటళ్ళు, సినిమాలు, రాజకీయాలు ఇలా రకరకాల చర్చ విషయాలు చర్చకి వచ్చాయి. రామారావు చర్చలో పాల్గొనకున్నా విని సంతోషిస్తున్నాడు. సిరియాళ్ మాత్రం అలాకూర్చుని ఉన్నాడు. అంబరీష్‌కి విసుగొచ్చి నెమ్మదిగా లేచి అలా వెళ్ళి హాస్పిటల్ అంతా తిరిగి వచ్చాడు. అతనొచ్చేసరికి చర్చ రాజకీయాల మీద సాగుతోంది.

అంబరీష్ ఎక్కడికి వెళ్ళినా ఎక్కువ సేపుండదు. అలా వెళ్ళి ఇలా వస్తాడు. రాగానే అన్నయ్య చేయిపట్టుకుని తను వెళ్ళివచ్చిన వివరాలు చెబుతాడు. అన్నయ్య చెయ్యిని ఎప్పుడూ విడవడు. "సిరియాళ్ అతన్ని మరీ అన్నకూచిని చేస్తున్నావ్" అంది జయ రెండుసార్లు.

"ఏం చేయనాంటి? అమ్మకు ఆరోగ్యం బాగోనప్పుడు అలవాటు చేసుకున్నాను. ఇప్పుడు క్షణం విడవకుండా అయ్యాడు" అన్నాడు.

తను చూసొచ్చిన విషయాలు గుసగుసగా అన్నగారికి చెప్పాలని వచ్చాడు అంబరీష్. మంచం మీద రామారావు, అతను పక్కగా సిరియాళ్, మంచం చుట్టూ జనం, ఏం చేయాలో తోచలేదు పిల్లవాడికి.

సిరియాళ్‌కి తమ్ముడి ఆరాటం తెలుస్తూంది కానీ అతను బైటికి వెళ్ళాలంటే ఉన్న మొదటి అడ్డు మేఘ కబుర్లలో మునిగి ఉంది. ఏం చేయాలో తోచడంలేదు. రామారావు ఇది గమనించి కూడా 'అతను ఏం చేస్తాడో చూద్దాం. మమకారం, మొహమాటంలో ఏదిగెలుస్తుందో చూడాలి' అనుకుని మౌనంగా ఉండిపోయాడు.

అంతలో మేఘ శివతో అంది అలా కుదరదండీ 'ఇది ప్రజాస్వామ్యం' అని.

'సిరియాళ్‌జీ' కాస్త పెద్దగానే అన్నాడు అంబరీష్

"జీ" దూరాన్నుండే జవాబిచ్చాడు సిరియాళ్.

"ప్రజాస్వామ్యం అంటే?" అడిగాడు.

"ప్రజాస్వామ్యమంటే ఏం లేదు. ప్రజలు తమ దుర్దినాలని తామే కొనితెచ్చుకోవడం" అన్నాడు సిరియాళ్.

అంతా పకపకా నవ్వరు.

"భయ్యా మేమిక వెళ్ళొస్తాం" అన్నాడు సిరియాళ్ గుమ్మంలో నిల్చుని.

తలూపాడు రామారావు.

వెళ్ళారిద్దరూ.

తరువాత మేఘ అంది "బావా! అతను నన్ను పలకరిస్తాడేమో చూద్దామనే నీ మంచం దగ్గర దిగ్భంధం చేశాను. ఎలా వెళ్ళగలిగాడు?"అని.

"ఏముంది? ఇందాక పెద్దగా నవ్వినప్పుడు తలవంచుకుని నోటికి చెయి అడ్డం పెట్టుకుని నవ్వావు. నువ్వు ఒళ్ళో తలపెట్టుకోగానే నీమీద నుండీ దాటి వెళ్ళాడు" అన్నాడు విభీషణ.

"నక్కజిత్తులన్ని నాదగ్గరుండగా తప్పించుకుందేల తాబేలు బుర్ర" అంది మేఘ.

అంతా నవ్వేశారు.

కాస్సేపుండి అంతా వెళ్ళిపోయారు. ఆ రాత్రి రామారావుకి జ్వరం రాలేదు. కానీ ఒంటిగంటకి చంద్రశేఖర్ వచ్చి నిద్రలో ఉన్న రామారావుని చూసి జ్వరం తగ్గిందని తెలుసుకుని సంతోషించి వెళ్ళిపోయాడు.

హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేస్తూ నీరసంగా ఉన్నాడు. "పదిరోజులు ఆఫీసుకు వెళ్ళద్దు" అన్నాడు డాక్టర్. ఆ మాట విన్నది మొదలు ఇంట్లో వాళ్ళు కట్టడి చేశారు. బయటికి కదలనీయలేదు. తరువాత ఆఫీసుకి వెళ్ళడానికి బైక్ తీస్తూ "మనిషన్నాక ఏదో ఒక వ్యాపకం ఉండాలి. ఈ రోజిలా ఆఫీసుకి వెళుతుంటే ఎంత ఆనందంగా ఉంది" అనుకున్నాడు.

ఇన్నిరోజులు తను వెళ్ళనందుకు చంద్రశేఖర్ గారు ఏమనుకున్నారో, శకుంతలగారు ఎలా ఉన్నారో ఆలోచిస్తూ ఆఫీసుగదిలోకి అడుగుపెట్టాడు. అంతే! అంతవరకూ కలిగిన ఆలోచనలన్నీ మాయం. చకచక తనపనిలో నిమగ్నమయ్యాడు. సాయంకాలం వరకు అలా రాస్తూ, వ్యాసాలు తయారు చేస్తూ కూర్చున్నారు. నాలుగింటికి ప్యూన్‌ని పిలిచి "శకుంతలగారికి తీరికగా ఉందేమో కనుక్కురా. ఆమెతో మాట్లాడవలసిన పని ఉంది" అన్నాడు.

"సార్ మేడమ్‌గారు ఆఫీస్‌కు రావడం లేదు"

"ఏం? శలవులో ఉన్నారేమో?"

"అదేమో తెలీదు సార్. మీకు జ్వరం తగిలింది చూడండీ ఆనాటి నుండీ మేడమ్ గారు కూడా ఆఫీసుకు రావడంలేదు"

రామారావు మనసు చెబుతోంది. ఎక్కడో అపశృతి దొర్లింది అని. మాట్లాడకుండా గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు. ప్యూన్ వెళ్ళిపోయాడు. చాలా సేపు ఆలోచనలతో గడిపి, చివరికి చంద్రశేఖర్‌కి ఫోన్ చేశాడు. "నేను మీతో మాట్లాడాలి" అని.

"నాక్కూడా పెద్దగా పనేం లేదు. వచ్చేయి" అన్నాడాయన.

అక్కడినుండి కదిలి బైటికి వచ్చాడు ప్యూను కుమార్ అతన్ని చూసి కుర్చీనుండి లేచి నిల్చున్నాడు. "కుమార్! మీ చెల్లెలు పెళ్ళి అన్నావుకదూ?" అడిగాడు.

"ఔనుసార్. ఈ నెలాఖరున"

"సరే ఖర్చులకి ఈ కాస్త ఉంచు" అంటూ డబ్బు అతని చేతిలో ఉంచి, భుజం తట్టి అక్కడినుండి కదిలాడు.

"రా! కూర్చో రామారావ్" ఆహ్వానించాడు చంద్రశేఖర్.

రామారావు కూర్చోలేదు. "శకుంతల గారు తను మానేశారా? మీరు తీసేశారా?"

"ఎందుకు?"

"ఇపుడు మీ జవాబు నాకు తెలిసిపోయింది. తెలవాల్సింది కారణం అదైనా చెబుతారా?"

రామారావు మాట విన్న చంద్రశేఖర్ వడివడిగా కదిలాడు. కుర్చీలోంచి లేచి, అతని చేయి పట్టుకుని, మరో గదిలోకి గబగబ లాక్కుపోయాడు. అక్కడు పేపర్ తీసి రామారావుకిచ్చాడు. మొదటి పేజీలో ఉన్న ఆ వార్తని చదివి అదిరిపోయాడు రామారావు.

ఐదు నిమిషాలవరకూ కోలుకోలేకపోయాడు. జ్వరం తెచ్చిన నీరసం అప్పుడు అనుభవానికి వచ్చిందతనికి. సోఫాని పట్టుకున్నాడు ఆసరాకోసం. అతని నరనరాన నీరసం ఆవరించింది. ఒళ్ళు వణుకుతోంది. పెదాలు అదురుతున్నాయి. దిగాలుగా కూర్చుండిపోయాడు.

ఐదు నిముషాలకి నెమ్మదిగా లేచి అడిగాడు "నష్టపరిహారం ఎంత చెల్లించారు?" అని.

"రెండు కోట్లకి బేరం కుదిరింది. కానీ ఆయన పార్టీవాళ్ళు ఒప్పుకోవడంలేదు. పాతిక కోట్లైనా ఇవ్వాలనీ లేదంటే పత్రికని మూయాలనీ డిమాండ్ చేస్తున్నారు. సంప్రదింపులు నడుస్తున్నాయి. ముఖ్యమైన అతనికి ఏదో ఆపరేషన్. అమెరికాకి వెళ్ళాడు. అతను రాగానే అతనిద్వారా బేరం కుదుర్చుకునే ఒప్పందం జరిగింది"

రామారావు ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. ఆరోజు తనని అర్థాంతరంగా రప్పించి ఇందుకా?

"నీకు విషప్రయోగం జరిగింది. అందుకే అంత జ్వరం వచ్చేసింది" అన్నాడు చంద్రశేఖర్.

మాట్లాడకుండా వెనుతిరిగాడు రామారావు. వెళ్ళి తన సీట్‌లో కూర్చున్నాడు. అంతే! ఆ రోజు నుండీ ఇంటికి వెళ్ళడంలేదు. రాత్రింబవళ్ళు ఆఫీసులోనే. తల్లితండ్రులు, తాతయ్యా బంధుమిత్రులంతా వచ్చి గొడవపెట్టారు. ఇంటికి రమ్మని అరిచారు.

రామారావు మరో ఆయుధాన్ని కూడా ధరించాడు. దానిపేరు మౌనం. అతను మాట్లాడ్డం మానేశాడు. ఎవరితోనూ పలకడంలేదు. చంద్రశేఖర్ ఎంతగానో నచ్చచెపాడు.

"రామారావ్ ఇందులో నీ తప్పు లేదని నాకు తెలుసు. ఆ మాటకొస్తే నీకు ప్రాణాపాయం కూడా కలిగేది. ఆరోజు రాత్రి నిన్ను హాస్పిటల్లో చేర్చకుంటే ప్రాణహాని జరిగేది నీకు. అందుకని నువ్వు ఎక్కువగా ఆలోచించకు. ఇంటికి వెళ్ళు. నా మాట విను"

విన్నాడు కేవలం చెవులద్వారానే. ఇంటికి వెళ్ళలేదతను. ఆయనతో కూడా పలకడం లేదు. పని. పని బలవంతాపెడితే రెండుపూటలా భోజనం చేస్తున్నాడు. దివారత్రులు ఆఫీసులోనే. బాగా నిద్రవచ్చినప్పుడు సోఫాలో పడుకుంటున్నాడు. సిరియాళ్ చేత రోజూ బట్టలు పంపిస్తోంది జయ. అక్కడే ఉన్న బాత్రూంలో స్నానం. అతను విడిచిన బట్టల్ని సిరియాళ్ ఇంటికి పట్టుకువెళ్ళి మర్నాడు మరో జత తెస్తున్నాడు.

అలా పదిహేను రోజులు గడిచాయి. ఈ పదిహేనురోజుల్లోనే చాలా చిక్కిపోయాడు. కళ్ళు లోతుకి వెళ్ళాయి. బుగ్గలు పీక్కుపోయినయి. మనిషి బరువుకూడా కొద్దిగా తగ్గాడు.

ఆ రోజు అర్ధరాత్రి దాటినా మేలుకునే ఉన్నాడు రామారావు. అంతలో కరెంటు పోయింది. చేస్తున్న పనిని అలాగే వదిలి కళ్ళు మూసుకున్నాడు. కొద్దిసేపటికి అతనికి తెలియకుండానే నిద్రపట్టేసింది. ఐతే చీమ చిటుక్కుమన్నా లేచేసే అవలాటుంది అతనికి.

అందుకే ఏదో చిరుశబ్దానికి కళ్ళు తెరిచాడు. ఇంకా చీకటిగానే ఉంది.

శుక్లసప్తమి చంద్రుడు కిటికీనుండి చల్లని, ఉండీలేని వెలుగుని ప్రసరిస్తున్నాడు. దూరం నుండి ఎవరో వస్తున్న సవ్వడి. 'ఎవరై ఉంటారు' అనుమానం కలిగింది. 'శత్రువులా? ఎందుకు వస్తున్నారు? తను ఇక్కడున్నట్టు తెలిసిందా?'

తెలీదు. ఎందుకంటే ప్యూను బయట తాళం వేసి వెళ్ళాడు. 'ఏం చేస్తే బాగుంటుంది?' ఆలోచించాడు. ఆపద్ధర్మంగా పెద్ద కఱ్ఱని చేతిలోకి తీసుకుని బీరువా పక్కనున్న కాగితాల దొంతర వెనక నిల్చున్నాడు. తాళాన్ని కోస్తున్న శబ్దం.

ఇద్దరు వ్యక్తులు సన్నని టార్చిలైటుతో లోపలికి వచ్చారు.

"తెలివి తక్కువ వెధవ. ఎక్కడ మరిచావురా?"

"ఇక్కడే ఈ టేబుల్ మీద పెట్టినట్టు గుర్తు."

"అన్న దగ్గర అదే మాటను. కత్తుల శిలువ వేస్తాడు. "

"ఒరే రంగా ఎలాగైనా నన్ను కాపాడరా. లక్షరూపాయలు ఇచ్చుకుంటాను. "

"ఆ మాత చెప్పావనికదా ఇంత రిస్క్ తీసుకుని కరెంటు పీకి, సెక్యూరిటీ వాళ్ళ కళ్ళు కప్పి ఇక్కడిదాకా తీసుకు వచ్చాను. ఇంతకీ ఆ కవర్లో ఏమున్నాయిరా"

ఒక్క క్షణం నిశ్శబ్దం. "చెప్పురా ఏమున్నాయి?"

"ఫోటోలు"

"ఎవరివి?"

"రంగా! అది చాలా సీక్రెట్. విషయం బైటపడితే నా తలతెగిపోతుంది."

"ఐతే దాచుకో" రంగడి కోపం.

"చెబుతానురా కోపగించుకోకు. కానీ ఈ విషయం బైటికి పొక్కనీయనని నీ కూతురిపై ఒట్టేయి"

"అలాగే నా చిన్నిపై ఒట్టు. "

"ఐతే విను. అన్నకి ఆ మధ్య ఏదో దోషం పట్టింది ఉన్నట్టుండి చచ్చిపోయేదోషం. దాన్ని ఏమంటార్రా"

"అపమృత్యుదోషం"

"ఆఁ! అదే ఇట్టా చెప్పిన ఆ కొండెంగాడు ఏం చేయమన్నాడో గానీ 'ఒరేయ్ దిక్కులేని వాళ్ళూ, అనాధలూ ఐన ముగ్గురు మగపిల్లల్ని తీసుకురా' అన్నాడు అన్న నాతో. సరేగదాని తెచ్చాను"

"ఎలా?"

"చాక్లెట్లు, బిస్కెట్లూ, డబ్బులూ ఎరచూపాను. అంతే. కారెక్కారు.  వాళ్ళని అన్నకి అప్పచెప్పి వేరేపని మీద ఎల్లాను. తరువాత వారానికి ఓ ఫోటో ఇచ్చాడు అన్న. 'ఈ ఫోటోలో వాడు ఎక్కడున్నా ప్రాణమైనా తియ్యి. నా దగ్గరకైనా తీసుకురా. కావాల్సినంత తిను. తాగినంత తాగు. జల్సా చేయి. కానీ వాణ్ణి మాత్రం తీసుకురా' అన్నాడు.

ఎక్కువ కష్టపడకుండా రెండు రోజులు తిరిగేసరికి కనిపించాడు ఫోటోలో వాడు. బలవంతంగా వ్యానెక్కించాను. అంతే. వాడు ఏదో తిని చచ్చాడు. వాడి దగ్గరున్న బ్యాగ్ లాక్కుని అన్న కియ్యాల్నని ఎల్తుంటే పోలీసులు తగిలారు. వాళ్ళని తప్పించుకుని బ్యాగులో ఉన్న ఫోటోలో చూశాను. అవన్నీ అన్న ఫోటోలు" ఒక్క క్షణం ఆగాడు.

"ముగ్గురు పిల్లల తలలు నరుకుతుండగా, దాన్ని మంటలో ఏమంటార్రా దాన్ని?"

"దేన్ని?"

"మంటని"

"మంటే!"

"కాదురా! నాలుగేపులా ఇటు కత్తి కట్టి, మట్టితో అలికి ముగ్గులెట్టి, పేళ్ళు నెయ్యిపోస్తారు"

"హోమం"

"ఆఁఆ అదే మూడు తలల్ని దాన్లో ఏస్తున్న అన్న ఫోటోలు. "

"బాబోయ్!"

"భయమేసిందిరా! తీసి చూశానని చెప్పినా నా పని ఖాళీ. ఆ విషయం నాకు తెలుసు. అందుకే అవి మామూలుగా సర్ది బైలుదేరా. అంతలో నువ్వు కనిపించావు. నీతోపాటు ఇక్కడి కొచ్చాను. ఇద్దరం కలిసి నువ్వు చేయాల్సిన పనిచేశాం. కానీ నువ్వు పెట్టిన హడావుడిలో ఆ ఫోటోల కవరు టేబుల్ మీదో, ఎక్కడో పెట్టి మరిచాను. "

"ఎలా ఉంటుంది కవరు?"

"ఎఱ్ఱని కవరు. అంచులు మట్టుకు నల్లరంగుగా ఉంటాయి. "

వింటున్న రామరావుని ముచ్చమటలు పోశాయి. తన గొడవలో తానుండి ఇరవైరోజులుగా ఆ కవరు విప్పిచూడలేదు. నిన్న చిందరవందరగా ఉన్న గదిని కాస్త సర్దాడు. ఎఱ్ఱని కవరు కనబడినా తీసి చూడకుండా తీసి చెత్తబుట్టలో వేశాడు. ఈ గది అంతా వెదికి చివరగా వాళ్ళు వెదికేది చెత్తబుట్టలోనే.

ఎలాంటి పరిస్థితిలోనూ దీన్ని చేయిజారనివ్వకూడదు. లోపల ఓ వ్యక్తి ఉన్నాడని వాళ్ళకి అనుమానం కలుగలేదు గనుక నిదానంగా ఉన్నారు. వాళ్ళకి అనుమానం కలిగిందో ముందు తనని పైకి పంపించి తరువాత మిగిలిన పని చక్కపెట్టుకుంటారు.

అందుకని అదనుకోసం చూస్తున్నాడు. ఆగంతకులిద్దరూ బీరువా తెరచి పై భాగాన అంతా వెదికారు. ఇంక క్రింద వెతకాల్సిన ఉంది. ఇద్దరూ కూర్చుని ఒక్కో కాగితం తీసి చూస్తున్నారు. రామారావు ఆలోచనలో పడ్డాడు.

●●●

**ఒక్కణ్ణే ఎలాగా చావు దెబ్బ కొట్టచ్చు.** అది చూసి రెండోవాడు తిరగబడకుండా ఉండాలంటే కూర్చుని ఉన్నప్పుడే సరైన అదను. అంతే! క్షణం ఆలస్యం చేయకుండా మెల్లిగా వారి వెనకాలకి వచ్చి కఱ్ఱతో ఒకడి తలమీద బలంగా కొట్టాడు.

చిన్నకేక వేస్తూ వాడు పడిపోగానే జరిగిందేంటో తెలుసుకునేందుకూ, తెలుసుకుని లేచి నిల్చునేందుకూ కొద్ది సమయం పట్టింది. ఆ సమయాన్ని వినియోగించుకున్న అతను మరి వాడిని లేవనీయలేదు. 'ఫట్'మంటూ వాడి తలపై దెబ్బపడింది. సందేహనివృత్తి కోసం చెరోటి మళ్ళీ ఇచ్చుకుని, వేస్ట్ బాక్స్ గుమ్మరించి, ఎర్రరంగు కవరు అందుకుని తనకి సాయం చేసిన టార్చిలైట్‌ని వాళ్ళ దగ్గరే పడేసి, బైటపడ్డాడు. బైట తలుపులు లాగి గడియవేసి సెక్యూరిటీ వేపు గబగబ అడుగులు వేయసాగాడు.

●●●

"ఏమంటున్నాడు ఆ నరాంతకుడు?" మర్నాడు చంద్రశేఖర్‌ని అడిగాడు రామారావు.

"ఏముందీ? ఆ రెండు కోట్లు తానే ఇస్తాననీ ఫోటోలు, నెగెటివ్స్ ఇవ్వమంటున్నాడు"

"నా వల్ల మీకు కలిగిన నష్టం పూడిందనుకుంటాను. "

"నష్టంలేదు. ఇపుడంతా లాభమే"

"సరేనండీ! నేనిక వెళ్ళొస్తాను"

"ఏమిటి? ఈ రోజు శలవు పెడుతున్నావా?"

ఓ క్షణం ఆగి అన్నాడు రామారావు. "ఔను. ఇంక శాశ్వతంగా శలవు తీసుకుంటున్నాను."

"ఏమిటీ?"

"ఔను. ఉద్యోగం మానేస్తున్నాను."

"కారణం?"

"దయచేసి అది మాత్రం అడగొద్దు"

"రామారావ్. ప్లీజ్ నువ్వలా మాట్లాడద్దు. నేనేమైనా తప్పు చేస్తే చెప్పు. నా తప్పు దిద్దుకుంటాను."

"సర్! నే వెళ్తూ వెళ్తూ మీమీద అలాంటి నేరం మోపలేను"

"పోనీ. నేనేమైనా అన్నానా?"

"రామారావు ఆయన చేతులు పట్టుకుని "ప్లీజ్! సర్.. మీరలా మాట్లాడకండి. మీకు నా వల్ల కోట్లలో నష్టం వచ్చిందని తెలిసినరోజు కూడా నన్ను పల్లెత్తు మాట అనలేదు మీరు"

"మరెందుకు వెళ్తున్నావ్?"

"ఇక్కడ ఎన్ని అపాయాలు పొంచి ఉంటాయో నాకు తెలిసివచ్చింది. నాలాగ ఆత్మీయులు ఎక్కువమంది కలిగినవారికి ఇలాంటి ఉద్యోగాలు పనికిరావు. ఆనాడు ఆ స్థితిలో నా స్నేహితుని భార్య తల్లిదండ్రులున్నా నేనలాగే పరుగెత్తుతాను. అలాంటి నాకు ఇలాంటి బాధ్యతలతో కూడిన ఉద్యోగం కూడదు. ఆ రోజు ఆ సమయానికి నేను 'అక్కడ' ఉన్నాను గనక మీకు నష్టం తప్పింది. లేదంటే భారీ నష్టం. ఇరవై కోట్లు. మావంటి వారు లక్ష ఒకేసారి చూడ్డం అరుదు."

ఊపిరి తీసుకోవడానికి ఆగాడు. "అలాంటిది ఇరవై కోట్లు నావారినీ, నా బంధుమిత్రులందరినీ, వారి ఆస్తిపాస్తులతో సహా అమ్మినా అంతడబ్బు రాదు. అలాంటి నాకు ఉలాంటి రిస్క్ ఉద్యోగం సరిపడదని తెలుసుకున్నాను. అందుకే మానేస్తున్నాను" చేతులు జోడించి వెనుతిరిగాడు. అతని కళ్ళలో నీళ్ళు. చంద్రశేఖర్ కూడా కళ్ళు తుడుచుకున్నాడు.

తిరిగి వెనక్కి వచ్చాడు.

"రామారావ్ ఏంటయ్యాఇది?!" అన్నాడు.

"ఇంటికి వచ్చి, ఉద్యోగం ఇచ్చిన మిమ్మల్ని ఎపుడూ మరువలేను" వెనుతిరగబోయాడు.

"ఏదో ఒకరోజు నువ్వు నామీద అలిగి వెళ్ళిపోతావని నేను ముందుగానే ఊహించాను. నిన్ను డిగ్రీ కూడా పూర్తి చేయనీకుండా ఉద్యోగంలో చేర్చుకున్నాను"

"కానీ నేను డిగ్రీ పూర్తి చేశాను"

"అది నీ ప్రతిభ మాత్రమే. నీ భవిష్యత్తుని పూర్తిగా వికసింపచేయనివ్వలేదు నేను. అందుకే నీ లైఫ్ సెక్యూరిటీ కోసం నీ పేరున బ్యాంక్‌లో డబ్బు వేశాను.. ఇవిగో.. తీసుకో"

"వద్దు సర్"

"అలా అనకు. ఇది నీకు మాత్రమే చెందుతుంది."

మాట్లాడకుండా తీసుకున్నాడు.

"శకుంతలని తీసేసానని అలిగి వెళ్తున్నావ్ కదూ?"

"అదీ కొంత కారణమేమో. తప్పు మా ఇద్దరిదీ. దండన ఆమెకే ఎందుకు? ఆమె లేకున్నా మీ పత్రిక నడుస్తుందనే నమ్మకం మీకుంది. నే లేకున్నా మీ పత్రికకి ఏలోటూ రాదని చెప్పడానికే, మీకు తెలీడానికే నే వెళ్తున్నాను.

"కానీ ఆమెని నేను తీసేయలేదు. బాధ్యతా రహితంగా ప్రవర్తించిందని కాస్త గట్టిగా మందలించాను."

"ఆమె ఏమన్నారు?"

"ఆమె కారణాలు ఆమెకుంటాయి. ఇక్కడ కారణాలు కాదు కావల్సింది బాధ్యత. ఆమె ఏదో చెప్పబోయింది నే వినిపించుకోలేదు"

"సరే! వస్తానిక"

బయటికొచ్చేశాడు.

ఇంటికి వెళ్ళాలనిపించలేదు. రోడ్డు మీద నడుస్తున్నాడు. అంతలో 'శకుంతలగారింటికి వెళితే?' అనిపించింది. ఆమె చెప్పిన ఫోన్ నెంబర్ జ్ఞాపకాల మరుగున పడిపోయింది. పదినిమిషాలు ఆలోచించగా గుర్తుకొచ్చింది. ఫోన్ చేశాడు.

"హలో" అంది.

"మేడం. నేను రామారావుని. మీరు తీరికగా ఉంటే మీతో కొంచెం మాట్లాడాలని .. మీకు అభ్యంతరం లేకుంటే మీ ఇంటికి రావాలని"

"అదేం మాట? తప్పకరండి" ఇంటి చిరునామా, గుర్తులూ చెప్పింది.

బైక్ తేలేదు. అందుకే ఆటోలో బైలుదేరాడు. ఆటో ముందుకీ, ఆలోచనలు వెనక్కీ వెడుతున్నాయి. 'చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి రావడం అంత తేలికేం కాదు' అనుకున్నాడు.

"రండి" అంది శకుంతల. ఆమె అతని కోసం ఎదురుచూస్తూ ఉంది. ఇల్లు మామూలుగానే ఉంది. దాన్ని సర్దిన తీరు గొప్పగా ఉంది.

"ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగింది కాఫీ ఇస్తూ.

"బాగానే ఉంది" అన్నాడు.

"ఆఫీసు విశేషాలు చెప్పండి" అంది.

"ఏమున్నాయండీ. అన్నీ ఓ.కే"

కాస్సేపు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ మాట్లాడుకున్నాక "వస్తానండీ" అంటూ లేచాడు.

వెళ్ళబోతూ ఆగి ప్రశ్నించాడు. "చంద్రశేఖర్‌గారు మిమ్మల్ని మళ్ళీ ఆహ్వానిస్తే తిరిగి ఆ ఉద్యోగంలో చేరతారా?" అని.

సమాధానం కోసం ఓ నిమిషం ఆగిందామె. "నిజానికాయన నన్ను కేకలేశారు తప్పితే తీసెయ్యలేదు. నాకే అనిపించింది.. అది చాలా పెద్ద పత్రిక. అందరి దృష్టీ దానిమీదే ఉంటుంది. శత్రువులు ఎక్కువ. రిస్క్ కూడా ఎక్కువే. మనచిన్న తప్పు ఆయనకి కోట్లలో నష్టం తేగలదు. అందుకని నా స్థాయి పత్రికని చూసుకోవడం బెటరనిపించింది. అందుకే అలాంటి ఉద్యోగం వద్దనుకున్నాను" అంది.

"ఈమె ఆలోచనలన్నీ నా ఆలోచనలాగున్నాయే" అనుకుని 'వస్తానండీ" అంటూ వెనుతిరిగాడు. గుమ్మంలో ఓ యువతి ఎదురైంది. ఆమెని ఆశ్చర్యంగా చూస్తూ పక్కకి తప్పుకున్నాడు.

శకుంతల అంది "రామారావుగారూ! మా అమ్మాయి చంద్రబింబ.. చంద్రా! వీరు రామారావుగారు" అంటూ పరిచయం చేసింది. ఆమె నిజంగానే చంద్రబింబంలా ఉంది. నమస్కార, ప్రతినమస్కారాలయ్యాక బైటపడ్డాడు రామారావు.

ఆ తరువాత మళ్ళీ ఎప్పుడూ శకుంతల ఇంటికి వెళ్ళలేదతను. తనుగా ఆమెకి ఫోను కూడా చేయలేదు. ఇంటికి వచ్చిన రామారావు తాను ఉద్యోగం మానేశానని ఇంట్లో చెప్పలేదు. 'సిరియాళ్ ఉన్నాడు కదా? చెబుతాడు' అనుకున్నాడు. విచిత్రం ఏమంటే సిరియాళ్ చెప్పిన తరువాత కూడా ఉద్యోగం గురించి ఎవరూ అతన్ని అడగలేదు. "దాదాపు ఇరవైరోజులు రాత్రింబవళ్ళు పనిచేసిన నాకు ఏమీ కాలేదు. ఆ ప్రభావం ఇంట్లో వారిమీద చాలా చూపించింది' అనుకున్నాడు. తనకి నచ్చిన తెలుగు సాహిత్యాన్నంతా తెచ్చేసుకున్నాడు. దాంతోనే అతనికిప్పుడు సమయం వేగంగా గడుస్తోంది.

●●●

"సార్! పెద్దసారు రమ్మంటున్నారు" ప్యూన్.

"వస్తున్నాను" అంటూ చేతిలో కాగితాలు పక్కనపెట్టి పెద్ద బాస్ గదిలోకి నడిచాడు సూర్యం.

"సర్! పిలిచారట" అన్నాడు.

ఆయన తలూపాడు. సూర్యం అలాగే నిల్చుని ఉన్నాడు. ఐదు నిమిషాలపాటు ఆయన ఏకాగ్రతతో ఏదో రాసి ప్రక్కనపెట్టి "రేపు ఈ ఫైల్ పనేంటో చూడాల్సింది నీదేనయ్యా" అన్నాడు.

"సరే సార్"

"ఇదిగో రేపు నువ్వు చేయాల్సిన పనుల లిస్ట్ వ్రాసి పెట్టాను" అంటూ చిన్న కాగితం అందిస్తూ "రేపు నేను రావడంలేదు. తెలుసుకదా?" అన్నాడు.

"తెలుసు సర్."

"చాలాసార్లు చెప్పి ఉంటానుగదూ? చాలా టెన్షన్ పడుతున్నాను. నాకు కావల్సిన కాండిడేట్ దొరుకుతాడో దొరకడో అని. ఐనా ఇంకా ఏం చేయగలను చెప్పు? నా ప్రయత్నాలు నే చేస్తాను. ఆ పైన పైవాడి దయ"

"అంతే సర్"

"అవును సూర్యం. నేనెప్పుడూ నీ పర్సనల్ విషయాలు అడగలేదు. నీకు పిల్లలు ఎంతమంది?"

"ఒక బాబు సర్"

"అలాగా? ఏం చేస్తుంటాడు"

"ప్రస్తుతం ఏమీ చేయడం లేదుసార్"

"పొరపాటు చేశావయ్యా! మీ అబ్బాయి అంటే నీలాంటి నిజాయితీపరుడే ఐ ఉంటాడు. నాకా నమ్మకం ఉంది. అతనితో గ్రూప్స్ రాయించి ఉండాల్సింది. అప్పుడు ఇంత శ్రమపడి ఉండేవాణ్ణికాను"

"ఏమయింది సర్?"

"విను. మొన్నొకరోజు మన మినిస్టర్ గారు నన్ను పిలిచారు. ' గోపాలకృష్ణగారూ! మీ రిటైర్మెంట్ దగ్గరిలో ఉంది కదూ?' అన్నారు. అవునన్నాను. 'మీ పదవీ విరమణ లోపుల మీలాంటి ఓ వ్యక్తిని సెలక్ట్ చేయండి. మీ ఆఫీసులో ఓ పోస్ట్ ఖాళీగా ఉంది కదా? అందులోకి' అన్నాడు. నేను అయోమయంగా చూశాను. అప్పుడాయనన్నారు.

'గోపాలకృష్ణగారూ నిజాయితీ కలిగిన వ్యక్తి శాఖాహార జంతువు వంటివారు. మాంసాహారాన్ని తీసుకునే జంతువులైనా శాఖాహార జీవిని ఇష్టపడతాయి తాను దుర్మార్గుడుగా ప్రవర్తించినవాడు కూడా ఎదుటివాడు సన్మార్గుడై ఉండాలని కోరుకుంటాడు. మీ మనసులో మీరిప్పుడు అనుకుంటూ ఉండచ్చు. - మీరింతగా చెబుతున్నారు. మీరీ మంత్రి పదవికి రావడానికి మీరు నిజాయితీగా, నీతిగా ఉండగలిగారా? - అని. ఈ రోజుల్లో అది అసాధ్యమన్నది లోకమెరిగిన రహస్యం. ఐతే మా నాన్నగారు మీ డిపార్ట్‌మెంట్‌లోనే

నిజాయితీతో పనిచేసి రిటైరైనారు. ఆయన నిజాయితీనే నన్నింత వాడిని చేసిందని నా నమ్మకం. అందుకే మీ డిపార్ట్‌మెంట్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే కోరి ఈ విభాగాన్ని ఎన్నుకున్నాను. నా అదృష్టం ఏమంటే మీరు కూడా మా నాన్నగారు వంటి వ్యక్తికావడం. మిమ్మల్ని గురించి విని, తెలుసుకున్న నా ఆనందం అంతా ఇంతా కాదు. ఐతే త్వరలో మీరు రిటైరవబోతున్నారు. మీ స్థానంలోకి ఎవరో ఒకరు వస్తారు. కానీ మీరుండగా, మీ పర్యవేక్షణలో ఓ యువకుడిని ఎన్నిక చేయండి. కుల, మత, వర్గాలకు ఈ ఎన్నిక జరగాలి. నే చేసిన మంచి పనుల్లో ఇదొకటి అనిపించాలి' అన్నారు. కనుక నేనింతగా టెన్షన్ పడుతున్నాను. ఒకవేళ మీ అబ్బాయి అయితే నాకీ శ్రమా, ఆదుర్దా ఉండేదికాదని అలా అన్నాను. ఏమనుకోకు"

"అబ్బే ఏం లేదుసార్!"

"ఇంతకీ మీ అబ్బాయిని గురించి చెప్పు. ఉద్యోగం చేసేవాడన్నావ్. ఎందుకు మానేశాడు?"

"తన సహోద్యోగిని ఉద్యోగంలోనుండి తీసేశారని అలిగి తాను మానేశాడు"

"అబ్బో! చరిత్ర ఘనంగానే ఉందే! ఇంతకీ ఎక్కడ పని చేసేవాడు?"

"పత్రిక ఆఫీసులో"

"ఏ పత్రిక?"

"తొలిసంధ్య"

"డిగ్రీ చేసిన వాడికి 'తొలిసంధ్య'లో ఉద్యోగం ఎలా వచ్చింది?"

"డిగ్రీ పూర్తి చేయకుండానే వచ్చింది సర్. చంద్రశేఖర్‌గారు ఇంటికి వచ్చి పిల్చుకు వెళ్ళారు"

"కొంపతీసి మీ అబ్బాయి పేరు రామారావు కాదుగదా?"

"వాడిపేరు అదే సర్"

"అంతేనయ్యా! నత్తగుల్లలన్నీ ఒకచోట, రత్నాలనీ ఒకచోట.. అనేది మా నానమ్మ. మంచివాళ్ళు, నిజాయితీపరులు లేరు. ఉన్నవాళ్ళనిలా నా మిత్రుడు చంద్రశేఖర్ లాంటి వాళ్ళు లాగేసుకుంటారు. ఇక మన డిపార్ట్‌మెంట్‌కి ఎలా దొరుకుతారు? ఐనా డిగ్రీ కూడా చేయలేదా?"

"అక్కడ ఉద్యోగం చేస్తూ డిగ్రీపూర్తి చేశాడు"

"ఆ రామారావు గురించి చాలా విన్నాను. కానీ ఏం చేస్తాం. అందని ద్రాక్షపండు వదిలేయ్"

"వస్తా సార్" వెనుతిరిగాడు సూర్యం.

●●●

"తాతయ్యా! నేను గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనుకుంటున్నాను. నీ సలహా ఏమిటి? "

"హతోస్మి. వాళ్ళనా దేవుడే కాపాడాలి"

"ఎవరిని?"

"నువ్వు ఏ డిపార్ట్‌మెంట్లో చేరతావో వాళ్ళని"

"నేనంత చెడ్డవాణ్ణేంటి?"

"నీ ప్రక్కన చెడ్డవాళ్ళు నిలువగలుగుతారేంటి?"

"సరే ఏమంటావిప్పుడు?"

"నీకా ఉద్యోగం దొరికేనా.. పెట్టేనా? దానికి గ్రూప్ ఎగ్జామ్స్ రాయాలి, అందులో తగినన్ని మార్కులు రావాలి. ఇంటర్వ్యూలకి వెళ్ళాలి. అక్కడ ఇంటర్వ్యూలో నెగ్గాలి. అప్పుడు కద ఉద్యోగం మాట"

"అవన్నీ అయ్యాయి. రేపు ఫైనల్ ఇంటర్వ్యూ ఉంది. కాస్త త్వరగా నిద్రలేపు. గుడ్ నైట్"

అంతే ప్రేక్షకులు ముగ్గురికీ (సూర్యం, జయ, తాతగారికి) నక్షత్రాలు కనిపించాయి సూర్యం తలపైకెత్తి దేవుడికి కృతజ్ఞతా పూర్వకమైన సలాం చేశాడు.

●●●

తన పేరు పిలవగానే చిరునవ్వుతో లోపల అడుగుపెట్టాడు రామారావు. వాళ్ళడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానం చెప్పాడు. ఓ ప్రశ్ననే సవరించి అది ఇలా ఉండాలి. అలా కాదు. అంటూ జవాబు కూడా చెప్పాడు. సబ్జెక్ట్‌కి సంబంధించిన ఇంటర్వ్యూ ముగిసింది. అంతే మరో వ్యక్తి అందుకున్నాడు.

"మిస్టర్ రామారావ్! మీ గురించిన మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు. అతను విస్మయంగా చూశాడు. అక్షరాలని కూడదీసుకోవడానికి, భావాలని సర్దుకోవడానికి అన్నట్టుగా ఓ నిమిషం ఆగాడు.

"చాల క్లిష్టమైన ప్రశ్న వేశారు. నాకు ఊహ తెలిసినప్పటినుండి నేనేమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. నన్ను గురించిన నా అభిప్రాయం రోజుకో రకంగా, పూటకో తీరుగా రంగులు మారుతూ కనిపిస్తూ ఉంది. అందుకే నేనేంటో నేను తెలుసుకోలేకపోతున్నాను.

ఎప్పుడూ నాతో నేనుంటాను. ఐనా ఏదో అసంతృప్తి.

ప్రతీక్షణం నాకై నేను జీవిస్తాను. కానీ ఏదో అపశృతి.

నిరంతరం నాలోకి నేను చూసుకుంటాను. ఐనా ఏదో అస్పృశ్యత.

నిత్యం నాదైన శైలిలో ప్రవర్తిస్తాను. ఐనా కరువైన ఆత్మస్పందన. నేనేంటో నాకే తెలీదు. మీకు నన్ను గురించి ఏమని చెప్పుకోను? 'స్వ'పరిచయం ఎలా చేయగలను? ఏమని తెలియజేయగలను. క్షమించండి"

"మీ ప్రియనేస్తం ఎవరు? వీడాలనిపించే శత్రువు ఎవరు?"

"ప్రియనేస్తం అంతరాత్మ. శత్రువు మనస్సు"

"మీకు ఇష్టమైన భాష ఏంటి?"

"సంస్కృతం"

"ధనం మూలమిదం జగత్. ఇదొక సామెతా, నినాదమా? లోకోక్తా?"

"ఇది సంస్కృత శ్లోకం -వేదామూల మిదంకావ్యం - భార్య మూలమిదం గృహం

కృషి మూలమిద సేద్యం - ధనం మూలమిదం జగత్. ఇదీ పూర్తి శ్లోకం"

"గుడ్ మీరిక వెళ్ళచ్చు"

"థాంక్యూ"

●●●

అలా రామారావుని గవర్నమెంట్ గుమస్తాగిరి వరించింది. అదే ఆఫీసులో పనిచేస్తున్న సూర్యాన్ని సిటీకి కొద్ది దూరంలో ఉన్న మరో బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ చేశారు. అతను ఉద్యోగంలో చేరాక అడిగింది మేఘ" అత్తయ్యా! బావపుట్టినరోజు ఎప్పుడు?" అని.

రామారావు తొలిసంధ్యలో ఉద్యోగం మానడం అందరికీ బాధగా ఉంది. 'ఎందుకు మానావు?' అనిఅడిగే ధైర్యం ఎవరికీలేదు. ఎప్పుడూ పుస్తకాలు ముందరేసుక్కూర్చోవడం, పలక్కపోవడం అందరికీ అదో లోటుగా అనిపించింది.

"మళ్ళీ బావ ఉద్యోగంలో చేరడంతో నా ప్రాణానికి హాయిగా ఉంది" అంది.

"ఏం మహాతల్లీ! నా ఉద్యోగానికీ, నీ హాయికీ సంబంధం ఏంటి?"

"చాలా ఉంది. ఎప్పుడూ వండుకు తినడం, ఉద్యోగాలు చేసుకోవడం, నిద్రపోవడం ఇదేనా జీవితమంటే? సరదా, సంతోషం, కబుర్లు, అరుపులు, గోల ఇవి కూడా ఉండాలి. నువ్వు ఉద్యోగం మానాక కొంపలంటుకుపోయినట్టు సీరియస్ ముఖంతో ఉండేవాడివి. అందుకే మేమంతా డల్ గా ఐపోయాం."

"అలా ఉండడం నాది తప్పే. కానీ మీ అందరికేమొచ్చింది? మీరైనా సరదాగా ఉండచ్చుకదా!"

"చెప్పాగా బావా? నువ్వు కేంద్ర బిందువని. బిందువు వెలవెల పోయింది. అందుకే వలయం విలవిలలాడింది. ఇప్పుడు బిందువు కిలకిలలాడుతున్నది. వలయం కళకళలాడనుంది"

"బాబోయ్ పెద్ద బిరుదే"

"ఎందుకమ్మా?"

"ఎందుకేంటి? ఆ రోజు అందరం శలవు పెట్టేసి గండిపేట వెళ్దాం. మా బాస్‌ని వ్యాన్ కూడా అడిగాను. ఆ రోజు తిండి ఖర్చులన్నీ ఈ గవర్నమెంట్ గుమాస్తాగారు భరిస్తారు."

"అలాగేలే. నువ్వు ముందుండి అన్ని ఏర్పాట్లు చెయ్యి. డబ్బుదేముంది? మీ బావే చూసుకుంటాడు" అంది జయ.

అనుకున్న ఆ రోజు రానే వచ్చింది. మేఘ అన్నీ సిద్ధం చేసింది. అంతా శలవుపెట్టారు. వ్యాన్‌లో గండిపేట చేరారు. కానీ ఆ రోజు ఏదో సినిమా షూటింగ్ ఉందిట. జనం చాలా మంది ఉన్నారు. ఆ రద్దీని తట్టుకోలేక అక్కడనుండి బైలుదేరి జూ పార్క్ చేరారు.

మేఘ ఆధ్వర్యంలో అందరికీ టిఫిన్లూ, కాఫీలు అందాయి. కూల్ డ్రింక్స్, పండ్లు, ఐస్ క్రీం ఒకటేంటి? చిరుతిండికి లోటులేకుండా తీసుకొచ్చింది. చెత్తబుట్టనుండి, స్ట్రావరకు అన్నీ, ఇది లేదనకుండా అమర్చింది. 'ఎలాగైనా మేఘ తెలివైనది' అంది జయ.

"మేఘా!నిన్ను పెళ్ళాడబోయే అతను ఎవరో ఏమో బంగారు పూల పుజచేస్తున్నాడు దేవుడికి" అంది శివ వాళ్ళమ్మ సిరియాళ్ వంక ఓరగా చూస్తూ. అప్పటికి వాళ్ళంతా ఓ చెట్టుక్రింద కూర్చున్నారు.

●●●

పచ్చగా విరగబూసిన ఆ చెట్టుపూలు అంబరీష్ తెచ్చి కుప్పలుగా సిరియాళ్ దగ్గర పోస్తున్నాడు. వాటిని శివలింగాకారంలో కత్తిరించిన ఓ క్రోటన్ చెట్టుకి విసిరేస్తున్నాడు సిరియాళ్. ఆమె మాటతో గతుక్కుమన్నాడతను. పూలువేయడం ఆపేశాడు. అంతా చూసీ చూడనట్టు చూసి, నవ్వీ నవ్వనట్టు చిరునవ్వులు నవ్వాడు.

"సిరియాళ్ జీ!"

"జీ" అసలే ఇరుకున పడినట్టున్న సిరియాళ్ పరిస్థితి కుడితిలో పడినట్టయింది. అందుకే జవాబు నీరసంగా వచ్చింది.

"పెళ్ళి అంటే?" అడిగాడు అంబరీష

"పెళ్ళి అంటే ఏం లేదు. చిన్నతనంలో మనం చేసిన వెధవ పనులకు - పెరిగిన తరువాత పెద్దవాళ్ళు వేసే కఠిన శిక్ష" అతని మాటలకు అంతా నవ్వారు. మేఘ మాత్రం కోపంగా చూసింది. తీరా చెప్పాక అనుకున్నాడు 'అమ్మయ్య ఇన్నిరోజులకి మేఘ ఉడుక్కునే సమాధానం చెప్పాను' అని.

"ఏంటయ్యా! పెళ్ళి మీద జోకులేస్తున్నావు? ఇంకా పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావో, మాకు పప్పన్నం ఎప్పుడు పెడతావో అని మేం చూస్తుంటే" అంది దివ్య.

"సిరియాళ్ జీ"

"జీ"

"పప్పన్నం అంటే?"

"పప్పన్నం అంటే ఏం లేదు. పెళ్ళి అనే తంతుకి పర్యాయపదంలే ఊరుకో"

"ఏంటబ్బాయ్ ఎన్నడూ లేనిది పిల్లాడినలా కసురుతావు? జీవితంలో పెళ్ళే చేసుకోవా? ఎన్నాళ్ళు తమ్ముడిని తోకలా వెంటేసుకు తిరుగుతావు? మీ అమ్మగారికి కాస్త నెమ్మదించింది కదా? ఈ స్వయంపాకాలు, వంట పుస్తకాలు ప్రక్కన పడేసి గుణవతి అయిన భార్యని తెచ్చుకో" అన్నారు తాతగారు.

"సిరియాళ్ జీ"

"జీ"

"భార్య అంటే?"

"భార్య అంటే ఏం లేదు. జీవితంపై మమకారం కలిగినపుడు మణిహారంగానూ, విరక్తి కలిగినప్పుడు మారణాయుధంగానూ పనికొచ్చే వజ్రం" సరిగ్గా అదే సమయానికి అంబరీష్‌కి ఐస్ క్రీం అందించడానికి చేయి సాచిన మేఘ అంది

"అంబరీష్ జీ"

"జీ"

"భార్య అంటే?"

"భార్య అంటే ఏం లేదు జీవితంపై విరక్తి కలిగినప్పుడు అనురక్తినీ, అనురక్తి కలిగినప్పుడు ఆహ్లాదాన్ని పంచే ఏకైక మిత్రురాలు" తెలిసిందా?" అడిగింది.

"తెలిసిందండీ! సిరియాళ్ జీ చెప్పిన మాటకంటే మీ మాటే బాగుందండీ"

"మా అక్కయ్యంతే - అచ్చుల్లో మేఘ. హల్లుల్లో వీణ తీగ. తను పలికితే ఎవరికైనా బాగానే ఉంటుంది"

క్రికెట్టు ఆడారు. అంత్యాక్షరి ఆడారు. ఓ హిందీ సినిమాలో చూపినట్టు రికార్డ్ ఆన్ చేసి దిండుని ప్రక్కవాళ్ళకి విసురుతూ ఆడారు. ముందుగా ఔటయ్యాడు సూర్యం.

"మా ఆవిడ అంతసేపూ దిండుని తన దగ్గర ఉంచుకుని, తీరా రికార్డ్ ఆగేముందు నా మీదకి విసిరింది. నాకు అన్యాయం జరిగిపోయింది" సూర్యం వాపోయాడు.

"మామయ్యా! అత్తయ్యని చేసుకున్నప్పుడే మీ జీవితానికి సరైన న్యాయం జరిగింది. వేషాలు వేయక మిమిక్రీ చేయండి" అంది మేఘ.

"నేనా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అంతగా నటించద్దు మాధవ పెద్ది, భానుమతి, ఎల్.ఆర్.ఈశ్వరి వంటి పాతగాయకుల్ని మీరు అనుసరించి పాడ్డం నాకు తెలుసు" అంది మేఘ.

కాస్సేపు బ్రతిమాలించుకుని "మనసున మల్లెల మాలలూగెనే" అంటూ పాడాడు.

తరువాత ఓడింది తాతగారు. "తాత దేనికి ట్రేడ్ మార్కు?"

"దగ్గుకి"

"సరే నేను ఇరవై రకాల దగ్గులు వినిపిస్తాను" అంటూ పొడిదగ్గు, జలుబు దగ్గు, కోరింత దగ్గు, అలికిడి దగ్గు, తన ఉనికిని తెలిపే దగ్గు, హేళనదగ్గు, తిరగమోత దగ్గు అంటూ వినిపించాడు.

శివ వాళ్ళమ్మ భగవద్గీత శ్లోకాలు, అతని అమ్మమ్మ త్యాగరాజ కృతి, వాళ్ళనాన్న యమధర్మరాజు డైలాగులు చెప్పారు. జయ ఆరు భాషల్లో రైల్వే ఎనౌన్స్‌మెంట్ చేయగా, అంబరీష్ వీణ డాన్స్ చేశాడు. చాలా చిత్రంగా దివ్య, శివ దిండుని అలాగే పట్టుకుని ఒకేసారి ఔటయ్యారు.

"ఇద్దరూ ఓడారు" సభ తీర్మానించింది.

"నాకేమీ రావు" అంది దివ్య.

"రాకేం? మగాళ్ళ మీద మంచి 'విసురు' విసిరేయ్!" అంది మేఘ.

"మగవాళ్ళు తమ లోపాల్నుండి తాము పారిపోవడానికి ప్రయత్నిస్తారు. అందుకే వారు ఏకాంతంగా గడపలేరు. నలుగురిలో ఇమడలేరు" అంది. 'ఇంక వీణ్ణి అడగాల్సిన అవసరం ఉండదు' అనుకున్నాడు రామారావు. అంతే! శివ అందుకున్నాడు. "ఆడవాళ్ళు పదిమందిలో ఉన్నప్పుడు ఏకాంతం గురించి కలలు కంటారు. ఏకాంతంగా ఉన్నప్పుడు పదిమందిని గురించి ఆలోచిస్తారు" అన్నాడు.

అంతే. చప్పట్లు మోగాయి. తిరిగి ఆటమొదలయ్యింది. సిరియాళ్ ఓడాడు.

"మీరంతా వాక్చమత్కారులు. ఏవేవో చెప్పారు. నా కలా రాదు. కళ్ళు మూసుకుని మన ముఖ్యమంత్రి బొమ్మ వేయనా?"

"రోజూ పేపర్లో అవన్నీ చూస్తున్నాం కళ్ళు మూసుకుని అందమైన అమ్మాయి బొమ్మవెయ్యి" అన్నాడు రామారావు.

"భయ్యా!" అంటూ ఇబ్బందిగా కదిలాడతను.

"అమ్మాయి బొమ్మ వేయాలి" అరిచారంతా. అంతే. క్షణాలమీద పాడ్, పేపర్, పెన్ను పంపించింది మేఘ. కళ్ళుమూసుకుని వేశాడంతే. అతను కళ్ళు తెరిచేసరికి పేపర్ రామారావు చేతిలో ఉంది. సిరియాళ్‌కి తప్పించి అందరికీ చూపాడది.

"భయ్యా! నే చూడద్దూ?"

"వద్దు. నీ కలల సుందరిని నీ కళ్ళలోనే ఉండనీ. నీ పెళ్ళిరోజు ఇది నీకు బహుమతిగ ఇవ్వబడుతుంది" అంటూ మడిచి జేబులో పెట్టుకున్నాడు రామారావు.

మేఘ ఓడింది. "చెప్పండి, ఏం చేయాలో" అడిగింది.

"నీ కలల రాకుమారుడి మీద కవిత చెప్పు."

"అలాగే."

**"కలల రాకుమారునికి కనకపు సింహాసనం -**
**హృదయాన్ని చూపమంది మనోదర్పణం.**
**ప్రేమలేఖ రాయాలనే ఉంది. కానీ**
**కాళిదాసునుండి - ఆధునిక కవిదాకా**
**వాడి వాడి అరిగిపోయిన అక్షరాలు**
**తోడి తోడి తరిగిపోయిన భావాలు.**
**మరేం చేయాలి? మనస్సు నెలా తెలపాలి?**
**అందుకే రాశాను. నిశ్శబ్దంలో సశబ్దగీతం.**

ఎక్కడుంది? మౌనాన్ని మించిన మనోజ్ఞమైన పదం"

అంతా చప్పట్లు కొట్టారు. "మేఘా! ఈ నిశ్శబ్దగీతం నీ కలల రాకుమారునికి చేరాలని మేమంతా కోరుకుంటున్నాం" అన్నారు తాతగారు. ఈసారి విభీషణ ఓడాడు. "నేనేం చేయాలి?"

"ఉందిగా నీ మకారాయణం. మకారాలు ఎక్కువగా ఉన్న పద్యం చదివి వివరించు" అన్నాడు రామారావు.

**కం: మామా వలువలు ముట్టకు**

**మామా కొని పోకు పోకు మన్నింపదగున్**

**మా మావ మేలగొనియెదు**

**మా మానస హరణ మేల మామము కృష్ణా.**

ఇది పోతనగారి 'టూ ఇన్ వన్' పద్యం. ఈ పద్యంలో గోపికలు కృష్ణుని స్మరిస్తున్నారు. 'మీరు కృష్ణుని స్మరించండి. నేను పలుకుల తల్లిని ప్రస్తుతిస్తాను' అంటూ సరస్వతీదేవికి ఇష్టమైన పదునాలుగు (14) సంఖ్యలో 'మ'కారాలనుంచి 'మా' అంటూ మాతయైన దేవిని మకారంతోస్తుంటారు. పద్యాన్ని ఎత్తుకోవడమే 'మా' అంటే 'తల్లీ' అని ఎత్తుకున్నారు. తనకావ్యం సజావుగా సాగుతున్నందుకు సరస్వతీదేవిని 'అంతర్వాహిని'గా స్తుతించిన పద్యం ఇదని నేను నమ్ముతాను" అన్నాడు.

"భేష్", "శభాష్" "వారెవ్వా" అంటూ అంతా మెచ్చుకున్నారతన్ని. ఘనంగా చప్పట్లు కొట్టి అభినందించారు.

"బావా ఇక నీ వంతు" అంది మేఘ.

"నే గెలిచాను. గెలిచినవారు ఏమీ చేయనవసరం లేదు" అన్నాడతను.

"అదేం కుదర్దు" అంది మేఘ. చాలాసేపు ఆమెతో వాదించి "అబ్బబ్బ నీ వంటి గయ్యాళిని ఎవరుచేసుకుంటాడో గానీ వాడు ఇనుపమేకుల పూజచేస్తున్నాడు దేవుడికి" అన్నాడు. సిరియాళ్ వెంటనే చేతిని వెనక్కి లాక్కున్నాడు. ఇందాక పాడ్‌కి పెట్టడానికిచ్చిన గుండుసూదుల్ని తమ్ముడి చేతిలో ఉన్న బంతికి గుచ్చి తమ్ముడూ తనూ నిశ్శబ్దంగా ఆడుకుంటున్నారు.

"అదేంటి? ఇందాకేగా బంగారు పూల పూజ చేస్తున్నాడని మెచ్చుకున్నారు" మేఘ పోట్లాడింది.

"అది తూచి అమ్మాయ్! ఇదే నిజం."

"మీరిలా నిముషానికో రకంగా చెప్పి అసలే అయోమయంలో ఉన్నవాళ్ళని మరింత అయోమయం లోకి గెంటద్దు" అంది.

"సరే. సరే. ఈసారి అలాగే చేస్తాం కాని ఇప్పుడేవంటావ్?"

"నువ్వేమైనా చెప్పు. పాటపాడు. ఆటాడు. నీ ఇష్టం."

"సరే! నాక్కొద్దిగా జ్యోతిష్యం తెలుసు. ఇక్కడున్న మీరు, ఇంకా మరికొందరు, ఇంకొందరూ మీ బంధువులు, స్నేహితులు, హితులు అంతా ఆపదల పాలుకాబోతున్నారు. అంతా చిక్కుల్లో పడనున్నారు. అది రేపుకావచ్చు. సంవత్సరాలే పట్టచ్చు. కానీ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపే చిక్కులు మీకు రానున్నాయి. మీకలాంటి జీవన్మరణ సమస్య కలగడానికి కారణం ఊహించగలరా?"

అంతా చూస్తున్నారు ఆశ్చర్యంగా వింటున్నారు. హృదయాన్ని చెవులకి అప్పగించి.

"అందుకు కారణం నేనే. ఔను. నా కారణంగానే మీరంతా చిక్కుల్లో చిక్కనున్నారు. దయచేసి వివరాలూ, కారణాలు నన్నడక్కండి. విషయం ఏంటో నాకూ తెలియదు మరి" అంటూ లేచాడు.

అక్కడున్న వాళ్ళందరికీ తెలుసు. అతను అంతకన్నా ఓ మాటకూడా ఎక్కువగా చెప్పడనీ తామూ చెప్పించలేమనీను.. అందుకే మౌనాన్ని బలవంతంగా పారదోలే ప్రయత్నం చేస్తూ అందరూ మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నారు. పెదాల చివర్నుండి వస్తున్న ఆ మాటలన్నీ పేలవంగా వినబడుతున్నాయి రామారావుకి.

●●●

శివ క్వాలిస్ కొన్నాడు. ఈ విషయం ముందే విన్న రామారావు "మీ ఇంట్లో ఉన్న ఐదుగురికి అంత పెద్ద బండి ఎందుకు? ఇప్పుడు మంచి మోడల్ కార్లు చాలా వస్తున్నాయి కదా?" అన్నాడు.

"ఇది కొత్తబండేం కాదు. కానీ ఎక్కువగా తిరిగింది లేదు. ఆ ఓనర్లకి మరో నాలుగు బండ్లున్నాయి. ఆపద సమయంలో ఆయన ప్రాణాలు రక్షించానన్న కృతజ్ఞతతో 'డాక్టర్ గారూ మీకు బండికావాలి. చాలా తక్కువ ధరకిస్తాను. కొనుక్కోండి. అపుడు నాలాంటి ప్రాణాలు మరిన్ని కాపాడచ్చు' అంటూ పోరుతున్నాడు. నాకూ నిజమే అనిపించింది. పైగా మనందరం బైటికి వెళ్ళాలంటే పెద్ద బండి ఏదైనా కావాలి. అందుకే కొంటున్నాను. నిజానికి మనకిది కూడా సరిపోదు కానీ కనీసం ఆడవాళ్ళైనా ఎండ కన్నెరగక వస్తారని కొంటున్నా" అన్నాడు.

"అవునులే. మనిద్దరికీ బైక్ లున్నాయికదా?"

"బండి పాతదైనా పూజ చేయించాలి" అన్నాడు శివవాళ్ళ నాన్న. ఊరికి చివరగా ఉన్న అమ్మవారి ఆలయంలో పూజ చేయించారు. అంతా బండిలో ఇరుక్కుని సర్దుకున్నారు. శివ, రామారావు బైక్ మీద వెనకాల బైలుదేరారు. నగరానికి కాస్త దూరంలోనే ఉన్న ఆ గుడి నుండీ బయలుదేరేప్పటికే రాత్రి ఏడుదాటింది. క్వాలిస్ వెళ్ళిపోయింది. శివ, రామారావు కాస్త నెమ్మదిగా వస్తున్నారు. సిటీ మరో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండగా ఉన్నట్టుండి బండి ఆపాడు రామారావు. "ఏంరా ఆపావు?" అడిగాడు శివ.

బండికి స్టాండ్ వేసి పరుగెత్తుతూ వెనక్కి నడిచాడు రామారావు. అక్కడ రోడ్డుకి కొద్ది దిగువలో ఓ కారు చెట్టుని ఢీకొని ఉంది. డ్రైవరు అచేతనంగా దూరంగా పడి ఉన్నాడు. ఇద్దరూ అటుగా పరుగెత్తారు.

"బాబోయ్! ఇతను పోయాడు" అన్నాడు శివ.

చెట్టు ఆధారంగా అడ్డంగా పడిపోయింది కారు. శివ జేబులో నుండి సెల్ తీసి పోలీసులకి ఫోన్ చేస్తున్నాడు. అది ఎంగేజ్ వస్తోంది. సహాయం కోసం ఎవరైనా వస్తారేమోనని రామారావు రోడ్డు మీదకి వచ్చి చూస్తున్నాడు. అంతలో పోలీస్ జీప్ కనిపించింది. "ఇక్కడ" అంటూ చేయి చాపి ఆపాడు రామారావు.

"ఇక్కడ ఏదో యాక్సిడెంట్ అయిందని ఎవరో ఫోన్ చేశారు. మీరేనా ఫోన్ చేసిన వాళ్ళు?" అడిగాడు ఒకతను.

"లేదు. మేం ఇప్పుడే వస్తూ చూశాం. మీకు ఫోన్ చేస్తున్నాను కూడా" అన్నాడు శివ. పోలీసుల వెనకే పత్రికల వాళ్ళు, చానళ్ళ వాళ్ళు వచ్చారు. అంతా చనిపోయిన వ్యక్తి చుట్టూ గుమికూడారు. ఓ విలేఖరి కారు దగ్గరికి వెళ్ళి చెప్పాడు. "కార్లో ఎవరో ఉన్నారు" అని.

అంతా అటు చేరుకుని కారు డోర్‌ని బలంగా లాగితే గాయాలతో స్పృహ తప్పి ఉన్న యువతి కనబడింది. శివ ఆమె నాడి పరీక్ష చేసి "త్వరగా వైద్యం చేస్తే ఈమె బ్రతకొచ్చు" అన్నాడు.

"మీరు డాక్టరా?" అన్నాడు యస్సై.

"అవును" శివ అన్నాడు.

"ఇక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఓ హాస్పిటలుంది. ఈమెతో పాటు మీరు మా జీప్‌లో వెళ్ళగలరా?" యస్సై అడిగాడు.

"తప్పకుండాను. ఈమెని జీప్‌లోకి చేరుద్దాం" అన్నాడు శివ.

"నాకిక్కడ కొన్ని పనులున్నాయి. అవి పూర్తిచేసుకుని నే హాస్పిటల్‌కి వస్తాను. ఈలోగా ఆమెకి ట్రీట్‌మెంట్ జరిగేలా చూడండి" అంటూ డ్రైవర్‌ని మరో కానిస్టేబుల్‌ని ఇచ్చి పంపాడు యస్సై.

పోలీస్ జీప్ కొంత సేపు అయాక డాక్టర్ వచ్చి ప్రాణభయం లేదని చెప్పాడు. తలవెనుక భాగంలో చిన్న గాయానికి కట్టుకట్టారు. ఎడమ, చేతికి కుట్లు వేశారు. ఐనా ఆమెకి స్పృహ రాలేదు.

శివని ఇంటికి పంపించి, సెలైన్ ఎక్కించిన ఆమె చేతిని అలాగే పట్టుకుని రాత్రంతా అక్కడే ఉండిపోయాడు రామారావు. మధ్యలో ఒకటి రెండు సార్లు ఆమె కళ్ళు తెరచి చూసి మళ్ళీ మూసుకుంది.

●●●

**తరువాత రోజు ఉదయమే శివ వచ్చాడు.** "రేయ్! రాత్రంతా అలాగే ఉన్నావు. వెళ్ళి రెస్ట్ తీసుకో. ఈరోజు ఆఫీసుకి శలవు కూడాను" అంటూ రామారావుని ఇంటికి పంపించి వేశాడు. ఎనిమిదింటికి ఆ యువతి స్పృహలోకి వచ్చింది. డాక్టర్ ఆమె పరిస్థితిని బట్టి పోలీసులకి ఫోన్ చేశాడు.

యస్సై వచ్చాక డాక్టర్ నిదానంగా జరిగింది చెప్పాడు ఆమెకి.

"డ్రైవర్?" అడిగిందామె.

"అతను పోయాడు" యస్సై చెప్పాడు. కొద్దిసేపు దుఃఖించింది. చివరగా అంది. "అతను తాగాడని ఏమాత్రం అనుమానం కలిగినా కారు తీయమని ఉండను. అతని భార్యా పిల్లలకు విషయం చెప్పండి" అంటూ ఎడ్రెస్ ఇచ్చింది.

"మీ వివరాలు చెప్పండి" యస్సై అడిగాడు. ఆమె చెప్పిన వివరాలు విని మీరు సత్యనారాయణరావుగారి అమ్మాయా?" అన్నాడు ఆశ్చర్యంగా

"మా నాన్నగారు మీకు తెలుసా?" అదిగిందామె.

"అంత పెద్ద ఇండస్ట్రియలిస్ట్ తెలీకపోతే ఆశ్చర్యం కానీ తెలిస్తే ఆశ్చర్యం లేదు" అన్నాడతను.

తరువాత ఒకరిద్దరు జర్నలిస్ట్‌లు వచ్చారు. వాళ్ళూ వెళ్ళాక ఆమె కాస్సేపు నిద్రపోయింది. అది పెద్ద హాస్పిటలేం కాదు. హైవేకి దగ్గరగా ఉందని నలుగురు యం.బి.బియస్ చేసిన డాక్టర్లు కలిసి పెట్టుకున్న హాస్పిటల్. అందులో ఒకతను ఎయం.డి కూడాను. పక్కనున్న పల్లెలనుండి అదపాదడపా జనం వస్తుంటారు.

రోడ్డు ప్రమాదాలు జరిగిన వాళ్ళు, ఎమర్జన్సీ కేసుల వాళ్ళూ వస్తుంటారు. వచ్చినవాళ్ళు 'పెద్ద'వాళ్ళైతే ప్రాణపాయం తప్పగానే వెళ్తారు. ప్రాణగండం ఉందని తెలిస్తే వీళ్ళే కార్పోరేట్ హాస్పిటళ్ళకో, ప్రభుత్వాసుపత్రులకో తీసుకు వెళ్ళమంటారు. కానీ ఊళ్ళలో ఉండే జనాలకి మాత్రం అది పెద్దాసుపత్రి.

ఆ జనం ఇంకా డబ్బులు కట్టడానికి ఇబ్బంది పడతారు. ఆ జనం ప్రాణాలు రక్షించిన వైద్యులకు ఇంకా దండాలు పెడతారు. ఆ జనం ఇంకా అమాయకంగానే ఉంటారు. ఎప్పుడో వచ్చే ఎమర్జన్సీ కేసులవల్లే ఆసుపత్రి నడుస్తున్నా ఊరిజనం అంటే ఆ నలుగురికీ ఇష్టం. తక్కువ ఫీజుతో ఒక్కోసారి అసలు ఫీజు తీసుకోకుండానే వైద్యం చేస్తుంటారు. కారణం వాళ్ళంతా ఆ చుట్టు ప్రక్కల గ్రామాల వాళ్ళే.

ఒక్క పరిశుభ్రత విషయంలో మట్టుకు కఠినంగా ఉంటూ, మిగతా విషయలు పెద్దగా పట్టించుకోరు. రోగుల కోసం సాయంత్రాలు వారి బంధువులు వస్తుంటారు. సాయంత్రం నాలుగునుండి ఆరువరకు వారి సందర్శకులు వస్తారు. వార్డుకిద్దరు మనుషులు నిరతరం కాపలా కాస్తారు. ఉమ్మకుండా, పసిపిల్లలు ఒకటీ, రెండు చేయకుండా జాగ్రత్తగా చూస్తూ ఉంటారు.

చంటి పిల్లల తల్లులను బైట ఆపి మరొకరు పిల్లల్ని పట్టుకున్నప్పుడే వాళ్ళని విడుస్తారు. వెళ్ళిన వాళ్ళు మాట్లాడుకున్నా, మురికి చేయకుండా రోగి బెడ్ మీద కూర్చున్నా పట్టించుకోరు.

నిద్రనుండి లేచాక ఆమెకి ఇడ్లీ తినిపించింది దివ్య. శివకూడా కూర్చున్నాడు. మధ్య మధ్య వెళ్ళి ఆమె పరిస్థితి కనుక్కుంటున్నాడు.

సాయంకాలానికి రామారావు తప్ప అంతా వచ్చారు. కబుర్లు చెప్పారు. ఆమెని పరామర్శించారు. ఏడు కావస్తుండగా అంతా వెళ్ళిపోయారు. జయ 'ఆమె'కి తోడుగా ఉండిపోయింది. మర్నాడు ఆదివారం. డాక్టర్లు పెద్దగా రారు. ఒంటిగంటనుండి నాలుగింటివరకు సందర్శకులకు అనుమతి.

జయ స్నానానికని ఇంటికి వెళ్ళాక ఆమె చూస్తోంది. కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళని, ఆత్మీయంగా పలుకరించుకుంటున్న వాళ్ళని, బత్తాయిలు ఒలిచి పేషెంట్ల నోట్లో పెడుతున్న వాళ్ళని, ఆత్మీయంగా సేవలు చేస్తున్న వాళ్ళని 'ఇదెంత బాగుంది ఇలాంటి ఆప్యాయతలు చూసి ఎన్నాళ్ళయింది?' అనుకుంది. కాస్సేపటికల్లా నిన్నటిలా జనాలు వచ్చారు. కబుర్లు చెప్పారు. నవ్వించారు. పలకరించారు. దివ్య, శివ కూడా డిస్పెన్సరీ మూసి వచ్చేశారు.

అప్పుడు ఆమె అంది "దివ్యగారూ! మీరంతా ఓ పది మాటలు మాట్లాడితే అందులో ఓ మాట రామారావు గురించి ఉంటుంది. ఇంతకీ ఎవరా రామారావు? అతను అంత గొప్పవాడా?" అని.

మేఘ వెంటనే అంది. "ఆయన మా బావ. బావ గురించి చెప్పవలసి వస్తే నాకు తెలిసిన ఒకే ఒక పదం. ద కంప్లీట్ మాన్. మా అందరి మీద అతని ప్రభావం చాలా ఉంది. అంతేకాదు. మిమ్మల్ని ఆపదలో చూసి, తీసుకువచ్చి హాస్పిటల్లో చేర్చిన ఇద్దరిలో మొదటి వ్యక్తి శివ, రెండోవ్యక్తి మా బావ రామారావు"

"నా కంత గొప్ప వద్దు. మనదంతా పెద్దపులి చూపే. ముందుకే. వాడే పక్కకి చూశాడు. ప్రమాదాన్ని గ్రహించాడు. వెనక్కి తిరిగాడు. అప్పుడు గానీ ఈ ట్యూబ్ వెలుగలేదు" శివ అన్నాడు. "మీరంతా ఎంతో మంచివారు. సంస్కారవంతులు కాకపోతే ఈ అనామకురాలి కోసం ఇంతమంది వస్తారా? ఇన్ని రకాలుగా సేవచేస్తారా? పైగా నా పేరు కూడా ఇంతవరకు అడగలేదు" ఆమె మాట పూర్తి చేయలేదు. "మేడమ్" అంటూ వచ్చేశాడొకతను.

అంతే. తరువాత జనమే జనం. హాస్పిటల్ ఆవరణంతా కార్లతో నిండిపోయింది. లోపలి భాగమంతా జనంతో నిండిపోయింది. "డాక్టర్ గారితో మాట్లడి వచ్చాను. రండి మేడమ్ ఇంటికి వెడదాం" అన్నాడు ఒకతను. అతనేదో పెద్ద ఉద్యోగి అని దర్పమే చెబుతోంది.

"నే రాను" అందామె.

"అదేంటి మేడమ్. నాన్నగారు వస్తే మమ్మల్ని కేకలేస్తారు."

"నాకు తెలుసు. మీ భయం నా గురించి కాదు. నాన్నని గురించి. ఈ అతిగౌరవం నాక్కాదు. మా నాన్న దర్పానికి. ఈ విలువ నా వెనకున్న నాన్న డబ్బుది. నన్ను నన్నుగా ఆదరించిన ఈ మంచివాళ్ళ ముందు మీ 'అతి' తనమంతా వెలవెలబోతోంది. వీళ్ళని విడిచి నేరాను. మీరిక వెళ్ళచ్చు". అందామె.

వచ్చినవాళ్ళంతా ఎంతగా బ్రతిమాలినా 'ససేమిరా' అంది. అప్పటికి అంతా వెళ్ళారు. ఐతే మర్నాడు జయ స్నానానికని ఇంటికి వెళ్ళింది. ఆ అమ్మాయి నాన్న విదేశాలనుండి ఆఘమేఘాలమీద వచ్చి ఆమెని బలవంతంగా తీసుకువెళ్ళాడు.

"వాళ్ళ కుటుంబానికి కృతజ్ఞతలు చెప్పాలి నాన్న. అప్పటివరకు రాను" అంటున్నా వినకుండా "ముందు ఇంటికి పదమ్మా! తరువాత చెప్పవచ్చును" అంటూ నిలబడనివ్వక తీసుకువెళ్ళాడు. ఈ విషయం డాక్టర్ ద్వారా విన్న జయ వాళ్ళంతా చాలా బాధపడ్డారు. కాకపోతే అంతా మనసులోనే. ఎవరూ పైకి చెప్పుకోలేదు. 'కనీసం మా ఫోన్ నెంబర్ అయినా తీసుకుని ఉండాల్సింది' అనుకుంది జయ.

ఆమె వెళ్ళిన నాలుగురోజులకి ఉత్తరం వచ్చింది.

'జయాంటీ –

నమస్తే నా పేరు సిరి. మీరు నాకు ప్రాణదానం చేసినా, ఆదరించి సేవలు చేసినా కృతఘ్నురాలనై మిమ్మల్ని కలవకుండా వెళ్ళినందుకు నన్ను మన్నించండి. నన్ను చూసిన గాబరాతో నాన్న నన్ను త్వరపెట్టి ఇంటికి తీసుకు వెళ్ళారు. హాస్పిటల్‌కి ఫోన్ చేసి మీ ఎడ్రస్ తెలుసుకుని ఉత్తరం వ్రాస్తున్నాను. ఫోన్ నంబరు అడిగి ఉండవచ్చు. కానీ నాకు ఫోన్ కన్నా ఉత్తరం అంటేనే ఇష్టం. నోటితో చెప్పలేనివి ఎన్నో కాగితం మీద పెట్టచ్చు. అందుకే ఉత్తరాన్ని ఎన్నుకున్నాను. మళ్ళీ ఉత్తరం రాస్తాను. ఇప్పటికి ఉంటాను. ..సిరి. '

తరువాత ఉత్తరం దివ్యకి, ఆ తరువాత మేఘకి వచ్చాయి. రామారావు ఢిల్లీనుండి వచ్చాక అన్నాడు "ఎందుకైనా మంచిది. ఆ అమ్మాయినుండి కాస్త దూరంగా ఉండండి" అని. అతని మాటలు ఎవరికీ రుచించలేదు. సిరి అలా ఉత్తరాలు రాస్తూనే ఉంది.

'మేఘా నాకో సమస్య వచ్చిపడింది. కళ్ళు మూసినా, తెరిచినా ఏదో ఆకారం కళ్ళలో కనబడుతున్నది. బొటనవ్రేలంత ఉన్న ఆ ఆకారం రోజుకి కాస్త పెరుగుతూ కనబడుతోంది. యాక్సిడెంట్ అయిన చోటులో ఏవేనా ఆవహించి ఉంటుందని మా నాన్న క్షుద్ర మాంత్రికులని పిలిపించి పూజలు, రక్షరేకలు, హోమాలు చేయించారు. ఏ దేవతైనా ఆగ్రహించబడిందేమోనని గ్రహపూజలు, మంత్రజపాలు, అభిషేకాలు చేయించారు. కానీ ప్రయోజనం లేదు. రూపం నానాటికీ వెంట్రుకవాసి తేడాతో పెరుగుతూ ఉంది. అదేంటో తెలీడంలేదు' అంటూ రాసిందోసారి.

తర్వాత కొద్దిరోజులకి మరో ఉత్తరం వ్రాసింది. ఆ రూపం క్రమంగా ఓ ఆకారం సంతరించుకుంటున్నదని పదిరోజులకి ఫోన్ చేసింది. 'దివ్యా! నాకు కనిపిస్తున్న రూపం క్రమంగా మార్పులు చెంది ఓ మానవాకారంగా అస్పష్టంగా ఉంది' అంటూ

మూడోరోజు జయకి ఫోన్ చేసి "ఆంటీ ఆ రూపానికి ఓ స్పష్టత వచ్చింది" అంది.

"మానవుడా? దేవుడా?"

"ఓ మానవరూపమది"

"ఎలాఉంది?"

"ఎవరో మగవాడు"

"ఔనా? "

"యువకుడు"

"ఎవరతను?"

"ఏమో ఆంటీ అతన్నిదివరకు ఎప్పుడూ నే చూసింది లేదు"

"అదేంటమ్మా?"

"ఔనాంటీ. నాక్కొద్దిగా బొమ్మలు వేయడం వచ్చు. నాన్నతో చెప్పి ఓ ఆర్టిస్ట్‌ని పిలిపించుకుని అతని సాయంతో ఆ బొమ్మ వేశాను. నే కలలో కూడా చూడని రూపం అది."

"మీ నాన్నగారు చెప్పినట్టు అదేదో దెయ్యంగాడిది అయిఉంటుంది. నువ్వు వేసిన రూపం అతను బ్రతికున్నప్పటిదేమో"

"తెలీదు" అంది.

నెలరోజుల తరువాత ఓ ఉత్తరం వ్రాసింది సిరి. దాంతోపాటు తాను వేసిన బొమ్మకూడా పంపించింది. ఐతే ఆ రోజు ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ఉత్తరం రామారావు చేతికి వచ్చింది. యధాలాపంగా దాన్ని తీసి చించి చూసిన రామారావు కొయ్యబారిపోయాడు ఓ నిముషం. తరువాత తేరుకుని ఉత్తరం చదివాడు.

"జయాంటీ! ఇదే నాకు నిరంతరం కనిపించే రూపం. మీకలాంటి తెలిసిన వాళ్ళెవరైనా ఈ రూపంలోగానీ, ఈ పోలికలతో గానీ ఉంటే ఆ వ్యక్తి వివరాలు నాకు తెలపండి - సిరి"

రామారావు తేరుకుని ఉత్తరాన్ని, బొమ్మనీ యధాతధంగా మడిచి కవర్లో పెట్టి తన గూట్లో, పుస్తకాల అడుగున ఎక్కడో పెట్టేసి ఊరుకున్నాడు. ఐతే ఏ విషయాన్ని అతను దాచాలనుకున్నాడో ఆ విషయం మర్నాడు 'తొలిసంధ్య' దినపత్రికలో ప్రకటనగా వచ్చింది.

'నమస్తే!

నా పేరు సిరి ఇక్కడున్న బొమ్మలోని వ్యక్తితో ఓ చిన్న అవసరం కలిగింది మాకు. మా సమస్యకి అతనే పరిష్కారం చెప్పగలడు కనుక అతనికోసం వెదుకుతున్నాను. అతను కానీ, అతన్ని గురించిన వివరాలు కానీ తెలిసినవారు మా నాన్నని కానీ, నన్నుగానీ సంప్రదించండి. ప్రప్రధమంగా అతని వివరాలు తెలిసిన వారికి మంచి బహుమతి ఇవ్వబడుతుంది'

'తొలి సంధ్య'లో పనిచేస్తున్నవారంతా అదేదో జోక్ అనుకుని. నవ్వుకుని ప్రకటించి ఊరుకున్నారు. కానీ రామారావు గది బైట నిరంతరం కాపలా ఉండే ప్యూను మాత్రం ఆరాత్రి పేపర్ చదువుతూ ఆశ్చర్యపోయాడు. ఆ విషయం కొందరి ముందు ప్రస్తావించగా వారంతా హేళనగా నవ్వారు. ఈ విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించి ఆ రాత్రి పదిగంటలకు సిరికి ఫోన్ చేశాడు.

'మీరు రేపోసారి మా ఇంటికి రండి.' అంది సిరి. మర్నాడుదయం వెళ్ళాడతను. వెళ్తూ వెళ్తూ రామారావు ఫోటోలు, కొన్ని పేపర్ కటింగులు కూడా తీసుకి వెళ్ళాడు. అతన్ని గురించిన వివరాలన్నీ చెప్పాడు. అన్నీ విని నిర్ఘాంతపోయింది సిరి. అతనికి డబ్బూ, కొత్తబట్టలూ ఇచ్చి సంతోషపెట్టి పంపించింది. ఆనాటి పేపర్లో విషయాన్ని చూసిన రామారావు హితులంతా రాత్రికి అతనింటికి చేరారు. అప్పటికి రామారావు ఆఫీసునుండి రాలేదు. వెళ్ళేటప్పుడే చెప్పాడు తల్లికి. "అమ్మా! నాకు ఆఫీసులో పనుంది. చాలా ఆలస్యమవచ్చు. కంగారుపడకు" అని.

అప్పటికే జనాలంతా తీవ్రమైన ఉత్కంఠతతో ఉన్నారు. వాదించుకుంటున్నారు.

అప్పుడే సిరినుండి ఫోన్.

"ఆంటీ నేను సిరిని" అంది.

"సిరీ! ఇదెలా సంభవం? వాణ్ణి నువ్వెప్పుడూ చూసిందీ లేదు. మేం వర్ణించిందీ లేదు. ఎలా వేయగలిగావు మావాడి బొమ్మని?"

"తెలీదాంటీ! కాని నేను వేసిన బొమ్మ మీకు పంపించినప్పుడైనా చెప్పలేదు మీరు."

"అవునా? నిజం సిరీ! అలాంటి ఉత్తరంగానీ, బొమ్మగానీ నీ నుండి అందలేదు మాకు."

అంతలో దివ్య ఫోన్ అందుకుని "అతన్ని చూడాలన్నావు. ఎందుకు?" అడిగింది.

"తెలీదు. ఓసారి చూడాలనిపించింది"

"రామారావు నీ ప్రకటన చూసే ఉంటాడు. ఎందుకోగానీ తెలీని వెంట్రుక వాసి శత్రుత్వపు రేఖ ఏదో వీళ్ళిద్దరి మధ్యన ఉందని నా అనుమానం"

"ఐతే ఇకనేం? నువ్వు నీ వివరాలు ఎడ్రస్ తో పాటు మీ నాన్నగారి వివరాలు, మీ ఇంటి ఎడ్రసూ వ్రాసి ఉంటావు. ఆ ఉత్తరం రామారావుకి చేరి ఉంటుంది. అతనే దాన్ని దాచి ఉంటాడు." అంది దివ్య.

"అలా ఎందుకు?"

"ముందే చెప్పుకున్నాంగా? అతనికి నీతో పలకడం ఇష్టంలేదు. ఆఁ" అన్నాడు శివ.

"ఆ రోజు రాత్రి రెండుమూడుసార్లు కళ్ళు తెరిచి చూసిందని వాడు చెప్పాడు. అప్పుడు తప్ప ఆమె వాడిని మీరెప్పుడూ చూసే ఛాన్సులేదు"

"ఆఁ! నాకో బల్బ్ వెలిగింది ఆ రోజు బావ వేసుకున్న షర్టు ఏంటి?" మేఘ అంది.

జయ కొంచెం ఆలోచించి "తెల్లషర్టు మీద లేత నలుపురంగు పెద్ద గళ్ళున్న షర్ట్. ఎందుకు?"

"ఎందుకేంటత్తయ్యా! సిరి వేసిన బొమ్మలో అదే షర్టుతో ఉన్నారు దొరగారు."

"ఇది ఎలా సంభవం?" అన్నాడు శివ.

"అది తేలాలంటే సిరి రావాలి" అన్నాడు విభీషణ.

●●●

తరువాత రెండురోజులకి ఆఫీసునుండి వచ్చి ఒంటరిగా కూర్చుని పేపర్ చదువుతున్నాడు రామారావు. అంతలో ఓ వ్యక్తి వచ్చి "సార్! రామారావుగారిల్లు ఇదేనా?" అనడిగాడు.

"ఆఁ! ఇదే" పేపర్‌లో నుండి తలపైకెత్తి చెప్పాడు. "ఎవరు కావాలి మీకు?" అడిగాడు.

"జయమ్మగారు" డ్రైవర్ డ్రస్‌లో ఉన్న ఆ వ్యక్తి చెప్పాడు.

"అమ్మా, నాన్నా, తాతయ్యా, ఎవరూ ఇంట్లోలేరు" అంటూ పేపర్లో తలదూర్చబోయి ఆగిపోయాడు. డ్రైవర్ కొద్దిగా ప్రక్కకి తప్పుకుంటే అతని వెనకాల కనపడింది ఓ యువతి. ఆమె సిరి. ఒక్క క్షణం మాత్రం ఆమెని చూసి తిరిగి పేపర్లో తలదూర్చాడు.

ఆమె కూడా అతనితో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. కనుచూపులతోనే 'పద వెళదాం' అనే మాటని గ్రహించి డ్రైవర్ వెనుతిరిగాడు. ఆమె వెళ్ళిపోయినా, కారు కనుమరుగైనా రామారావు పేపర్లో నుండి తలని కదల్చలేదు.

●●●

"అతన్నా?" పిడుగు పడినటు అదిరిపడ్డాడు సత్యనారాయణరావు.

"అవును. అతన్నే. ఏం? అంతలా అదిరిపడ్డారు? అతను ఇంతకు ముందే మీకు తెలుసా?"

"నేను ముందే ఊహించాను. అతనితో మీకున్న వైరం ఎమిటి?"

"అది నీకు అనవసరం"

"అతన్ని నేను ప్రేమించక పోయిఉంటే మీరన్నది నిజమే. కాని ఇప్పుడు నాకది అవసరం"

"ప్రేమా? అతన్నా? "

"ఇంటికి వెళితే కనీసం పలకరించలేదు. పేపర్లో తనని గురించి వేసినా నేను ఫలానా అని చెప్పలేదు. "

"అతన్ని ప్రేమించావా? ఓ బండరాయిని."

"బండరాయో, గుండ్రాయో అతను నా మనసులో నిలిచిపోయాడు"

"సిరీ! ఈ ప్రపంచంలో నువ్వు ఎవరినన్నా కోరుకో కుల, మత ప్రాంతీయ, అంతర్జాతీయ భేదం లేకుండా అతనికి నిన్నిచ్చి పెళ్ళిచేస్తాను. కాని ఆమొండాడిని మరచిపో. నా మాటవిను."

"కాని నాన్నా! నేను కావాలని అతన్ని వరించలేదు. ఇది దైవికంగా జరిగింది. అది మీకూ తెలుసు."

"నువ్వొక్కటి తెలుసుకో నువ్వు కోరింది ఈ జన్మలో జరుగదు" అరుస్తూ వెళ్ళిపోయాడాయన. అంతే!

ఆ రోజు నుండి నిరాహారదీక్ష, మౌనదీక్ష మొదలెట్టింది సిరి. సామదానాది సకలోపాయాలు ప్రయత్నించి విఫలుడై చివరకు మూడోరోజు అన్నాడు.

"సిరీ! నీ మంచిని కోరి ఎంత చెప్పినా వినకుండా నీవీదారిని ఎంచుకున్నావు. ఇక నీ ఇష్టం. ముందు భోజనం చెయ్యి. తరువాత మాట్లాడుకుందాం."

భోజనాలు ముగిసాక "అమ్మా! నువ్వెంచుకున్న వాడొక కొరకరాని కొయ్య. ఒకసారి అతని మనసులో ఏదైనా నిర్ణయం జరిగితే ఇక మార్చలేము. నన్ను ఒప్పించావు సరే. అతన్ని ఒప్పించడం కష్టం. ఇందుకు నీక్కొన్ని షరతులు పెడుతున్నాను విను. నీ ప్రేమ విషయంలో నేను జోక్యం చేసుకోను. అయితే అతన్ని నీ ప్రేమలో పడేట్టు చేసుకునే భాధ్యత నీదే

ఇందుకోసం నీకు సరిగ్గా సంవత్సరం టైము ఇస్తున్నాను సంవత్సరంలోగా అతన్ని నీతో పెళ్ళికి ఒప్పించాలి. లేదంటే గడువు గడిచాక నే చూసిన వాడిని పెళ్ళాడాలి. ఈ గడువులో అతను నిన్ను కొట్టినా, తిట్టినా, అవమానించినా నిన్ను బలవంతాన తీసుకు వచ్చి నిన్ను వేరే వాడికిచ్చి పెళ్ళి జరిపిస్తాను. ఈ షరతులకి నువ్వు ఒప్పుకుంటేనే నీ ప్రేమని అంగీకరిస్తాను. లేదంటే నువ్వు మళ్ళీ నిరాహార దీక్షని మొదలెట్టుకోవచ్చు.

ప్రాణానికి ప్రాణమైన భార్యపోతేనే తట్టుకుని, భరించి నిలువగలిగాను. నువ్వూ పోతే ఓ శోకం పెట్టి ఊరుకుంటాను" అన్నాడు.

'మీ షరతులన్నింటికీ నేను ఒప్పుకుంటున్నాను. కాకపోతే నాకో చిన్ని సాయం చేయాలి మీరు.' అంటూ చెప్పింది. ఆయన ఏం చేయాలో, ఎలా చేయాలో వివరంగా, నిదానంగా.

"సరే" అన్నాడాయన. చివరగా కూతురు తలమీది చేయివేసి నిమురుతూ అన్నాడు "అమ్మా! మామూలుగా ప్రేమకథలకి కులగోత్రాలు, ఆస్తి, అంతస్తులు, మతాలు, పాతకక్షలు విలన్లవుతూండడం మనకు తెలుసు.

నీ ప్రేమకథకి విలన్ ఎవరో తెలుసా? నీ ప్రేమికుడు. నీదో వింతకథ ... వింత ప్రేమకథ. తండ్రిగా నీ ప్రేమ విఫలమవ్వాలని ఆశిస్తున్నాను. కానీ సాటి మనిషిగా మాత్రం నీ ప్రేమ ఫలించాలని కోరుకుంటున్నాను" ఆయన కళ్ళలో కన్నీరు.

సిరి కళ్ళకూడా కనీళ్ళు.

"థాంక్స్ నాన్నా! ఇంతకీ అతనికీ, మీకు కలిగిన వైరం ఎలాంటిది?"

"అదినే చెప్పను. అతని ద్వారనే నీకు తెలియాలి"

"సరే! మీరు నాకు చేసే సాయం గుర్తుందికదా? ఆ ప్రయత్నంలో ఉండండి మీరు"

"మంచిదమ్మా! నువ్విక పడుకో"

●●●

తుడిచిన ఇంటినే పదే పదే తుడుస్తూ కూర్చుంది జయ. తాతగారేమో పూలుకోసే వంకతో తోటలో తిరుగుతున్నారు. సూర్యం మాత్రం మేడమీది చల్లగాలికి తిరుగుతూ భానుమతి పాటని కూనిరాగం తీస్తూ ఉన్నాడు. "శ్రీకర కరుణాల వాల వేణుగోపాలా"

తాతగారికి పాటవినబడుతోంది. మరొకప్పుడైతే కొడుకు పాటని శ్రద్ధగా వినేవాడు. ఆనందించేవాడు. కానీ ఆయన మనసిప్పుడు పాటమీద లేదు. మనవడి గది మీద ఉంది. మాములుగా ఉదయం ఆరున్నర ఏడు ప్రాంతాల్లో నిద్రలేస్తాడు రామారావు. ఈ రోజు తొమ్మిదిన్నర అవుతున్నా ఇంకా నిద్రలేవలేదు. అలాగని తలుపు తట్టడానికి మనసురావడంలేదు. జయకూడా అదే స్థితిలో ఉంది.

'రాత్రి జరిగిన సంఘటనే ఇందుకు కారణమా?' మామా కోడళ్ళు తమలో తమని ప్రశ్నించుకుంటున్నారు. కలవరపడుతున్నారు. రాత్రి.. పూర్వాపరాలివి.

●●●

భోజనాలకి కూర్చున్నారు నలుగురూ. మమగారికి సౌంజ్ఞ చేసింది జయ. అలవోకగా గమనిస్తున్నాడు సూర్యం. కళ్ళు కంచం మీదున్నా ఏదో జరగబోతున్నదని గ్రహించాడు రామారావు.

"రేయ్ తాతా! నీతో మాట్లాడాలి" అన్నాడు తాతగారు.

"చల్లకొచ్చి ముంతదాచడం ఎందుకు? చెప్పు తాతయ్యా! " నెయ్యి వడ్డించుకుంటూ అన్నాడు రామారావు.

"సిరి.. అదే కారు యాక్సిడెంట్‌లో మీరు రక్షించారే ఆ అమ్మాయి గురించి నీ అభిప్రాయం ఏంటి?" అడిగాడు కొద్దిగా జంకుతూనే.

"ఎవరో అమ్మాయి గురించి నా అభిప్రాయం ఏమంటుంది తాతయ్యా! ఏమీలేదు"

"ఆ అమ్మాయి నిన్ను ప్రేమించింది. నిన్న నాకు ఉత్తరం రాసింది. ఆమె మా కందరికీ కూడా నచ్చింది కనుక పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని."

"నచ్చిందా? ఎవరికి నచ్చింది."

"నాకూ, మీ నాన్నకీ, మీ అమ్మకి"

"తాతయ్యా! అమ్మ స్త్రీ. కనుక మరో స్త్రీని పెళ్ళాడేందుకు ఇండియాలో పర్మిషన్ లేదు. పోతే నాన్న పెళ్ళిచేసుకోవచ్చు. కానీ అమ్మ ఊరుకోదనుకుంటాను. మిగిలింది నువ్వు. నీకీ ముదిమి వయసులో పెళ్ళి అనవసరమని నా అభిప్రాయం."

"చాల్లే సంబడం. పెళ్ళి మాకు కాదు. నీకు" అంది జయ.

"అల్లాగా? పెళ్ళి నాకే ఐతే అమ్మాయి నాకు నచ్చాలనే కనీసపు ఆలోచన మీకు రానందుకు నే చింతిస్తున్నాను"

"బడాయిపోకు. ఆమెకి ఏం తక్కువని నీకు నచ్చలేదు?"

"సరే. దీనికి జవాబు చెప్పేముందు ఓ చిన్న ప్రశ్న. సుమారు పాతికేళ్ళనాడు ఓ అమ్మాయిని చూడ్డానికి ఇద్దరు పెళ్ళికొడుకులు వచ్చారు. ఉదయం చూసినతను సూర్యం. సాయంత్రం చూసినతను సుబ్రహ్మణ్యం. సుబ్రహ్మణ్యం అన్నింటా సూర్యానికన్నా మిన్నగా ఉన్నాడు. అందం, చదువు, డబ్బు, ఉద్యోగం. కనీ ఆ అమ్మాయి సుర్యాన్నే ఎన్నుకుంది ఎందుకు? సుబ్రహ్మణ్యానికి ఏం తక్కువ? " నవ్వుతూ ప్రశ్నించాడు.

"ఏముందిరా! ఆమెకి అతనే నచ్చి ఉంటాడు" అన్నారు తాతగారు కూడా నవ్వుతూ.

"ఔనా? అందం, ఆస్తి, చదువూ ఉన్నా పెళ్ళిచేసుకోవాల్సిన వ్యక్తికి అమ్మాయి నచ్చాలనే చిన్న విషయం కూడా మీకు ఎందుకు అర్థంకాదు?" కరుకుగా అన్నాడు రామారావు.

"హుఁ! నీతో మాట్లాడ్డం అంటే కొరివితో తలగోక్కోవడం" అంటూ జయ చెయ్యి కడుక్కోవటానికి లేచింది. కళ్ళు, కనుబొమ్మలు, భుజాలు ఎగరేసి మూతిని 'గ' ఒత్తులా క్రిందకి విరిచాడు రామారావు. ఈ సంఘటన జరిగక ఎవరూ ఎవరితోనూ మాట్లాడుకోలేదు. కానీ ఉదయం నిద్రలేవాల్సిన రామారావు చాలా ఆలస్యంగా లేచి బైటకి వచ్చాడు.

అప్పటివరకు జయ, తాతగారూ ఊపిరి బిగపట్టినట్టున్నారు. అతను బైటకి రాగానే తేలిగ్గా అయిపోయారు. "ఏరా తాతా! ఇంతదాకా పడుకున్నావేం?" తాతగారి ప్రశ్నకి "ఏం లేదు తాతయ్యా" అని ముభావంగా జవాబిచ్చి గబగబా తయారై ఆఫీసుకి వెళ్ళిపోయాడు రామారావు.

●●●

ఆ రోజు ఆదివారం. శివ వాళ్ళింటిని మరో అంతస్తుకి పెంచారు. సత్యనారాయణ వ్రతం చేసుకున్నారు. బంధువులంతా వెళ్ళిపోయాక రామారావు వాళ్ళు, సిరియాళ్, మేఘ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఉన్నట్టుండి "పేకాడుదాం" అంది దివ్య. వాళ్ళంతా ఆటలో నిమగ్నమయ్యారు. రామారావు ఇంటికొచ్చి ఏదో ఇంగ్లీష్ నవల చదువుతూ కూర్చున్నాడు. సూర్యం ఓడిపోయి ఇంక ఆడను అంటూ వచ్చేశాడు. జయ, తాతగారు కూడా వచ్చేశారు - తాతగారు చెట్లకి నీళ్ళు పడుతున్నారు. జయ పట్టుచీర మడతేస్తుంది.

అంతలో వాకిట్లోకి కారు వచ్చి ఆగింది. అందులో నుండి ముందుగా సత్యనారాయణరావు దిగాడు. ఆయన వెనక సిరి దిగింది. వీళ్ళని చూసిన తాతగారు పంపుకట్టేసి వాళ్ళ వేపు నడిచాడు.

గేటుకి బయటివేపు ఆగిపోయిన ఆయన "మేము లోపలికి రావచ్చా?" అడిగాడు.

"అయ్యో! అదేం మాట? రండి రండి" ఆదరపూర్వకంగా నవ్వి గేటు తీశాడు.

జయ ఇద్దరికీ మంచినీళ్ళు ఇచ్చింది గ్లాసు క్రింద పెట్టి తాతగారినీ, సూర్యాన్ని చూస్తూనే చేయబోయేది తప్పో, ఒప్పో నాకు తెలియదు కానీ నా ఒక్కగాక్క కూతురు ప్రాణాలతో ఉండాలని కోరుకోవడం వల్ల మీ ముందుకి ధైర్యంగా రాగలిగాను" అన్నాడు ఉపోద్ఘాతంలా.

"చెప్పండి" సూర్యం అన్నాడు.

"విషయం మీకు తెలిసిందే ఐనా మళ్ళీ చెబుతాను "మా అమ్మాయి మీ అబ్బాయిని ప్రేమించిందట. స్పృహలో ఒళ్ళెరుగని స్థితిలో తను మీ అబ్బాయిని చూసి ఉంటుంది. ఐనా మరోసారి అతన్ని చూడకుండానే అతని బొమ్మ వేయగలిగింది. ఇది యాదృచ్ఛికమో, దైవ సంకల్పమో నాకైతే తెలియదు. ఆమె కోరితే కొండమీది కోతినైన నే కొనితేగలను. ఒక్క మీ అబ్బాయిని తప్ప.

కానీ తప్పని ఆ వ్యక్తినే కోరింది వరించింది. వారించాను. ఆత్మహత్యకి పూనుకుంది. కన్న మమకారం వల్ల నేను రామారావు కాళ్ళు పట్టుకునైనా బ్రతిమాలతాను. కానీ నాకు తెలిసి రామారావు ఈమెని స్వీకరించడు. అందుకే ఆమె ప్రేమని ఆమె ఇష్టానికే వదిలేశాను. ఆమె కోరిక మీదే ఇక్కడికి తీసుకు వచ్చాను.

మీ ఇంటికి కిలోమీటరు దూరంలో ఓ గ్లాస్ ఫ్యాక్టరీ ఉంది. ఇరవై ఏళ్ళుగా అది మూతపడింది. దాన్ని నే కొన్నాను. అమ్మాయి ఎం.బి.ఏ చేసింది. దానికి ఈమెని ఎం.డిగా చేశాను. ప్రేమే కాకుండా తనకి మరో వ్యాపకం కూడా ఉండాలికదా? అందుకే ఆమెకీ బరువు, బాధ్యతలని అప్పగించాను. ఒక సంవత్సరం గడువిచ్చాను. ఈలోగా తను చేయవలసినవి రెండు - ఒకటి రామారావుని పెళ్ళికి ఒప్పించగలగడం.

రెండు.. లాభాలు రాకున్నా సరేగానీ ఫ్యాక్టరీ నష్టాల్లో కూరుకుపోకుండా చూడ్డం. రెంటిలో ఆమె దేన్ని సాధించలేకున్నా నేను చూసిన వరుడి మెడలో తను పూలమాల వేయాలి. ఇది మాకు కుదిరిన ఒప్పందం.

మీకెవరికీ అభ్యంతరం లేకపోతే ఆమెని ఇక్కడ వదిలి వెళ్తాను. ఈ తండ్రి బాధని అర్థం చేసుకున్న జవాబు చెబుతారని ఆశిస్తున్నాను" ముగించాడు.

రామారావు తన గదిలో కూర్చుని ఉన్నాడు. అంతా విన్నాడు. ఇలాంటిదేదో జరుగుతుందని అతను ఊహించాడు. కానీ అదింత త్వరగా జరుగుతుందనుకోలేదు. తండ్రి చెప్పబోయే జవాబు ఏమిటో అతనికి తెలుసు. అందుకే మాట్లాడకుండా పుస్తకం పొట్టమీద పెట్టుకుని పైకప్పుకేసి చూస్తూ పడుకున్నాడు.

సూర్యం అన్నాడు. "మీ విషయంలో నేను కొద్దిగా మాత్రం సాయం చేయగలను. అది నిరభ్యంతరంగా మీ అమ్మాయిని మా ఇంట్లో వదిలి వెళ్ళండని చెప్పడం. ఇంక వాడి విషయంలో అంటారా? అందులో మీరెంత అశక్తులో, నేనూ అంతే"

"నాకా సాయం చాలు. మీరింత మంది మంచి మనసులున్న మనుషుల మధ్య నా కూతురికి ఏ లోటూ రాదని. నా దగ్గర కన్నా ఇక్కడే ఆమె ఆనందంగా ఉంటుందనీ నాకు తెలుసు" లేచాడాయన. "మీ మంచితనానికి నాకరెన్సీ నోట్ల లెక్కలు కట్టి తనున్నందుకు డబ్బు ఇస్తానసే చీప్ మాటలు మాట్లాడను.

ఆమెవల్ల మీలో ఎవరికి ఇబ్బంది కలిగినా నాకు ఒక్క ఫోన్ కాల్ చేయండి. చాలు నే వచ్చి తనని తీసుకువెళతాను" గుమ్మం వరకు వెళ్ళి వెనక్కి వచ్చాడు. జయ దగ్గరికి వెళ్ళి నమస్కరించి "అమ్మా! నాకూతురు ఎక్కువగా మాట్లాడదు. ఆకలి అని కన్న తల్లినే అడిగి ఎరగదు. మేమే తన ఆకలి గ్రహించి తినిపించేవాళ్ళం. ఆ బాధ్యత ఇకపై మీదమ్మా! " జయ చేతిలో కూతురి చెయ్యి ఉంచి గబగబా కదలి వెళ్ళిపోయాడు.

●●●

జయ తెల్లవారు ఝామునే ఐదింటికి నిద్రలేస్తుంది. పనమ్మాయి బట్టలు, గిన్నెలు, ఇల్లు తుడిచేపని చేస్తుంది కానీ ముగ్గుమాత్రం తనే వేసుకుంటుంది. తరువాత స్నానం, దీపారాధన అయ్యాక స్టౌ దగ్గరికి వెళ్తుంది. ఇంట్లో పనీ, పరిస్థితీ గమనించిన సిరి మూడో రోజు జయ నిద్రలేచేప్పటికి వాకిట్లో ముగ్గు పెడుతోంది.

జయ గబగబా వచ్చి 'ఏం పనమ్మా ఇది?' అనబోయింది కాని అలానే ఉండిపోయింది. మామూలుగా చుక్కలు పెట్టి, అవి కలుపుతూ, నింపుతూ వాటి ఆధారంగా ముగ్గుపెడతారు. సిరి రెండు వేళ్ళ చివరి నుండి సన్నగా జాలువారుతున్న ముగ్గు అద్భుతాలని సృష్టిస్తున్నది.

సన్నగా గీసిన గీతలు తీగలౌతున్నాయి. అడ్డదిడ్డంగా గీసిన రేఖలు ఆకులౌతున్నాయి.

మొనతేలిన వంకులు మొగ్గలౌతున్నాయి. పిచ్చి మెలికలన్నీ పుష్పాలౌతున్నాయి. సున్నాలు సుమాలుగానూ మారుతున్నాయి. పూలతోట పరుచుకుంది వాకిట.

సిరి ముగ్గు ముగించగానే అంది జయ "నీ చేత ముగ్గు మాన్పించాలని వాకిట్లో కొచ్చాను. ఐతే ముగ్గువేసుంటే ఆపేదాన్ని. కానీ పూలతోటని చిత్రించితే ఏమనగలను?"

సిరి చిరునవ్వు నవ్వింది. జయ స్నానం చేసి వచ్చేప్పటికి టిఫిన్ తయారు చేసింది వద్దన్నా వినక వంటలోనూ సాయపడింది. కాదు వంటే చేసింది. జయ వంట బాగా చేస్తుంది. ఐతే సిరి చేతి వంటలో ఏదో కొత్త రుచి. ఈ రుచిని జిహ్వామున్నెరుగనిది.

"వంట సిరి చేసిందా?" అడిగాడు సూర్యం. 'అవును' అంది జయ. "నీ చేతి వంట చాలా బాగుంటుంది. ఐతే ఈ కమ్మని రుచి కొత్తది కనుక మరింత రుచిగా అనిపిస్తోంది" అన్నాడు.

రామారావుకి ఎంతగానో నచ్చిన ఈ రుచి గొంతునుండి గుండెకి చేరుకుని అక్కడ పదిలంగా ఉండిపోయింది. పై సంభాషణ జరిగినప్పుడు సిరి అక్కడలేదు. వంటపూర్తిచేసి టిఫిన్ తిని తను కొద్దిగా లంచ్ ప్యాక్‌లో సర్దుకుని ఎనిమిదింటికల్లా ఫాక్టరీకి వెళ్ళిపోయింది.

"అక్కడ ఉన్నన్నాళ్ళూ నీకెలాంటి వాహనాలూ పంపబడవు" తండ్రి మాటలు గుర్తుకి తెచ్చుకుని నవ్వుకుంటూ కాలినడకన బైలుదేరింది.

ఆరోజు ఆఫీసులో పనుండి ఏడింటి వరకు ఉండిపోయాడు రామారావు. అతను వచ్చేసరికి తనింటి వాళ్ళతోపాటు మేఘ, విభీషణ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సూర్యం ఈ మధ్య బాగా మాట్లాడ్డం అలవాటు చేసుకున్నాడు.

"మామయ్యా! బావకి ఇష్టం లేదని తెలిసి సిరిని ఇంట్లో ఉండడానికి ఒప్పుకున్నారు కదా? కాదూ కూడదని గొడవ చేస్తే మీరు ఏంచేసేవారు?" అడిగింది మేఘ.

"వాడలా అనడం మేఘా నేనా అమ్మాయిని ఉండమంటానని తెలిసే" వాడు బైటికి రాలేదు. తరువాత వాడు గొడవ చేయడం అలా ఉంచి 'నాకిష్టంలేదు నాన్నా' అని ఉంటే 'మీ అమ్మాయిని మీరు తీసుకు వెళ్ళండి అని ఉండేవాడిని."

"అంటే?"

"నేనేం చెబుతానో వాడికి ముందే తెలుసు. వాడిప్రవర్తన ఎలా ఉంటుందో నాకు తెలుసు. అందుకే నేను అంగీకరించాను. వాడు మిన్నక ఊరుకున్నాడు. పైగా 'ఆమె ఇక్కడ ఉండడం వల్ల నీ మనసు చంచలమై పోతుందని వెనక్కి పంపావా?' అంటూ మీరంతా గేలిచేస్తారని కూడా భావించి ఉండవచ్చు."

"వావ్! భలే తండ్రీ కొడుకులు" అంది మేఘ. అంత వరకూ మల్లెపందిరి క్రింద కూర్చుని విషయం మరో విషయానికి మళ్ళిన తరువాత ఇంట్లోకి వచ్చాడు రామారావు. అతను వచ్చి అప్పటికి పదిహేను నిమిషాలు దాటింది.

●●●

**సూర్యం స్నేహితుడు ప్రభాకర్.** కాలేజీ రోజుల్నుండి కలిసే ఉన్నారు. పెళ్ళిళ్ళు అయినా, ఉద్యోగాల్లో స్థిరపడినా వారి స్నేహం వీడిపోలేదు. పైగా ఉద్యోగాలు కూడా ఒకే సిటీలో. ప్రభాకర్‌కి బాంక్‌లో ఉద్యోగం రెండు కుటుంబాలు వాళ్ళింటికి వీళ్ళు వీళ్ళింటికి వాళ్ళు రాకపోకలున్నాయి.

ఆ రోజుల్లో మితభాషిగా పేరున్న సూర్యానికి ఏకైక మిత్రుడు ప్రభాకర్. అతను ఈ మధ్య బ్యాంక్ పరీక్ష ఏదో వ్రాసి అందులో ఫస్టు రావడంతో ప్రమోషన్ మీద ఢిల్లీ వెళ్ళాడు.

సంసారాన్ని తల్లిదండ్రులు, భార్యమీద వదిలి ఒక్కడు ఢిల్లీలో ఉంటున్నాడు. ఒక్కడే కొడుకు. అతని చదువుకి అంతరాయం కలిగించడం ఎందుకని దేశరాజధానిలో ఒంటరిగా ఉద్యోగం తోడుగా ఉంటున్నాడు. ఇటీవలికాలంలో బ్యాంక్ అతన్ని ఆస్ట్రేలియా పంపించింది. ఏదో ట్రైనింగ్ నిమిత్తం.

అతను వెళ్ళి మూడునెలలు దాటింది. అతని కుటుంబానికి కావలసిన చిన్న చిన్న అవసరాలు సూర్యం చేసిపెట్టేవాడు. ఆరోజు ఉదయమే ఫోనొచ్చింది. ప్రభాకర్ తండ్రి పోయాడని. తాతగారూ, సూర్యం, జయ వెళ్ళారు. "ఇప్పుడు శలవు పెట్టే వీలు లేదు తాతయ్యా! లేదంటే నేనూ వచ్చేవాడిని" అంటూ ఆఫీసుకి వెళ్ళాడు రామారావు. సిరి ఫాక్టరీకి వెళ్ళిపోయింది.

పెద్దాయన హఠాన్మరణంతో కృంగిపోతున్న ప్రభాకర్ కుటుంబాన్ని ఓదార్చారు. సూర్యం అన్నింటా తానుండి జరగవలసిన కార్యక్రమాలన్నీ జరిపించాడు. ప్రభాకర్‌కి ఫోన్ చేసి ట్రైనింగ్‌ని మధ్యలో విడిచి రావద్దనీ, తానున్నాననీ ధైర్యం చెప్పాడు. ప్రభాకర్ పెదనాన్న తాను తలకొరివి పెడతానన్నాడు. అన్ని పనులూ, కార్యక్రమాలు దగ్గరుండి చూసుకున్నాడు సూర్యం. ఐతే నిన్నటి వరకూ చక్కగా తిరుగుతూ కబుర్లు చెప్పిన పెద్దాయన గుండెపోటుతో పోవడం ఆ ఇంట్లో వాళ్ళకి భయాన్ని కలిగించింది.

ఒకరిద్దరు బంధువులున్నా ప్రభాకర్ కుటుంబానికి ధైర్యం చెబుతూ ఆ రోజు అక్కడే ఉండిపోయారు ముగ్గురూ. ఆ విషయం రామారావ్‌కి ఫోన్ చేసి చెప్పారు. ఫాక్టరీ నుండి వచ్చిన సిరి 'ఆంటీ వాళ్ళింకా రాలేదే' అనుకుంటూ స్నానం చేసింది. అంతలో ఫోనొచ్చింది. జయ విషయం చెప్పింది.

"ఆంటీ! నేనొక్కదాన్ని ఇంట్లో ఉన్నానని తెలిస్తే మీ అబ్బాయి ఎలాగూ ఇంటికి రాడు. నాకేమో రాత్రిళ్ళు భయం. ఒక్కదాన్ని ఉండలేను" అంది దిగులుపడుతూ.

"ఔనమ్మా నాకదే బెంగగా ఉంది. సమయానికి దివ్య అమ్మగారింటికీ, మేఘవాళ్ళ ఊరికీ వెళ్ళారు. నీ దగ్గర ఉండమనడానికి ఎవరూ లేరు. వీళ్ళేమో ఇక్కడ ఆపదలో ఉన్నారు. ఏం చేయాలో తోచకుండా ఉంది"

"సరే. నే వెళ్ళి సిరియాళ్‌నీ, అంబరీష్‌నీ ఈ పూటకి భోజనానికి ఇక్కడికే రమ్మంటాను. రాత్రికి ఇక్కడే ఉండమంటాను. ఈలోగా మీరు రామారావుకి ఫోన్ చేసి నేకాక మరో ఇద్దరు జీవులు ఇక్కడ ఉన్నారని చెప్పండి. అప్పుడుగాని అతను ఆఫీసు విడిచిరాడు"

"సిరియాళ్ వాళ్ళూ లేరమ్మా వాళ్ళమ్మగారిని తీసుకుని యాదగిరిగుట్ట వెళ్ళారు. పోనీ ఈ రాత్రికి మీ నాన్నగారి దగ్గరకి వెళ్ళకూడదూ?"

"ఆంటీ! భయంతో నే చచ్చినా సరే గానీ నాన్న దగ్గరకి వెళ్ళను. అది మా ఒప్పందానికి వ్యతిరేకం. సరే ఉంటాను. " ఫోన్ పెట్టి వెనక్కి తిరిగిన సిరి విస్తుపోయింది. సోఫాలో కూర్చుని ఉన్న రామారావు చేతిలో ఉన్న ఫైల్లో తలమునకలైపోయి ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు. అంతవరకు సిరిలో కలిగిన దిగులూ, భయమూ పోయి ఆ స్థానాన అనిర్వచనీయమైన ఆనందం కలిగింది.

ఆమె వెళ్ళాక 'పుట్టినప్పటినుండి నీ పేరు వేలమంది పలికి ఉంటారు. కానీ ఈమె నోటినుండి విన్న నీ పేరు ఎంతందంగా ఉంది?' ఇంకా ఏదో అనబోతున్న అంతరాత్మ పీకని దబాలున నొక్కాడు రామారావు.

సిరి వంట చేసింది. అన్నీ టేబుల్ మీద సర్ది అతనికోసం చూస్తూ కూర్చుంది అతను రాడని తెలుసు. ఐనా కాస్సేపు చూసి తను కొద్దిగా తిన్నది. అన్నం సయించలేదు. ఈలోగా జయ మళ్ళీ ఫోన్ చేసింది. ఆమె ఫోన్లో మాట్లాడుతుండగా రామారావ్ డైనింగ్ హాల్లోకి నడిచాడు. సిరి జరిగింది చెప్పింది. "మీ అబ్బాయి వచ్చాడు. కానీ రాత్రంతా ఇక్కడ ఉంటాడన్న నమ్మకం లేదు నాకు. అందుకే అతను వెళ్ళేవరకు హాల్లోనే ఉండి వెళ్ళాక తలుపులు వేసుకుని పడుకుంటాను" అంది స్వరాన్ని తగ్గించి.

కాస్సేపు మాట్లాడినతరువాత జయ అంది "మీ ఇష్టం ఏమైనా ఏడవండి" అని పకపకా నవ్వింది. రామారావ్ వెళ్తాడేమోనని హాల్లో కూర్చుని చాలాసేపు ఎదురు చూసింది సిరి. డైనింగ్ టేబుల్ దగ్గర ఏవో చిరు శబ్దాలు వినబడుతున్నాయి. కానీ అతనెంతసేపటికీ బయటకి రాలేదు. ఓ గంట సేపు ఎదురుచూసి అనుకుంది. 'బకాసురుడిలా వంటంతా తిని అది చాలక పచ్చి బియ్యం గ్రటా తింటున్నాడేమో ఖర్మ!' తన ఆలోచనలకి నవ్వొచ్చింది. బుచ్చిబాబు నవలని చేతిలోకి తీసుకుని చదువుతూ కూర్చుంది.

నవలలోని కథ, పాత్రలు, ఆలోచనలోని సంఘటనలు, సందర్భాలూ కలగాపులగంగా కలిసి పోయి అయోమయ స్థితి ఏర్పడింది. ఆ స్థితిలో కాస్సేపు గడిపిన ఆమె తనకి తెలీకుండానే నిద్రలోకి జారుకుంది. తిరిగి ఆమెకి మెలుకువ వచ్చేసరికి తెల్లవారు ఝామున ఐదైంది. సోఫా మీదనుండి లేచిన ఆమె చుట్టూ చూసింది. రామారావ్ తన గదిలో మంచం మీద, పొట్టపై చేతులుంచుకుని నిద్రపోతున్నాడు. బండరాయిలో చిన్న కదలిక చాలు. శిల్పంగా మార్చచ్చు' పనులన్నీ ముగించుకుని స్నానం చేస్తుండగా అక్కడ.. హాల్లో ఓ మూల, కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుతూ, తను నిద్రపోయిందా? తిరిగి నిద్రలేచేటప్పటికి సోఫామీద ఉంది. ఎలా?'

వంట, పనులు అయ్యాక తన బాక్స్లో పెట్టుకుని అతనిక్కూడా లంచ్ బాక్స్లో పెట్టి టేబుల్ మీద ఉంచింది. అప్పటికి రామారావు నిద్రలేచి బాత్రూంలో దూరాడు.

అప్పుడు ఫోన్ చేసి "నాన్నా నేను" అంది.

"ఏమ్మా ఇంతపొద్దున్నే గుర్తొచ్చాను?"

"చిన్నడౌటు"

"అడుగు"

"నాకు నిద్రలో నడిచే అలవాటుందా?"

"పెద్దగా లేదు కానీ పడక కుదరనప్పుడూ, జ్వరం తగిలినప్పుడూ, ఆలోచనతో సతమతమైనప్పుడూ, కొద్దిగా ఉద్వేగస్థితి కలిగినప్పుడూ నువ్వు నిద్రలో పడక మార్చి మరో మంచం మీదకి చేరడం నే చూశాను. అసలిదంతా ఎందు.." ఫోన్ డిస్కనెక్ట్ అయింది. ఆమె మాటలు వింటూ తన గదిలోనే ఉండిపోయాడు రామారావు.

గుండెల్లో రేగే అలజడిని గొంతుతో నొక్కి పట్టి గబగబ బైటకి వచ్చాడు. అతను వెళ్ళాక ఇంటికి తాళం వేసి ఫాక్టరీకి వెళ్ళింది సిరి.

●●●

రామారావు ఆఫీసు నుండి వచ్చేసరికి కాలనీ చివర జయ ఎదురుపడింది. అప్పటికి రాత్రి ఎనింది దాటింది. సూర్యం ఆఫీసునుండి రాలేదింకా. తాతగారు భాగవత సప్తాహం అని వెళ్ళారు.

బైక్ ఆపి "ఏమ్మా ఎక్కడికి?" అడిగాడు రామారావు జయపలకలేదు.

"అమ్మా! ఈ రాత్రి పూట ఎక్కడికి బైలుదేరావు?"

"రోజా ఆరింటికల్లా ఇంటికి వచ్చేస్తుంది సిరి. ఎనిమిది దాటింది. ఆమె జాడలేదు. శివగానీ సిరియాళ్ గానీ లేరు. అందుకే ఆటోలో ఆమె ఫ్యాక్టరీకి వెళ్దామని ఆటోకోసం చూస్తూ నిల్చున్నాను" ఆమె మాటకి రామారావు పలకలేదు.

"నాకు తెలుసు. ఆమెని ఇంట్లో ఉండనిచ్చి నందుకే మా మీద పీకలదాకా కోపంగా ఉంది నీకు. ఇబ్బందిగా కూడా. అందుకే నీకు ఫోన్ చేయకుండా నేనే బయలుదేరాను.."

"సరే! నిన్ను ఇంటి దగ్గర దించి నే వెళ్ళి చూసొస్తానుగానీ రా బండి ఎక్కు. " అన్నాడు. ఆమెని వాకిట్లో దింపి గ్లాస్ ఫాక్టరీకి వెళ్ళాడు రామారావు. గేట్ దగ్గరున్న సెక్యూరిటీ వాళ్ళని అడిగాడు "మీ ఎండిగారు ఇంకా లోపలే ఉన్నారా?" అని.

"లేదు. ఫాక్టరీలో ఇద్దరు వర్కర్లు సోడాబుడ్లు విసురుకు కొట్టుకున్నారు. ఆపడానికి అక్కడే ఉన్న మేడంగారు వెళితే ఆమె చేతికి దెబ్బతాకింది. హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు."

"అలానా! ఏ హాస్పిటల్?" కంగారు పడుతూ అడిగాడు. బండి వెనక్కి తిప్పి అతను చెప్పిన హాస్పిటల్ ముందు పది నిమిషాల్లో ఉన్నాడు. అప్పటికే సిరి బైటికి వచ్చేసింది. "మేడమ్ రండి కార్లో దింపుతాను" ఎవరో అంటున్నారు.

"నే ఆటోలో వెళతాను. మీరు కారుని ఇంటికి తీసుకువెళ్ళండి" అంటోంది సిరి. "అదిగో మీ బంధువులబ్బాయి వచ్చాడు మీకోసం" అంటూ మేనేజరు రామారావుని చేరి "మేడం కార్లో రానంటున్నారు. మీరు బైక్ మీద తీసుకువెళతారా?" అడిగాడు. తలూపాడు రామారావు. బండి ఆమె పక్కగా ఆగింది. ఓ నిముషం తటపటాయించి ఎక్కి కూర్చుంది.

"వస్తా సర్. గతంలో తగిలిన చోటే మళ్ళీ దెబ్బ తైలింది. అందుకని జాగ్రత్తగా తీసుకెళ్ళండి". కార్లో కూర్చుంటూ చెప్పాడు మేనేజరు. ఎడంచేతికి గాయం. కుడిచేత్తో పట్టుకోవటానికి వీల్లేని పొడవాటి సీటు, ఐనా రామారావ్‌కి దూరంగా వెనక్కి జరిగి, సీటు అడుగు భాగాన్ని కుడిచేత్తో పట్టుకుని కూర్చుంది సిరి. ఇంటికి చేరారిద్దరూ.

అప్పటికి సిరి రాలేదని తెలిసి శివ, సిరియాళ్, శివ బైక్‌లు వేసుకుని ఫాక్టరీకి వెళ్ళారు. సమాచారం తెలుసుకుని హాస్పిటల్‌కి వస్తున్నారు. అంతలో బైక్ మీద ఇద్దరూ కనిపించారు. "మే ఐ హెల్ప్‌యూ" అన్నాడు శివ.

"వెధవ్వేషాలు చాలుగానీ పద" అన్నాడు రామారావు.

అందరి కళ్ళు వెనక్కి తిరిగాయి. 'వారెవ్వా! అచ్చుల్లో వీళ్ళిద్దరూ వైష్ణవ నామధేయులు కానీ హల్లుల్లో శివ,పార్వతులు' అనుకున్నాడు విభీషణ.

'వీళ్ళిద్దరినీ సృష్టించిన బ్రహ్మ మహా నేర్పరి' అనుకున్నాడు శివ.

'మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనే పదం వీళ్ళిద్దరూ పుట్టకముందు ఎలా పుట్టిందబ్బా!' అనుకున్నాడు సిరియాళ్. అంతా ఇంటికొచ్చేసరికి ఇల్లంతా జనాలు. ఇది ఊహించాడు రామారావు.

ఇంటికి వచ్చాక "ఏమ్మా మంత్రినీ, సేనాధిపతినీ, కోశాధికారినీ పెద్ద సేననే పంపించావు. అలాంటప్పుడు నన్నెందుకు వెళ్ళమన్నావు?" అడిగాడు చిరునవ్వుతో.

"బావా నువ్వు రాజువి. ఎందరున్నా నీ తరువాతే.." అంది మేఘ.

"అబ్బబ్బ! నిన్ను చేసుకోబోయే వాడెవరోగాని ఆయుధపూజ చేస్తున్నాడు" అన్నాడు రామారావు.

"అంటే?"

"అంటే.. సుత్తీ, కొడవలీ, బాకూ, ఈటె, కత్తి మొదలైనవన్నమాట" సిరియాళ్‌ని ఓరకంట గమనిస్తూ చెప్పాడు రామారావు. జయనడిగి సుత్తి, మేకులు, బుల్లి రంపం, మరికొన్ని ఇనప పరికరాలు తీసుకు వెళ్తున్న సిరియాళ్ అప్పటికి గడపదాటుతున్నాడు. రామారావు ఈ మాటనగానే అవన్నీ అతని చేతినుండి జారి క్రిందపడిపోయాయి.

"ఏంటబ్బాయ్ అలా పడేసుకున్నావ్?" అంది జయ.

"నీకు తెలీదు కానీ వెళ్ళి వంట చేసుకో" అన్నాడు రామారావు.

అప్పుడు చూసింది సిరి చేతికి కట్టుని. "ఏమైందమ్మా? చేతికి కట్టేంటి? " అడిగింది జయ.

"చిన్న దెబ్బ అంతే" అంది సిరి.

మర్నాడు ఆదివారం. అంతా భోజనాలు చేసి రామారావు ఇల్లు చేరారు. కాస్సేపు పేకాడారు.

"అమ్మా కోఠీలో కొన్ని పుస్తకాలు కొనుక్కోవాలి. వెళ్తున్నా" అన్నాడు రామారావు.

"రేయ్ నే మానేస్తాను. నాక్కొన్ని బుక్స్ కావాలి" శివమాటలు విననట్టు వెళ్ళిపోయాడు.

"ఇపుడు చెప్పు. నీ ప్రేమ ఎంతవరకు వచ్చింది?" అడిగింది మేఘ. సిరి చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

"ఫలించటానికి పిందె అంటూ వేయాలికదా?" అంది జయ.

"ఏమ్మా బైక్ మీద ఎక్కించుకు వచ్చాడు కదా!" దివ్య అంది.

"నే గ్యారంటీగా చెబుతున్నాను. అప్పుడు కూడా ఇద్దరూ మాట్లాడుకుని ఉండరు. వాడు బైక్ ఆపి ఉంటాడు. ఈమె ఎక్కి కూర్చుని ఉంటుంది. ఇక్కడ తెచ్చి పడేశాడు. అదేదో సామానులా, మూటలా సీనా?" అడిగింది జయ. సిరి తల ఊపింది.

కాస్సేపు అక్కడ కూర్చుని కొద్దిగా ఇబ్బందిగా అనిపించి బైటికి వచ్చి బుల్లి తోటలో కూర్చున్నాడు సిరియాళ్.

"నా స్థితి సరే. నీ పరిస్థితి ఏమిటి?" అడిగింది సిరి.

"నిన్ను చూశాక నేను చాలా బెస్ట్ అనిపిస్తున్నది. సుబ్బాయమమ్మగారు కోలుకోవటం, అతన్ని నా కొంగుకి కట్టుకోవటం. అంతే. కానీ నీ పరిస్థితి అలాకాదు. బావ మనస్సొక సంద్రం. అందులో ఏముందో ఎవరికీ తెలీదు" అంది మేఘ.

అంతలో వాకిట్లో ఆటో ఆగింది. "బావ ఆటోలో వచ్చాడేంటి?" మేఘ మాటలు పూర్తికాకుండానే అలా నోరు తెరిచి ఉండిపోయింది. లేచి నిల్చుంది. వాకిలి తోటలో ఉన్న సిరియాళ్ బిగుసుకు పోయాడు ఆ దృశ్యం చూసి. అంతా ఒక్కక్కరే అక్కడికి చేరారు.

రామారావు మామూలుగానే ఉన్నాడు. అతని చేతిలో పెద్దపూల దండ ఉంది. అతని తరువాత ఆటోలో దిగిన యువతి మెడలో పూలదండ, బుగ్గన చుక్క, పెళ్ళి బొట్టు, కొత్తచీర నలుపు రంగులో ఉన్నా చాలా ఆకర్షణీయంగా ఉందామె. 'అమ్మా' అన్నాడు రామారావు. ఎత్తుగా ఉన్న గుమ్మంలో నిల్చుని ఉందామె.

గేటు దాటి లోపలికి వచ్చిన రామారావు ఆ యువతి గుమ్మానికి చివరిమెట్టు క్రిందున్నారు. "అమ్మా జరిగిందేంటో వీళ్ళకు చెప్పనవసరం లేదనుకుంటాను. నాకెలాంటి నమ్మకాలు లేవు. ఇలా రమ్మన్నా ఇంట్లోకి వచ్చేస్తాం. నీకీ హారతి, దిష్టినీళ్ళ వంటివి కదా! త్వరగా అవి తీసుకునిరా" అన్నాడు. అక్కడున్న అందరి కళ్ళ చివర నీళ్ళు. జయ మాట్లాడకుండా లోనికి వెళ్ళింది. అంతా బిగుసుకుపోయి చూస్తున్నారు. అందరికళ్ళు సిరికోసం వెదికాయి. ఆమె ఎక్కడా కనిపించలేదు. కాస్సేపు పోయాక సిరి వంటగది నుండి బైటికి వచ్చింది. అప్పటికి రామారావు రెండోసారి అన్నాడు. "అమ్మా వాకిట్లో ఈ సంత నాకు ఇష్టం కాదు. నువ్వొస్తావా? మేం వచ్చేదా?"

కొడుకు మాటలకి జయకళ్ళు తుడుచుకుంటూ వస్తోంది. వాకిట్లోకి రాబోతున్న ఆమె ఆగిపోయింది. అంతా చేష్టలుడిగి చూస్తున్నారు. వాకిలికి చాలా ఎత్తులో కట్టబడి ఉందా ఇల్లు. మేడమెట్లలా ఉన్న ఆ ఇంటి గుమ్మం మెట్లు దిగుతోంది సిరి.

ఆమె చేతిలో హారతి పళ్ళెం. అంతే! రామారావు కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. వెంటనే ఆశ్చర్యాన్ని దాచుకుని ఆనందాన్ని నింపుకున్నాయి ఆమె దిగుతున్న ఒక్కోమెట్టు మీది అడుగు రామారావు గుండెలమీద 'దబ్' 'దబ్' మంటూ పడుతున్నాయి.

**'ఈ కరకు గుండెని నీ లేత పాదాలతో తాకకు. కందిపోతాయ్'** గుండె నోటిని గభాలున మూసేశాడు రామారావు.

ఆమె చివరి మెట్టు చేరగానే పెళ్ళి కూతురిలా ప్రక్కనే ఉన్న యువతి "మేడమ్!" అంది ఆశ్చర్యంగా. సిరి కూడా ఆశ్చర్యపోతూ.. "నువ్వు విలియమ్. కూతురు?"

"ఔను మేడమ్ చనిపోయిన మీ కారు డ్రైవర్ విలియమ్ కూతుర్ని నా పేరు స్నేహ. "

"చాలా సంతోషం" హారతివ్వడానికి పళ్ళాన్ని అలా పైకెత్తింది సిరి. ఆమెని కళ్ళ చివరి నుండి చూశాడు. ఆ కళ్ళలో అసూయ, అసహనం, అనుమానం కనిపించలేదు. పళ్ళాన్ని ఆమె చేతిలో నుండి తోసి కిందపెట్టి "ఎవరినో భయపెట్టి ఇంటినుండి తరిమేయాలని ఇలా నాటకమాడబోయాను. కానీ ఇపుడు నేనే భయపడుతున్నాను. మీరిక వెళ్ళిరండి" అంటూ తన పక్కనున్న యువతి చేతిలో డబ్బుంచి గబగబ మెట్లు ఎక్కి ఇంట్లోకి చేరాడు రామారావు.

వెళ్తున్న అతని వంక ఓమారు చూసి ఇటు తిరిగి "నీ పేరు స్నేహ కదూ?" అంది.

"ఔను. నాన్న పోయాక మాకుంటుంబానికి ఆర్థిక ఆధారం నేనే. ఏదైనా ఉద్యోగం ఇస్తారని మీ ఇంటికి వెళ్ళాను. అయ్యగారు ఫారిన్ వెళ్ళారని, మీరు బంధువులింట్లో ఉంటున్నారని చెప్పారు. ఇపుడు నాటకాలకి కొద్దిగా ఆదరణ వస్తోంది. అందుకని చిన్న చిన్న నాటకాలు వేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను.

నిన్న ఈ బాబు నా దగ్గరకొచ్చి "జీవిత నాటకంలో చిన్న పాత్ర వేయాలి" అంటూ డబ్బు ఇచ్చారు. ప్రథమాంకంలోనే నాటకం ముగిసింది. ఆ బాబు భయపడి పారిపోయారు" అంది స్నేహ.

"సరే! నాటకాలని వదిలెయ్. ఇక్కడికి దగ్గర్లో గ్లాస్ ఫాక్టరీ ఉంది. రేపు ఉదయం అక్కడికి వచ్చి కంప్యూటర్ ఆపరేటర్‌గా అపాయింట్ మెంట్ తీసుకో"

"సరే మేడమ్"

"స్నేహా సమయపాలన ముఖ్యం. ఓ నిమిషం ఆలస్యం చేసినా నే భరించలేను. సమయానికి ఫాక్టరీకిరా. సమయానికి వెళ్ళు."

"సరే మేడమ్ ఆ బాబు డబ్బు ఇచ్చారు. నేనాటకంలో పాల్గొనలేదు. కనుక ఇది నాకు చెందదు" డబ్బు వెనక్కి ఇవ్వబోయింది. "నాటకం సరిగ్గా రక్తికట్టక పోవడానికి నువ్వు కారణం కాదు నీ తప్పుకూడా లేదు. అందుకని ఉంచేసుకో" అంటూ వెనుతిరిగింది.

●●●

రామారావు ఆఫీసు నుండి వచ్చేసరికి తాతగారు పెట్టే బెడ్డింగ్ సర్దడం చూసి 'తాతయ్యా! ఎక్కడికి ప్రయాణం?" అడిగాడు. "తీర్థయాత్రలకి మన కాలనీవాళ్ళు బస్సేదో ఏర్పాటు చేశారు. శివవాళ్ళ అమ్మగారూ, నాన్నగారూ, నానమ్మగారూ, నేనూ వెళ్తున్నాం" అన్నాడాయన.

"మరి ఎల్లుండి అమ్మకి ఆపరేషన్ కదా?" అడిగాడు.

"జయని చూసుకోవడానికి నువ్వూ మీ నాన్న ఉన్నారు కదా! ఈ అవకాశం మళ్ళీరాదు. అందులోనూ డబ్బు నెల్రకితం ఇచ్చాం. ఆపరేషన్ అని వారం నాడు తెలిసింది. డబ్బు వెనక్కి ఇవ్వరట" రామారావు మరి మాట్లాడలేదు.

తాతగారు వెళ్ళిన మూడోరోజు జయకి ఆపరేషన్ జరిగింది. శ్వాసలో చిన్న ఆటంకం వల్ల ఆపరేషన్ తప్పదన్నారు డాక్టర్లు.



కౌముది

రేపు ఆపరేషన్ ఉందనగా ఆ రాత్రి భోజనాల దగ్గర సూర్యంతో అంది జయ. "సిరికి చీకటంటే చాలా భయం. అందుకని మీరు ఆఫీసునుండి త్వరగా ఇంటికి రండి. మూడు రోజుల తరువాత ఎలాగూ డిశ్చార్జ్ చేస్తానన్నారు" అని.

"ఏంటీ? నీ ఆపరేషన్ అంటే నే ఆఫీసుకి వెళతానా? వారం రోజులు శలవు పెట్టాను. నీకు స్పెషల్ రూం ఇచ్చే ఏర్పాటు చేశాను. నువ్వక్కడ ఉన్నన్నాళ్ళూ నేనూ అక్కడే భోజనం కూడా మనకు హోటల్ నుండీ వస్తుంది" అన్నాడు సూర్యం.

సిరి ఇంకా ఫాక్టరీ నుండి రాలేదు. ఆలస్యమౌతుందని చెప్పి వెళ్ళింది కూడా. రామారావు పలకలేదు. ఆ తెల్లవారి మామూలుకన్నా త్వరగా లేచి వంట చేసి "ఆంటీ నాకీ రోజు కూడా చాలా పనుంది" అంటూ వెళ్ళిపోయింది. కాస్సేపటికల్లా సూర్యం జయ కూడా వెళ్ళిపోయారు.

రామారావు కూడా వస్తానంటే "ఆపరేషన్ చిన్నదేగా? నువ్వు వద్దులే ఆఫీసుకెళ్ళు" అన్నారు. వాళ్ళు వెళ్ళాక చిందర వందరగా ఉన్న హాల్ సర్దుతూ ఉండగా జయ గదిలో అద్దం దగ్గర ఓ ఉత్తరం కనిపించింది విప్పాడు. ఆ అక్షరాల వెంట అతని కళ్ళు పరుగులు తీస్తున్నాయి.

"ఆంటీ నన్నూ, రామారావ్‌ని ఏకాంతంగా ఉంచడంలో అంకుల్ ఆంతర్యం నాకు అర్థమయింది. బహుశా అతనిక్కూడా అర్థమయే ఉంటుంది.

కానీ మీ అభిప్రాయం సరైనది కాదు. అతనికిష్టం లేకుండా అతనింట్లో వచ్చి తిష్ట వేశాను. అది నా మొదటి తప్పు. అతని ఏకాంతానికి భంగం కలిగిస్తూ ఆ రోజు నేను మాత్రమే ఉండడం నా రెండవ తప్పు. ఇపుడు మీరుండరని తెలిసినా నేనిక్కడ ఉండాలనుకుంటే అది ముచ్చటైన మూడవ తప్పు. ఈ తప్పునే చేయను. కారణం రామారావుని నే ప్రేమిస్తున్నాను. కామించడంలేదు. ఏకాంతంగా అతనున్న ఇంట్లో గడపాలని లేదు నాకు.

**మా తెలుగు లెక్చరర్ చెప్పేవారు. రాధ కృష్ణుని సమక్షంలోనూ, పరోక్షంగానూ అంతే ఆనందంగా ఉండేది. ఇదేమని ఓ రోజు కృష్ణుడు అడిగితే "కృష్ణా.. నువు కనిపించినప్పుడు నా ఎదుటి మాత్రమే ఉంటావు. కనిపించనప్పుడు నా అణువణువునా ఉంటావు. ఒకటి నేత్రాలతో చూసి మనసులో దాచుకోవడం, రెండవది మనసుతో చూసి కనులలో నింపుకోవడం. తేడా ఏమీలేదు" అందిట.**

నాకంతటి గొప్పపోలిక లేకున్నా ఏ రోజైతే అతన్ని కళ్ళతో కాక మనసుతో కూడా అంత బాగా చూడగలనో ఆరోజు మీ ఇంటినుండి వెళ్ళిపోతాను. అతను మరెవరినైనా ప్రేమించినా, పెళ్ళాడినా బాధపడని స్థితికి చేరుకోవాలంటే ప్రయత్నం మట్టుకు చేస్తున్నాను. ఫాక్టరీలో ఇప్పుడు సీజన్ వర్క్ నడుస్తోంది. అందుకని ఈ మూడురోజులూ నేనక్కడే ఉంటాను. హోటల్ భోజనం. నా రెస్ట్ రూంలో నిద్ర. ఏర్పాట్లన్నీ చేసుకునే వచ్చాను.

సిరి"

ఉత్తరం చదివిన రామారావు ఆమెగదిలోకి వెళ్ళాడు. అక్కడ లంచ్ బాక్స్ కనిపించింది. ఆమె టిఫిన్ కూడా చేయకుండా వెళ్ళిందని గ్రహించాడు. కళ్ళు మూసుకుని సోఫాలో కూర్చుండిపోయాడు.

అదేరోజు రాత్రి ఏడవుతుండగా క్లర్క్‌ని పిలిచి అడిగింది సిరి. "హోటల్‌నుండి భోజనం తెప్పించమన్నాను. ఆ ఏర్పాట్లు చేశారా?" అని.

"యస్ మాడమ్. మరో అరగంటలో రావచ్చు"

"సరే నేనలా రౌండ్స్‌కి వెళ్ళి వస్తాను. డిజైన్ వర్క్ షాపులో నన్ను కలవమని మేనేజర్‌కి చెప్పండి" అంటూ బైలుదేరింది. రౌండ్స్ ముగించుకుని ఆమె వచ్చేసరికి క్లర్క్ ఎదురుచూస్తూ నిల్చున్నాడు. ఆమెని చూడగానే "మేడం! మీకోసం మీ బంధువుల అబ్బాయిలు ఎదురుచూస్తున్నారు. అతను వచ్చి చాలాసేపయింది. శేట్ ఆఫీసులో కూర్చుని ఉన్నారు" అన్నాడు.

సిరి చేతిలోని ఫైల్స్ అతనికిచ్చి గబగబ గేట్ ఆఫీస్‌కి వచ్చింది. సిరియాళ్ కనిపించాడు. "భయ్యా మిమ్మల్ని పిల్చుకురమ్మన్నాడు" అన్నాడు. వెళ్ళాలా వద్దా అని కొద్దిసేపు ఆలోచనలో పడింది. "మీరు ఆలోచించవద్దు. దయచేసి త్వరగా రండి" అన్నాడు.

"సరే వస్తున్నాను" అంటూ వెళ్ళి పదినిముషాలలో వచ్చింది. వీళ్ళ బండి అలా రోడ్డు ఎక్కిందో లేదో రామారావ్ బైక్ మీద ఎదురొస్తూ కనిపించాడు. వీళ్ళని చూసి తన బండిని వెనక్కి తిప్పాడు.

ఆమె ఇల్లు చేరేసరికి ఇంటినిండా జనం. అంతా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. సిరిని చూసి అంది దివ్య "ఏం తల్లీ ఇంతలేటు? ఎంతసేపు బ్రతిమాలించుకున్నావేంటి?" అని.

"తప్పు ఆమెదికాదు. నోట్లో నాలుకలేని వాణ్ణి సారధిగా పంపిన వాళ్ళది" అంది మేఘ, కోపంగా చూశాడు సిరియాళ్. హోటల్ నుండీ అందరికీ భోజనం వచ్చేసింది అని త్రేన్చుతూ  అంతా హాల్లో చేరారు. రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకు కబుర్లు.

అంతలో ఎక్కడినుండో వచ్చిన అంబరీష్ అన్నాడు "సిరియాళ్ జీ!"

"జీ" సిరియాళ్ జవాబు

"వలపు" అంటే?"

"ఓరి వెధవాయ్! ఈ మాట ఎక్కడ నేర్చుకున్నావ్"

"టీవీలో విని"

"ఏంటీ?"

"ఔను. ఆ గదిలోకి వెళ్ళి టీవీ పెట్టుకున్నాను. సినిమా వచ్చింది. అందులో ఓ అమ్మాయి అబ్బాయిలో పదహారుసార్లు అందీమాట వలపు అంటే"

"వలపు అంటే ఏంలేదు. మానవులు తనకు ఇష్టమైన వారిపై విసిరే పూవుల వల."

"గుడ్ బాగా చెప్పావ్. ఇలా చెప్పగలగడం కేవలం మగాళ్ళకి మాత్రమే సాధ్యం. ఆడాళ్ళకి చేతవదు. ఎందుకంటే ఆడవాళ్ళకి తెలివితేటలు తక్కువగా ఉండి, తమ తెలివి తేటల్ని గురించిన అంచనాలు ఎక్కువగా ఉంటాయి" అన్నాడు శివ.

"మగవాళ్ళకి తెలివితేటలు మితంగా ఉండి, తమ తెలివి తక్కువ తనాన్ని కప్పుకునే అతి తెలివి ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆడవాళ్ళు చెప్పిన ఆణిముత్యాలవంటి మాటలు బైటికి రానీరు" అంది దివ్య. ఆ మూడురోజులూ అంతా రామారావు ఇంట్లోనే ఆనందంగా గడిపారు.

కాలచక్రంలో రోజులు నెలలు గడుస్తున్నాయి. తాతగారు యాత్రల నుండి రావడం, జయ హాస్పిటల్ నుండి వచ్చి బాగా కోలుకోవడం జరిగిపోయాయి. ఆ రోజు జయ మధ్యాహ్నం కునుకు తీస్తుండగా రామారావు ఫోన్ చేశాడు. "అమ్మా! నా స్నేహితురాలు ఒకమ్మాయిని మనింటికి తీసుకువస్తున్నాను. తనకి మేడమీది గదికాని, క్రింద ఓ గది కానీ ఇవ్వు. తను మనకి అద్దె ఇవ్వద్దు. అలాగని పేయింగ్ గెస్ట్ కాదు. తన మట్టుకు వంట చేసుకుంటుంది. లేదా హోటల్ నుండి తెప్పించుకుంటుంది. ఆమెకి కలిగిన ఆపద తొలిగిపోతే త్వరలో వెళ్ళిపోతుంది. లేదంటే తనకి మనఃస్థిమ్మితం కలిగే వరకు వుండి.." రామారావు కంఠం వణికి బొంగురుపోయి ఆగిపోయింది. ఫోన్ పెట్టేశాడు.

జయ మేడమీది గదిలో సామాను తీయించి పనమ్మాయితో గది సర్దించి ఉంచింది. సాయంత్రం ఆరవుతుండగా రెండు ఆటోలు వచ్చాయి. ఒక దాన్లో నుండి రామారావు కొద్దిపాటి సామానుతో దిగాడు. మరో ఆటోలో నుంది దిగిందామె. ఆమె చాలా పొడగరి. లావుగా కూడా ఉంది. తెల్లగా చితికిపోయిన సంసారం కలిగిన గొప్పింటి కోడలులా ఉంది.

"రా! మంజూ" అన్నాడు. ఇంట్లోకి దారితీశాడు రామారావు.

జయగుమ్మంలో ఎదురై "రండి" అంది.

"అమ్మా నా అంచనా ప్రకారం నువ్వు మన గ్యాంగ్‌నంతా పిలిచి ఉండాలే? ఏరీ వాళ్ళంతా!" అడిగాడు రామారావు.

"ఎదుటి వారి అంచనాలు తలక్రిందులు చేయడం నీకే కాదు. నాక్కూడా వచ్చునని నీకు తెలుపడానికే నేనెవర్నీ పిలవలేదు. ఎవరికీ చెప్పలేదు" అంది జయ నవ్వుతూ..

అది రామారావు మనసుని ఎక్కడో తాకింది. "తాతయ్యకి కూడా?" అన్నాడు.

"ఆс" అందామె.

"సరే మనవాళ్ళందరినీ పిలిపించు. మంజుకి పరిచయం చేయాలి"" అన్నాడు.

"అమ్మా ఈమె మంజు. మంజూ మా అమ్మ" పరిచయాలు అయ్యాక మళ్ళీ చెప్పాడు "అమ్మా మేమిద్దరం కలిసి ఈ సామాను సర్దేస్తాం. నువ్వీలోగా మనవాళ్ళందర్నీ పిలిపించు" అని. ముందు, రామారావు గదిలో సా మాను సర్ది క్రిందకి వచ్చేసరికి జనాలంతా వచ్చి ఎదురు చూస్తున్నారు. మంజుకి పేరు పేరున అందరినీ పరిచయం చేసిన రామారావు సిరికి ఫాక్టరీలో పని ఎక్కువగా ఉంది కనక తనురాదనీ ఆమె వచ్చేలోగా పరిచయాలు జరగాలనీ గబగబా చెపుతున్నాడు. "ఇతను అంబరీష్. సిరియాళ్ తమ్ముడు" అంటూ చివరి పరిచయం చేస్తూ మెట్లెక్కి ఇంట్లోకి వస్తున్న సిరిని చూశాడు.

"అరే అవసరమైన కాగితం ఒకటి మరిచాను ఇప్పుడే వస్తాను" అంటూ గబగబా మేడమీదకి వెళ్ళాడు. ఈలోగా సిరి వచ్చేసింది. అపుడు తాతగారు అన్నారు. "అమ్మా మంజూ ఇందాక మా అందరినీ పరిచయం చేసి ఈమె వంతు వచ్చేసరికి ఏదో మరిచానని వెళ్ళాడే అదేంటో తెలుసా? వాడి మనస్సు. అది ఎక్కడ దాచాడో మాకు తెలీదు. కానీ మా అందరి మనసులు దోచుకున్న ఈమె సిరి. భగవంతుడు అనుగ్రహిస్తే ఈ ఇంటికి కోడలు అవుతుంది. విధి వికటిస్తే మాకు అందని ద్రాక్షావుతుంది. సిరీ! ఈమె మంజు. రామారావు స్నేహితురాలు" అంటూ పరిచయం చేశాడు.

"నమస్తే" అంది సిరి. ఆమె ముఖంలో ఎక్కడా అప్రసన్నత ఛాయలు లేవు. నిండుగా నవ్వుతూ అంది. ఓరగా చూస్తూ మెట్లు దిగి వచ్చాడు రామారావు.

●●●

మంజు ఆ ఇంటి పరిస్థితులని అర్థం చేసుకుంది. వాళ్ళ స్నేహాలు, బంధుత్వాలు, సరదాలు సంతోషాలు, మాటలు అన్నీ అర్థమైనాయి ఆమెకి. ఆమె తెలివైనది. మంచి వాక్చమత్కారి కూడా. ఏ విషయం మీదైనా సున్నితమైన చతురోక్తులాడుతుంది.

ముఖ్యంగా రాజకీయం, సినీరంగం మీద ఆమె విసుర్లు జోరుగా ఉండేవి. ఓసారి విభీషణ అన్నాడు. "మీరు అచ్చులో మంజు. హల్లుల్లో చతురోక్తుల విందు" అని.

"అబ్బా! అరవకండర్రా! మంచిదేవుళ్ళ సినిమా వస్తుంటేనూ?" అంది శివవాళ్ళ నానమ్మ.

"పౌరాణిక సినిమాల్లో ఓ చిత్రం ఉంటుంది తెలుసా?" అంది మంజు.

"మీరు చెప్పకుండా ఎలా తెలుస్తుంది అంది దివ్య.

"ఇందులో ఏ దేవుడి పేర సినిమా తీస్తారో ఆ దేవుడిని హీరోని చేసి, మిగిలిన దేవుళ్ళని జోకర్లలో చూపుతారు" అంది.

అంతా నవ్వారు.

జయ వచ్చి మరో ఛానల్ మార్చి అంది" ఈమె మంచి నటి. ఈమె సినిమాలు ఎన్నో చుశాను. నాకు చాలా నచ్చుతుంది" అని.

"గొప్పనటి అంటే నాకస్సలు పడదు" అంది మంజు.

"మరి?" జనాల ప్రశ్న.

"ఏముంది గొప్ప నటి అనే పేరు రాగానే నటన మీద దృష్టి పెట్టి గ్లామరుని గాలికి వదిలేస్తారు. అలా వదిలిన గాలంతా శరీరంలో నిండిపోయి ఊరిపోతారు. నటన ఎంత గొప్పగా ఉన్నా భారీగా పెరిగి, అడ్డంగా ఊరిన హీరోయిన్ని ఏం చూస్తాం? పాతకాలంలో అయితే హీరోయిన్లు తక్కువగా ఉండేవారు కనుక తప్పేదికాదు. ఇప్పుడలా కాదు. ప్రపంచ సుందరీ మణులంతా మన ప్రాంగణంలోనే ఉంటున్నారు. ఇప్పుడు కూడా మహానటి పేరుతో ఓవరాక్షన్ చేసుంటే ఏం చూడగలం?"

విభీషణ అన్నాడు "మన సినిమాల్లో నాకు నచ్చనిది ఒక్కటే హీరో వేసే పిచ్చి పిచ్చి మారువేషాలు విలన్ ఎందుకు గుర్తించడు. పైగా ఆ విలన్ వెధవలు పెద్ద గ్యాంగ్ లీడర్లు. అంతర్జాతీయ అపరాధ ముఠాలు. పిన్ను నుండి పలుగు వరకు స్మగ్లింగ్ చేసే ఏబ్రాసులూ ఉంటారు. కానీ హీరోని గుర్తుపట్టరు. మరి ప్రేక్షకులు గుర్తుపడతారు కదా!"

"అదా విలన్ గుర్తుపట్టకుండా ఉండటానికి నిర్మాత అతనికి లక్షల్లో డబ్బు ఇస్తాడు. మనక్కూడా ఎవరైనా అలాగే ఇస్తే మనమూ గుర్తుపట్టం" అన్నాడు సిరియాళ్.

విభీషణ అన్నాడు. "గొప్పగా చెప్పారు. అచ్చుల్లో మీరు సిరియాళ్. హల్లుల్లో ముఖ్మల్. గొప్పదనపు అనుభూతినిస్తారు కానీ గొప్పగా కనిపించరు."

రోజులు గడుస్తున్నాయి. రామారావు మంజుని నువ్వూ అనడం, ఏ పనిచాలన్నా చేసిపెట్టడం, తరచుగా వాళ్ళిద్దరూ బైటికి వెళ్ళడం అందరికీ అనుమానాన్ని కలిగించింది. ఓరోజు పెట్టీ, బెడ్డింగ్ సర్దుకుని ఎద్దరూ ఎక్కడికో వెళ్ళారు. వెళ్ళి ఐదు రోజులయింది.

"సందేహం లేదు. బావ మంజుని పెళ్ళాడి తీసుకు వస్తాడు. సిరీ నువ్విక్కడుండి లాభం లేదు. ఆ మొండి గుండెలో ప్రేమ లేదు. నువ్వెళ్ళిపో" అంది కన్నీళ్ళతో.

"అతనికి నామీద ప్రేమలేకపోవచ్చు. కానీ అంజుని పెళ్ళాడ్డానికి మాత్రం వెళ్ళి ఉండడు. ఆమె ఏదో తీరని ఆపదలో ఉంది బహుశా ఆ ఆపద తొలిగించే ప్రయత్నంలో కూడా వాళ్ళు వెళ్ళే అవకాశం ఉంది. పైగా రామారావు తెలివైనవాడు. ఒక్క దెబ్బకి రెండు పిట్టలు. ఒకటి మంజుని కాపాడ్డం. రెండు అనుమానంతో గనక నేనుంటే నేను మా ఇంటికి పారిపోవడం. నేను ఓ రకంగా ఇది పరీక్షించడమే అని నా భావన."

"ఒకవేళ నువ్వది నమ్మి పారిపోతే?"

"అతనిక్కావల్సింది అదే. నన్ను పారదోలితే అతను తనని తాను ప్రపంచ విజేతగా మనసులో భావిస్తాడు. ఎందుకంటే నేనింత తేలిగ్గా వెళ్ళనని అతనికి తెలుసు. అతనిలో నీతీ నిజాయితీ గురించి నాకు తెలుసు. మా ఇద్దరిలో ఏ ఒక్కరం మా స్వభావ విరుద్ధంగా నడిచినా రామారావు ఇక పెళ్ళిమాట ఎత్తడూ. ఎవరినీ పెళ్ళాడడు. ఇది మీరంతా తెలుసుకోవాలి" అంది సిరి పకపకా నవ్వుతూ.

అప్పుడే మంజూ రామారావు ఇంట్లోకి వచ్చారు. వీళ్ళ మాటలు వింటూ ఇంట్లోకి వచ్చారు కానీ ఏమీ విననట్టే ఊరుకున్నారు. వాళ్ళు ఎక్కడికి వెళ్ళామనిగానీ, ఎందుకు వెళ్ళామనిగానీ ఏమీ చెప్పలేదు.

తరువాత వారం రోజులకి ఓ అర్ధరాత్రి ఏదో చిరు శబ్దం వినిపించి సిరికి మెలుకువ వచ్చింది. ఎవరో ఏడుస్తున్న ధ్వని. గది బైటికి వచ్చింది. పెద్దగా ఉన్న ఆ హాల్ చివర మెట్లున్నాయి. క్రింది మెట్టుమీద కూర్చుని మంజు తలని ఒళ్ళో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమెకి కొద్ది దూరంలో కూర్చుని ఉన్నాడు రామారావు.

"నేను అన్యాయమై పోయాను. నా బ్రతుకు తెల్లారబోతోంది. రామారావ్ నన్ను చంపేయ్. నాకు విషం ఇచ్చేయ్!" అంటూ పెద్దగా రోదిస్తోంది.

"మంజూ ఊరుకో ఏడవకు" అంటున్నాడు రామారావు. అంతలో అక్కడికి చేరుకుంది సిరి. ఆమె రాకని ఇద్దరూ గమనించలేదు. "ఎన్నో ఆశల్తో నీ దగ్గరకి వచ్చాను. నా ఆశలన్నీ ఆవిరైపోయాయి. నా బ్రతుకు అధోగతి పాలయింది. ఇంకా ఇంకా నేనెందుకు బ్రతకాలి. నేను చచ్చిపోతాను. రామారావ్ నే చచ్చిపోతాను" అంది.

అంతలో సిరిని చూసి "సిరీ" అంటూ రోదిస్తూ ఆమె ఒడిలో తల ఉంచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. అప్పటికి అందరికీ మెలుకువ వచ్చి అక్కడికి చేరుకున్నారు. వచ్చిన ముగ్గురూ రామారావు వంక అసహ్యంగా చూస్తున్నారు. తనపై ఎలాంటి అపార్థాలు కలిగాయో అర్థమయింది రామారావుకి. కానీ అవేవీ పట్టించుకునే స్థితిలో లేడతను. లేచి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"నేను.. నేను. ఈ రోజు నీ గదిలో పడుకోనా?" అంది మంజు.

"తప్పకుండాను. రండి" అంటూ ఆమెని నడిపించుకుని తన గదిలోకి తీసుకువెళ్ళింది.

సిరి గదిలోకి వెళ్ళి ఆమె మంచం మీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది మంజు.

"మీ సమస్య ఏంటో నాకు తెలీదు. అందుకే ఎలా ఓదార్చాలో తెలీడం లేదు. దయచేసి ఊరుకోండి అని మాత్రం చెప్పగలను. లేదా నేను మీకు ఏరకంగానైనా సహాయపడగలనో చెప్పండి. దుఃఖం అన్ని సమస్యలకి పరిష్కారం కాదు. దయచేసి మీరు దుఃఖించవద్దు. మీ దుఃఖం మీకు ఆత్మీయులు ఎక్కడైనా ఉంటే వారిని కష్టాల్లోకి నెడుతుంది. దయచేసి భగవన్నామం చేస్తూ గడిపెయ్యండి" అంది సిరి. మంజు దుఃఖం మానింది. ఆమె ఏదో భగవన్నామం చేస్తూ అలాగే నిద్రలోకి జారుకుంది. ఆ తెల్లవారాక అపరిచితులైన ఇద్దరు వ్యక్తులు వచ్చారు.

"మీరేనా మంజు?" అడిగారు.

"అవును" అందామె.

"మీతో మాట్లాడాలి. అలా బైటికి వెల్దాం రండి" అన్నాడొకతను.

ఈలోగా రామారావు కూడా వచ్చాడు. "పదండి" అన్నాడు.

"మేం మాట్లాడవలసింది ఆమెతో" అన్నారు వాళ్ళు.

"అతన్ని రానిస్తేనే నేను వస్తాను" అంది మంజు.

"సరే రండి" అన్నారు. నలుగురూ కలిసి వెళ్ళారు. అలా వెళ్ళి వాళ్ళు మూడురోజులదాకా తిరిగిరాలేదు. నాలుగోనాడు ఉదయం ఆటోలో నుండి దిగిన మంజు గబగబా పరుగెత్తుకుంటూ ఇంట్లోకి వచ్చింది. తాతగారు పూజ ముగించి అపుడే బైటికి వచ్చారు. మంజు వచ్చి ఆయన కాళ్ళకి నమస్కరించింది.

'తాతయ్యగారు నన్ను ఆశీర్వదించండి. మీ చల్లని చేతులతో కట్టిన ఇంట్లో నాకు శుభం జరిగింది. నా భర్త విడుదలవుతున్నారు. ఆయనకి మరణ శిక్ష తప్పింది" అంది ఏడుస్తూ.

"లేమ్మాలే ఏంటి? నీ భర్తకి మరణశిక్షా?"

"ఔను. ఉరికంబం ఎక్కవలసిన నా భర్త విడుదులవుతున్నారు. మరికొద్దిసేపట్లో రామారావు నా భర్తని తీసుకు వస్తాడు" ఆమె అలా అంటూండగానే రామారావు, మంజు భర్త త్యాగరాజు వచ్చేశారు. భర్తని చూసి అటుగా వెళ్ళిన మంజు రామారావు కాళ్ళమీద పడిపోయి "రామారావ్! ఇంతకన్నా కృతజ్ఞతలు ఎలా చెప్పాలో నాకు తెలీడం లేదు" అంటూ నమస్కారం చేసింది.

"ఛీ! ఏమిటిది మంజూ లే" అన్నాడు రామారావు కంగారు పడుతూ.

"నువ్వు నాకన్నా వయసులో మూడేళ్ళు చిన్నవాడివి. కానీ పెద్దమనసుతో నన్ను మావారినీ ఆశీర్వదించు" ఆమె మాటనగానే ప్రక్కనే ఉన్న త్యాగరాజు భార్యని అనుకరించాడు.

"ఔను. మీరు మమ్మల్నిద్దర్నీ ఆశీర్వదించండి" అన్నాడు కన్నీళ్ళతో.

"నా శవాన్ని తేవాల్సింది. సజీవంగా నన్ను తెచ్చారు" అన్నాడు.

మొదటిసారిగా రామారావు కళ్ళల్లో నీళ్ళు. అతని రెండు కళ్ళనుండి జారి ఆ జంటపైపడినాయి. అవి ఆశీస్సులుగానూ, అభినందనలుగానూ తోచాయి ఆ జంటకి.

●●●

**"పేదింటి పిల్లనైనా వాళ్ళబ్బాయికి** తగిన ఒడ్డూ, పొడుపూ చూసి నన్ను కోరి కోడలిగా తెచ్చుకున్నారు మా మామగారు. ఆయనతో సమంగా నేనూ శ్రమించాను. వేలలో ఉన్న వ్యాపార లాభాలని లక్షల్లో చేశాం. రమణారావ్ మావ్యాపార ప్రత్యర్థి. మమ్మల్ని ఏ రకంగానూ దెబ్బతీయలేకపోయాడు.

వాడి కొడుకుని మా మీదకి ఉసికొలిపాడు. మా వారి చెల్లెలు, పిల్లలు లేని నాకు కూతురు వంటిదీ అయిన రమమీద వాడు అత్యాచారం జరిపాడు. వాణ్ణి కోర్ట్ కీడ్చాను. నేరం ఒప్పుకుని దాన్ని పెళ్ళాడతానన్నాడు. ఆయన ఒప్పుకున్నా నే ఒప్పుకోలేదు. వాళ్ళ దగ్గర ఉన్న డబ్బంతా ఖర్చయ్యేదాకా కోర్ట్ చుట్టూ తిప్పీ తిప్పీ నాక్కావలసిన తీర్పురాబట్టాను.

ఫలితంగా వాడు పెళ్ళి చేసుకోరాదనీ, ఏ స్త్రీలతోనూ అక్రమ సంబంధం పెట్టుకోరాదనీ, పశువులా ప్రవర్తించిన వాడు అలా ఉండిపోవాలని విప్లవాత్మకమైన తీర్పు నిచ్చింది కోర్ట్. కాదు. డబ్బుని నీళ్ళలా ఖర్చు చేసి ఇప్పించాను. అతన్ని నిఘా వేసి ఉంచే బాధ్యత కూడా చట్ట బద్ధంగా నేనే తీసుకున్నాను.

అందుకు వాడి తండ్రి కక్షకట్టి తన బంధువుని తానే చంపుకుని ఆ హత్యా నేరాన్ని మావారిపై మోపి మరణ శిక్ష వేయించాడు. హుసేన్‌సాగర్‌లో దూకబోయిన నన్ను ఈ రామారావు రక్షించాడు. ధైర్యం చెప్పాడు. స్కూల్లో చదివేప్పుడు నాకన్నా మూడేళ్ళు జూనియర్. గుర్తుపట్టాడు. ఇంటికి తీసుకు వచ్చాడు. రాష్ట్రపతికి క్షమాభిక్ష పెట్టమని అర్జీ పెట్టించాడు.

ఈ రాష్ట్రపతిగారిది మా ఊరే. మా ఊరి ఎం.పీగా గెలుపొంది మీటింగ్ ఇస్తుండగానే వెళ్ళి ఆయన్ని బలంగా క్రిందకి లాక్కువచ్చాను. అంతా మా వెనక క్రిందికి వచ్చారు అంతే స్టేజ్ మీద బాంబు పేలింది. ఆ విషయం ఇద్దరు మాట్లాడుకుంటూ ఉంటే విన్నాను. అప్పటికి నేను చిన్నపిల్లని.

"అమ్మా! జీవితంలో ఏనాడు నా సాయం కావాలన్నా చేస్తాను. ఇది నా వరం అనుకో. వాగ్దానం అనుకో" అన్నారు. అది గతం రామారావు నేనూ కలిసి ఢిల్లీ వెళ్ళాం. రాష్ట్రపతి విదేశీ పర్యటనలో ఉన్నారు. నా ఫోటో, మావారి కేసుకి సంబంధించిన వివరాలు అన్నీ వివరించి రాసి కవర్లో ఉంచి అక్కడ ఉంచి వచ్చాం. అదే మీరంతా అపార్థం చేసుకున్న ఆ ఐదురోజుల క్యాంప్.

ఏవో కారణాలవల్ల ఆయన ప్రయాణం, పర్యటన రద్దైపోయి వెనక్కి వచ్చారుట. అపుడు నా ఉత్తరం చదివి వెంటనే స్పెషల్ ఆఫీసర్ని నియమించి నా భర్త కేసుకి సంబందించిన పూర్వపరాలు తెలుసుకు రమ్మన్నారు.

అంతే! నే వ్రాసిన వివరాల్లో అబద్ధాలు లేవని ఆయనకి తెలిసిపోయింది. అందుకే మొన్న నన్ను కలిసి మాట్లాడ్డానికి వచ్చారు. నేనూ రామారావు వెళ్ళాం. మమ్మల్ని రెండురోజుల పాటు ప్రశ్నించి, రాష్ట్రపతికి నివేదిక పంపించారు. అంతే మా వారు నిర్దోషిగా విడుదలయ్యారు." చెప్పింది మంజు.

"ముందు అత్తగారూ, మామగారూ, మరదలు వాళ్ళూ ఏరి?"

"అత్తగారూ, మామగారూ పోయారు. మరదలు అడవిలో ఓ కోయ ముసలమ్మ దగ్గర ఉంటోంది"

"మరి మీ ఆస్తిపాస్తులు..?"

"అవి బలవంతంగా ఆక్రమించబడినాయి. రాష్ట్రపతిచే నియమించబడిన ఆఫీసరు చాలా మంచివారు. ఆయన ఏం చేశారో తెలీదు. మళ్ళీ మా ఆస్తిపాస్తులు మాకు వచ్చాయి. మా జోలికింక రాకుండా రమణారావుని మూడుకేసుల్లో ఇరికించారు ఆఫీసరు. వాటినుండి అతను విడుదలయ్యేసరికి ఇరవై ఏళ్ళు పడుతుందని ఆయనే నవ్వుతూ మాతో చెప్పారు"

"మరి మీ మరదలు. భవిష్యత్ ఏమిటి?"

"కడుపులో ఉన్న బిడ్డని తొలిగించుకుంటే విదేశాల్లో ఉన్న నా తమ్ముడు ఆమెని పెళ్ళాడతానన్నాడు. కాని రమకి పిల్లలంటే తనకి ప్రాణం. చిన్నప్పటినుండి ఇరుగు, పొరుగు పిల్లల్ని తెచ్చి వాళ్ళకి అన్ని సపర్యలు చేసేది. పాపతో పాటుగా ఆమెని స్వీకరించేవారెవరైనా ఉంటే ఆమెకి పెళ్ళి. లేదంటే అంతే.

ఇపుడు కొస మెరుపు ఏమంటే ఈ వీధి చివరన మేడ అమ్మకానికి పెట్టారు. మేం అది కొనుక్కుని ఇక్కడికి వచ్చేస్తాం. రామారావు వంటి మంచి మిత్రుడిని మీ వంటి మంచి ఆత్మీయుల్ని విడిచి మేం అక్కడ ఏం చేస్తాం? మాది కూడా సిటీ. కానీ మాకిక్కడే బాగుంది.

ఈ కుట్రలూ, కుతంత్రాల వల్ల మేం సాధించింది ఏముంది? ఏదైనా చిన్న వ్యాపారం చేస్తూ ఇక్కడ ఉండిపోదల్చుకున్నాం" మంజు మాటలకి అంతా సంతోషించారు.

●●●

రామారావు వాళ్ళ వీధి చివరున్న ఇల్లు రిటైర్డ్ ఇంజినీరుది. చాలా కళాత్మకంగా కట్టుకున్నాడు ఇల్లుని. ఐతే భార్యా, భర్తలు నెలల తేడాతో పోయారు. విదేశాల్లో ఉన్న వారి తనయులు ఇంటిని బేరానికి పెట్టారు. మంజు ఆ ఇల్లు కొనుక్కుంది. చిన్న ఫార్మసి.ఎండ్.ఎఫ్ కొనుక్కునేందుకు బేరాలు మొదలుపెట్టారు కూడా.

ఆ రోజు గృహప్రవేశం. "రావల్సిన వారు మాకు పెద్దగా లేరు. అందుకని అందరం ఒకేసారి భోజనాలకి కూర్చుందాం" అంది మంజు. వాళ్ళ వంటావిడ అందరికీ వడ్డించుతానంది. మీరూ వెళ్ళండి వంటకాలన్నీ మధ్యలో ఉంచి, చుట్టూ విస్తళ్ళు వేసి మొదటి వడ్డన చేసి వెళ్ళండి" అంది మంజు. వంటావిడ అలాగే వడ్డించి వెళ్ళింది. భోజనానికి ఉపక్రమించే ముందు అన్నాడు రామారావు.

"ఈ కొత్త ఇంట్లో మనందరి కోరికల చిట్టా విప్పుకుందాం. మన మనసులో ఉన్న బలమైన కోరికలు చెప్పుకుందాం. సరదాగా ఉంటుంది" అని.

మేఘ అంది. అక్కర్లేదు. "మా అందరితో చెప్పించి నువ్వు మాత్రం ఏమీ చెప్పవు. ఒద్దు" అని.

"లేదులే మహా తల్లీ! చివరగా నేను చెబుతాను. రామారావు ఒప్పుకున్నాడు. "ఆ! మరో రూల్. అందరికీ తెలిసిన కోరికలు కోరుకోకూడదు. అది మరో రూల్" అన్నాడు.

"అంటే?"

"ఇపుడు నువ్వున్నావు. నీ కలల రాకుమారుడితో పెళ్ళవ్వాలని కోరుకోకూడదన్న మాట. అది అందరికీ తెలిసిన విషయమేగా?" అన్నాడు.

"సరే" అన్నారు.

బామ్మ(శివ)గారితో మొదలైంది.

"నా కెన్నాళ్ళనుండో నా కోడలు ఇక్కడికి రావాలని ఆశగా ఉంది. ఆమె రావాలని నా కోరిక" అంది.

"నాకు మనవడు కావాలి" శివవాళ్ళ నాన్న.

"మా వాళ్ళిద్దరూ ఒకరిమీద ఒకరు విసుర్లు విసురుకోని రోజు చూడాలి" శివవాళ్ళ అమ్మగారు.

"నే పుట్టిన ఊరు రాముల పల్లిని చూడాలని ఉంది" అన్నారు తాతగారు.

"మా ఆవిణ్ణి తోసుకుని ఊటీ వెళ్ళాలనుంది" అన్నాడు సూర్యం.

"మా ఆయనకి గవర్నమెంట్ డాక్టర్‌గా ఉద్యోగం రావాలి" అంది దివ్య.

"మా ఆవిడకేమో లైబ్రేరియన్ ఉద్యోగం రావాలి" అంది దివ్య.

"నా కొడుక్కి పెళ్ళికావాలి. ఏడాదిలోగానే బుల్లి పాపాయి (అమ్మాయినే) ఎత్తుకోవాలి" జయ.

"మా ఆవిడకేమో లైబ్రేరియన్ ఉద్యోగం రావాలి. అక్కడికే వెళ్ళి ఆమెకే వినిపించేట్టు 'నోరు మాత్రమే పనిచేసే ఆడాళ్ళకి నోరుమూసుకునే ఉద్యోగాన్నిచ్చిన దేవుడు గ్రేట్ అనాలి'" అన్నాడు.

దివ్య వెంటనే "నోరు లేదనుకునే మగాళ్ళు బుఱ్ఱ కూడా లేదనుకుని సోమరులుగా మారారుట" అంది. అంతా పకపకా నవ్వారు.

"ఐశ్వర్య రాయ్ వంటి అమ్మాయ్ రోజూ కల్లోకి రావాలని నా కోరిక" అన్నాడు విభీషణం.

"మా అమ్మమ్మ సుబ్బాయమ్మ పరుగుల పందెంలో ఫస్టొస్తే చూడాలనుంది" అంది మేఘ.

"చంద్రశేఖర్‌గారు నన్ను ఆస్ట్రేలియా పంపుతానన్నారు. అది రేపే కావాలి" సిరియాళ్.

"మా వంట మనిషి వంట చెత్తగా ఉంటోంది. పదిరోజుల పాటు ఆమెకి మంచి వంట చేసే బుద్ధి కావాలి" అన్నాడు అంబరీష్.

"నా కూతురు. అదే .. మరదలు బ్రతుక్కి ఓ దారి చూపాలి దేవుడు" అంది.

"మా నాన్న ఆరోగ్యంగా ఉంటే చాలు" అంది నిదానంగా సిరి.

"బావా! ఇపుడు నీ వంతు" అంది మేఘ.

"వస్తున్నాను. అదే విషయానికి వస్తున్నాను. మా తాతయ్యని విడిచి ఉండగలనా లేదా అని చిన్నప్పటి నుండి నాకో సందేహం. అది తీర్చుకోవడానికి ఆఫీసరు వేసిన ఆరునెల్ల టూర్‌కి ఒప్పుకున్నాను. విశాఖ జిల్లాలోని ఓ పల్లెలో క్యాంప్. నే భోజనం చేసి తీరిగ్గా వెళ్ళేసరికి రైలు వెళ్ళిపోతుంది. ఈ రోజే ఇప్పుడే బైలుదేరాలి. ఏరోజూ ఆలస్యం అవని ఆ రైలు ఈ రోజు ఆలస్యంగా రావాలని నా కోరిక" అన్నాడు రామారావు తలవంచుకుని.

ఎవరి ముఖంలోకైనా చూసి మాట్లాడే ధైర్యం ఇపుడు లేదతనికి. అంతా బిగుసుకుపోయారు. భోజనాలు చేస్తున్నారంతా. కానీ మౌనంగా. రామారావుకిది నచ్చలేదు.

"ఏమిటీ మౌన వైరాగ్యం? అంతా ఏదో అనలికదా? అనండి" అన్నాడు.

ఎవరూ పలకలేదు. "మేఘూ! ఏమైంది నీ తెలుగూ? తెలివీ?" అన్నాడు ఆమెని కవ్విస్తూ.

"దేవుడు ఆ రోజు మీ అందరి మనసుల్లో దూరి సుబ్బాయమ్మని వెళ్ళగొట్టారు. మీ ఇంటివాళ్ళే ఒప్పుకుని ఉంటే ఇంత తెలివైన వాడివైన నిన్ను భరించలేక ఈ మేఘ చిన్ని గుండె ఎప్పుడో ఆగిపోయేది" అంది. ఆమె కళ్ళలో నీళ్ళు.

రామారావు పలుకలేదు ఓ నిముషం. తరువాత అన్నాడు. "మేఘూ! ఎవరికి ఏ ఊరు, ఏ నీళ్ళు, ఏం వ్రాసుందో అది జరుగుతుందని మా తాతయ్య చెప్పాడు. అలా గీతలో ఉందిట" అని. కొద్దిసేపుండి తిరిగి అన్నాడు.

"ఎలాగూ నే వెళ్తున్నాను. నే వెళ్ళాక మీ కందరికీ బోర్ కొట్టకుండ ఓ సమస్యాపూరణం ఇస్తాను. దాంతో కుస్తీ పట్టండి. వినండి. సమస్య ఏంటంటే

"ముష్కరుడా పోకు పోకు ముద్దిచ్చెదరా"

ఇదీ! మేఘూ! విభీషణా మొదటి ఛాన్సుమీదే ఆలోచించండి. నేను మధ్యలో ఓసారి వస్తాను. అప్పుడు చెప్పండి."

"కానీ బావా.."

"నా నిర్ణయానికి తిరుగులేదు. ఈ విషయంలో నేను ఎవరి సలహాలూ తీసుకోలేదు. ప్లీజ్. ఇదికాక మరే విషయమైనా మాట్లాడండి. ఆఁ! మరో విషయం. నా సమస్యని పూరించిన వారి మనస్సులో ఏ కోరిక ఉందో అది నాకు చేతైనంతలో తీర్చే ప్రయత్నం చేస్తాను."

"నీ మాటలు నమ్మేదెవరులే. అప్పుడేదో ఉపాయం ఆలోచించి ఉంచుకుంటావు"

"లేదు మేఘా! ఇది ప్రమాణం. మా తాతయ్య మీద ప్రమాణం. నువ్విప్పుడే ఈ సమస్యా పూరణం చేయి. నా ప్రయాణం ఇంక సుబ్బాయమ్మగారింటికే. నన్ను నమ్ము."

రామారావు మాత్రమే మాట్లాడుతున్నాడు. అంతా మౌనంగా వింటూ అన్నం కెలుకుతున్నారు. మజ్జిగ పోసుకున్నాడు రామారావు. అప్పుడన్నాడు. "సారీ! పంక్తిలో ఎవరూ లేవకుండా నేనొక్కడినే విస్తరి ముందునుండి లేవకూడదు. ఇది అమర్యాదకరం. కానీ నాకు రైలు టైమౌతోంది. కనుక నన్ను క్షమించండి. ఈ రెండు ముద్దలూ తిని నేలేచి వెళతాను. మీరంతా భోజనాలు నిదానంగా చేయండి. వెళ్ళొస్తాను" ఒక ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

అందరి వంకా చూస్తున్నాడు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. ఇది అతను ఊహించిందే చిరునవ్వుతో మరో ముద్ద నోట్లో పెట్టుకున్నాడు. గ్లాసు అందుకున్నాడు. నోట్లోని ముద్ద అలగే ఉంది. గ్లాసు అందుకున్నాడు. మరునిముషాన లేచేసే వాడే

అప్పుడు వినబడింది. మధురమైన పాట.. కాదు మాట.. కాదు పద్యం.

**"శుష్కము తెలియని వాడవు**
**నిష్కామివి నీవు హరివి నిపుణత చేతన్**
**నిష్కపటి వైన వెన్నెల**
**ముష్కరుడా పోకు పోకు ముద్దిచ్చెదరా!"**

పాత సినిమాలో కృష్ణుడు కడకు పంపిన అగ్నిద్యోతనునితో రుక్మిణి పలికిన పి.సుశీల పద్యంలా చక్కని రాగంతో పాడింది. చివరకి పి.లీలలా ఆ..ఆ..ఆ..అంటూ రాగాన్ని కూడా ఆలపించింది సిరి.

అంతే శిలాప్రతిమలా కూర్చుండిపోయాడు రామారావు. చేతిలోని గ్లాసు అలాగే ఉంది. కంచంలో చెయ్యి అలాగే ఉంది. చివరి ముద్ద తాలుకు మెతుకులు గొంతులోనూ, నోట్లోనూ అలాగే ఉన్నాయి. నిలిచిపోయాయి. ఆశ్చర్యంతో ముడిపడిన అతని భృకుటి అలాగే ఉంది.

మాటలు, చేతలు, ఆలోచనలు అన్నీ నిలిచిపోగా పదిమందిలో మొదటిసారిగా ఆమెకేసి చూశాడతను. ఆమె తలవంచుకుంది. అన్నం కలుపుతుంది. ఓ క్షణం ఆమె వంక చూశాడు. గ్లాసు కింద పెట్టాడు. నవనాడులూ కృంగిపోయిన వాడిలా కూర్చుని ఉన్నాడు. అతని బుర్ర ఆలోచనలు మానుకుంది. అతని ఆలోచనలు కదలికను మనుకున్నాయి. అతనిలో కదలిక చేతనని మానుకుంది. ఆ చేతన అచేతనమై ఆగిపోయిందలా.

ఈలోగా అందరి భోజనాలూ పూర్తయి చేతులు కడుక్కుని వచ్చారు. తల వంచుకుని అలా ఉండిపోయిన అతన్ని శివతట్టాడు "పద లేచి చెయ్యి కడుక్కో" అన్నాడు.

రామారావు సరిగా లేచి నిల్చున్నాడు. అతని అడుగులు భారమై కదిలాయి ముందుకు.

అతను చెయ్యి కడుక్కోవనికి అలావెళ్ళగానే విభీషణ మాట వినబడింది. మంచి పద్యాన్ని మీ చాతుర్యంతో అమోఘంగా పూరించారు. అచ్చుల్లో మీరు సిరి. హల్లుల్లో సుగంధ, పరిమళ, సుమనోహరి" అని

"అమ్మాయ్! ఎంగిలి చెయ్యి అయినా పర్లేదు. ఆ చేత్తో ఓ షేక్ హాండిచ్చుకో" మేఘ అంది.

ఆ రాత్రి రామారావు నిద్రపోలేదు. ఏ సమస్యలూ సమస్యగా తోచని రామారవు తనకే తను పెద్ద సమస్యగా తోచాడు. అతని ప్రయాణం కొండెక్కింది. ఆ ప్రయాణాన్ని అంత తేలిగ్గా ఆపగలిగినందుకు ఆమెని అందరూ చాటుగా అభినందించారు. తరువాత వచ్చిన ఆదివారం నాడు అన్నాడు రామారావు. "అమ్మా! మన గ్యాంగ్ కంతా నా మీద కచ్చగా ఉంది. నే లేకుంటే ఏవో మాట్లాడాలనీ ఉంది. అందుకే నేనలా వెళ్ళొస్తాను. ఈలోగా నామీదున్న కచ్చనంతా వెళ్ళగక్కుకోండి" జయతో అన్నాడు.

"నీ మీద మాకెందుకు కచ్చగా ఉండటం?"

"మొన్న గృహప్రవేశం నుండీ చూస్తున్నాను. నే చాటయితే చాలు చెవులు కొరుక్కోవడం, నవ్వుకోవడం గమనిస్తున్నాను. ఈ రోజు ఆదివారం గనక మీకు ఫ్రీ. మరిన్ని కబుర్లు చెప్పుకుని నన్ను ఆడిపోసుకుని సంతసించవచ్చు"

"ఔనూ! ఇంతకీ ఆ రోజు ప్రయాణం ఎందుకు పెటుకున్నట్టు?"

"ఏముంది? నాకున్న సిద్ధాంతాలకీ మనసుకీ సంఘర్షణ ప్రారంభమైంది. అది తట్టుకోలేక పారిపోవాలనుకున్నాను" అంతే. చెప్పి వంటగదినుండి బైటికి నడుస్తున్నాడు. స్నానం చేసి నిన్నటి రోజున తరిగి ఫ్రిజ్‌లో ఉంచిన దొండకాయ ముక్కల బుట్టని తీసుకుని హడావిడిగా వంట గదిలోకి వస్తుంది సిరి.

అంత హడావుడిగానూ వస్తున్న రామారావుని ఆమె చూసుకోలేదు. కొద్దిలో ఇద్దరూ 'ఢీ'కొనేవారే. కానీ సిరి పొట్టకి పట్టుకున్న బుట్ట రామారావు పొట్టని 'ఢీ'కొని క్రిందపడిపోయింది. ముక్కలు చిందరవందరగా చిందాయి క్రిందకి.

గడప కిరువేపులా పడిపోయాయి. విషయం గ్రహించి ప్రక్కకి తప్పుకుంది సిరి. చిందిన ముక్కల వంక ఓసారి చూసి బైటికి నడిచాడు రామారావు. అతను బైటికి వెళ్ళగనే జనాలంతా పోగయ్యారు. రామారవు తిక్క వదిలిందన్నారు. "విదేశాల్లో ఉండి, మంచి చదువు చదివొచ్చిన నువ్వు అంత మంచి పద్యం.. అంత బాగా పూరించడం వింతగా ఉంది" అన్నారు తాతగారు.

"ఫారిన్నుండి వచ్చాక తెలుగు నేర్చుకోవాలని తెలుగు బి.ఏ క్లాసులకి వెళ్ళాను. అపుడు కాస్త నేర్చుకున్నాను. ఐతే రోజూ మధ్యాహ్నం లంచ్ అవర్లో నాకు ఓ గంటసేపు ఖాళీగా ఉంటున్నది అందుకని త్వరగా భోజనం చేసి తెలుగు నేర్చుకుంటున్నాను"

"ఎవరి దగ్గర?"

"ఓ మాష్టారు వస్తారు. ఆయన పండితుడు. మంచి ప్రావీణ్యత గలవారు. "నేనిప్పుడు చెప్పిన పద్యం నా సొంతంగా చెప్పింది కాదు. మా గురువుగారు శ్రీ **బుహ్యావరపు** రామకృష్ణగారి బావగారు చెప్పారు ఒక సభలో" - ఈ పద్యాన్ని గరికిపాటి వారు పూరించారు" - ఈ పద్యం ఫలాన పత్రికలో పూరించబడింది" అంటూ దాని పుట్టుపూర్వోత్తరాలు చెప్పి పద్యం దాని చమత్కారం అన్నీ చెబుతారు" నాకీ ప్రక్రియ నచ్చి నేర్చుకున్నాను.

రామారావుకి ఇక్కడుండటం కష్టంగా ఉందని పారిపోతాడని ఊహించాను. ఎందుకంటే అతని మనసులో సంఘర్షణ ప్రారంభమయింది."

"సంఘర్షణ దేనికి? హాయిగ నిన్ను పెళ్ళాడచ్చు కదా?"

"అలాంటి తేలిక విషయమైతే అతను ఇలా వ్యవహరించడు. నన్ను పెళ్ళాడ్డానికి ఏదో ఇబ్బంది ఉంది. అతనేదో లక్ష్యాన్ని ఎన్నుకుని పెళ్ళి మానుకునే నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. మా నాన్నకీ, అతనికీ నా ప్రేమని మించిన పగలు ఉండవచ్చు. లేదా అతని మనసు ఇదివరకే మరొకరికి ఇచ్చి ఉండవచ్చు. ఇక చివరిది.."

"చెప్పు. ఏంటది?"

"ఏంలేదు"

చెప్పు లేదంటే మాకు అదేంటోనన్న ఆదుర్దా ఉంటుంది.

"రామారావుకి అస్సలు నచ్చి ఉండకపోవచ్చు"

"మరిప్పుడు ఎలా?"

"నే చెప్పిన నాల్గింటిలో మూడు వరకు అతన్ని మెప్పించి ఒప్పించవచ్చు. కానీ మూడోదే నిజమైతే ఆ సృష్టికర్త వచ్చినా అతన్నీపెళ్ళికి ఒప్పించడం కష్టం.."

"ఏంటీ.. ఏంటి? ఆ మూడోది ఏంటన్నావ్?"

"అతని మనసులో ఎవరైనా ఉండడం. అలాంటి పరిస్థితిలో మాత్రం తనకేది నచ్చిందో అలాగే చేస్తాడు కానీ నన్ను అతని దరిదాపులోకి రానీడు."

"సరే పద్యం గురించి చెప్పు"

"నన్ను తప్పించుకోవడానికి తను ఇంటినుండి పారిపోతాడని ఊహించాను. ఐతే తెలివితేటలు ఎక్కువగా ఉన్న ఆ వ్యక్తి వెళ్ళేముందు చిన్న మాయవంటిది చేస్తాడనుకున్నాను. అందుకు అనువైన వాళ్ళు ముగ్గురు. సిరియాళ్, శివ, దివ్య, మేఘ, విభీషణ. వీళ్ళని ఆధారంగా అతని ఎత్తుగడ సాగుతుందనుకున్నాను. బొమ్మలు వేయమని, కవిత చెప్పమని - ఆడాళ్ళిలా మగాళ్ళిలా అని చతురోక్తులాడాలనీ ఓ పందెం వేస్తాడనుకున్నాను.

"హిరణ్యా కశిపుడు "ఏడిరా నీ విష్ణు?" అంటే

"అంతటా ఉన్నాడ"ని ప్రహ్లాదుడు చెప్పగానే విష్ణుమూర్తి గరికపోచనుండి గగనం దాకా అంతా నిండిన ఆయన అప్రమత్తంగా ఉన్నాట్ట. ఆ మేడలో సూది మొన మోసినంత కూడా సందులేక నిండిపోయాడు. చివరకు ప్రహ్లాదునిలోనూ హిరణ్యాకశిపుని శరీర రోమాల్లోనూ కూడా నిండి కూర్చున్నాడు. ఇలా తట్టితే చాలు బైటికి వచ్చేద్దామని. నేలలో, గాలిలో, పూల సువాసనలో కూడా.

అలాగే రామారావు ఏ ఎత్తుగడ వేసినా నే గెలవాలని, దాన్ని అవకాశంగా తీసుకుని అతన్ని ఆపాలని అనుకున్నాను. చిక్కులెక్క ఇవ్వడం, కవిత చెప్పమనడం, పాడాలి అనడం, రాజకీయం, చరిత్ర సినిమాలు, చివరకు హస్త కళల గురించి అడుగుతాడేమోనని మట్టితో బొమ్మల వంటివి కూడా నేర్చాను.

మట్టి ముద్దా, చిన్న చక్రం వంటివి సిద్ధంగా పెరట్లో పెట్టి ఉంచుకున్నాను. కొయ్యబొమ్మలకి కావల్సిన వస్తువులు, కుట్లు, అల్లికలు ఇలా నాకు రాని విద్యలు చాలా నేర్చుకుని రెడీగా ఉన్నాను. ఐతే అతను నాకిష్టమైన పద్యపాద పూరణ ఇవ్వడం ఆ శ్రీవాణి ఆశీస్సులే. విభీషణ నువ్వు తప్ప పద్యం మరెవ్వరూ చెప్పలేరనే అతని అంచనాయే ఆపేసిందతన్ని"

ఊరంతా తిరిగి వచ్చి తోటలో కూర్చున్న రామారావు ఇంటి వెనకాలకి వెళ్ళాడు. అక్కడ అతనికి మట్టీ, చక్రమూ కనిపించాయి. ఆ సమయంలో కరెంటు పోవడాన అతని రాకని గానీ, గమనాన్ని గానీ ఇంట్లోని వాళ్ళెవరూ గమనించలేదు.

●●●

రెండు నెలలు గడిచాయి. ఆ రోజు రాత్రి భోజనాల సమయంలో అన్నాడు రామారావు. "అమ్మా! రేపు మిమ్మల్నందరినీ ఓ చోటుకి తీసుకు వెళతాను. శివ వాళ్ళ కారు కాక మరో కారు కూడా వస్తుంది. అంతా రెడీగా ఉండండి" అని.

"ఇంతకీ ఎక్కడికిరా"

"అది గమ్యం చేరాక తెలుస్తుంది. నే వెళ్ళి శివవాళ్ళకీ, మేఘ వాళ్ళకీ చెప్పి వస్తాను."

"రేయ్ అందరికీ శలవు కావాలంటే.."

''రేపు జాతీయ శలవుదినం'' అంటూ వెళ్ళిపోయాడతను. సిరి ఏదో లెక్క చేస్తూ తన గదిలో కుర్చుండిపోయింది. ఆమె భోజనానిక్కూడా రాలేదు. మర్నాడుదయం తొమ్మిదింటివరకు రెండు కార్లు వాకిట్లో రెడీగా ఉన్నాయి. జనాలంతా వాటిల్లో ఎక్కి కూర్చున్నారు. ఈలోగా బైక్ మీద ఎటో వెళ్ళిన రామారావు వచ్చి ''అంతా వచ్చారా?'' అని అడిగాడ్

''ఆ'' అంది జయ.

''అంతా?'' రెట్టించాడు.

''ఆఁ వచ్చేశాం''

''అమ్మా! నీ పట్టుచీర తరువాత సర్దుకో అందరూ వచ్చారా?''

''వచ్చాంరా!''

''ఐతే ఇంటికి తాళం వెయ్యి'' చికాకు పడుతూ అన్నాడు.

''సిరి ఇంట్లోనే ఉంది. తనకి ఏవో లెక్కలు తప్పొచ్చాయిట. రాత్రంతా అలా చేస్తూనే ఉంది''

''గొప్పవాళ్ళు లెక్కలు ఎప్పుడూ తప్పుతాయిగానీ వెళ్ళి పిలు అన్నాడు కటవుగా. జయవెళ్ళి ఎంత బ్రతిమాలినా సిరి రాలేదు. ''ఆంటీ! ఈ లెక్క తప్పితే నాకు ఈ ఇంట్లో ఉండే అవకాశమే పోతుంది'' అంది జాలిగా చూస్తూ.

''చాల ముఖ్యమైన లెక్కలట్రా! తను రానంటోంది'' అంది జయ తిరిగొచ్చి.

రామారావు ముఖం గులాబీ వర్ణంలాంటి ఎరుపులో కొచ్చింది. మరు నిమిషంలో వెనుతిరిగాడు. గబగబా మెట్లెక్కుతూ ఇంట్లోకి చేరాడు. సిరి గది ముందుకి వచ్చాడు. కూర్చున్న కుర్చీనుండి క్రిందకి వ్రేలాడుతున్న బారెడు జడ, ఫాన్‌గాలికి అల్లాడుతున్న ముంగురులు, మెరూన్ కలర్‌లో అలరిస్తున్న పంజాబి డ్రెస్. వంచిన తల ఆలోచిస్తున్న పెద్దకళ్ళు, ఆ భంగిమలో చెయ్యి తిరిగిన శిల్పి చెక్కిన శిల్పంలా ఉందామె.

ఒక్క క్షణం ఆమెనలాగే చూస్తూ గుమ్మంలో నిల్చున్నాడు రామారావు. సిరి గుమ్మనికి అభిముఖంగానే కూర్చుని ఉన్నా చేస్తున్న లెక్కల్లో లీనమై పోయి రామారావుని గమనించలేదామె. ఓ క్షణం అలా చూసి లోపలికి వచ్చాడతను. అతను దగ్గరగా వచ్చేవరకు గమనించలేదామె. అతి సమీపంలో అతన్ని చూసి బిత్తరపోయిందామె.

ఆ సమీపంలోనే మొదటిసారిగా ఒకేసారి ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. మరుక్షణం తన ఎడమ చేత్తో ఆమె కుడిచేతిని బలంగా పట్టుకుని గబగబా లాక్కుపోతున్నాడు. ఆమె చేతిలోని కాగితాలు జారిక్రిందపడ్డాయి పెన్ను అలాగే ఉండిపోయింది. పూవులా తాకుతున్న ఆమె శరీర స్పర్శ అతని గుండెలో బరువుని పెంచింది. బలంగా పట్టుకున్న అతని చేతి స్పర్శ ఆమెకి ఆనందంగా తోచింది.

వాకిట్లో ఉన్న వ్యాన్ వరకు ఆమెనలా లాక్కువచ్చాడు. 'వదలకు రామారావ్. ఈ చేతినిలాగే పట్టుకో. నీవు తోడుంటే నాకు నరకమైనా నాకమే' ఆమె మనసు కవితని పాడుతోంది. జనాలంతా ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు. తెరచుకుని ఉన్న డోర్ గుండా ఆమెని బలవంతంగా వ్యాన్‌లో కూర్చోపెట్టాడు. అపుడు చూశాడు. తను పట్టుకున్న చోట ఆమె చేయి ఎర్రగా కందిపోయి ఉండటం. అదేమీ పట్టించుకోనట్టుగా ప్రక్కకి తిరిగి ''అమ్మా! నువ్వెళ్ళి తాళం వేసిరా'' అన్నాడు. జయ తాళం వేసి రాగానే వాహనాలు రెండూ ప్రయాణం సాగించాయి.

రామారావు దారి చూపగా గంటకి పైన ప్రయాణించిన ఆ వాహనాలు ఓ ఇంటిముందు ఆగాయి. చుట్టూ పెద్ద ప్రహరి. ఇల్లు లోపల ఎక్కడో ఉంది. వాకిలి అంతా పరచుకున్న చెట్లు అంతా దిగుతున్నారో లేదో గమనించకుండానే తను దిగాడు రామారావు.

వెంటనే వ్యాన్ డోర్ తీసి ఇందాకటి లాగే ఆమె చేయి పట్టుకుని "రా!" అంటూ దించాడు. ఆమె దిగగానే ఆ చేతినలా పట్టుకుని గబగబా లాక్కుపోసాగాడు. అంతా వాళ్ళని అనుసరిస్తున్నారు. ఇంట్లోకి లాక్కుపోతున్నాడు. యాభై ఏళ్ళ వ్యక్తి చెక్కబల్ల మీద కూర్చుని పేపర్ చదువుతున్నాడు. నలభై ఐదేళ్ళ స్త్రీ భుజం మీది తడి బట్టలు దండెం మీద ఆరేస్తున్నది.

సిరినీ, రామారావునీ చూసి ఆ ఇద్దరూ చేష్టలుడిగి నిల్చున్నారు. వాళ్ళని దాటి, మరో గది దాటి, ఇంకో గదిలోకి సిరిని చేర్చాడు.

"చూడు మంచంలో అచేతనంగా, మృత్యువుకి దగ్గరగా పడి ఉన్న ఈమె నా భార్య. ఒకే జీవితం, ఒకే భార్య, ఒకే పెళ్ళి అనే ఆదర్శం నాది. నువ్వొచ్చి నా మదిలో అలజడి లేపావ్. నేనీ సంఘర్షణ తట్టుకోలేను. నా మనసు నీ మీద ప్రేమతో బందీ అవుతోంది. అంతరాత్మ అభ్యంతరం పెడుతోంది. ప్రేమ నీ వేపు లాగుతోంది. ఆదర్శం అవతలకి నెడుతోంది. నీ సహనం, గొప్పదనం, మంచితనం చూసి నా ఆలోచనలు దీపం పురుగులా నీ చుట్టూ తిరుగుతున్నాయి. నా గతం, జ్ఞాపకాలూ, కలిసి బుట్టలో అడ్డుపడుతున్నాయి. నాకీ క్షణక్షణ క్షోభ నుండి విముక్తి కలిగించు. దయచేసి నా హృదయంలో నుండి వెళ్ళిపో" క్రింద కూర్చుని మంచం మీద తలనుంచి చేతుల్లో ముఖం దాచుకున్నాడు రామారావు.

చుట్టూ చేరిన జనాలు ఆశ్చర్యపోతున్నారు. ఈలోగా 'ఆ అమ్మాయి' తల్లిదండ్రులు అక్కడికి వచ్చారు. ఏదో చెప్పబోయిన ఆమె సిరి కళ్ళలోని కాఠిన్యాన్ని చూసి ఆగిపోయింది. కాస్సేపటికి తేరుకున్న రామారావు నెమ్మదిగా లేచి వాకిట్లోకి వచ్చాడు. వాకిలంతా తోటలా ఉంది.

అమ్మాయి తండ్రి తేరుకుని అందరికీ కాఫీ, టిఫిన్లూ చేయించాడు. కొసరి కొసరి అందం చేతా తినిపించారు. సిరి మాత్రం ఏమీ ముట్టలేదు. కోమాలో ఆ యువతి మంచం దగ్గర అలాగే ఉండిపోయింది. ఎవరు చెప్పినా, ఎంత బ్రతిమాలినా కనీసం కాఫీ కూడా తీసుకోలేదు. ఓ గంట అక్కడ గడిపి తిరిగి అంతా ప్రయాణమయ్యారు. అందరికన్నా ముందు వానెక్కింది సిరి. ఇంటికి వచ్చాక తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది. భోజనం కూడా చేయలేదు. జయ వెళ్ళి తలుపు తడితే "ఆంటీ నేను ఓడిపోయాను. ఈ ఒక్కరోజైనా ఈ గదిలో మనసారా ఉండనీయండి. ప్లీజ్" అంది. రాత్రంతా ఆమె గదిలో లైటు వెలుతోంది.

మర్నాడు రామారావు నిద్రలేచేప్పటికి సిరి గది ఖాళీగా కనిపించింది. ప్రశ్నార్థకమైన అతని ముఖం చూసి "గ్లాస్ ఫాక్టరీ లెక్కల్లో ఏదో తేడా వచ్చిందిట. ఇరవై లక్షలు నష్టమట. అందుకని తమ ఒప్పందం ప్రకారం సిరిని వాళ్ళ నాన్న తీసుకువెళ్ళారు" అన్నారు తాతగారు.

రామారావు సోఫాలో కూర్చుండిపోయాడు. ఆ రోజల్లా భోజనం చేయలేదు. సిరి గదిలో గడిపాడు. మర్నాడు కూడా అన్నంగానీ, టిఫిన్ గానీ ముట్టక పోవడంతో జయ అతనికి చేరువగా వచ్చింది.

"నాన్నా! నువ్వు మా ముగ్గురి ప్రాణానివి. నీవిలా ఉంటే ఎలా చెప్పు. మేం ఏమైపోవాలి?" అంది. అంతే! ఆమె ఒడిలో తలదాచుకుని "అమ్మా" అంటూ చాలాసేపు రోదించాడు.

జయ అతని తల నిమురుతూ ఉండిపోయింది. మనస్సులో దాగిన దుఃఖమంతా తీరినదాకా దుఃఖించారు. ఎవరూ అడ్డు చెప్పలేదు. చాలాసేపటికి గానీ అతను యథాస్థితికి రాలేకపోయాడు. స్నానం చేశాక అన్నం ముద్దలు కలిపి నోట్లో పెట్టింది జయ. నాలుగు ముద్దలు అన్నాడు. ఆ తిన్న ముద్దల్లో చాలా మట్టుకు అతని కన్నీళ్ళే చారు, మజ్జిగలా కలిసి అతని పొట్టలోకే వెళ్ళాయి.

ఓ పదిరోజులు గడిచాక "అమ్మా! అప్పుడు ఆగిపోయిన ఆ పల్లెటూరి కాంప్ ఇప్పుడు ముందుకొచ్చింది. వెళతాను. నెలదాకా రాను" అన్నాడు. "వెళ్ళిరానాన్నా! ఇక్కడుండేకన్నా అదే నయం" అంది.

"అమ్మా సమయాసమయాల్లో మీరంతా నన్ను విడిచి ఉండగలరు. కానీ అసలు నన్ను చూడకుండా ఓ రోజు కూడా గడవని వారు ఇద్దరే ఇద్దరున్నారు. ఒకరు శివ.. రెండవ వారు.. సి..." ఆగిపోయాడు. అతని గొంతు గుటకలు మ్రింగింది.

"అమ్మా! వాడి దగ్గరికి వెళ్ళి అనునయించి వస్తాను" అంటూ శివ ఇంటికి వెళ్ళాడు.

●●●

ఊరినుండి వచ్చాక రెండు రోజులకి ఓ నాటి రాత్రి పదింటికి ఇంటికి వచ్చి, వాకిట్లో ఉన్న బాత్రూంలో దూరి తలారా స్నానం చేశాడు రామారావు. "ఏరా ఈ చలిలో చన్నీటి స్నానమేంటీ? పైగా తలమీద" అంది జయ.

"అమ్మా నెలక్రితం నా  భార్యపోయిందిట. అందుకే ఈ స్నానం. నాకీ విషయం ఇందాకే తెలిసింది" అన్నాడు.

జయ పలకలేదు. రామారావు అన్నాడు "అమ్మా నన్ను చూస్తే మీకందరికీ అసహ్యంగా ఉంది కదూ?" అని.

జయ అతని నోరు మూసి "అంతమాట వద్దు నాన్నా! నువ్వు ఏ పనిచేసినా అందుకు బలమైన కారణం, కాదనలేని నిజం ఉంటాయి" అంది లాలనగా.

"అమ్మా ఈ మాట చాలు నాకు" అంటూ వెళ్ళి భోజనానికి కూర్చున్నాడు. అక్కడ పెళ్ళిశుభలేఖ కనిపించింది. "ఎవరిదమ్మా పెళ్ళి?" అడిగాడు.

"ఎవరో తెలిసిన వాళ్ళు లేరా?" అంది జయ కార్డు లాక్కుంటూ.

భోజనం ముగించి తన గదిలోకి వెళ్తూ "అమ్మా! పెళ్ళికి నువ్వు తప్పక వెళ్ళు. బీరువాలో మంచి నెక్లెస్ తెచ్చి పెట్టాను. అది పెళ్ళి కూతురికివ్వు" అన్నాడు.

"నెక్లెస్సా?"

"పెళ్ళి ఎవరిదో నాకు తెలిసిపోయింది." అంటూ తన గదిలో దూరాడు. జయ బాధగా కళ్ళు మూసుకుంది. తెరచిన ఆమె కళ్ళకి ఎదర ఉన్న రూపం కనబడలేదు. ఆ వ్యక్తి కళ్ళూ నీళ్ళ కావిడులే. ఆ వ్యక్తి సూర్యం. జయ ఆ పెళ్ళికి వెళ్ళలేదు.

●●●

**"సార్.. పెద్ద సార్ పిలుస్తున్నారు" ప్యూను చెప్పాడు.**

"అలాగా? వస్తున్నాను" అంటూ లేచాడు రామారావు చేతిలోని పనిని గబగబా పూర్తిచేసి తన టేబుల్ నీట్‌గా సర్ది బైలుదేరాడు అతను గది ముందు ఆగగానే "రామారావ్! రావయ్యా" అన్నారు ఆఫీసరు.

"చూడకుండానే నే వచ్చినట్టు గుర్తుపట్టారు." అన్నాడు మెచ్చుకోలుగా రామారావు.

"ఐదు నిమిషాల్లో వస్తానని ప్యూన్‌తో కబురు చేశారు. ఇచ్చిన సమయానికి రాగలిగేది రామారావు తప్ప ఇంకెవరుంటారు?" అన్నాడాయన.

రామారావు ఇబ్బంది పడ్డాడు. "సరే సరే. మాట మారుస్తున్నాను. నీతో మాట్లాడవల్సి ఉంది. బైటనుండి వచ్చి ఎవరూ ఇబ్బంది పెట్టకుండా, మధ్యలో అంతరాయం కలగకుండా కాపలా ఉండమని ప్యూన్‌కి చెప్పాను. ఎందుకైనా మంచిది ఆ తలుపు వేసిరా!"

రామారావు తలుపేసి వచ్చాడు.

"కూర్చో" కుర్చీ చూపాడు. కూర్చున్నాడు.

"ఇది నేను ఊహించిందే ఐనా ఇంత త్వరగా వస్తుందనుకోలేదు" అన్నాడు.

"ఏంటి సర్ అది?"

"నాకు ట్రాన్స్‌ఫర్" ఓ నిమిషం, నిశ్శబ్దం.

"రామారావ్ ఎవరైనా మాట్లాడితే నీకు విసుగ్గా అనిపిస్తుందా?"

"లేదు సర్. నేను వినడాన్ని ఎక్కువగా, వినిపించడాన్ని తక్కువగా ఇష్టపడతాను."

"సరే విను. నేనీ ఉద్యోగాన్ని డబ్బు సంపాదించడానికి చేయడం లేదు. కేవలం బ్రతుకు గడవడానికి మాత్రం చేస్తున్నాను. ప్రధమ స్థాయి ఉద్యోగినీ, అందునా పొదుపుగలవాడినీ కనుక డబ్బు నా అవసరాలకి పోను ఎక్కువే మిగిలింది. ఐతే తాతలు కట్టించిన పెంకుటిల్లుగానీ నాన్న ఇచ్చిన పందిరి మంచంగానీ నే మార్చలేదు.

పోతే ఆఫీసు విషయం రీఫిల్ దగ్గర్నుండి నేను నా స్వంత ఖర్చుతోనే కొనుక్కున్నాను తప్ప ఆఫీసు డబ్బుని వాడుకోలేదు. ఇది కొంతమందికి పిచ్చి పనిగా అనిపించవచ్చు. కానీ నేను నా కోసం బ్రతుకుతున్నాను. నేనెలా బ్రతకాలనుకున్నానో అలా. జీవితంలో రాజీ లేకుండా జీవనంలో లోపాలు లేకుండా.

ఈ ఉద్యోగం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. తృప్తిని పరిచింది. డబ్బుని సమకూర్చింది. ఒదుదుడుకులూ, కష్టసుఖాలు నెట్టుకుంటూ ఇంతదాకా నెట్టుకు వచ్చాను. ఇక రిటైర్మెంట్ వయసు వచ్చేసింది. ఆ విషయం ఓ రోజు మన డైరెక్టర్ గారితో అన్నాను. ఆయన మంత్రిగారితో అన్నారు. అంత నా స్థానాన్ని భర్తీ చేయగలవాడు మాకు మారుగా రావాలని ఆయన పట్టుపట్టారు. తత్ఫలితంగా వెదికి వెదికీ నిన్ను అపాయింట్ చేశాను.

కానీ నేను వెళ్ళిపోతున్నాను. నీ నీతీ, నిజాయితీలోని గొప్పదనాన్ని ఆకళింపు చేసుకుంటూ సంతృప్తికరమైన నిట్టూర్పు విడవకముందే నే వెళ్ళిపోతున్నాను. కాదు వెళ్తున్నాను. నీ ఆదర్శాల గురించి నాకెలాంటి భయమూ లేదు. నా బాధంతా నీ గురించే. నువ్వు.. నువ్వు పదిలం.. నువ్వు చాలా జాగ్రత్తగా ఉండు.

ముప్పై ఏళ్ళ క్రితం విశ్వనాథం అనే వ్యక్తి ఈ ఆఫీసులో పనిచేసేవాడు. 'మీరు తినండి. అది మీ ఇష్టం. కానీ నన్ను మాత్రం లంచాల ఊబిలోకి లాగద్దు. నే తినను' అన్నాడతను. అంతే! అతను చనిపోయాడు. జాబ్ తిరబడి పోయాడు. జాబ్‌లో నడిమధ్యన కూర్చున్న విశ్వనాథం పోయాడు. అటు, ఇటు కూర్చున్న వాళ్ళకి చిన్న దెబ్బలు కూడా తగల్లేదు. ఎందుకో ఈనాటికీ ఎవరూ చెప్పడంలేదు.

రామారావ్! ఆదర్శం కన్నా జీవితం గొప్పది. అంతగా ప్రాణాలమీదికొస్తే నువ్వు లంచగొండివికా. కానీ మరో విశ్వనాధానివి కాకు." ఆయన కళ్ళలో నీళ్ళు.

"సరే" అన్నాడు ఆయన దగ్గరకి వెళ్ళి. ఆయనలేచి రామారావుని గాఢాలింగనం చేసుకున్నాడు.

"రామారావ్ రెండు కళ్ళతో సమాజాన్ని చూడు. కానీ పది కళ్ళతో నీకు రాబోయే ఆపదని చూడు. "

ఓ నిమిషం రామారావు పలకలేదు. "సర్ మీ అభిమానానికి ఏమిచ్చి ఋణం తీర్చుకోను?" అన్నాడు బేలగా.

"నువ్వు జాగ్రత్తగా ఉండి నూరేళ్ళు బ్రతుకు చాలు" అన్నాడు ఆయనే గోపాలకృష్ణ.

●●●

ఆయన వెళ్ళాక రామారావు మీద చిన్న యుద్ధమే జరిగింది. "రామారావ్ నువ్విలా నీతీ నిజాయితీ అని మడిగట్టుకుని కూర్చుని మాలాంటి వారి నోట మట్టి కొట్టకు" అన్నాడు ఓ పెద్దమనిషి.

"మీకు అనువైనట్టు మీరు నడుచుకోండి. నా మనసుకి తోచిన విధంగా నే నడుస్తాను"

"అలా అంటే ఎలా? నీ వల్ల మాకు నష్టం కదా?"

"నా వల్ల మీకు నష్టం కలిగినట్లు నిరూపించితే మీ మార్గంలోనే నడుస్తాను."

"అదెంత పని?" చిటిక వేసి మొదలెట్టాడు. మిగిలిన జనాలంతా ఆత్రంగా చూస్తున్నారు. చెప్పాడు. చాలాసేపు సమాజమంతా ఎలా చెడిపోయిందో, తానొక్కడు మడికట్టుకు కూర్చుంటే తనెంత నష్టపోతాడో, తన భార్యా పిల్లలు డబ్బులేనివారిగా లోకం ముందు

ఎంత చులకనగా చూడబడతారో.. తనకున్న భావాన్నీ, ఆవేశాన్ని మాటల్లో ఇరికించి అరగంటదాకా అలా చెబుతూనే ఉన్నాడు. ఆయనకి ఆయాసం పుట్టి ఊరుకున్నాడు. రామారావు మొదలెట్టాడు.

నెమ్మదిగా, సుతిమెత్తగా మొదలైన ఆ వాక్ప్రవాహం చివరికి పదును తేలి అందరి గుండెలనీ తాకింది ముందు. తరువాత అతని మాటల తీరుకి దడిసి ఎవరూ నోరు విప్పలేక పోయారు. అంతే. ఆ ఆఫీసులో మొదటి సారిగా లంచాలు తీసుకోని వ్యక్తికి అక్కడి జనం భయపడ్డం ప్రారంభమైంది.

పోతే ఈ విషయం ఇంతటితో ఆగలేదు. చిలువలు పలువలుగా మారి హెడ్డాఫీసుకి చేరింది. అక్కడినుండి ఆఫీసరయ్య చెవిని సోకింది. అంతే మరుక్షణాన రామారావుకి హెడ్డాఫీసుకి ట్రాన్సఫరైంది. అతను వెళ్ళిపోయిన రోజు ఆఫీసులో అందరూ నవ్వుకున్నారు. జోకులేసుకున్నారు.

"ఇపుడు చూపమను. మహదేవయ్య గారిముందు తన ప్రతాపం, నీతి, నిజాయితీను. గురుడికి తోక కత్తిరించి వేస్తాడాయన. ఆయన ఎవరినైనా విడుస్తాడుగానీ లంచాన్ని వ్యతిరేకించేవాడిని మాత్రం విడువడు" అన్నాడు ఆ పెద్దాయన.

అంతదాకా వాళ్ళని దేవుళ్ళుగా భావించిన ప్యూను మొగిలయ్య అన్నాడు "రామారావు బాబుని మీరు తక్కువగా అంచనా వేస్తున్నారు. తన పద్ధతులు మార్చుకోవాల్సివస్తే ఆ బాబు ఉద్యోగమే మానుకుంటాడు."

"కొయ్యి కోయ్ కోతలు. ఇది గవర్నమెంట్ ఉద్యోగం బాబూ. ఎన్ని లక్షలు పోసి కొన్నాడో. అంత తేలిగ్గా వదులుకుంటాడంటే మేం నమ్మాలా?"

"ఐతే మీకు ఆటంబాంబు లాంటి వార్తలు రెండు చెబుతాను వినండి. ఒకటి మన డైరెక్టరుగారు, గోపాలకృష్ణగారూ, ఓ మంత్రిగారూ కలిసి నిజాయితీ పరుడికోసం వెదికి వెదికి వలవేసి గాలించి ఈ రామారావు బాబుని పట్టుకొచ్చారు మన డిపార్ట్‌మెంట్‌కి. అదీ ఆ బాబు గత చరిత్రని నీతిని, నిజాయితిని పరీక్షించి సానవేసి రుద్ది, తెలివితేటల్ని పరీక్షించి అన్నింటా నంబర్ వన్ అని తెలిశాక అపాయింట్ చేశారు.

ఇక రెండవ వార్త.. వార్తలు రాయడంలో నంబర్ వన్ స్థానంలో ఉన్న 'తొలిసంధ్య' పత్రికలో ఈ బాబు చాలా ఉన్నత పదవిలో ఉండేవారు. తన తోటి ఆఫీసర్‌కి చిన్న అన్యాయం జరిగిందని విని సహించలేక ఆ ఉద్యోగాన్ని వదిలేశాడు.

అక్కడ ఆయన జీతం ఎంతో తెలుసా? అంకెలు వేయని బ్లాంక్ చెక్కు. ఈ ఉద్యోగానికి వచ్చే జీతంలో పదింతలు ఎక్కువిస్తానని పత్రికాయన అన్నా గడ్డిపోచకన్నా హీనంగా తృణీకరించి వచ్చాట్ట. ఆయన వెళ్ళిపోయాక గానీ నాకు ఆయన విలువ తెలిసింది. ఇప్పటికీ మించింది లేదు. ఆ బాబు రమ్మంటే ఈ ప్యూనుగిరీ ఒదులుకుని ఆయన చెప్పులు తుడిచే ఉద్యోగానికైనా ఎళ్లిపోతాను.

రావణాసురిడి కొలువులో మంత్రిగా కన్నా రాముడి చేతిలో ఉడతగా ఉండటం మేలు. నేను కూడా ఈ రోజు నుండి లంచానికి వ్యతిరేకం. పదీ, పాతిక కోసం ఎవరి తొత్తుగిరీ నే చేయను" కుర్చీని తుడిచి ఆ గుడ్డని విదిల్చి కదిలాడు మొగిలయ్య. శ్రోతలు, ప్రేక్షకులు శిల్పాలుగా మారి అలా చూస్తున్నారు.

●●●

"అమ్మా! నాన్నా! తాతయ్యా! ఆగండి. ఎక్కడికి వెళ్తున్నారు?"

"గుడికిరా!"

"పదండి. నేనూ వస్తాను."

"గుడికా?"

"ఏం? మీ గుడివాళ్ళు నన్ను రానీరా" చిరునవ్వుతో అడిగాడు.

"అదేం లేదుగాని పద" అంది జయ. సూర్యం ఏదో అనుమానంగా చూశాడు. తాతామనవడు ముందు నడువసాగారు.. జయ, సూర్యం కాస్త వెనక బడ్డారు.

"ఏమిటి మీ అబ్బాయి భక్తిపరుడయ్యాడు?" అంది జయ.

"అది భక్తి అయి ఉండదు" ఆలోచిస్తూ అన్నాడు సూర్యం.

"మరి?"

"ఫలితాల కోసం ఎదురు చూడాలంతే. అవునూ అన్నట్టు బ్యాంక్‌లో నీ ఎకౌంట్‌లో క్యాష్ ఎంతుంది?"

"లక్ష. ఐన మోకాలికీ బోడిగుండకీ లింకుపెట్టినట్టు ఇపుడు ఆ విషయం ఎందుకు?"

"అవునూ! పసుపు కుంకాలకి మీ అమ్మవాళ్ళు రాసిచ్చిన ఎకరం పొలం కాగితాలు ఎక్కడున్నాయి?"

"ఏమిటీ అడ్డదిడ్డ ప్రశ్నలు?"

దూరంగా ఉన్న రామారావు చెవులకి ఈ మాటలన్నీ వినిపించాయి. మనసులోపలే నవ్వుకున్నాడు. గుడికి వెళ్ళిన తరువాత అక్కడివాళ్ళంతా దిగులుగా ఉండటం చూశారు తాతగారు "ఏమయింది?" అన్నారు. వారం వారం వారం భజన చేసే వెంకటేశం, శంభుదాసూ రాలేదు అన్నారు. "పోనీ మనం అందరం తోచిందేదో పాడుకుందాం" అన్నారు తాతగారు.

ఈ మధ్య జయ ప్రోద్భలంతో సూర్యం కూడా రోజూ గుడికి వస్తున్నాడు. అంతా భజన చేస్తున్నారు. ఎవరికి తోచిన పాట వాళ్ళు చెబుతున్నారు. అందరి వంతూ అయిపోయింది. ఇక నువ్వు అంటే నువ్వు అనుకుంటున్నారు.

అప్పుడు రామారావు "తాతయ్యా! నీ దేవుడిమీద నేనూ పాట పాడేదా?" అన్నాడు.

తాతగారు కొయ్యబారిపోయారు. క్షణంలో తేరుకుని "ఆం ఆం! పాటలా!" అన్నాడు.

రామారావు "గాలి నడుగూ, పూచిన పూలబాల నడుగు" అంటూ పాడాడు. మనస్సు మైకపు కొక్కాలకి తగులుకుని ఏదో లోకాలకి వెళ్ళిన అనుభూతి కలిగింది అందరికీ. పాటలతోటే పరమాత్మ దర్శనమైనట్టుగా అనిపించింది.

"మరోటి" అన్నారు. అన్నమయ్య కీర్తన పాడాడు. "ఇంకోటి" ప్రాధేయపడ్డారు. మీరాభజన్ పాడాడు.

"మీరు పాడారు సరే. మా చేత పాడించండి. మీలో శృతి కలిపే అదృష్టాన్ని మాకు ఇవ్వండి" ఓ గడుగ్గాయి పట్టుపట్టాడు.

"ఓం నమఃశ్శివాయ" అంటూ హిందోళ రాగంలో నామం పాడుతూ వారిచేత పాడించాడు. ఇరవై నిముషాల పాటు ఆ గానప్రవాహం సాగింది.

ఇంటికి వచ్చేవరకూ నలుగురూ మాట్లాడుకోలేదు. ముగ్గురు రామారావు పాటని గుర్తుకి తెచ్చుకుంటున్నారు. రామారావు మాత్రం ఇంటికి రాగానే తన గదిలోకి వెళ్ళి టీవీ పెట్టుకు కూర్చున్నాడు. కాస్సేపటికి తాతగారు అతని గదిలోకి వచ్చాడు.

"టీవీ ఆఫ్ చేసి రా తాతయ్యా! అంటూ తన ప్రక్కనే చోటిచ్చాడు.

"రేయ్ నువ్వడిగింది నా చేతిలో ఉన్నదైతే ఎడమచేతిలోది కుడిచేతికి మార్చకుండా ఇస్తాను. మాటంటే మాటే"

"సరే! ఇప్పుడేగా నువ్వు కోరుకోమన్నది? నేనూ ఏం కోరుకోవాలో ఆలోచించు కోవాలిగా? ఈ లోగా నువ్వా నీ కొడుకునీ, కోడల్నీ కూడా సంప్రదించు. నువ్వు నాకిచ్చేవరం వాళ్ళకి కంటకప్రాయంగా ఉండచ్చు."

"నీకా భయం అవసరంలేదు. వాళ్ళు నామాట నెప్పుడూ కాదనరు."

"సరే! రేపుదయం వస్తాను. అదే..పాత అప్పులవాడిలా.."

"సుస్వాగతం."

మరుసటి రోజుదయం తొమ్మిదింటికల్లా తాతయ్య గదిలో ఉన్నాడు రామారావు. "రారా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను" అన్నాడాయన.

"తాతయ్యా! చివరి అవకాశం ఇస్తున్నాను. మరోసారి ఆలోచించుకో"

"అవసరం లేదు. అడుగు"

"ఐతే..విను. నా మొదటి కోరిక.. అమ్మ కోసం నువ్వు కొన్న బంగారం నాక్కావాలి. అమ్మ తన పుట్టింటి నుండీ తెచ్చుకున్నదీ, తన పంట డబ్బులతో కొనుక్కున్నవీ కాకుండా పెళ్ళికీ, నీ రిటైర్మెంట్ డబ్బుతో నువ్వు చేయించినవీ నాకివ్వు.

ఇక రెండవ కోరిక... ఆ నగలను నేను అమ్ముకున్నా, తాకట్టు పెటినా, దానం చేసినా అడిగే హక్కు మీకెవరికీ ఉండరాదు. మళ్ళీ ఆ నగల గురించి నన్నెవరూ అడగరాదు."

మనవడి కోరికల చిట్టా విని చలించిపోలేదు. దిండు క్రిందనుండి బ్యాంక్ స్లిప్స్, ఎకౌంట్ బుక్ తీసి అతని చేతిలో ఉంచి "ఇవి అమ్మకి నే చేయించిన నగలు. బ్యాంక్‌లో ఉన్నాయి. సేఫ్టీ లాకర్లో. రేపు వెళ్ళి తెచ్చుకో.

ఐతే నాకో చిన్ని సందేహం. నువ్వు గుడికి రాకున్నా, భజనలో పాల్గొనకున్నా, పాటలు పాడి మమ్మల్ని మెప్పించకున్నా, నువ్వు అడిగితే ఈ ఇల్లునే నీ పేరున వ్రాస్తాము. నీ నమ్మకాలనీ, పద్ధతులనీ మార్చుకుని కేవలం మమ్మల్ని మెప్పించడానికి గుడిదాకా రావడం ఎందుకు?"

"నాకు తెలుసు తాతయ్యా" నేనడిగితే మీ ముగ్గురూ ప్రాణాలైనా నాకోసం ఇస్తారని. కానీ తీసుకోవడమే పరమావధిగా బ్రతికే నేను నా దృష్టిలో మరింత పలచనైపోతాను పైసా పైసా చేరేసి కొనుక్కున్న నగలు మీవి.

బుద్ధ మనసూ కూడి కట్టుకున్న ఆశయ సౌధం నాది.

నేనొక మాట ఆపంగానే మీ జీవిత కాలపు ఆదాయాన్నంతా నాపరం చేస్తారు.

కానీ నేనేమి ఇవ్వగలను? మిమ్మల్ని ఎలా సంతోషపెట్టగలను? మీ దేవుడిని స్తుతించడం ద్వారా సంతోషపెట్టగలను. దేవుడి పట్ల నాకు భక్తిలేదు. నా ఆశయాల పట్ల మీకు అనురక్తిలేదు. మీక్కావలసింది నా సంతోషం. నాక్కావలసింది మీ సంతోషం. అందుకే నెలరోజులుగా హార్మోనియం నేర్చుకుని మరీ పాడాను"

జయ, సూర్యం అప్పటికే అతని గదిలోకి వచ్చారు. "అమ్మ! నాన్నా నన్ను క్షమించండి" అన్నాడు. తాతయ్యకి వంగి నమస్కారం చేశాడు.

●●●

"సార్! మహదేవయ్య సార్ మిమ్మల్ని పిలుస్తున్నారు." ప్యూన్ చెప్పాడు. వెంటనే సీట్‌లో నుండి లేచాడు రామారావు. ఈ పిలుపు అతనూహించిందే

"గుడ్ మార్నింగ్ సర్." మహాదేవయ్యని విష్ చేశాడు.

"ఓ! రామారావు రా. నెంబర్ సిక్స్ ఫైల్ నీ టేబుల్ మీదకి ఎప్పుడు వచ్చింది?" అడిగాడు ఏదో రాసుకుంటూ.

"నాలుగు రోజులనాడు సర్"

"దాన్ని నువ్వెప్పుడూ పూర్తిచేశావ్?"

"మరునాడు."

"దాని విలువెంతో నీకు తెలుసా?"

"తెలీదు సార్"

"అందుకే అంత త్వరగా పూర్తి చేశావ్. ఏదైనా కానీ. నీ కష్టం పోదులే. ఇంద ఇది తీసుకో" నోట్ల కట్టని రామారావు వేపు జరిపాడు"

"ఏంటి సర్ అది?"

"డబ్బు"

"అది నాకెందుకు?"

"ఎందుకేంటి? నే టేబుల్ నుండి అంత త్వరగా ఆ ఫైలు కదిలినందుకు దానికి సంబంధించిన ఒకాయన ఇచ్చిన బహుమతి అది."

"క్షమించండి. బహుమతులు స్వీకరించే అలవాటు మా కుటుంబానికి లేదు" అక్కడి నుండి కదలబోయాడు.

"మిస్టర్ రామారావ్. ఆ డబ్బునేనిచ్చింది. అది స్వీకరించకపోతే నువ్వు నన్ను అనుమానించినట్టే కదా? వెంటనే తీసుకో" మహదేవయ్య కోపంగా అన్నాడు.

వెనుతిరిగిన రామారావు ఓసారి ఆయన్ని ఎగాదిగా చూసి "సర్ నాకు వ్యక్తుల మీద కన్నా వృత్తిమీదే గౌరవం ఎక్కువ. నా దృష్టిలో మాతృ ద్రోహం చేసినవాడు, వృత్తి ద్రోహం చేసినవాడూ సమానులు"

"రామారావ్" పెద్దగా అరిచాడు మహదేవయ్య, "నువ్వు నన్ను అనుమానిస్తున్నావ్"

"అది నా ఉద్దేశ్యం కాదు సర్."

"కాకపోతే ఏంటి? నేనిచ్చిన డబ్బుని ఇక్కడే వదిలి వెళతావా? ఒకరికిచ్చిన డబ్బు మీద చిటికెన వేలుకూడా వేయడీ మహదేవయ్య నువ్వు తెలుసుకో. "

"లంచం ఎవరిచ్చినా స్వీకరించడీ రామారావు. మీరు తెలుసుకోండి"

"కాదయ్యా! "

"అది లంచం."

"పోనీ లంచమే అనుకో. తీసుకోవడానికి నీకేంటి అభ్యంతరం?"

"అమ్మో! తీసుకుంటే నన్ను చంపేస్తుంది"

"ఎవరు నీ భార్యా?"

"కాదు. నా అంతరాత్మ"

"అంతరాత్మకి భయపడితే సుఖంగా బ్రకతలేమయ్యా! చూడు మేమందరం ఎంత సంతోషంగా ఉంటామో. నీవు చూడు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న వాడిలా ఎంత దిగాలుగా ఉంటావో!"

"ఆ డబ్బు తెచ్చే తాత్కాలికానందం కన్నా మీలాంటి వాళ్ళకి ఏదో పోగొట్టుకున్న వాడిలా కనిపించడమే నాకు బాగుంటుంది సర్."

"సమాజం మారిపోతుంది రామారావ్ ఇక్కడెవరూ మడికట్టుక్కూర్చోవడం లేదు. అంతా నీతులు వల్లిస్తున్నారు. కానీ తమదాకా వచ్చేసరికి లంచం ఇవ్వడానికీ తీసుకోవడానికీ ఎవ్వరూ వెనుకాడ్డంలేదు."

"సర్! సమాజం మారిపోతోందని గోలపెట్టేవారిలో నేను లేను. నేను మారకుండా ఉండాలని ఆత్మఘోష పడే వారిలో ఉన్నాను."

"చాలా తక్కువగా ఉన్నారు మీరు. ఒకప్పుడు మీ వేపు ఎంతోమంది ఉండేవారు. క్రమంగా వాళ్ళంతా మా వేపుకి వచ్చేస్తున్నారు. ఎవరో ఒకరిద్దరు తప్ప అంతా మా వేపు వస్తారు. ఇది తప్పదు.

ఈ ఆఫీసునే తీసుకో. ఒకప్పుడు ఈ ఆఫీసులో చాలామంది నిజాయితీ పరులు ఉండేవాళ్ళు. ఇపుడు వాస్తవాన్ని గ్రహించి అంతా మా వేపు చేరారు. ఇంత పెద్ద ఆఫీసులో మేం రెండు వందల మంది మీరు కేవలం ఇద్దరు"

"మరో వ్యక్తి?"

"ఉన్నాడులే ఓ మూర్ఖుడు. మురళి అని.. ఆశయాలకి భార్యాబిడ్డలు అడ్డం అని పెళ్ళి కూడా మానేశాడు. విసిరేయబడినట్టు ఆ మూలనున్న ఓ గదిలో కుప్పలు తెప్పలుగా పేరుకు పోయి ఉన్న ఫైళ్ళ మధ్య చావలేక బ్రతుకునీడుస్తున్న బ్రహ్మచారి. ఒంటరి బాటసారి. ఏం సాధించాడతను? ప్రమోషన్ లేదు. ఇంక్రిమెంట్ లేదు. ఉండేందుకు మంచి ఇల్లు లేదు.

పదిమందిలో నిలిచే అర్హత లేదు. ప్యూన్‌కి కూడా అతనంటే గౌరవం లేదు. మంచి బట్టలు, మంచి చెప్పులు, చేతికి ఉంగరాలు, మెడలో మంచి గొలుసూ ఏవీ లేవు. లేవు అంటే పూజ్యం అంటే సున్నా. సున్నా అంటే విలువలేనిదని అర్ధం. తెలుసుకో"

"ఆ మురళిగారు చాలా తెలివైనవాడు."

"ఏంటీ తెలివైన వాడా?"

"పైగా అతను చాలా సాధించాడు."

"సాధించాడా? ఏంటీ అతను సాధించింది?"

"పెళ్ళి మానడం వల్ల అతను తన మీద తను పట్టు సాధించాడు. మీనుండి దూరంగా ఉండటం వల్ల ఇలాంటి ఆఫీసుల్లో దొరకని ఏకాంతాన్ని సాధించాడు. ఒంటరి వాడైనా రెండువందల మందిని ఎదుర్కునే ధైర్యాన్ని సాధించాడు. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు సాధించకుండా మీలాంటి వారిమీద మానసిక విజయం సాధించాడు. నా దృష్టిలో అతనే మిమ్మల్నందరినీ వెలివేశాడు."

"ఆ ఒంటరి, ఆ పిచ్చాడు ఆ పని రాక్షసుడు మా మీద సాధించాడా? నీది భ్రమ"

"భ్రమ కాదు సరే నిజం. మీరు.. కాదు. మీరు చెప్పే రెండువందల మందిలో ఒక్కరైనా సరే. అతను చేసిన పనుల్లో ఒక్కటైనా చేయగలరా చెప్పండి. పెళ్ళి మానేయగలిగారా? కనీసం ఒక్కరోజైనా లంచం వద్దు అనగలిగారా? ఒంటరిగా ఒక్క రోజైనా గడపగలిగారా? నలుగురు కలిసి మనమీద మాటదాడి చేస్తేనే భరించలేదు అతను సింహం.. సింహంలా రెండు వందల మందిని ఎదుర్కొంటున్నాడు. ఈ ఆఫీసు అనే నదిలో మీరంతా ఏటవాలుతనానికి కొట్టుకుపోతుంటే అతనీ ప్రవాహానికి ఎదురీదుతున్నాడు"

"ఏమిటీ?"

"మీరంతా అతన్ని వెలివేశామని సంతోషిస్తున్నారు. కానీ అతని దృష్టిలో తను మిమ్మల్ని చిమ్మేశాడు. చీపురుతో చెత్తని చిమ్మినట్టు. చెత్త బరువు చిమ్మే మనిషికన్నా తూకంలో, కొలతలో ఎక్కువ ఉన్నంత మాత్రాన దాన్ని తెచ్చి ఇంటినిండా పరుచుకోలేం కదా? చిమ్మి అవతల పారేస్తాం. అతను చేసిందదే"

"అతని చర్యలో అంత అర్ధముందా?"

"ఇంకా చాలా ఉంది సర్. ఒక వ్యవస్థకోసం పనిచేసి, డబ్బుతీసుకోవాల్సిన మీరు, వ్యక్తి కోసం పనులు చేసిపెడుతున్నారు. చెత్తకూడా అదే చేస్తుంది. తనని తయారు చేసిన వ్యక్తికోసం కొంతకాలం పనిచేసి, ఆ తరువాత పనిమాని మొండికేసి పరుచుకుని ఉంటుంది. దాన్ని చిమ్ముకునో, మోసుకునో, తోసుకునో దూరంగా పడేసి చేతులు దులుపుకుంటాం. అలాంటి హాయినిప్పుడు అతను పొందుతున్నాడు"

"............"



కౌముది

"మీరన్నారే సంఖ్యాబలం అధికంగా మీకుందని.. మీరు ఎంతమంది? రెండు వందలు. అతనితో కూడి మేమూ ఇద్దరం. అంటే మా సంఖ్య కూడా రెండు. మిగిలినవి మీ దగ్గర సున్నాలు ఐదు నిముషాల క్రితం మీరే చెప్పారు. సున్నాకి విలువలేదని సున్నా, శూన్యం, పూజ్యం, అంటే... విలువలేనివని. విలువలేని రెండు సున్నాలు తీసేస్తే మీరూ రెండు. మేమూ రెండు. బలాలు సమానంగా ఉన్నాయి"

"నీ మాటలతో బురిడీలు కొట్టించకు. ఐనా ఇదంతా దేనికోసం?"

"చెప్పాను కదండీ! మానసికానందంకోసం."

"డబ్బు ఇచ్చిన ఆనందం అది ఇవ్వలేదు రామారావ్"

"చెప్పానుకదా సార్! ఇస్తుంది. డబ్బుకన్నా మంచి ఆనందాన్నిస్తుంది. ఒకసారి ఆ ఆనందానికి అలవాటు పడితే ఇక డబ్బుకాదుకదా? దాని తాతగారు దిగొచ్చినా మనని వశం చేసుకోలేదు"

"పందెం?"

"ఆఁ! పందెం సర్"

"పందెం ఎంత?"

"మీరే చెప్పండి"

"నేను సగటు రోజుకి రెండు వేలైనా సంపాదిస్తాను. నీతో పందెం వేసి గిరిగీసుక్కూర్చుంటే పందెం మాట దేవుడెరుగు. నాకంత డబ్బు నష్టంకదా?"

"మీరు రోజుకి రెండుకాదు. ఐదువేలు సంపాదిస్తారనుకుందాం. అంటే నెలకి లక్షన్నర. నేటినుండి నెలరోజులపాటు లంచం జోలికి పోకుండా మీరు పని చేయండి. ఆ పనిలో మీకెలాంటి మానసికానందం కలక్కుండా ఉంటే గడువు ముగిసిన మర్నాడు నేను మీకు లక్షన్నర రూపాయలు ఇస్తాను. డబ్బుని మించిన ఆనందం మీకు కలిగితే మట్టుకు మీరు శాశ్వతంగా లంచాలు తీసుకోవడం మానేయాలి"

"ముందు నీ దగ్గర లక్షన్నర క్యాష్ చూపించి అప్పుడు మాట్లాడు"

ఓ నిమిషం ఆయనవంక అలాగే చూసిన రామారావు జేబులోనుండి బంగారు నగలు తీశాడు. కర్చీఫ్ విప్పి టేబుల్ మీదుంచి" సరే ఇవి మా అమ్మ నగలు. చెడి అమ్ముకున్నా వీటి విలువ మూడు లక్షలు దాకా వస్తుంది"

"వ్వాట్?" అదిరిపడ్డాడు మహదేవయ్య.

"సరే! ఇవి బంగారు నగలో కాదో అన్న మీకు అనుమానం కలగచ్చు. అందుకని ఇవిన్ని రోజులూ బ్యాంక్ లాకర్లో ఉంచిన కాగితాలు, వీటి ఫోటోలు, తూకాలు ఇదిగో ఈ కవర్లో ఉన్నాయి" కవరు తీసి అన్నీ ఆయన ముందుంచాడు. "ఇవి అసలు సిసలు బంగారు నగలు సర్."

"ఔను కానీ ఎందుకింత రిస్క్ తీసుకోవడం?"

"సార్! నీతి, నిజాయితీల వల్ల కేవలం నా ఒక్కడికే ఆనందం కలిగితే అది మూర్ఖత్వం. మీలాంటి వారిక్కూడా కలిగితే అవి మానవనైజం. నాది మూర్ఖత్వమో, మానవ సహజమైన గుణమో తేల్చుకోవడానికి సిద్ధపడ్డాను. అందుకే ఈ రిస్క్ తీసుకోదల్చుకున్నాను."

"ఒకవేళ నాకలాంటి ఆనందమేదైనా కలిగినా కలగలేదని నేనీ నగలు తీసేసుకుంటే?"

"అప్పుడూ నేనే ఓడినట్టు. ఎందుకంటే మీరు లంచం తీసుకోవడానికీ, ఈ నగలు తీసుకోవడానికి పెద్ద తేడా.. నా దృష్టిలో పెద్ద తేడాలేదు."

"సరే! నువ్వు నీ నగలు పందానికి పెట్టావు. మరి నన్నేం పెట్టమంటావ్?""

"మీ అవినీతి, లంచగొండి తనము, అప్రియ భాషణత్వమూను.."



కౌముది

"అవునా?"

"అవును సర్! పందానికి పెట్టిన ఈ నగలను ఇప్పుడే నేను మీ పరం చేస్తున్నాను. అంటే ఈ రోజు నుండి నేనా నగలను వాడుకోలేను. అలాగే నేనడిగిన ఆ మూడూ మీరు పందెంలో పెట్టానని మీరు చెప్పిన క్షణం నుండి వాటిని మీరూ వాడుకోరాదు. "

"మనలో మాట. మీకు తెలీకుండా నేవాడుకుంటేనో?"

"సర్! మూడు సంవత్సరాల క్రితం మీకు ఓ వ్యక్తి లంచంగా యాభైవేలు ఇచ్చాడు. ఆ డబ్బు మీనుండి ఎవరో కొట్టేశారు. అది ఆ వ్యక్తే అని మీకు అనుమానంగా కూడా ఉండింది. కానీ మీరతన్ని ఏమీ అనకుండా అతని పని చేసిపెట్టారు. లంచం మాట అటుంచితే మీలోని నిజాయితీనే నా చేత ఈ పందానికి పూనుకునేలా చేసింది."

"ఇదంతా నీకెలా తెలుసు?"

నవ్వాడు రామారావు. "ఇందుకు సంబంధించిన రూల్స్ ఇంకా ఏమైనా ఉన్నాయా?"

"ఉన్నాయి సర్."

"చెప్పు అదేంటో?"

●●●

"చెప్పు. ఏం చెయ్యమంటావ్?"

"నువ్వు ఓడిన తరువాత ఈ స్టాఫ్ చేత లంచం మాన్పించు. కానీ ఈరోజు నుండే నువ్వు మానెయ్. అదే లంచం తీసుకోవడం" అన్నాడు రామారావు.

"సరే నీ అన్ని షరతులకు నేనొప్పుకుంటున్నా"

"మరి నేను వెళ్ళిరానా?"

"మధ్యలో నువ్వొచ్చి నేనోడిన నా పైసల్ నాకియ్యమనవు కద?"

"నేను ఆలోచించాక మాట్లాడతాను. మాట్లాడాక ఆలోచించను"

"నా స్టైలు గూడ గదే ఐతే నువ్వు తెలివైనోడివి గనగ మాటల్లో చెప్పనీకి వచ్చింది. నాకు గట్లరాదు. గదే తేడా."

"సరే వస్తా!"

"ఎల్లిరా"

●●●

ఏ రోజు రామారావుతో పందెం కాశాడో ఆ రోజు నుండి మహదేవయ్య మనసులో అలజడి మొదలయింది 'ఏమీటీ రామారావు? ఏమాశించి తనతో ఈ పందానికి దిగాడు? మధ్య తరగతివాడి బంగారు కల బంగారం. అలాంటి బంగారాన్ని పందానికి పెట్టడానికి ఎంతటి వాడైనా వెనుకాడతాడు. పైగా తనకి పైసా కూడా ఆదాయం లేని విషయంలోనా?

నిజంగా తననుండి లంచం తీసుకోని వ్యక్తినే ఆశిస్తున్నాడా లేక ఇందులో అతనికేమైనా లాభముందా? అతనెవరితోనైనా ఆరులక్షలకి పందెం కట్టి తనకీ మూడులక్షల బంగారాన్ని ఇచ్చాడా? ఈ అనుమానం రాగానే ఆయన రామారావు గురించి ఎంక్వైరీ చేయించడానికి ఇద్దరు మనుషులను నియమించాడు.

ఐతే ఈ ఎంక్వైరీ వల్ల వెల్లడైన చాలా విషయాలని ఆయన జీర్ణించుకోలేకపోయాడు. మనుషుల్లో ఇలాంటివారు కూడా ఉంటారా? అనిపించింది. ఎలాంటి స్వార్థం లేకుండా రామారావు తనతో పందెం కట్టాడని నిర్ధారించుకున్నాడు. ఆ నిర్ధారణతో ఆయనలో సంఘర్షణ ప్రారంభమైంది.

అది చాలా తీవ్రరూపం దాల్చి మనస్సుని కోసివేతగా మారింది. ఆ క్షణం నుండి ఆయనకి నేనేంటి? రామారావేంటి? అనే పోలిక మొదలైంది నిముష నిముషానికీ అతన్ని తనతో పోల్చుకోసాగాడు. అప్పటినుండి ఆయన తిరస్కరించే లంచాన్ని పందెంకోసం కాకుండా మనస్ఫూర్తిగానే తిరస్కరించసాగాడు. ఇందువల్ల దిగజారిపోయిన తనలోని మానవత్వపు విలువల్ని కొద్దిగా పెంచుకుంటున్నట్టు ఊహించుకోసాగాడు.

రెండవ వ్యక్తి నరసింహ. మహదేవయ్య లంచాన్ని తిరస్కరించడం అతనికి కొరుకుడు పడని విషయంగా మారింది. చాలా పెద్ద మొత్తాల్లో ఆయన రాబడినాశిస్తున్నారేమోనని పెద్ద మొత్తంలో లంచం ఇచ్చి తన బావమరిదినే పంపించాడు. అది వెనక్కి వచ్చేసరికి పిడికిళ్ళతో జుట్టు పీక్కున్నాడు.

'ఏంటీ రామారావు? ఏం చెప్పి మహదేవయ్య మనసు మార్చాడు? మనుషులు మాటలతో మారిపోతారా? అందునా మహదేవయ్య వంటి లంచగొండులు? వారు మారడమా? కాని ఇది నిజం. ఎలా జరుగుతోందిది? ఎప్పుడూ రుసరుసలాడుతూ కసురుకునే మహదేవయ్య ప్రశాంత వదనంతో చిరునవ్వుతో లంచాన్ని కాదంటున్నాడు.

తన అంచనాలకి అందని మాయ ఏదో జరుగుతోంది. రామారావే చేస్తున్నాడది. మంత్రగాడేమో. మాయల వాడేమో. గారడీవాడై ఉంటాడా? అన్ని శక్తులు కలగిన ఏ స్వాములువారైనా అయి ఉంటాడా? తను లేనిపోని పోకడలకి పోయి పందెం కాసాడా? రామారావు నెగ్గితే ఈ ఆఫీసు వాళ్ళందరి చేతా లంచం తినడం మాన్పించాలి. అది తనవల్ల అవుతుందా? చూడబోతే రామారావు నెగ్గేట్టే ఉన్నాడు. తనిప్పుడు ఏం చేయాలి? అసలు రామారావు బుట్టలో తానేల చిక్కాడు?

అతని దగ్గర ఏదైనా ఆకర్షణ ఉందా? మంత్రం ఉందా? తావీదులు యంత్రాలు మెడకి మొలలోనూ కట్టుకు తిరుగుతాడా? అందుకే తాను మోసపోయాడా? అతను కదా మోసపోవలసింది? ఒకటీ రెండూ కాదు ఏకంగా ఇరవై ఐదువేలు ఏ ఫలితాన్ని ఆశించి తనకిచ్చాడు. రాతలేదు. లెక్కలేదు. పత్రం, సాక్ష్యం ఏమీలేవు. ఖాళీ తన నోటి మాటవిని నమ్మి ఇచ్చి చక్కాపోయాడు. ఎందుకు? ఎందుకు? ఎందుకు? '

●●●

దీక్షగా పనిచేసుకుంటున్నాడు మహదేవయ్య. ఆఫీసు గది బైట ఏదో గొడవ వినిపించడంతో బైటికి వచ్చాడు. "ఏంటి గొడవ?" అడిగాడు.

"సార్ ఈయనెవరో పల్లెటూరు వాడులా ఉన్నాడు. ఈ కొత్త దంపతులను తీసుకుని ఆఫీసుకి వచ్చాడు. ఇది గుడంట. మీరు దేవుడంట విడవమంటాడు" ఆయన అటు తిరిగితే వధూవరులు, ప్రక్కనే ఓ యువకుడు. 'ఏంటీ గొడవ?' అడిగాడు.

"సార్ నా ఓం పేరు విమల్. మా నాన్నగారు యాక్సిడెంట్‌లో పోయారు. ఆయనకి సంబంధించిన డబ్బు వస్తే గానీ పెళ్ళి చేయలేని పరిస్థితి. వరుని తల్లిదండ్రులేమో త్వరపెడుతున్నారు. కారణం వరుని నానమ్మ చావు బతుకుల్లో ఉంది.

ఇపుడు పెళ్ళి చేయకుంటే మరో ఏడాదిదాకా కుదర్దు. ఏం చేయాలో తోచలేదు. ఈ ఆఫీసుని గురించి తెలిసిన మావాళ్ళంతా భయపెట్టారు. ఇక్కడ టాప్ టు బాటమ్ లంచాల్తో మునిగుంది అన్నాడు. పెట్టడానికి నా దగ్గర బి.కాం డిగ్రీ తప్ప ఏమీలేదు.

దేవుడి మీద భారం వేసి కాగితాలు తీసుకుని ఈ ఆఫీసుకి వచ్చాను. సార్! వారం రోజుల తరువాత నా ఇంటికి పోస్ట్‌లో వచ్చిన కాగితాలు చూసి షాకయ్యాను. ఏ కాగితాలకోసం లంచం ఇవ్వడానికి మా ఇల్లు తాకట్టు పెట్టాలనుకున్నానో అవి పావురాల్లా ఎగురుకుంటూ మా ఇంటికి వచ్చాయి.

అందుకే చెల్లెలి పెళ్ళి చేశాను. వధూవరులని తీసుకుని గుడికి వెళ్ళమంది మా అమ్మ. సారీ కొత్తగా కట్టిన గుడి ఇది. దేవుడు మీరు. వీళ్ళని ఆశీర్వదించండి" అక్షింతలు చేతిలో పెట్టాడు.

తనకాళ్ళకి మొక్కుతున్న వధూవరులను కంగారుపడుతూ దీవించి

"చూడు విమల్ ఇది గవర్నమెంటు ఆఫీసు. ఇలాంటి పనెప్పుడూ చేయకు. ఇలా ఎప్పుడూ రాకు" అన్నాడు.

"సారీ సార్! మా చెల్లి బలవంతం మీద రాకతప్పలేదు. వస్తాం సార్. ఇదిగో భయ్యా! ఈ డబ్బా నిండా మంచి నెయ్యితో చేసిన స్వీట్లూ, లడ్డూలు ఉన్నాయి. ఇవి మీ ఆఫీసు వాళ్ళందరికీ పంచు" అంటూ ప్యూనుతో చెప్పి తనవాళ్ళతో వెళ్ళిపోయాడు విమల్. ఆ తెల్లవారే మహదేవయ్య నుండీ పిలుపు వచ్చింది రామారావుకి.

"గుడ్ మార్నింగ్ సర్!"

"రావయ్యా కూర్చో."

"కూర్చున్నాడు. చెప్పండి సర్."

"ఇదిగో నీ బంగారం. అన్నీ సరిగా ఉన్నాయో లేదో లెక్క చూసుకో" బంగారం అందించాడు.

"అదేంటి సర్?" ఆశ్చర్యంగా అడిగాడు.

"రామారావ్ ఈ పందెంలో నే ఓడానయ్యా!" అన్నాడు. ఆయన కంఠంలో ఒణుకు.

"కానీ సర్. పందెం గడువు తీరడానికి ఇంకా రెండు రోజులుంది"

"నాకు తెలుసు. ఎలాగూ ఈ పందాన్ని ఓడాను. రెండు రోజుల ముందే నా ఒప్పుకుని నా ఓటమిలో ఉన్న గెలుపుని అనుభూతి చెందాలనుకున్నాను. నీకు తెలుసా? నేనిప్పుడు ఓడి గెలిచాను. ఆఫీసరుగా ఓడాను. మనిషిగా గెలిచాను."

"సర్?" నమ్మలేనట్టు ఆశ్చర్యంగా అన్నాడు.

"ఔను. మంచిపని ఇంత సంతృప్తినిస్తుందని నాకు తెలీదయ్యా. చూడు ఈ ఉత్తరాలన్నీ చూడు. దీవిస్తూ, ఆశీర్వదిస్తూ, నమస్కారాలు చేస్తూ, ఇంకా ఎన్నో భావోద్వేగాలకి లోనౌతూ జనాలు రాసినవి. రామారావ్ నీకు మాట ఇస్తున్నాను. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు ఇక లంచం ముట్టనయ్యా! నన్ను నమ్ము."

"నమ్ముతాను సర్. మీ మీద అపారమైన నమ్మకం ఉండబట్టే ఈ ఆఫీసులో మరెవరి జోలికీ పోకుండా మీతోనే పందెం అన్నాను."

"నువ్వెలాగైనా చాలా గొప్పవాడివయ్యా!"

"కాదు సర్. గొప్పవాళ్ళు మీరు. మీలోని మానవతని అలా తట్టానంతే. అదే నేను చేసింది. అంతే. మీలోని ఆ మంచితనం నెమలిలా పురి విప్పి ఆడితే అది మీ గొప్పే. వస్తాసర్"

"ఇదిగో నీ బంగారం తీసుకువెళ్ళు.

"సరే సర్!"

●●●

"రామారావుగారూ! నర్సిమ్మన్న రమ్మంటున్నాడు" తలవంచుకుని పనిచేసుకుంటున్నాడతను.

"నరసింహ! ఎక్కడున్నాడు?" అన్నాడు.

"రండి తీసుకువెళతా" ఆ యువకుడు అన్నాడు.

"ఒక్క నిముషం" అంటూ కంప్యూటర్ ఆఫ్ చేసి, అక్కడ నీట్‌గా అన్నీ సర్దేసి ప్యూన్ని పిలిచాడు.

"నేనలా బైటికి వెళ్తున్నాను. ఓ గంటవరకూ రాను. ఈ గంటకి పర్మిషన్ లెటర్ రాసి ఆఫీసరుగారు వస్తే సంతకం చేయించుకురా. లేదంటే నే రాగానే వెళ్తాను" అంటూ బైటికి నడిచాడు.

ఆఫీసు ముందున్న చెట్లనీడలో కూర్చుంటూ "చెప్పు నర్సింహ" అన్నాడు.

"రామారావ్ నేను పందెంలో ఓడిపోయిన" రామారావు ఇచ్చిన డబ్బులు జేబులో నుండి తీస్తూ అన్నాడు నరసింహ. "అదేంటి? ఇంకా గడువుందిగా?" రామారావు అడిగాడు.

"ఆఁ ఉంది ఒక్కరోజు."

"మరీ ఓటమి మాటలేంటి?"

"యుద్ధంలో విజయం ఊరికినే లభిస్తుందేంటి? అందుకు పోరాడాలి. ఆయనకి పెద్ద మొత్తంలో నువ్వే లంచం ఇచ్చి పంపించవలసింది. బైటివారి దగ్గర పుచ్చుకోడు. కాని నీ దగ్గర తీసుకుని ఉండేవాడేమో"

"నా నుండి అయినంత చేసిన. ఆయన దగ్గరికే రానిస్తలేడు"

రామారావు మాట్లాడలేదు. అంతలో నరసింహ గ్యాంగ్ వచ్చారు. అందులో ఓ యువకుడు అన్నాడు.

"ఆఫీసరు లంచం ఒద్దనడానికి కారణాలు వంద రాశాం. చివరకు దెయ్యం పట్టడం, పిచ్చి రావడం, దేవత ఆవహించడం కూడా వ్రాసి 'ఇదికాదు, ఇదికాదు' అన్ని అన్నీ కొట్టేస్తూ వచ్చాం. ఇక మిగిలింది రెండవ కారణం, 45 వ కారణం రెండూను."

"ఏంటా రెండు?"

"మొదటిది ఆఫీసరు మనస్సు ఉన్నట్టుండి మారిపోవడం. ఇదేమీ సత్యకాలం, కృతయుగం కాదు. ఆయన గదిలోకి వెళ్ళిరాగానే ఆయన మారిపోవడానికి. పోతే మిగిలింది 45 వ కారణం. అదేంటంటే లంచం తీసుకోవద్దని మీరే ఆఫీసరు గారికి ఎక్కువ మొత్తంలో లంచం ఇచ్చి ఉండాలి. ఈ విషయం రాస్తున్నప్పుడు 'ఇలాంటి మూర్ఖులు కూడా ఉంటారా?" అంటూ ఎగతాళి చేసుకుంటూ నవ్వుకున్నా,. ఐతే రోజులు గడిచేకొద్దీ మాకు ఆ కారణమే క్రమంగా ఎదుగుతూ వామనుడిలా కనబడుతుంది. మేం నవ్విన కారణం ఇపుడు మమ్మల్ని చూసి నవ్వుతోంది."

రామారావు చూస్తున్నాడు అతని వంక.

"ఇప్పుడు చెప్పండి. నర్సిమ్మన్న ఓడిపోయానని ఒప్పుకున్నాడు. మీ డబ్బు మీకిచ్చాడు. మీ ఒప్పందం, పందెం ముగిశాయి. మీరే గెలిచారు. ఆఫీసరుగారికి మీరు లంచం ఇచ్చారా లేదా?"

"ఔనా?"

"ఔను"

"ఎంతిచ్చారు?"

"మూడు లక్షలు"

"క్యాషా?"

"కాదు బంగారు నగలు"

"వారెవా! లంచం ఇచ్చి ఆయన చేతులు కట్టేస్నావ్. లంచం తినడని నాతో పందెం కాసినవ్. గాయినెవరూ? ఎత్తులు జిత్తులు బాగా తెలిసినోడు. బాపనయ్యా..?"

"చాణక్యులు"

"ఆఁ! గాయననువ్వేనయ్యోయు. "

"ఐతే ఓ మాట. గడువుకి మూడురోజుల ముందే మహదేవయ్యగారు నా నగలను నాకు ఇచ్చేశారు. తాను ఓడి గెలిచాననీ, చెప్పారు. ఇంతకీ ఈ పందాన నువ్వా ఓడానంటావా?"

"ఆఁ! సందేహం లేదు."

"కావాలంటే ఇంకా గడువుతీసుకో"

"ఒద్దు పందాన ఉన్నప్పుడే కాదన్నసారు. ఇప్పుడు మారినాంక తీసుకుంటడా? తీసుకోడు"

"ఇప్పుడు చెప్పు. నువ్విచ్చిన మాట నిలబెట్టుకుంటావా? లేదా?"

"నేను మాటిస్తే మాటే"

"పందాన నువ్వోడావనీ, నువ్వన్న మాట చెల్లించాలనీ నేను అడగను. మళ్ళీ ఆలోచించు" నర్సింహ నవ్వాడు పెద్దగా. నెలరోజులనాడు నీ మాయలో పడకుండా ఆలోచించాల్సి ఉండె గప్పుడు మీసాలు దువ్వి, గిప్పుడు వాసాలు లెక్కబెట్టుడెందుకు? నా కళ్ళు తెర్చుకున్నయ్. ఆఫీసయ్యే మారితే మస్తేవుంది? నేనూ మారిన. ఈరోజు కెళ్ళి ఈ ఆఫీస్‌ల ఒకడు లంచం తిన్నా ఆని పుచ్చె పగిలిపోతుంది. ఇది చెప్పనీకే పిల్చిన. ఒస్త" నరసింహ తన వాళ్ళతో సహా లేచాడు.

అతను రెండడుగులు వేయగానే రామారావు అన్నాడు. "అన్నా! నర్సిమ్మన్నా!"

నరసింహ వెనుతిరిగి చుశాడు. "ఏమన్నా అన్నవా?" అడిగాడు.

"ఆఁ అన్న నర్సిమ్మన్నా అన్న."

"నన్ను నర్సిమన్నా అన్నావా?" ఆనందం, ఆశ్చర్యం కలుగగా అన్నాడు.

"ఈ రోజు నుండి నువ్వు నాకు నర్సిమ్మన్నవి. ఎందుకంటే ఓ చిన్న పందెంతో ఎంతో పెద్ద భారాన్ని నీ తలమీద వేసుకున్నావు. నీవాళ్ళు తప్ప మన పందానికి సాక్షులు లేరు. నా డబ్బుకి సాక్షులు లేరు. ఐనా మాటమీద నిలబడ్డావు. ఎవరుంటారు నీలాగ?

"నాలాంటి వారు వీధికి పదిమందైనా దొరుకుతారు. పందెం పెట్టగలను. నగలు ఇవ్వగలను. పాతికవేలు పెట్టి ఎలాంటి ఒప్పందమైనా చేయగలను. బోల్డు కబుర్లు చెప్పగలను. కానీ నీలా కార్యాన్ని తలమీద వేసుకోలేను. కార్యాచరణ శూరుడివి నువ్వే. నాలాంటి వారి వల్ల జనాలకి తప్పేంటో తెలుస్తుంది. కాని దాన్ని ఆపేశక్తి నీలాంటి వారి వల్లే అవుతుంది. అందుకే ఈ పందాన నువ్వు ఓడినా నీ మనసుతో గెలిచావు. ఈ డబ్బు నువ్వే ఉంచు" డబ్బు వెనక్కిచ్చాడు రామారావు.

"లంచమిస్తున్నవా?" అనుమానంగా అడిగాడు నరసింహ.

"కాదు ఇది ఈ ఆఫీస్ ఫండ్ ఇది నీ పేర బ్యాంక్‌లో ఉంచు. ప్రాణావసరపరిస్థితిలో ఉన్నవారికీ, ఆపదలకీ, ఇక్కడి వారి చిన్న చిన్న అవసరాలకీ నువ్వే వాడు. నాకింకా డబ్బు రావల్సి ఉంది. రాగానే ఇస్తాను. అదికూడా నీ దగ్గరే ఉంచు.

నూటికి పది చొప్పున వడ్డీకి తెస్తున్న వారు ఇక్కడా ఉన్నారు. అవసరం తెలిసి వాళ్ళని ఆదుకో. నేను ఈ ఆఫీసులో పనిచేసినా, చేయకపోయినా ప్రతీ సంవత్సరం ఇదే రోజున మనం కలుసుకోవాలి.

నా అవసరానికి మించిన డబ్బు ఎప్పుడు కనిపించినా నీకిస్తుంటాను. నువ్వీ సాయం చెయ్యి. ఎందుకంటే ఈ ప్రపంచంలో నీకన్నా నమ్మకస్తుడు. అందునా ఇలా ఆదుకోవడంలో నాకెవరూ లేరు."

నరసింహ చూస్తున్నాడు రామారావు వంక.

"నర్సిమ్మన్నా ఇస్ భయ్యాసే గలే నహీ మిలాగే?" చేతులు చాచి అడిగాడు.

నరసింహ వెంటనే రామారావుని గాఢాలింగనం చేసుకున్నాడు. ఇద్దరి కళ్ళలోనూ నీళ్ళు.

"రామారావ్ భయ్యా! ఈ రోజు కాణ్ణించి నువ్వునా తమ్మునివి. నీకు నా ఔసరం కలిగితే నర్సిమ్మన్నా అని పెద్దగా పిల్వు చాలు. నీ ముందర వాలుత." అన్నాడు నరసింహ.

"తప్పకుండా పద. ఆఫీసులోకి వెళదాం."

●●●

**ఆరు నెలల తరువాత ఓ రోజు ఆఫీసు బయట** చెట్ల నీడలో కూర్చుని రామరావు, నరసింహ మాట్లాడుకుంటున్నారు. "నర్సిమ్మన్నా! ఓ ముఖ్య విషయం చెబుదామని నిన్ను పిలిచాను"

"ఏందది?"

"నీతో మాట్లాడి వెళ్ళాక నేను ఉద్యోగంలో రిజైన్ చెయ్యబోతున్నాను. అదే నా ఉద్యోగానికి" బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు నరసింహ "ఏందీ రిజైన్ చేస్తవా?"

"ఔను. నేనొక బృహత్తర కార్యం చేయాలని సంకల్పించుకున్నాను. అందుకే రిజైన్ చేయక తప్పదు"

"నువ్వంత పట్టుగ ఉన్నవంటే అదేదో పెద్దదై ఉంటది. చెప్పు డబ్బేమన్నా కావాలా? నువ్వు ఇచ్చిందే ఉన్నది నాదగ్గర."

"అవసరం లేదు. నా బంధువులంతా కలిసి ఓ వందమందిదాకా ఉంటారు. వాళ్ళందర్నీ ఆరునెల్లపాటు రహస్యంగా దాచేయాలి నువ్వు. ఎక్కడ దాస్తావో నీ ఇష్టం. మరో నరమానవుడి కంట పడద్దువాళ్ళు. పడ్డారంటే వాళ్ళు ప్రాణాల్తో ఉండరు. ఇందుకయే ఖర్చు ఎంతైనా నేనిస్తాను."

"డబ్బు సంగతి అట్లుండనియ్యి. మరి నువ్వెక్కడుంటవ్?"

"నేను జనం మధ్యలోనే ఉంటాను. ప్రమాదం నాక్కాదు. నావాళ్ళకే రావచ్చు. ఐనా నేనా పనిని మొదలెట్టడానికి ఇంకా టైముంది"

"అది సరేగానీ నువ్వే ఆళ్ళకి చిక్కితే?"

"చిక్కను"

"ఆ మాటనకు. చిక్కితే?"

"..........."

"ఆలోచించకు. నీ కోసం గూడ ఏదో ఇంతెజాం చేస్త."

"నీ ఇష్టం. నాకు అంత అవసరం లేదనే అనుకుంటున్నాను" సరే నే వస్తాను. నాకేదైనా కావాలంటే?"

"... అంటే.. నాకు ఫోన్ చెయ్యి. ఎవరికన్నా చెప్పి పంపిచ్చు. నీకు నేనున్న. బయమొద్దు. ఈ రోజు కాణ్ణించి నావోల్లు నల్గురు నీకు ముందు ఎన్కలుంటరు?"

"ఇవ్వాల్టినుండి వద్దు. పేపర్ క్రమం తప్పక చదువుతూ ఉండు. నీ అవసరం నాకెప్పుడుందో నీకే తెలుస్తుంది. నర్సిమ్మన్నా! ఈ యుద్ధంలో నే గెలవచ్చు. ఓడవచ్చు. అందుకు నాకు బాధగా లేదు. కానీ నేనసలు లేకుండా పోతే.. మాఅమ్మా, నాన్న, తాతయ్య, నాకో స్నేహితుడున్నాడు శివ అని.. వాణ్ణీ నువ్వే చూసుకోవాలి.

నా బదులుగా నువ్వే రామారావు కావాలి. ఇది గుర్తుపెట్టుకో"

"గట్ల మాట్లాడకు. నిన్ను గూడ రక్షించుకుంట. ఎల్లిరా!"

"వస్తానన్నా!"

వెనుతిరిగి ఆఫీసు మెట్లు ఎక్కుతున్నాడు రామారావు.

●●●

"తాతయ్యా!" రామారావు పిలుపుతో పేపర్ చదువుతున్న తాతగారు తలెత్తి చూశారు.

"నీతో మాట్లాడాలి" అంటూ ప్రక్కనే ఉన్న కుర్చిలో కూర్చున్నాడు.

"చెప్పు" అన్నాడాయన.

"ఏదైనా పనికి వెళ్ళే ముందు పెద్దవాళ్ళ ఆశీస్సులు తీసుకోవాలంటారు. ఎందుకు?"

"అలా దీవెన పొందడం మానసిక బలాన్నిస్తుంది."

"అలా అయితే ఇప్పుడు నన్ను మనస్ఫూర్తిగా దీవించు."

అతనికి ఊహ తెలిసినాక చేసిన రెండవ నమస్కారం ఇది. "తాతా! నాకు చాలా భయంగా ఉందిరా!"

"నీకు నీ మీద నమ్మకం తరిగిందో, నా మీద పెరిగిందో తెలీక.."

"రెండూ తప్పే తాతయ్యా! నాకు నా మీదెప్పుడూ నమ్మకమే. అలాగే నీ మీదా ఉంది" దీన్లో తరుగుదల పెరుగుదల లేవు. ఎప్పుడూను."

"అలా అయితే సంతోషమే."

"తాతయ్యా! నగలు నాకిమ్మని అడిగినప్పుడు నువ్వు ఎందుకని మాటమాత్రం కూడా అడగలేదు. అలాగే 'తొలిసంధ్య'లోనూ, గవర్నమెంట్ ఆఫీసులోనూ ఉద్యోగం మానినప్పుడు మీరెవరూ ఎందుకని మాట మాత్రం కూడా అడగలేదు. గవర్నమెంట్ ఉద్యోగం మానాక నేనింతకాలమూ నే ఉదయం వెళ్ళి రాత్రి ఇంటికి వస్తున్నా మీరెవరూ ఎక్కడికని గానీ, ఎందుకనిగానీ నన్నడగలేదు. కనీసం ఈరోజైనా నన్నడగలేదు. 'విషయం ఏమిట్రా?' అని నా మీద మీకు అంత నమ్మకమనుకోనా? నిర్లిప్తత అనుకోనా?"

"నమ్మకమేరా! మాములుగానే బిడ్డలమీద తల్లిదండ్రులకి నమ్మకం ఉంటుంది. అలాంటిది నీవంటి వాడి మీద ఉండేది అపారమైన ప్రేమ విశ్వాసాలతో కూడిన నమ్మకం."

సూర్యం ప్రక్కనే కూర్చుని పేపర్ చదువుతున్నాడు. జయ టీ తాగుతూ పక్కనే ఉంది.

"సరే! మీకిప్పుడు నేను ఓ మంచివార్త అంటే ఓ గుడ్ న్యూస్, ఓ బ్యాడ్ న్యూస్ చెబుతాను."

'లా' పాసయ్యాను. గవర్నమెంట్ ఉద్యోగం మానేశాక ఓ పెద్ద లాయర్ దగ్గర అసిస్టెంట గా చేశాను. కోర్ట్‌కి వెళ్ళాను. చిన్న చిన్న కేసులు వాదించాను కూడా.

ఐతే రేపు నేను సుప్రీం తలుపులు తట్టబోతున్నాను. లాయరగా కాదు. ఓ పిటీషనర్‌గా. ఈ దేశానికి సంబంధించిన ఓ విషయాన్ని సుప్రీం కోర్ట్‌లో కేసుగా దాఖలు చేయనున్నాను. ఇదేదో ఆషామాషీ వ్యవహారం కాదు. అలాంటివి ఒకటికాదు. రెండు. అవి ఈ దేశంలోని మాములు జన్మ కూడా వ్యతిరేకించేది ఒకటి. రెండవది రాజకీయాన ఉన్న ప్రతి ఒక్కరూ కాదంటారు. కాదనడం కాదు ముందు నా పీక కోసేస్తారు. నేనూ, నాతోపాటు మీరందరూ డేంజర్ లో పడనున్నారు."

ఊపిరి తీసుకోవడానికి రామారావు ఆగాడు. ఊపిరి బిగబట్టి వాళ్ళు వింటున్నారు. "రాజ్యాంగంలో చేర్చవలసిన విషయమొకటి, మార్చవల్సిన విషయమొకటి. వీటిని గురించి తపనపడుతున్నాను. మీరు చేయవల్సింది ఏంటంటే మనకీ, మన బంధువులకీ, స్నేహితులకి అందరికీ ఆపదరావచ్చు.

అందుకని మన బంధువులు, శివవాళ్ళ బంధువులు, సిరియాళ్ వాళ్ళు, సుబ్బాయమ్మగారి కుటుంబం, ప్రభాకర్ అంకుల్ వాళ్ళు. ఇంకా మీకున్న దగ్గరి స్నేహితులు, హితులు ఎవ్వరికైనా ఏ నిముషాన్నైనా ఆపద కలగొచ్చు. అందుకని మీరంతా ఒకే చోట ఉండండి. నామిత్రుడు నర్సిమ్మన్న మిమ్మల్ని సురక్షిత స్థలానికి చేర్చి మీక్కావల్సిన వసతులు, సౌకర్యాలు చూస్తాడు. నాన్నా! మీరు, తాతయ్యా పూనుకుని వీలైనంత త్వరగా వాళ్ళందరినీ మనింటికి చేర్చండి. నాకోసం ఎవరి ప్రాణాలు పోవడం నాకిష్టంలేదు" అంటూ వెళ్ళి తన రూములో కూర్చున్నాడు. ఏదో చదివాడు.

ఏంటో వ్రాశాడు. ఏమిటో ఆలోచించాడు. సాయంత్రానికల్లా సూట్ కేసు తీసుకుని ఇంటినుండి బైటపడ్డాడు.

●●●

రామారావు చెప్పినట్టు అతని బంధువులు, మిత్రులు అతనింటికి చేరారు. మరునాడు రెండు బస్సులలో రాష్ట్రాలకు రాష్ట్రాలు దాటించి, కాకులు దూరని కారడవిలాంటి ప్రాంతాన ఉన్న ఓ కొత్త ప్రాంతానికి చేర్చాడు నరసింహ. ఆ కొండమీద ఉంటున్నాడొక స్వామీజీ. అక్కడికి చేర్చాడు అందరినీ.

"సామీ! నా తమ్ముడు నన్ను నమ్మి ఈల్లను అప్పగించిండు. నేను మీకప్పగిస్తున్న. నేనిక్కడుంటే నా కోసం వెతుక్కుంటూ జనాలొస్తరు. నే ఎల్త. అందర్నీ కాపాడే భారం నీదే" అన్నాడు.

"నరసింహా! నువ్వు భయపడకు. వీళ్ళను నా ప్రాణంగా చూసుకుంటాను. ఇక్కడికి దగ్గర్లో ఓ కోయజాతి ఉన్నది. వాళ్ళంతా నా ప్రియశిష్యులు. రెండు వందల ఇళ్ళుంటాయి అక్కడ నువ్వు ముందే ఇచ్చిన డబ్బుతో బియ్యం, గోధుమ పిండి, పప్పులు నూనెల వంటి సరుకులు తెప్పించి అక్కడ దాచి ఉంచాను. వీళ్ళందర్నీ ఇంటికొకరి చొప్పున అక్క ఉంచుతాను అంతా ఒకే చోట ఉంటే ఎవరికైనా అనుమానం కలగొచ్చు. ఏమంటావ్?"

"ఔను సామీ. ఇంటికొకళ్ళుంటే ఇంక బాధే లేదు."

"ఆఁ! అందరికీ చెప్పావా? నేను ఒక పూట భోజనం పెడతాను. ఒక పూట పండ్లు దుంపలు రొట్టి వంటివేదో పెడతాను."

"అన్నీ చెప్పాను సామీ. ఆరునెలలు కాదు. ఏడాదికి కావల్సిన సరుకంతా తెప్పించి ఉంచుతానన్నారు?"

"ఉంచాను. కానీ నువ్వు రావడం ఆలస్యమైతే వీళ్ళు ఇబ్బంది పడకూడదు కదా? సరే నీవిక వెళ్ళిరా!"

నరసింహ వెళ్ళిపోయాడు. బస్సులు కూడా వెనక్కి వెళ్ళాయి. పల్లెల్లో జనాన్ని ఫ్రీగా ఎక్కించుకుని తీసుకు వెళ్ళారు వారి గమ్యస్థానాలకి. బస్సులని గమనించిన కొందరు ఆర్.టి.ఎ వారు ప్రజలు, పౌరులు, వారూ, వీరూ బస్సులు జనాలతో వెళ్ళి జనాలతో రావడం చూశారుగానీ అందులోని జనం మారారని తెలుసుకోలేకపోయారు. గమనించనూలేదు.

బస్సులో వచ్చేప్పుడు నరసింహని అతని అనుచరుడు అడిగాడు. "అన్నా! రామారావు బంధువులు, స్నేహితులు, అందరికీ ఆపద కలుగుతుందని ఇక్కడికి తెచ్చావు. మరి నీకు ఆపద కలిగితే అని, "గీ విషయం తమ్ముడు గూడ చెప్పె. అందుకే ఆలోచిస్తున్న" అన్నాడు నరసింహ. అంతే! తనింటికి చేరిన తెల్లవారి అతనుకూడా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు.

●●●

సిటీలో ఉన్న జాతీయ రహదారి రోడ్డది. పేదలు కొందరు రోడ్డు ప్రక్కన డేరాలు వేశారు. రకరకాల బొమ్మలు, ఆటవస్తువులు, దేవుడి విగ్రహాలు అమ్ముతున్నారు. కొన్ని ఫైబర్వి, కొన్ని నాముతో చేసినవి. కొన్ని డేరాల ముందు క్రికెట్ ఆటకి సంబంధించిన వస్తువులు, కొన్నింటి ముందు సోఫా సెట్లు, కొన్నింటి ముందు పండ్ల బళ్ళు, చిన్నపిల్లల ఉయ్యాలలు, కుర్చీలు, అమ్ముతున్న ఓ సర్దార్జీ చిన్న స్కూటీదిగి "అమ్మా! అరటి పండ్లు డజనెంత?" అడిగాడు హిందీలో.

"ముప్పై ఐదు డజను" అందామె. ఆమె ముస్లిం వృద్ధ మహిళ బురఖా వేసుకుంది. వంగిపోయింది నడుము. కట్టె ఆధారంగా వంగి నడుస్తోంది. "ముప్పై కియ్యి" అన్నాడతను.

"రావు" అందామె.

"సరే ఎన్నొస్తే అన్నియ్యి.. ముప్పైకి" అంటూ యాభై రూపాయల నోటు ఇచ్చాడు. ఆమె అదందుకుని "చిల్లర తీసుకు వస్తా" అంటూ డేరాలోకి వెళ్ళింది. పండ్లు ఇచ్చి చిల్లర ఇచ్చింది. సర్దార్జీ డబ్బు చూసుకుని జేబులో పెట్టుకుని కదిలాడు.

●●●

అదే రోజు రాత్రి ఏడింటికి.

అది ఓ చిన్న పేదల బస్తి. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పేదలు ఇళ్ళుకట్టుకున్న ఆక్రమిత స్థలమది అక్కడ అన్నీ సిమెంట్ రేకుల ఇళ్ళు. నెమ్మదిగా అక్కడికి చేరి ఓ వ్యక్తి ఓ ఇంటి ముందు ఆగి తలుపు తట్టాడు. తెరుచుకుందది. అతను లోపలికి వెళ్ళాక మూసుకుంది.

"నర్సిమన్నా ఎలా ఉన్నావ్?" అడిగాడు రామారావు.

"నేను బాగానే ఉన్న. నువ్వేందట్ల. ఆ ముసలమ్మ ఏసంలో, పండ్లమ్ముకుంటూ.. నాకు నచ్చలేదబ్బా! "

"ఏం చేస్తాం? కాలమొక్కరీతి గడుపవలయు. ఎలా ఉంది పరిస్థితి?"

"శాన గడ్డుగ ఉన్నది?"

"నాకు తెలుసు."

"ఏం తెలుసు నీకు? నువ్వు కనిపిస్తే ముక్కలుగ నరుకుతరని తెల్సా? నిన్ను పట్టిస్తే యాభై లక్షలిస్తరనేది పుకారు కాదని తెల్సా? చోటానాయకున్నిండి పెద్దోల్లదాకా నీకోసం పగలే గాలిస్తుండ్రని తెల్సా?" కోపంగా అన్నాడు నరసింహా.

"నా కన్నీ తెలుసు. నా జాగ్రత్తలో నేనున్నాను."

"నీకెందుకొచ్చిన పరేషాన్ చెప్పు? పంట ఎనక్కి తీస్కోరాదు?"

"నర్సిమన్నా! ఈ మాట మనస్ఫూర్తిగానే అంటున్నావా?"

"అనకేం జేస్త? ప్రాణం కాడికొచ్చిన పని ఎంత మంచిదైతే ఏం లాభం?"

"నర్సిమన్నా! ఇదినా జీవిత లక్ష్యం. నేను బతికున్నా చచ్చినా నాకు తేడాలేదు. అది నే సాధించకుండా ఉంటే.. నా ఉనికికే ప్రయోజనం లేదు."

"ఎంత చిత్రమో చూస్తివా? నిన్న 'అందరూ' కల్సి మీటింగు పెట్టిండ్రంట. సాటుగ. "

"ఔను. తెలిసింది"

"ఈ దేశమంలో గిన్ని పార్టీ లెందుకున్నయో, ఈల్లందర్నీ కల్పే సూత్రమేందో నాకు తెల్సు"

"ఏంటది?"

"ఈల్లందర్కీ సాపకింద నీళ్ళలాంటోడు ఓడుండాలె. అంతే. అప్పుడంత ఒక్కటైతే. "

"బాగానే కనుక్కున్నావు గానీ ఇంకేంటి విశేషాలు?"

అలా కాస్సేపు మాట్లాడుకున్నాక "ఇంకాస్త" అంటూ బైలుదేరాడు. "చీకటి పడింది. ఇంకేం భయంలేదు. రోడ్డుదాకా వస్తాపద" అంటూ రామారావు, నరసింహా గబగబా రోడ్డుసమీపానికి వచ్చారు. వారు పూర్తిగా రోడ్డు చేరక ముందే ఓ వ్యాన్ వెళ్ళిపోవడం జరిగింది.

అంతా క్షణాల మీద జరిగింది. జరిగింది తెలుసుకుని "రేయ్. ఆపండ్రా! ఆపండీ" అంటూ కొంత దూరం వెళ్ళి నర్సింహా దాన్ని పట్టుకోవడంలో గానీ, నంబర్ గుర్తుపట్టడంలో గానీ సఫలం కాలేకపోయాడు. దిగులుగా తన నివాసం చేరాడు.

అతని అనుచరులందరికీ కబురు అందింది. అంతా మారువేషాలతో రామరావు కోసం గాలించారు. వాళ్ళ గాలింపు గాలింపులానే ఉండిపోయింది. అప్పుడు విలపించాడు నరసింహా దోసిలిలో ముఖాన్ని దాచుకుని 'రామారావు భయ్యా!" అంటూ వెక్కి వెక్కి ఏడ్చేశాడు. చాలా సేపు అలా దుఃఖిస్తూనే ఉన్నాడు. చాలాసేపు... గుండెల్లోని బాధ కొంతవరకు కరిగేదాకా అతన్ని దుఃఖించనిచ్చి అపుడు భుజం మీద చేయివేసింది రమ.

అతని భార్య. ఆమె చదువుకుంది. గవర్నమెట్ బ్యాంక్‌లో క్లర్క్‌గా చేస్తున్నది. వాళ్ళది ప్రేమ వివాహం. భాషలోని యాసలు, ప్రాంతీయతలోని వైషమ్యాలు వారి వివాహం ఆపలేకపోయాయి.

నెమ్మదిగా అందామె "కంటికి కనిపించని వారంతా పోయారనుకుంటే పొరపాటే. కేంప్ వాయిదాపడింది కదా? ఆ సమయానికి అతనెక్కడున్నా వస్తాడు చూడండి. ఈలోగా మనం ఊరుకోరాదు. రామారావు ఆశయాలకి ప్రజల సపోర్ట్ సంపాదిద్దాం. నిశ్శబ్ద విప్లవం లేవదీద్దాం. జరుగుతున్నదంతా ప్రజలకి తెల్పే ఏర్పాటు చేయండి. ప్రజల్లో స్పందన తీసుకువచ్చే ప్రయత్నం చేద్దాం" అంది. ఆమె కూడా బ్యాంక్‌కి వెళ్ళడం లేదు.

నరసింహ ఆమె చేతిలో తన తలనుంచి "ఔను. నువ్వు చెప్పినట్టు చేద్దాం. రామారావ్ భయ్యా కనిపించాడా సరి. నువ్వు ఈ ఆస్తినంతా అమ్ముకో, నీ కొడుకుతో విదేశాలకెల్లిపో.

"నేను ఈ దేశాన్ని శాసిస్తున్న 'నల్లబజారు' రాజకీయాల్ల చేరి, ఆల్ల సిగతంగినోడినై ఒక్కోనా.. అంతుజూస్త" అన్నాడు నిశ్చల దృక్కులతో ఎటో చూస్తూ.

●●●

రామారావు కేసుని ఢిల్లీ హైకోర్ట్ కూడా కొట్టేసింది. అంతే. సుప్రీం కోర్ట్ గుండె తలుపులు తట్టాడు. దేశమంతా ఉత్కంఠతతో చూస్తున్నది అటువేపు.

●●●

నరసింహ పంచిన కరపత్రాల ద్వారా రామారావు గుండె చప్పుడు తెలిసింది ప్రజలకు. దీనికి తోడు 'తొలిసంధ్య' ఇచ్చిన మద్దతు కలిసొచ్చింది.

'తొలిసంధ్య' పత్రిక 'ద ఫస్ట్ న్యూస్' పేరుతో ఆంగ్లంలో పత్రికని స్థాపించింది. నెమ్మదిగా పత్రిక పుంజుకుంటుందనుకున్నప్పుడు దేశమంతటా ఆ పత్రిక శాఖలను ఏర్పాటు చేసుకుంది.

మామూలుగా ఇలాంటి స్థానిక పత్రికలు ప్రారంభించిన కొంతకాలానికే భారీ నష్టాలతో మూతపడుతుంటాయి. ఐతే చంద్రశేఖర్ తన మాతృదేశమైన బెంగాల్‌లో పత్రిక రెండవ ప్రచురణ (మొదటి ప్రచురణ హైదరాబాదులో) ప్రారంభించి, కొంగ్రొత్త పోకడలను చూసి అతి తక్కువ కాలంలో స్థానిక ఆంగ్ల పత్రికలని అధిగమింపచేశాడు.

పత్రికకి మంచి మార్కులు రావడంతో ఢిల్లీలో ఈవినింగ్ ఎడిషన్ ప్రారంభించాడు. 'ద ఫన్ న్యూస్'ని చాలా మంది ఎద్దేవా చేశారు. సాయంకాల పత్రికకి 'ద ఫస్ట్ న్యూస్' పేరేమిటి? "అలానా? ఏదీ చూద్దాం" అంటూ తెప్పించుకున్నారు కొందరు. వారికి పత్రిక నచ్చింది. అది జనాల్లో పాకింది. సర్క్యులేషన్ పెరిగింది. అంతే. 'ద ఫస్ట్ న్యూస్' ఉదయం రావటం మొదలెట్టింది.

ఆ దశలో పత్రిక నిలదొక్కుకోవడం కష్టమైంది. ఐనా అలాగే నడిపించాడు. నిరంతరం వార్తల కోసం అన్వేషించే విలేఖరులని నియమించి కలిసిరాగల కాలంకోసం ఎదురు చూస్తున్నాడు చంద్రశేఖర్. ఆ కాలం త్వరగానే వచ్చిందిలా..

ప్రజలు, ప్రజలని అరిచే ఓ మంత్రి పుంగవుడు ఉద్యోగం కోసం వచ్చిన ఓ యువతిపై అత్యాచారం జరిపాడు. ద ఫస్ట్ న్యూస్ విలేఖరి ఆమెను రక్షించుదామని అటుగా వచ్చాడు. స్పెషల్ గన్ మేన్, అంగరక్షకులు, కుక్కలు చూసి ఆగిపోయాడు. చాటుగా నక్కి అదంతా రికార్డ్ చేశాడు. అభ్యంతరకరమైన దృశ్యాలని కాల్చేసి సాక్ష్యాలుగా పనికొచ్చేవాటిని, పేపర్‌లో ప్రచురించాడు.

ఫోటోలు, యువతి ఆరోపణ, డాక్టర్ల రిపోర్ట్ కలిసి మంత్రిని జైల్లోకి నెట్టాయి. అప్పటి నుండి 'ద ఫస్ట్ న్యూస్' పేరు జనాలకి తెలిసింది. జనాలనాడి చంద్రశేఖర్‌కి అందింది. ఆరోజు నుండీ ప్రతీరోజు 'టుడేస్ సెన్సేషనల్ న్యూస్' పేరుతో రోజూ ఓ వార్త వస్తుంది. అది మానవత్వాన్ని కాలరాసి దానవులుగా మారిన వారి ఫోటో, మరియూ వార్తతో ఉంటుంది. ఇలా పత్రిక ఒకటుందని నమ్మని వారంతా క్రమంగా చందాదారులయ్యారు.

తరువాత దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లోకి వ్యాపించింది ఆ పత్రిక. జనాదరణ కూడా బాగానే ఉంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే దేశ ప్రజలకి రామారావుని పరిచయం చేసింది. అతని ఆశయం ఏంటి? అతను వేసిన కేసు పూర్వాపరాలు ఏంటి? వంటి విషయాలని ఏరోజు కారోజు ప్రచురించడం మొదలయ్యింది. ప్రజల నుండి ఎనలేని మద్దతు రామారావుకి లభించింది. రామారావుని కిడ్నాప్ చేసి తీసుకువెళ్ళింది గూండాలో, రాజకీయవాదులో కాదు. చంద్రశేఖర్. అతనివల్ల తనకీ, తనవల్ల అతనికీ ప్రచారం లభించే సమయం అది. అందుకే అతన్ని తీసుకువెళ్ళి మరో మానవుడికి తెలీకుండా నమ్మకస్తులైన నలుగురు వ్యక్తులచేత చిన్న భూగృహంలో దాచాడు. కోర్ట్ సమయాన తప్ప అతన్ని బైటికి విడిచేవాడు కాదు. కోర్టులో ఈ విషయం రహస్యంగా నరసింహకి రామారావు చెప్పాడు. హై కోర్ట్‌లో అతని కేసు కొట్టివేయబడినాక 'నాక్కావల్సింది అదే' అనుకుని 'సుప్రీం'కి అప్పీలు చేశాడు. రామారావుకి ప్రజలనుండి అపారమైన సపోర్ట్ లభించింది.

ప్రజానుకూల ఉద్యమాలు జరిగాయి. విదేశాలనున్న 'స్వదేశీయుల మద్దతు   ఈ మంచిని ఆచరించనివ్వాలని మానవ హక్కుల సంఘాల మద్దతు ఇలా ఎన్నో లభించాయి. అంతర్గతంగా ప్రతిమనిషినీ మనసు ప్రశ్నిస్తున్న 'ఆ భావన' కోర్ట్‌లో కేసులా రావడం అందరికీ సంతోషం కలిగించింది.

ప్రజావాహిని రాజకీయాన్ని ప్రశ్నించడం మొదలయింది. రాజకీయాన ముసలం పుట్టి యువతకి స్ఫూర్తి కలిగింది. యువవాహిని కోర్ట్‌కి తరలి రాసాగింది. అన్నాహజారే కోసం రోడ్డెక్కిన జనం రామారావు కోసం కోర్ట్‌కి నదిలా ప్రవహించాలని.

●●●

ఐ.ఏ.యస్. చదవాలంటే పరిమిత వయసులోనే ఎన్నో పరీక్షలు. ఆ పరీక్షలో పలు ప్రశ్నలు. పోటీలు, పందాలు, చర్చలు, శిక్షణలు, ఎన్నో, ఎన్నెన్నో ఎందుకు? ఎందుకిన్ని కష్టనష్టాలకోర్చుకోవాలి? ఎందుకంత తెలివికావాలి? అన్నింటా ఆ వ్యక్తికి అర్హత ఉందని ఎందుకు నిరూపించబడాలి? ఇవన్నీ ఒక పరిమిత వయసులోనూ, పరిమిత సమయంలోనూ, పరిమిత నిమయాలలోనూ, కేటాయించబడినన్ని సార్లు మాత్రమే వ్రాయాలి.

ఎందుకు?

ఎందుకిన్ని కఠిన నియమనిబంధనలు? ఎవరైనా ఎప్పుడైనా ఎలాంటివారైనా ఐ.ఏ.యస్ ఎందుకని వ్రాయకూడదు?

జవాబు మనకందరికీ తెలుసు.

ఎందుకంటే ఆ వ్యక్తి ఓ జిల్లాకి అధికారిగా ఉండాలి. ఆ జిల్లాలో ఉన్న వందలాది గ్రామాలకు, కొన్ని పట్టణాలకు అతను అధికారి. అక్కడ తప్పు జరిగితే ఆ ఫలం జిల్లా మొత్తానికి పంచబడుతుంది. లక్షల్లో ప్రజలు ఆ తప్పిదానికి బలౌతారు. కోట్లాది ప్రజాధనం వృధాగా ఖర్చుచేయబడుతుంది.

యం.బి.బి.యస్ చదవాలంటే అందుకూ అర్హతకావాలి. లక్షల్లో ఒకడిగా నెగ్గాలి. విద్య, తెలివితేటలూ కావాలి. ఎందుకంటే వేలాది రోగులని చూసి వైద్యం చేయబోయే డాక్టర్ వృత్తి అది.

ఐ.పి.యస్, ఇంజనీర్, లాయర్, లెక్చరర్, గుమస్తా ఏ ఉద్యోగానికైనా ఎన్నో పరీక్షలు, ఎన్నెన్నో ప్రశ్నలు. ఎన్నో అర్హత నిరూపణలు.

కానీ కొన్ని కోట్ల మందిని పరిపాలించేందుకు కావల్సిందేమిటి?

ఎన్నికలు.

అక్షరం రాదు. చదువురాదు. సంతకం తెలీదు. తెలివైన తనం లేదు. పరుగెత్తలేడు. నడవలేడు. పోటీలో నెగ్గలేడు. పదిమందిని మెప్పించలేడు. మెదడుకి పదును పెట్టి చిక్కు లెక్క కూడా విప్పలేడు. చూడకుండా భారతదేశపు పటం వేయలేడు. సశాస్త్రీయంగా ఒక విషయాన్ని గురించైనా అనర్గళంగా ఉపన్యసించలేడు.

ఐనా అతనికి ప్రజలని పాలించే అర్హత...?

అందుకే అంగూటా భావ్‌లు (వేలిముద్ర గాళ్ళు,) రౌడీలు, గూండాలు, కల్తీ వ్యాపారులు, నేర చరిత ఉన్నవారూ, ప్రాంతీయ భాష తప్ప మరో ముక్క రానివారు, పాత నేరస్తులు, ముసలి డొక్కులు నేడూ రాజ్యాన్ని ఏలుతున్నారు.

భుజబలం? చల్తా. గుండాగిరీ? చలేగా? చరిత్రంతా మురికి? చల్‌నేదో యార్.

మరిక్కడ... ఈ రాజకీయాన చెల్లనిదేంటి?

పేదరికం.

ఈ ఎన్నికల నాణేనికి ఓ వైపు రాజకీయం. మరో వేపున్నది ధనం. అదుంటే నాణెం అటు నుండి ఇటు తిరిగిపోతుంది. అదుంటే వేలుముద్రగాళ్ళు కూడా పాలకులౌతారు. మాట్లాడ్డం రాని వాళ్ళు మంత్రులౌతారు. నానాగడ్డీ తినేవాడు కూడా ఘనుడౌతాడు.

'ఏ దేశంలో రాజకీయాలు హీనస్థితిలో ఉంటాయో - ఆ దేశంలో అవినీతి ఉన్నత స్థానం ఉంటుంది.' అన్నాడు ఓ మహానుభావుడు.

చిన్న ఆఫీసులో వందమందిలో మెలగవలసిన ఓ గుమస్తాకి పదవీ విరమణ ఉంటుంది. ఎందుకంటే ఆ వయసులో అంతకు మించిన పని అతని వల్ల అవదు కనుక.

కానీ శరీరం 'భౌతిక కాయం'గా పిలవబడేంతవరకు భేషుగ్గా రాజ్యం ఏలవచ్చునా? ఔను. ఎందుకు? గుమస్తాకున్న భాధ్యతలకన్నా రాజ్యపాలనకి తక్కువ బాధ్యతలా? వీరిలో ఉన్న గుణమేమిటి? గుమస్తాక్కలిగిన దోషమేమిటి?

మన దేశంలో యువకులంతా చదువుల చుట్టూ, చదువులన్నీ ఉద్యోగాల చుట్టూ, ఉద్యోగాలన్నీ డాలరు చుట్టూ పరుగెత్తడం మామూలైంది. అందుకే ఇక్కడ దారిద్ర్యం పదిలంగా ఉంది. దేశం బాగుపడాలంటే ప్రజాచైతన్యం కావాలి. ప్రజా చైతన్యంకావాలంటే రాజకీయ చైతన్యం కావాలి. రాజకీయ చైతన్యం కావాలంటే అక్కడున్నవాళ్ళు పవర్‌ఫుల్‌గా ఉండాలి. అందుకు వృద్ధులూ, విద్యలేని వారూ అనర్హులు.

రాజకీయాల్లోకి రావాలనుకునే యువకులు 'యం.సెట్' 'లాసెట్'లా 'పొలిటికల్' వ్రాయాలి. ప్రథమ శ్రేణిలో ఉన్నవారికి ఐ.ఏ.యస్ లాగ పొలిటికల్ (సైన్స్) సెట్ ముందున్న వారికి ప్రధాని పదవికి, తరువాత వారికి ఆర్థిక మంత్రి పదవికి, ఆ తరువాత వారికి రక్షణ మంత్రి పదవికీ పోటీ చేయడానికి అర్హులు. అదీ అన్ని ఉద్యోగాలవలెనే వయోపరిమితి ఉండాలి.

ప్రథమ శ్రేణిలో నెగ్గినవారికి మాత్రమే ప్రధానమైన పదవుల అర్హత మేధావులంతా రంగాన దిగుతారు. దేశం ఇపుడు నిండా మునిగే ఉంది గనక వారు మునుగుతారన్న భయంలేదు. అపుడు మేధావుల మధ్య సమర్ధవంతమైన పోటీ ఉంటుంది.

ఆ పోటీ చూసి ప్రజలు ఆలోచనలో పడతారు. బరిలో దిగిన వాళ్ళంతా యువత కనుక, వారిలో ధైర్య స్థైర్యాలు ఉంటాయి గనక నోట్లిచ్చి ఓట్లు కొనుక్కోరు. ఇన్ని పరీక్షలకి నిలిచి గెలిచిన యువనాయకులు దేశానికి మంచి చేస్తారు.

అనుభవం కాదు అర్హత ముఖ్యం. ఎవరైనా, ఎప్పుడైనా ఏదో ఒక ఉద్యోగానికి క్రొత్తవారై ఉంటారు కదా? కొత్తగా వచ్చిన యువకులు కూడా నేర్చుకుంటారు.

అనుభవం ఉన్న చాలామంది పెద్దలు గద్దెనెక్కి ఏం ఉద్దరించారు?

అప్పుడు రాజ్యాంగాన్ని వ్రాసినవారు మహానుభావులు. అవినీతి జాఢ్యం అంటుకోని వారు. ధనవ్యామోహం లేనివారు. లంచాల రోగం పట్టుకోని వారు. 'కూడ' బెట్టాలని తట్టనివారు. స్వార్ధపు దోమ కుట్టనివారు.

అలాంటి జనం లేరిపుడు. అలాంటి నాయకులు లేరిపుడు. అలాంటి పరిస్థితులు లేవిపుడు. కానీ ఆ నాటి రాజ్యాంగం ఉంది. రాక్షస బల్లిలాంటి ఈ వ్యవస్థని 'ఆ రాజ్యాంగం' ఏంచేసినా త్రోసిపుచ్చుతోంది. కనుక అది మార్చండి లేదా మన రాజ్యాంగంలో ఈ విషయం చేర్చండి. దేశాన్ని సంక్షోభం నుండి కాపాడండి" ఇది రామారావు మొదటి వాదన.

రెండవ వాదన "అరవై దాటితే ఏ మంత్రి పదవీ ఉండద్దు. రాజకీయ పదవీ విరమణే. ప్రత్యక్ష, పరోక్ష రాజకియాలలోకి రాకూడదు. పెన్షన్ ఇవ్వాలి. అందరు ఉద్యోగుల్లా వాళ్ళూ పెన్షన్‌తో బ్రతకాలి. అంతే. దీనికి తిరుగు ఉండరాదు."

ఇదీ రామారావు వాదన. దేశమంతా అట్టుడికి పోయింది ఈ వాదనతో. కుళ్ళు రాజకీయాలతో విసిగిన ప్రజలంతా దీన్ని సమర్ధించారు. ముందుగా యువకులు, తరువాత స్త్రీలు, ఆ వెనుక కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ఇలా క్రమేపీ ఒక్కో వర్గం వారు సమర్ధించే వారిలో చేరిపోయారు. అంతా కోర్టుకి చేరుకుంటున్నారు. కోర్టు బయట వేలాదిగా నిలిచి నినాదాలు చేస్తున్నారు. ఇంకా తీర్పు ఎప్పుడు అంటూ ప్రశ్నిస్తున్నారు.

కేసు వాయిదాలు పడుతూనే ఉంది. ప్రజాగ్రహం పొంగుతూనే ఉంది. పరిస్థితులు క్షీణిస్తున్నాయి. ఇది నాణానికి ఒక ప్రక్క.

మరో ప్రక్క. రాజకీయ నాయకులు. రామారావుని లేపెయ్యాలని, కేసు కొట్టెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు. ఏ రాజకీయవాదికి అనుకూలంగా ఉందని? ఎవరు సమర్ధిస్తారు దీన్ని? ఇప్పుడున్న ముసలీ ముతకాపోతే మిగిలినవారెందరు? వారిలో చదువుకున్నవారెందరు? అవినీతిలో చిక్కుకోనిదెందరు?

రామారావు చెప్పిన అర్హతగలవారు దేశం మొత్తంలో వేళ్ళమీద లెక్కించచ్చు. ఇంక ఎవరుంటారని? అందుకే ఒత్తిళ్ళు తెచ్చారు. ఓడించారు. ఇపుడు సుప్రీం కోర్టులో ఉంది బంతి. పార్లమెంట్ బిల్లు ఆమోదం అని చిలకల్లా పలికారు రాజకీయవాదులు. 'ఇది రాజ్యాంగం విషయం. కోర్టులోనే తేలాలి' అన్నాడు రామారావు.

మరో వేపు ఈ విషయం త్వరగా తేల్చాలని, రామారావుకి అనుకూలంగా కేసు తీర్పు రావాలని ప్రజలు కోరుతున్న తీరు రోజుకోరకమైన క్రొత్త పోకడల్ని సంతరించుకుంటోంది.

నలుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం ధర్మాసనంలో అంతా వృద్ధులు తలపండి ఉన్నవారు. సమాజంలోని న్యాయాన్యాయాలు, కుళ్ళు, అవినీతి నెరిగినవారు. వారిక్కూడా అనిపించింది 'ఎంతకాలం ఇలా? మనవంతు కృషిగా మనదేశానికి సాయం చేద్దామా?' అని.

ముందుగా ఒకరు మాత్రం ఇలా ఆలోచించారు. ముగ్గురు వ్యతిరేకించారు. క్రమంగా ఒక్కొక్కరే అనుకూలించసాగారు. ఇపుడు ఒకరు మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. 'ఇది తలనొప్పితో కూడిన పని' ఇందులో ఎన్నో లొసుగులున్నాయి'. 'ఇది సాధ్యంకాదు' అని.

తాము పదవీ విరమణ చేసేలోగా ఓ మంచి పని చేయాలని ఉన్నముగ్గురూ ఆ ఒక్కరిని సమాధన పరిచారు. వారి అనుమానాలు తీర్చారు. అంతే. తీర్పు రామారావుకి అనుకూలంగా వచ్చేసింది.

●●●

**రామారావుకి ఫోన్. కేంద్రమంత్రినుండి.** అర్జంటుగా తమని కలవమని.

వెళ్ళద్దన్నాడు చంద్రశేఖర్. "నీకు ఆపద రావచ్చు" అన్నాడు.

ఊరుకున్నాడు.

ఈసారి ప్రధాని, రాష్ట్రపతినుండి ఆహ్వానం. "బాబూ! నీకు ప్రాణభయంలేదు. మాట్లాడాలి" అని.

వెళ్ళాడు. రెండు రోజులపాటు సమావేశం జరిగింది. చిరునవ్వుతో రామారావు ఇంటికి తిరిగి వచ్చాడు. కొద్ది రోజులు గడిచాక రాజకీయవాదులు తమ పిల్లల్ని ఎలాంటి పరీక్షలుకి హాజరైతే పి.యం పదవి దక్కుతుందో ఆ చదువుకోసం తయారు చేయిస్తున్నారు. రామారావు మీద కోపంగా ఉన్నా ఇప్పుడు చేయగల్గింది లేదని మిన్నకున్నారు.

నరసింహ, రామారావు బంధుమిత్రులను వెనక్కి తీసుకువచ్చాడు. అంతా మాములుగా జరిగిపోతోంది. ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు.

"బావా! పెద్ద గండం గడిచి గట్టెక్కాం. అందరం కలిసి ఏదైనా గుడికి వెళ్దామా" అంది మేఘ.

"పదండి" అన్నాడు రామారావు. అంతా కలిసి ఊరికి దూరంగా ప్రశాంతంగా ఉన్న గుడికి వెళ్ళారు. అంతా సరదాగా గడిపారు. ఆలయ ప్రాంగణం విశాలంగా ఉంది. చెట్లు, పూల మొక్కలతో దారి ఆహ్లాదంగా ఉంది. దైవదర్శనం చేసుకుని అంతా తోటలోకి వచ్చారు. కబుర్లు చెప్పుకున్నారు. రామారావు చూస్తున్నాడు. అందరి వంకా పరీక్షగా గమనింపుగా.

ఇపుడు 'తన' వాళ్ళ లిస్ట్‌లో నర్సిమ్మన్న కూడా చేరాడు. 'అందరూ తనని ఎంతగా ఇష్టపడతారు వీళ్ళకి తనవల్ల కదా. అన్ని కష్టాలు వచ్చాయి'

"గిప్పుడు చెప్పు. నీ కొచ్చిన కష్టమేంది?" రామారావుని తడుతూ అన్నాడు నరసింహ.

"ఏంటి నర్సిమన్నా?"

"గంతగ నువు ఏమాలోచిస్తున్నవ్?"

"ఏమీలేదు"

"ఎన్నిసార్లు పిల్చిన్నో తెల్సా? ఏం లేకపోతే ఎందుకు పలుకవ్?"

"సారి. సారి. చెప్పు. ఎందుకు పిలిచావ్?"

"ఇప్పటికీ దేశ సేవ ఎక్కువైపోయింది తమ్మీ! ఇంక ఆలోచించకు. ఇంకో ప్రణాలిక ఎయ్యకు."

"వెయ్యనులే. భయపడకు."

"అగ్గో. నాకెందుకురా బై బయ్యం. ఏదో ఈ బతుక్కి ఓ కోరికుంది తీరుస్తవని. అంతే"

అదేంటని రామారావు అడగలేదు. తన పెళ్ళి చూడాలనుందంటాడనీ తెలుసు. అందుకే మౌనంగా ఉండిపోయాడు. టాపిక్ మార్చేందుకు "అంబరీష్‌కి కళ్ళజోడు వచ్చిందా? ఎప్పుడు?" అన్నాడు.

"మొన్ననే భయ్యా" అన్నాడు సిరియాళ్

"మేధావులందరికీ కళ్ళజోడు వస్తుంది" అంది దివ్య.

"కానీ కళ్ళజోడు వచ్చినవాళ్ళంతా మేధావులు కారు." అన్నాడు శివ.

శివ సొంత ప్రాక్టీస్ పెట్టాక దివ్యకీ, అతనికీ మధ్య గొడవలు చాలా తగ్గాయి. మగాళ్ళిలా, ఆడాళ్ళిలా అని ఎపుడైనా చమక్కులు విసురుకుంటారుగాని ఉప్పూ, నిప్పూ అన్న చందాన ఇది వరకులా లేరు. మొన్నామధ్య దివ్యకి జ్వరం తగిలింది. చిన్న మందుమాత్రలు కూడా ఇవ్వకుండా ఆమెను పేరున్న డాక్టర్ దగ్గరకి తీసుకు వెళ్ళాడు.

అది టైఫాయిడ్‌గా తేల్చిన డాక్టర్ హాస్పిటల్లో చేర్చమన్నాడు. "ఆ వాతావరణం దివ్యకి పడదు" అంటూ ఆమెని ఇంటికి తీసుకు వచ్చి రేయింబవళ్ళు ఆమె పక్కనే కూర్చున్నాడు. ఓ రోజు జ్వరం తీవ్రంగా ఉండి తను పలవరిస్తుంటే "బామ్మా! నీ గయ్యాళి మనవరాలు లేకుంటే నే బ్రతకలేనే" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. దివ్య కోలుకున్నాక ఇద్దరిలోనూ మార్పు వచ్చింది. మాటల విసురులున్నా అది

పెడసరంగా, విసిరేసినట్టుగా కాకుండా సరదాగా సంతోషంగా ఉండేవి. అరుదుగా ఆడవాళ్ళిలా, మగాళ్ళిలా అని వచ్చేవిగాని. మామూలుగా మామూలు విషయాలపైనే వారి మాటల తూటాలు ఉండేవి.

"మానవ సంబంధాలన్నీ కేవలం ఆర్థిక సంబంధాలు మాత్రమే కాదు" అని శివ అన్నాడంటే.. "కానీ. ఆర్థిక సంబంధాలన్నీ కేవలం మానవ సంబంధాలు మాత్రమే" నవ్వుతూ అంటుంది దివ్య.

శివ నవ్వేసాడు.

"గొప్పవారంతా గొప్ప సిద్ధాంతాలు తయారు చేస్తారు" అంది దివ్య.

"కానీ 'గొప్ప సిద్ధాంతాలు చేసేవారు మాత్రమే' గొప్పవారు అనలేం" అన్నాడు శివ నవ్వుతూ.

మరోసారి "మౌనంగా ఉండే వాళ్ళంతా మహర్షులనుకోవచ్చు" అన్నాడు శివ

"కానీ మహర్షులంతా మౌనంగా ఉన్నారనుకోలేం" అంది దివ్య.

ఈమధ్య ఇవి కూడా తగ్గిపోయినై. అందుక్కారణం నరసింహ. "ఏమమ్మా దివ్యమ్మా! మేమందరం గీడుంటే మీరిద్దరు పుస్తకాల బాస మాట్లాడతరెట్లా? జర ఈ ఏలిముద్రగాల్లక్కూడ అర్థమయేట్టు మాట్టాడుండ్రి" అంటాడు.

"సారీ అన్నా!" అంటుంది దివ్య.

"ఆఁ గట్లనే గట్లనే. గా డాక్టర్ పిల్లగాన్ని పరేషాన్ జెయ్యకు మల్ల"

"అన్నా! డాక్టరైతే పిల్లగాడు కాలేడు. పిల్లగాడేమో డాక్టర్ కాలేడు. ఇంతకీ ఆయన డాక్టర్ పిల్లగాడా?"

"నీ బాంచెన్ సెల్లే. కాల్మొక్కుత. గసుంటి మాటల బాంబులు నా మీదెయ్యకు. నా పెల్లాం పోరి ఉంది. శానా తెలివుంది ఆమెకు. గామెను పట్టుకుని నీ ఇష్టమొచ్చినట్టనుపో." అంటాడు అంతా నవ్వులే నవ్వులు.

●●●

శివ క్లినిక్ ప్రారంభించే ముందు రామారావుతో అన్నాడు. "రేయ్ మనకొక రచయిత ఉన్నాడు. యండమూరి వీరేంద్రనాథ్ అని. ఆయన కథలో హీరో ఒక డాక్టరయి ఒక రూపాయితో వైద్యం చేసి మెడికల్ షాపు తనే అక్కడ పెట్టిదాని ద్వారానే డబ్బు సంపాదిస్తాడు. రచయిత ఈ కథని రాసి ఊరుకున్నారు. నేనుదానిని అమలు చేస్తాను. కేవలం ఐదు రూపాయల ఫీజుతో రోగులను చూస్తాను. మెడికల్ షాపు కూడా పెడతాను."

"అంటే నీకూ డబ్బు సంపాదించాలనే ఆలోచన కలిగిందన్నమాట."

"కాదు. విను. మెడికల్ షాపు పెడతాను. మందుల్ని డైరెక్ట్‌గా మందుల కంపెనీల నుండే కొనుగోలు చేస్తాను. సి.ఎండ్.ఎఫ్‌కి వెళ్ళడం అవన్నీ చేయను. కంపెనీ సొంతదారులతో మాట్లాడి అక్కడ నుండి నేరుగా తెచ్చుకుంటాను. అతి కొద్ది పాటి లాభంతో వాటిని నా క్లినిక్‌కి వచ్చేవారికి అమ్ముతాను. పేదవారికి ఉచితంగా సేవ చేసే స్థితి కాదు నాది. తక్కువ ఖర్చుతో వైద్యం చేయగలుగుతాను. చదివిన చదువుని ఇలా వినియోగిస్తాను."

"కాని ఇదంత సులభం కాదు. మందుల షాపు వారు, డాక్టర్లు నీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారు. పైనుండి ఒత్తిళ్ళు తెస్తారు. నీ క్లినిక్ మూయిస్తారు. నీ మీద లేని పోని ఆరోపణలు."

"చేయనీ ప్రజలే అదంతా చూసుకుంటారు."

"చూసుకోరు. నీమీది ఆరోపణలు నమ్ముతారు. లాభం లేకుండా ఇలా చేయవనుకుంటారు."

"నా ప్రయత్నం నే చేస్తాను. ఆటంకాలు వచ్చినా ముందుకెళ్తాను. మరీ అంతగా అయితే అక్కడ మూసేసి నా ఇంట్లో ప్రాక్టీసు మామూలుగా మొదలెడతాను."

"గుడ్ కార్యశూరుడికి ముందుండాల్సింది గుండెబలం. అనుకున్నది చేయగల్గడం" ప్రోత్సహించాడు రామారావు. ఇద్దరూ కలిసి తిరిగిరు. మందుల కంపెనీ సొంతదారులతో మాట్లాడారు. ప్రపంచంలో ఓ వింత ఉంది. వందమంది వ్యతిరేకించిన పనిని ఒకడు తప్పక సమర్థిస్తాడు. ఎన్నో కంపెనీల వారు తమ సేల్స్ పడిపోతాయన్నారు. ఇవ్వమన్నారు.

"ఒక ఓనరు మాత్రం నేనిస్తాను. రెండు రసాయనిక పదార్థాలు ఇలా కలిపితే ఇలా మరేదో వస్తుందనేది ఓ సూత్రం. ఒకనాడు ఒకడు ఇలా కాకుండా మరోలా కలిపితే మరోటి ఏదో వస్తుంది. అది కూడా ఓ ప్రయోగమే. ఓ సూత్రమే. అలాగే నా తోటి కంపెనీల సోదరులు చెప్పింది నిజం. అదొక సూత్రం. ఐతే రేపు మీ దగ్గరికే రోగులు ఎక్కువగా వచ్చే మా మందులు ఎక్కువ భాగం మీకే ఇవ్వాల్సి రావచ్చు. పేదలకి కనుక పుణ్యం, పురుషార్థం, కీర్తి, ప్రతిష్ఠ. రావచ్చు. ఇదొక సూత్రం. లేదా ప్రయోగం" అంటూ ఒప్పుకున్నాడు. కాళ్ళరిగేలా తిరగ్గా తిరగ్గా మరో కంపెనీల వాళ్ళూ ఒప్పుకున్నారు. అది అతి కష్టం మీద ఒప్పించారు.

శివ క్లినిక్ తెరిచాడు. వైద్యం చేస్తున్నాడు. మందులలా ఇస్తున్నాడు. మొదట్లో అంతా వెక్కిరించారు. ఆపై నవ్వారు. ఇది రాముడి కాలం కాదన్నారు. జనం నుండి కూడా పెద్దగా స్పందన రాలేదు. ఏదో బొటాబొటీగా నడిచేది. అవినీతి వ్యాపించినంత త్వరగా నీతికి సంబంధించిన విషయాలు పాకిపోవు.

శివ రోగులకు మందులు వ్రాసి "ఇందులో ఈ రెండు ఇక్కడ కావాలంటే కొనుక్కోవచ్చు అనేవాడు. ఓ అతి తెలివి పేషెంట్ ఓ పూటకి మాత్రం కొనుక్కుని మిగిలినవి తన ఇంటి దగ్గరున్న మెడికల్ షాపులో అడిగాడు. ఉన్నాయని మందులిచ్చి తీసుకున్న డబ్బు చూడగానే కళ్ళు తిరిగాయి అతనికి. మరోచోట, ఇంకోచోట అడిగి అడిగి మందు విలువ ఇంత కాదు 'అంతే' అని తెలుసుకుని విస్తుబోయాడు.

మందు మింగాడు. అంతే రోగానికి స్వస్తి. అపుడు శివ అతని దృష్టిలో దేవుడైపోయాడు. ప్రచారం చేయించుకోవడానికి ప్రచారం రావడానికి తేడా ఉంది. ప్రచారం లభించడానికి నాలికలు, మంచితనం పనిచేస్తే, ప్రచారం చేయించుకోవడం చేయి విదలించడం ఆపగా ఆగిపోతుంది. ఆ వ్యక్తి నలుగురికి, వాళ్ళు పన్నెండు మందికి, ఇలా పాకిన విషయం శివక్లినిక్ ముందు క్యూకట్టేట్టు చేసింది.

ఆ 'క్యూ' రోజు రోజుకీ పెరుగుతున్నది. శివవాళ్ళు (శివ, దివ్య) వెళ్ళేసరికే జనం బారులు తీరి నిల్చుని ఉంటారు రోడ్డుమీద. ఎండ, వానన‌క నిల్చుంటారు. అలసట కలిగేదాకా చూస్తాడు శివ. ఇంకా జనం మిగిలితే సాయంత్రం వస్తాడు. లేదంటే అంతే.

జనం ప్రవహంలా వస్తున్నారు. ముందు పేదలు వచ్చేవారు. ఇపుడు దిగువ మధ్య తరగతివారు వచ్చి చేరారు. మందుల పెట్టెలు డబ్బాలు డబ్బాలు వచ్చి మాయమై పోతున్నాయి. ముందు కొంతమంది మందుల కంపెనీల వారూ వచ్చి చేరారు. వారికి కూడా పెద్దగా నష్టం ఏమీలేదు. ఏ మందులైనా అమ్మడానికే కదా? అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

రెప్రజెంటేటివ్‌లు, మేనేజర్లు, వాళ్ళ బాస్‌లు అందరికీ ఇచ్చే జీతాలు, బోనస్‌లు, డైలీ ఎలమెంట్స్ అన్నీ కలిపి లెక్క చూసుకుంటే శివ ఇచ్చే రేటే ఎక్కువగా అనిపించింది. డాక్టర్లు, మెడికల్ షాపులవాళ్ళు నోటీసులు, అదిరింపులు, బెదిరింపులు రాకపోలేదు. వీళ్ళ సంగతి ప్రజలు, ఇంక మీడియా వాళ్ళు చూసుకున్నారు.

శివకి, కీర్తి, ప్రతిష్ఠ లభించాయి. నాకు తోచినంత సాయం చేస్తున్నాననే తృప్తి మిగిలింది. ఐదు రూపాయలనే డాక్టరనే బిరుదుకూడా వచ్చింది. రోజురోజుకీ అతని క్లినిక్ ముందు పెరుగుతున్న క్యూ అతన్ని ఎక్కడికో చేర్చింది.

ఓనాటి టీవీ ఇంటర్వ్యూలో అడిగారు. "ఎక్కడినుండి కలిగింది స్ఫూర్తి?" అని.

"నా స్నేహితుడి నుండి" అన్నాడు.

"ఎవరా స్నేహితుడు?"

"ఓ! రామారావు మీ స్నేహితుడా?"

"కాదు. నేను రామారావు స్నేహితుడిని."

"రెంటికీ తేడా ఏంటి?"

"చాలా ఉంది. ఆ మంత్రిగారు నాకు బాగా తెలిసిన వ్యక్తి అనడానికీ, నేను ఆ మంత్రిగారికి బాగా తెలిసిన వ్యక్తిని అనడానికీ ఉన్నంత వాడు గంధపు చెట్టు. అందులో కాస్త సుగంధం నాకు అబ్బింది."

అలా ఇంటర్వ్యూలు, సన్మానాలు, బిరుదులు పదిమంది పెద్దవారితో పరిచయాలు జరిగాయి. అమెరికాలో ఓ సంఘం వారు 'తెలుగు జాతిమనదీ' అనే కార్యక్రమం నిర్వహించాలని సంకల్పించి కవులు, గాయకులు, నటులు, రచయితలు, రాజకీయాన ఉన్నవారు, ప్రజల మేలు కోరి మంచిపనులు చేస్తున్నవారు ఇలా చాలామందికి ఆహ్వానం అందింది.

అందులో శివ పేరుంది. "చిన్న సన్మానముంది. సతీమణితో కలిసి రండి" అంటూ ఫోన్ చేశారు. శివ ఇలాంటివి వద్దని తనకి నచ్చదని చెప్పినా వారు వినిపించుకోలేదు. ఫ్లైట్ చార్జీలు చెక్ రూపంలో పంపించేశారు. ఇక తప్పలేదు. భార్యతో పాటు బైలుదేరాడు. ప్రయాణానికి వారం ఉంది.

●●●

చంద్రశేఖర్‌కి హార్ట్ ఎటాక్ వచ్చింది. "ఆపరేషన్ అవసరం లేదు. మందులతో తగ్గుతుంది. రెస్ట్ తీసుకోండి. చాలు." అన్నారు డాక్టర్లు.. రామారావు ఆయన్ని చూడ్డానికి వెళ్ళాడు.

"రామారావ్! నాకో చిన్న సాయం చేయగలవా?" అడిగారాయన.

"సార్ కోర్ట్‌కి నే తిరిగినప్పుడు, కేసు విషయంలో మీరు అందించిన మానసిక, ఆర్థిక సాయం మరువలేనిది. పైగా నన్ను దాచేసి ప్రాణదానం చేశారు. మీకు ఏమైనా చేయగలిగితే అది నా భాగ్యం" అన్నాడు రామారావు.

అమెరికాలో జరిగే 'తెలుగు జాతి మనదీ' వారి ఆహ్వానం వచ్చింది. తొలిసంధ్య నుండి సిరియాళ్‌ని మరో వ్యక్తిని వెళ్ళమన్నాను. తల్లి అనారోగ్యకారణంగా అతను వెళ్ళనన్నాడు. నేనూ, అభిరామ్ వెళ్ళాలనుకున్నాం. నేను కదిలితే కాల్చేస్తానంటున్నాడు డాక్టర్. నా బదులుగా నీవు వెళ్ళగలవా అని."

"వెళ్తాను. కానీ.."

"ఆ భరోసా చాలు నాకు. నువ్వెళ్తే వెళ్ళినట్టే. అందుక్కావల్సిన ఏర్పాట్లన్నీ నే చేయిస్తా వెళ్ళడం, రావడం అంతే నీ పని. మిగిలినవి నాకు వదిలేయ్."

"మీకిదివరకే చాలా ఋణపడి ఉన్నాను."

"ఈ పని చేస్తే నే నీకు ఋణపడి ఉంటాను. నీ సమర్థత నాకు తెలుసు. చెప్పాగా నువ్వెడితే నే వెళ్ళినట్టేనని.."

"సరే! నువ్వెళ్ళి నిశ్చింతగా ఉండు. నిన్ను ఏర్ పోర్ట్ దాకా కూడా పంపించే ఏర్పాటు నాదే సరే

"సరేనండీ! వస్తా"

●●●

విషయం విని శివ చాలా సంతోషపడ్డాడు. "నా టిక్కెట్టు ముందే బుక్కయింది. లేదంటే ముగ్గురం వెళ్ళేవాళ్ళం. ఇప్పటికీ ఏమీ మించిపోలేదు. నే ముందుగా వెళ్ళి వసుతులవీ చూసి ఫోన్ చేస్తాను. నిన్ను రిసీవ్ చేసుకోవడానికి నేనే వస్తాను." అన్నాడు సంబరపడిపోతూ. శివ వెళ్ళిన మూడు రోజులకి రామారావు బైలుదేరాడు. 'తొలిసంధ్య'కి చెందిన అభిరామ్ ముందే వెళ్ళిపోయాడు.

రామారావు మొదటిసారిగా ఫ్లైట్ ఎక్కాడు. ఆ ఆనందాన్ని అనుభవించకుండా ఏదో ఆలోచనలో పడిపోయాడు. కారణం అతని మనస్సేదో కీడు శంకిస్తోంది.

విమానాశ్రయంలో దిగాక రామారావు సెల్ రింగయ్యింది. శివ మాట్లాడాడు. తనకి రావడానికి కుదరలేదనీ, ఇద్దరు వ్యక్తుల్ని పంపిస్తున్నాననీ వాళ్ళతో రావల్సిందనీ చెప్పాడు. ఫోన్ ఆఫ్ చేసిన రామారావు మనస్సు స్థిమిత పడింది.

ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వాళ్ళే రామారావుని గుర్తుపట్టారు. "రండి మీ ఫ్రెండ్ నన్ను పంపించారు" అన్నారు. కారులో కూర్చున్నాక "ప్రయాణం బాగా జరిగిందా సర్?" అన్నారు లావుగా పొడుగ్గా, ఉన్న వ్యక్తి. అతను కార్లో వెనకాల రామారావు ప్రక్కనే కూర్చున్నాడు. రామారావు పలుకలేదు. కళ్ళుమూసుకుని నిశ్చింతగా కూర్చుని ఉన్నాడు.

"నిద్రపోతున్నారా?" అడిగాడు. మౌనమే జవాబు.

లావాటి వ్యక్తి కొద్దిసేపు ఏదో ఫైలు తిరిగేస్తూ కూర్చున్నాడు.

కాస్సేపు పోయాక రామారావు కళ్ళు తెరిచాడు.

"కునుకు పట్టినటుంది" అన్నాడతను చిన్నగా నవ్వుతూ.

"నిద్రకాదు. ఫ్లైట్ ఎక్కినప్పటినుండి కలిగిన టెన్షన్ ఇపుడు తీరిపోయింది. ఇంతకీ మనం ఎక్కడికి."

"మీ ఫ్రెండ్ శివగారి.."

"అది అబద్ధమని నాకు తెలుసు. ఇపుడు ఎక్కడికని నా ప్రశ్న."

"చంపేస్తామని భయమా?"

"అందుకు నాలుగు కత్తిపోట్లు, ఓ పిస్టల్ గుండు చాలు. ఇంతసేపు నన్నీ కార్లో ఉండనివ్వరు."

"ఎందుకో, ఎవరో ఊహించు చూద్దాం."

చిన్న నవ్వు నవ్వి అన్నాడు రామారావు "నేనెందరికి శత్రువునో నాకు తెలీదుగానీ, నా మనసుకెవరూ శత్రువులు లేరు. అందుకని వ్యక్తుల్ని ఊహించలేనుగానీ బడా రాజకీయవేత్తలన్నది నిజం."

"గుడ్ నేనూహించినదానికన్నా పదిమెట్లపైనున్నావ్. శివ పంపించిన వాళ్ళం కాదని కార్లో ఎక్కాక ఊహించావా?"

"కాదు. విమానాశ్రయంలో ఇందాక దిగానా? ఫోనొచ్చిందా? అపుడు తెలిసింది."

"ఎలా?"

"మా వాడు అంటే శివ శ, ష, స లు చాలా స్పష్టంగా పలుకుతాడు "నేనేరా శివనీ" అనగానే మాట్లాడినవాడు నావాడు కాదని తెలుసుకున్నాను."

"మరలాంటప్పుడు కార్లో ఎందుకెక్కావ్? పోలీసుల సాయం తీసుకోవచ్చుగదా?"

"కారణాలు రెండు. మావాడి ఫోన్ మీ దగ్గరుంది. అంటే వాడూ, వాడి భార్యా మీ ఆధీనంలో ఉండి ఉండవచ్చు. రెండు. నాకిలాంటి సంఘటన ఇండియాలోనే జరుగుతుందని ఊహించాను. "

"వెరీ వెరీ గుడ్ ఈ ఫైల్ ఏంటో తెలుసా?"

"బహుశా నా ఆటో బయోగ్రఫీ అయి ఉంటుంది" చిరునవ్వు అలా అంటూండగానే మత్తులాంటిది ఆవహించింది రామారావుని. కూడదు అనుకుంటూనే కళ్ళుమూసుకున్నాడు. మరుక్షణం నిద్రలాంటి మత్తులోకి జారుకున్నాడు.

●●●

"హలో రామారావ్. లే . నిద్రలే. నీతో చాలా విషయాలు మాట్లాడాలి."

"ఎవరో తట్టగానే కళ్ళు తెరిచాడు. నిన్నటి లావాటి వ్యక్తి. చుట్టూ చూశాడు. అయోమయంగా ఉంది." అప్పుడే తెలవారుతోంది. చిరుచీకటిగా ఉంది.

"నిద్రమత్తు వదులుతుంది. కళ్ళు తుడిచేసుకో" నీళ్ళు అందించాడా వ్యక్తి. అతను చెప్పినట్టు చేశాడు.

"నీతో ఎక్కువగా మాట్లాడే టైమ్ లేదు. నా మాటలు విను. నాకు చదువు. ఎక్కువగా లేదు. డబ్బు సంపాదించాలని దుబాయ్ చేరాను. మధ్య వర్తిద్వారా మోసగించబడ్డ నేను ఉద్యోగం లేక నానా పాట్లు పడి దుబాయినుండి తిరిగి ఢిల్లీ చేరాను. అక్కడ ఓ వ్యక్తి నన్ను కలిసి అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తానని ఇక్కడికి తీసుకు వచ్చాడు.

"ఇక్కడికి వచ్చాక తెలిసింది. 'నా ఉద్యోగం గుండాగిరి' అని. తప్పలేదు. అలా ఈ వృత్తిలో స్థిరపడిపోయాను. నెలరోజుల క్రితం నిన్ను చంపే కాంట్రాక్ట్ వచ్చింది. మామూలుగా ఒప్పుకున్నాను. కానీ తీరా, నీ పేరు, ఫోటో చూశాక నిర్ఘాంతపోయాను. అంతకు ముందే నిన్ను గురించి చాలా విన్నాను. అందుకే డబ్బు తీసుకుని 'వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

"రామారావుని చంపేసే కాంట్రాక్ట్ రద్దు చేసుకుంటున్నాను. ఇంద మీ డబ్బు."

"ఇండియాలో ఉన్న ఆటంబాంబు లాంటి వ్యక్తి రామారావు. అతన్ని నే చంపేస్తే నా అంతరాత్మ నన్ను చంపేస్తుంది."

"ఇంద మరో సూట్ కేసు తీసుకో, దీనితో నీ అంతరాత్మ నోరు నొక్కేయ్."

"అంతరాత్మలకి డబ్బు విలువ తెలియదు"

"ఏమంటావిప్పుడు?"

"అతన్ని నే చంపను."

"మాట ఒప్పుకున్నప్పుడే, డబ్బు అడ్వాన్సుగా తీసుకున్నప్పుడే కాంట్రాక్ట్ ప్రారంభమయింది. అది ఇప్పుడు రద్దుకాదు."

"అందుకే నాకిచ్చిన డబ్బుకి వడ్డీ తెచ్చాను."

"బాబ్బాబు. నీకు పుణ్యం ఉంటుంది. ఇండియాలో అతనికేదైనా జరిగితే గొడవలౌతాయని నిన్ను నమ్ముకుని ఇక్కడ కాంట్రాక్ట్ కుదుర్చుకున్నాను. నాకూ అతన్ని చంపమనడం బాధగానే ఉంది. కానీ వాళ్ళిస్తానన్న డబ్బు ఎంత ఎక్కువంటే నా వారసులు మూడు తరాలు కూర్చుని తిన్నా తరగనంత. అందుకే కక్కుర్తిపడిపోయాను."

"అది నావల్ల కాదు. క్షమించు."

"నీకు మరోటి కాదు... కాదు.. రెండు... నాలుగు.. ఐదు సూట్ కేసులు ఎక్కువిస్తాను. ప్లీజ్! ఇప్పుడు అతన్ని అమెరికా రప్పించే రిస్క్ కూడా లేదు. ఆ చంద్రశేఖర్ పంపించాడు. కాగల కార్యం తీర్చిన గంధర్వుడు. ఇప్పుడు రామారావుని చంపితే మనచేతికి మట్టి అంటదు.

"సరే ఐతే. అతన్ని నేను చంపను. ఆ మధ్య ఇద్దరు అమెరికన్లని విడిచాకదా! ఆ దీవిలో విడిచి వస్తాను. అదైతే చేయగలను."

"ఓ.కే ఆ పని చేయి. అక్కడినుండి మనిషన్నవాడు ప్రాణాలతో బైటపడడు. నాకూ రక్తపు కూడు అందులోనూ ఓ మంచివాడి రక్తపు కూడు తిన్నాననే బాధ ఉండదు."

"సరే! అతని వివరాల ఫైల్, ఫోటో అన్నీ తెప్పించి రెడీగా ఉంచు."

"అలాగే"

●●●

**ఇదీ జరిగిన విషయం.** ఇప్పుడు మనం పడవలో ఉన్నాం. మరో అరగంటకి నిన్ను నీళ్ళలో తోసి మేము వెనక్కి వెళ్ళిపోతాం. నా పేరు ఉపేందర్. నిన్ను విడిచే దీవి వివరాలు విను. ఇది అమెరికాకి చాలా దూరంలో ఉంది. ముందుగా షిప్‌లో మరో దీవి చేరి అక్కడి నుండి ఇక్కడికి పడవలో రావాలి. చాలా ప్రమాదకరమైన ప్రయాణం ఇది. అనుభవం ఉన్న ఈ దీవి వాళ్ళు మాత్రమే ఇలా పడవ నడపగలరు. మరొకళ్ళకి ఇది అసాధ్యం.

ఈ దీవి అనాగరిక అడవి జాతి వారిది. ఇక్కడ రాణి పరిపాలన ఆనవాయితి. జనం అనాగరికమైనా వీరు చాలా మంచివారు. చాలా సుకుమారంగా ఉంటారు. వీళ్ళకి నీటి ఎద్దడి చాలా ఉంది. అందుకే తెలిసిన నావంటి దుర్మార్గులు, దొంగలద్వారా మనుషుల్ని రత్నాలిచ్చి కొనుక్కుంటారు. ఆ రత్నాలు వీళ్ళకి ఎక్కడినుండి వస్తాయో మట్టుకు తెలీది. అది చాలా రహస్యంగా ఉంచుతారు.

కొనుక్కున్న బానిసలతో చాలా దూరం నుండి నీళ్ళు తెప్పించుకుంటారు. మంచినీళ్ళు వాళ్ళకి చాలా దూరంలో ఉంటాయి. నీళ్ళు మోసీ, మోసీ బానిసలు చచ్చిపోతారు. కొత్తవారిని కొనుక్కుంటారు. రోజుకి ఇన్ని కడవలనీళ్ళని వాళ్ళకేవో లెక్కలుంటాయి. అవి తెచ్చి పడేస్తే వాళ్ళిక నీ జోలికి రారు.

ఆ! అన్నట్టు నువు శాఖాహారివనుకుంటాను. అక్కడంతా పచ్చిమాంసమే. కూరగాయలు తక్కువ. పేరు తెలీని ధాన్యమేదో పండుతుంది. దాన్ని పిండి చేసి కుడుముల్లాంటివేవో వండుతారు. ఇక్కడి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే చంపేస్తారు. కానీ నాకు నమ్మకముంది. నువ్వు ఎలాగైనా ఇక్కణ్ణుండి బయటపడతావ్. అప్పుడు నా దగ్గరకు రా. ఇదిగో నా విజిటింగ్ కార్డ్. ఎన్ని ఏళ్ళ తరువాత నువ్వు ఇక్కడికొచ్చినా నీతోపాటు నేను వస్తాను ఇండియాకి. ఆ! అన్నట్టు నేన్నీకు చేసిన ద్రోహానికి శాస్తిగా నా వృత్తినే మానుకుంటున్నాను. నీ మీద పగలేదు. కానీ అసహాయతతో ఈ పని చేశాను. నన్ను క్షమించు. రామారావుకి విజిటింగ్ కార్డ్ ఇచ్చి అతన్ని నీళ్ళలోకి తోయాలనుకున్న ఉపేందర్ విభ్రాంతిగా చూశాడు. రామారావు తనే దూకాడు.

తనకోసం ఈదుకుంటూ వస్తూ ఆ దీవి వ్యక్తిని సమీపించాడు. ఇలాంటి సంఘటన మొదటిసారిగా చూసిన ఆ వ్యక్తి రామారావు తననేదో చేయడానికి వస్తున్నాడని అతన్ని ఎదుర్కొనడానికి తయారుగా ఉన్నాడు. సమీపంలో ఉన్న ఒడ్డుని చేరిన రామారావు అతన్ని చూసి చిరునవ్వు నవ్వి రమ్మన్నట్టుగా సౌంజ్ఞ చేశాడు. అయోమయంగా చూస్తున్న ఆ అడవి మనిషి ఒడ్డుకి చేరాడు. దూరం నుండి ఉపేందర్ బై చెప్పాడు. రామారావు అటుగా చూడలేదు.

●●●

అదొక చిన్నదీవి. నిండా ఒక చిన్న గ్రామమంత కూడా ఉండదు. దాని పేరు 'జ' దీవికే కాదు అక్కడి మనుషుల పేర్లు కూడా ఏకాక్షరనామాలే. ఆడవారు ఆ ప్రాంతం వారికి దేవతలు. కష్టమైన పనులేవీ వారిచేత చేయించారు. వంటనుండి అంతా మగవారిపనే. ఇంటిని అలంకరించే వస్తువులు చేసుకోవడం, శరీరాన్ని అందంగా ఉంచుకోవడం, పండుగుల వంటివి వచ్చినప్పుడు మగవారికి సాయపడ్డం ఇలా చిన్న చిన్న పనులు తప్పించి ఆడవారికి పెద్దగా పనులేమీ ఉండవు. మాములుగా ఇలా గిరిజన జాతివారు నల్లగా మొరట తేలి ఉంటారు. వీరు మట్టుకు చక్కని నాసికలతో, గోధుమ వర్ణానికి కొద్దిగా ఎక్కువగా, అందంగా ఉన్నారు, సుకుమారంగా కూడా ఉన్నారు. వేడి కొద్దిగా తక్కువగా ఉన్నా ఎండకూడా ఉంది. స్త్రీ పరిపాలన అక్కడి ఆనవాయితీ. కానీ ఈ పాలన అనువంశికం కాదు. పద్దెనిమిది నుండి ముప్పై ఏళ్ళ వరకే రాజ్యాధికారం తరువాత నచ్చిన వాణ్ణి పెళ్ళాడి గృహిణిగా స్థిరపడాలి. రాణి గృహిణిగా మారిన తరువాత పోటీలో ఉన్న కన్నెలందరూ ఓ మైదాన ప్రాంతంలో అక్కడ పూసే ఓ అడివిపూలతో కిరీటం వంటిది వేస్తారు. ఆ రాత్రి గ్రామంలో ఎవరూ బైటికి రారు. మరునాడు ఎవరి కిరీటం గాలికి చెక్కు చెదరకుండా ఉంటుందో ఆమె ఆనాటినుండి మహారాణి.

ప్రస్తుత మహారాణి పేరు 'రూ'. ఆమె పరిపాలనకి వచ్చి నాలుగేళ్ళయింది. మంచి అందగత్తె, మంచి తెలివైనది కూడా అని అక్కడి వారి అభిప్రాయం. అక్కడికి బానిసలుగా అమ్మబడిన వారు రామారారావు ఆరవవాడూ, చివరివాడూ కూడా. బానిసల సంఖ్య ఎప్పుడూ ఆరుని మించదు. ఎందుకంటే వజ్రాలు వారికి దేవత ఇచ్చిన ధనం. అది ఎక్కువగా ఖర్చు చేయకూడదని వారి అభిప్రాయం. బానిసలుగా యువకులూ, ఆరోగ్యంగా ఉన్న వారిని మాత్రమే కొనుక్కుంటారు.

గతంలో ఉన్న ఆరుగురు బానిసలు కూడబలుక్కుని ఒకేసారి ఆత్మహత్య చేసుకోవడంతో ఒకేసారి ఆరుగురిని కొనుక్కోవలసి వచ్చింది. అదివారికి బాధాకరంగా ఉంది. అందుకే బానిసలమీద కట్టడినీ, శ్రమనీ కొంత తగ్గించి, వారిని కొద్ది దయతో చూడాలని రాణి ఆజ్ఞాపించింది. ఉన్న ఆరుగురిలో తొమ్మిది నెలల క్రితం వచ్చిన మొదటి వ్యక్తి చాంగ్, చైనా యువకుడు.

●●●

చాంగ్ పుట్టిన సంవత్సరానికి అతని తండ్రిపోయాడు. పేదరికంలో కూడా అతన్ని తల్లి బాగానే పెంచింది. ఐతే ఎందుకో చాంగ్‌కి చిన్నతనం నుండి సన్యాసిగా మారాలని కోరిక. పన్నెండేళ్ళ ప్రాయంలోనే. అతను తన కోరికని తల్లితో చెప్పాడు. తల్లి తిట్టింది. "నీకు తెలుసుగా? ఇలాంటివి ఇక్కడ నడవ్వు" అంటూ బయపెట్టింది. చాంగ్ తన పట్టు వీడలేదు.

"ఐతే విను. ముందు ఇంగ్లీష్ బాగా నేర్చుకో" అంది. సరేనన్నాడు. ఇంగ్లీష్ నేర్చుకోసాగాడు.

కొంతకాలానికి చెప్పాడు. "నాకు ఇంగ్లీష్ బాగా వచ్చింది" అన్నాడు.

"సరే ఐతే ఓ సంవత్సరంపాటు ఇంగ్లీష్ పేపర్ కూడా చదువు. అంతేకాదు నువ్వు ఏదో ఒక వృత్తిలో విద్యలో ప్రావీణ్యం సంపాదించేవరకు నా ముందు సన్యాసం మాట ఎత్తకు" అంది తల్లి.

అదే రోజు అతను ఎక్కడికో వెళ్ళిపోయాడు. తిరిగి సంవత్సరం తరువాత వచ్చాడు. "అమ్మా! నాకులోకజ్ఞానం, ఆంగ్లం, విద్యా బాగా వచ్చాయి. ఇదిగో నేను నేసిన వస్త్రంతో నీకు గౌను కుట్టి తెచ్చాను. " అంటూ తల్లికి ఇచ్చాడు. ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది.

"నాయనా! నాకు చిన్నప్పటి నుండి సన్యాసులంటే ఇష్టం ఉండదు. నీవు సన్యసిస్తాననగా నీకు బద్దకపు జబ్బు పట్టుకుందని అనుకున్నాను. లోకజ్ఞానం తెలిస్తే సన్యాసం మీద ఏవగింపు కలుగుతుందనుకున్నాను. వృత్తి విద్య నేర్చి నాలుగు డబ్బులు కళ్ళజూస్తే మారిపోతావనుకున్నాను. నీది నిజమైన పట్టు అని నిరూపించావు.

ఐతే కొన్ని మంచి మాటలు విను. కష్టపడి సంపాదించినదే తప్ప, ఎప్పుడూ కూర్చుని, కబుర్లు చెప్పి తినబోకు. నువ్విప్పుడు అనుభవించే సుఖం, తినే తిండి, మరొకరి శ్రమ ఫలితం అని మరువకు. ఈనాడు నీ చేతనున్న సంపద నిన్న మరొకరిది. రేపు ఇంకొకరిది మరవద్దు. ఆపద, రోగం, ముసలితనంలో తప్ప శారీరక శ్రమ చేయనినాడు ఆహారం ముట్టకు. ఈ దేశంలో సన్యాసులమని చెప్పుకోరాదు. అందుకని దేశపు ఎల్లలు దాటివెళ్ళిపో. సంపూర్ణ జ్ఞానివై, అసలైన సన్యాసివై మెలుగుకాక. నా కొరకు దిగులుపడకు. ఈ చేతుల్లో బలం ఉన్నంత వరకు కష్టం చేసుకుంటాను. ఆ తరువాత వెనకేసిన డబ్బుంది. అది చాలు వృద్ధాప్యానికి" అంటూ సాగనంపింది.

చాంగ్ భారత్ వచ్చాడు. అతన్ని గురువుగా ఆదరించారు జనం. దాంతో శిష్యులమంటూ చేరబోయారు జనం. "నేనే అజ్ఞానిని. అజ్ఞాని గురువేంటి?" అంటూ తరిమేశాడు. కొంతవరకు ధనం, మందిరాలు, హంగూ అర్పించబోయారు. అన్నింటిని నిరాకరించాడు.

తను నేసిన వస్త్రాలని అమ్మి దాంతో వచ్చిన డబ్బుతో చిన్న కుటీరం నిర్మించుకుని అందరూ ధ్యానం చేస్తూ గడపసాగాడు. ప్రజలు అతని నిరాడంబరతకి జేజేలు పలికారు. దాంతో అతను వేసిన వస్త్రాలకు ధర ఎక్కువగా పలుకుతోంది. చాంగ్ బాగా ఆలోచించి మారువేషంలో రాత్రి వేళల సంతలాంటి విక్రయశాలల్లో అమ్మ సాగాడు. అదీ సరసమైన ధరలకు. శిష్యులమని వచ్చినవారికి కన్నుకుట్టింది. ఒళ్ళుమండింది. అతన్ని నిలదీశారు. అంతే అక్కడినుండి నేపాల్‌కి మకాం మార్చాడు.

శిష్యులమని వచ్చిన వాళ్ళు అక్కడికే చేరారు. అతన్ని బ్రతిమాలి, బామాలి అమెరికాలో చిన్న ఉపన్యాసం ఇచ్చేందుకు రప్పించి అక్కడినుండి ఈ దీవికి అమ్మేశారు.

చాంగ్ రామారావుని చూసి చూడగానే "యూ ఆర్ రమరవ్!" అన్నాడు.

"యస్" అన్నాడు రామారావు వారం రోజులు బాధగా, అన్యమనస్కంగా గడిపాడు రామారావు. అమ్మ, నాన్న, తాతయ్య చాలా గుర్తొచ్చారు. తరువాత తనకి తనే సర్ది చెప్పుకున్నాడు. అలవాటు పడ్డం నేర్చుకున్నాడు. మిగిలిన వారితో కలిసిపోయి తన పని తాను

చేసుకునేవాడు. అంతా ఆంగ్లంలో మాట్లాడుకుంటూ వారితో స్నేహం, కబుర్లు, వాదనలు ఎక్కువైనవని తనని తను గమనించుకుంటూ రామారావు తెలుసుకున్నాడు.

●●●

వాతావరణంలో మార్పువల్ల, అలవాటు లేని శ్రమవల్ల రామారావుకి బాగా జ్వరం వచ్చేసింది. వచ్చిన కొత్తలో బానిసలకి ఇలా జ్వరాలు, జలుబు దగ్గులు మామూలే. కనుక అక్కడివారు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారికి తోచిన చెట్లు మందులేవో వేసి ఊరుకున్నారు. వాటితో జ్వరం తగ్గలేదు కదా ఇంకాస్త పెరిగింది.

అపుడు చాంగ్ మాత్రమే కాక ఇంకా నలుగురూ అతనికి చాలా సేవ చేశారు. రాత్రింబవళ్ళు వాళ్ళు చేసిన సపర్యల వల్ల, అతనికి జ్వరం తగ్గింది. కోలుకోవడం మొదలుపెట్టారు. ఒక మగవాడి గురించి మిగిలిన మగవారు ఇంత శ్రద్ధ, ఓపికతో సేవచేయడం అక్కడివారిని ఆశ్చర్యపరిచింది. వారికి చాలా దూరంలో పురుషాధిక్య ప్రపంచం ఒకటుందని అక్కడ మగవారికి మాత్రమే న్యాయం జరుగుతుందని తెలీని అమాయకులు పాపం.

●●●

"రామారావ్! ఏం ఆశించి నువ్వు ఇన్ని పనులు చేశావ్? ప్రజలకోసమా? నీ మానసిక తృప్తి కోసమా? కీర్తి కాంక్షా? ఏదైనా పదవిలాంటివి ఆశించావా? కారణం చెప్పు" చాంగ్ అడిగాడు.

"కీర్తి కాంక్షే" చెప్పాడు మైకేల్. అతను అమెరికన్. ఇంజనీరు. ఓ పేరున్న ఇంజనీరు కట్టిన ఓ పేద్ద భవంతి అరవై ఏళ్ళకల్లా కూలిపోతుందని సశాస్త్రీయమైన వాదనతో ఓ సభలో వాదించాడు. అందుకు అలిగిన ప్రత్యర్థి అతన్నీ దీవికి పంపించేశాడు.

"ధనకాంక్ష, వస్తుకాంక్ష, మీలాంటి సన్యాసికి మోక్ష కాంక్ష ఉన్నట్టే ఇతనికి కీర్తి కాంక్ష చాలా ఉన్నదనిపిస్తోంది నాకు. వెంటనే డేవిడ్ అందుకున్నాడు.

"ఏదో ఆశించి చేసే వాళ్ళు ఇన్ని మంచి పనులు చేయరు. అదీ నిస్వార్థంగా" అన్నాడు. ఇతను కూడా అమెరికనే. ఓ సైంటిస్ట్, భారతీయ ఆయుర్వేద వైద్యం మీద పరిశోధన చేసి కొన్ని చాలా గొప్పవని, మరికొన్ని వాడ్డం వల్ల రోగాలకి సైడ్ ఎఫెక్టు కలుగుతుంది తేల్చాడు. ఇంకా కొన్ని మందులపై పరిశోధన జరగాల్సి ఉండగా ఇక్కడికి తేబడ్డాడు.

"అసలు స్వార్థం అనేది తప్పన్నది ఎవరు?" తనుకూడా వాదనకి దిగాడు ఫెరోజ్. ఇతను పాకిస్థాన్ ఆర్మీ ఆఫీసరు. పరమనాస్తికుడు. ఉన్నదున్నట్టు మాట్లాడాలనే కఠిన నియమం కలవాడు. పైవాడిని కాకా పట్టడం గాని, క్రింద వాడిచేత కాకా పట్టించుకోవడంగానీ ఎరుగని ముక్కు సూటిమనిషి. అందుకే రాత్రి ఇంట్లో నిద్రించినవాడు మూడోరోజు కళ్ళు తెరచి చూశాడు. అప్పటికే ఈ దీవిలో ఉన్నాడు.

స్వార్థపూరితమైన కోరిక వల్లే మానవ జన్మ ప్రారంభమవుతుంది. అలా పుట్టిన మానవుడికి స్వార్థం ఉండకూడదనడం అన్యాయం. ఇల్లు, బట్టలు, తిండి, నిద్ర, పెళ్ళాం, పిల్లలు ప్రేమ, అనుబంధం, కడుపు తీపి ఇతన్నీ తనకోసం.

"తానైన 'తనదనాన్ని' చంపుకోవడం తన్ని తాను చంపుకోవడమే. మనిషిని జీవచ్ఛవంలా బ్రతకమనడమే నిస్వార్థంగా జీవించమనడం"

"అంటే హత్యలు, దోపిడి, దొంగతనలు చేసి జీవించడం సబబని నీ ఉద్దేశ్యమా?"

"సబబు అనేది పరిస్థితిని బట్టి ఉంటుంది. 'ఏ' అనేవాడు.. 'బి' అనేవాడిని రోజూ మానసికంగా హింసిస్తుంటే ఓ రోజు 'బి' వెళ్ళి 'ఏ' ని హత్య చేశాడనుకో. అది హత్య కాదు 'ఏ' ఉన్న హింసాత్మక ప్రవృత్తే వాడి మరణానికి కారణం కదా?"

"కాదు. స్వార్థం అనేది ఒకటే. అది ఒక్కటిగానే ఉండి ఉంటే తనకోసం తాను శ్రమిస్తాడు మంచి ఫలితాలని పొందగల్గుతాడు. దానికి చిన్న చిన్న కోరికలు జాయింటయితే అది హత్యలు, దోపిడీల్లాంటి వాటిక్కారణమవుతుంది."

"స్వార్థాన్ని చెడు ఆలోచనగా చిత్రించిన వాళ్ళు ఎన్నివేల ఏళ్ళనాటి వాళ్ళోగాని మానవాభివృద్ధిని కొంత నిరోధించారనే చెప్పచ్చు. 'సంఘం కోసం బ్రతుకు', 'లోకం కోసం జీవించే 'స్వార్థ' త్యాగిగా మారు' వంటి పదాలను ఏరేయాలి"

"అపుడుగాని పరోక్ష నరకంగా ఉన్న భూలోకం ప్రత్యక్ష నరకంగా మారడం"

"భూలోకం అంటే చెట్టూ - చేమా, పురుగూ - పుట్రా, రాయీ, రప్పాకాదు. మనుషులు కూడా. మిగిలిన వన్నీ జడపదార్థాలు. కదల్లేవు. కదలిక ఉన్న మనుషులు తమ అభివృద్ధి కోసం తాము కృషి చేస్తే మీకింత ఏడుపుదేనికి?"

అలా వాదనలు సాగుతుంటాయి. ఐదుగురూ వాదనలో పాలుపంచుకుంటారు. ఆ వ్యక్తి రష్యాకి చెందిన స్టాయ్. అతనెక్కువగా మాట్లాడు. అందరి మాటలు విని ఉంటాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు.

భూగర్భ పరిశోధనా కేంద్రంలో పనిచేశాడు. మంచి మేధావి. కానీ మొండితనం చాలా ఉంది. అందుకే అతనీదీవికి పంపించబడినాడు.

నాలుగు చక్రాలతో తోపుడు బండివంటివి ఉన్నాయి. తోలుతిత్తిలాంటి సంచులు, ప్లాస్టిక్ క్యాన్లు వంటి వాటిల్లో నీళ్ళు తెచ్చేయాలి. అదీ రోజుకి మూడుసార్లు అంతే వీళ్ళ పని. ఇక వీళ్ళ జోలికి ఎవరూరారు. బానిసల కోసం డేరాల్లాంటి మూడుగదులున్నాయి.

గదికిద్దరు చొప్పున నివాసముండాలి. భోజనం వాళ్ళే పంపిస్తారు. అది నచ్చకపోతే పళ్ళో దుంపలో తినచ్చు. వీళ్ళు తప్పించుకుంటారనే బాధ వాళ్ళకి లేదు. అది అసాధ్యం అని తెలుసుగనక జైలు లాంటి దరకాలేమీ ఉండవు. మంచినీళ్ళ కొలను లాంటి చిన్న నది వాళ్ళ నీటికి ఆధారం. నిజానికి నది చాల దూరంలో ఉంది. ఒకసారి నీళ్ళు తేవడమే కష్టం. అలాంటిది మూడుసార్లు తేవాలంటే కాళ్ళ వాపులే. "చూశారా! దేవుడున్నాడు. ఈ ఆపదలో కూడా మనకెంత సౌలభ్యమో. నీళ్ళు తెచ్చి అక్కడ పడేస్తే వాళ్ళు మన జోలికి రారు. మాట్లాడుకోవచ్చు. కబుర్లు చెప్పుకోవచ్చు. కొట్టడం, నరకయాతన పెట్టడం వంటి బాధలు లేవు. ఇదే పరమాత్మ దయ" చాంగ్ అన్నాడు.

"ఏడిసినట్టుంది. దేవుడి దయ ఉంటే ఇలాంటి కష్టం రాకుండా ఉండాలిగానీ వచ్చిన కష్టంలో సుఖాన్ని వెదుక్కుని ఇది దేవుడి దయ అనడం వెర్రితనం" అన్నాడు ఫెరోజ్.

"నిజమే కదూ! రోజుకి మూడుసార్లు నీళ్ళు తేవడం అంటే మామూలుగా లేదు. ఒళ్ళంతా ఒక్కటే నొప్పులు, బాధ. ఇక్కడ సుఖంగా ఉంది గనక దేవుడి దయ అనుకోవడానికి. నిజానికి దేవుడి దయ అనేది ఒక అనుభూతి. మనసుకి, శరీరాని కష్టం కలిగించే వివిధ అనుభూతులలో నుండి సుఖంగా అనిపించినదాన్ని వెలికి తీసుకుని సంతోషపడ్డమే దేవుడి దయగా చెప్పుకోవచ్చు. అలాంటి సంతోషం వల్ల బాధకి సంబంధించిన చిన్న చిన్న అనుభూతులు కష్టాన్ని కలిగించవు. ఈ రకమైన మానసిక స్థిరత్వాన్ని నింపరాదని దేవుడనే వాడిని ప్రవేశపెట్టారు మన పూర్వీకులు." అన్నాడు రామారావు.

●●●

"ఎప్పుడూ అలా దుంపలూ, ఆకులూ తినకపోతే వాళ్ళు పెట్టే భోజనం తినచ్చుగా?" కోపంగా అడిగాడు డేవిడ్

"తినచ్చు. కానీ ఆ మాంసాహారం అంటేనే లోపలినుండి వికారాలు వచ్చేస్తున్నాయి." అన్నాడు రామారావు.

"ఔను. విన్నాను. ఇండియాలో చాలామంది వెజిటేరియన్స్ ఉంటారటకదా?"

"ఉండచ్చు. కానీ దుంపలతో సరిపెట్టుకోవడం బద్ధకం. అవేవో నీకు తోచినట్టు వండుకోవచ్చుకదా?"

"వాళ్ళిచ్చే ఈ కుడుములతో నీ దుంపలు వండుకుని కలిపి భుజించు."

"అంత సమయం ఎక్కడుంది? మూడుసార్లు నీళ్ళు తెచ్చేసరికి ఒళ్ళు హూనమవుతుంది"

"మనస్సుంటే మార్గం అదే దొరుకుతుంది. సమయం చిక్కుతుంది."

అంతే ఆలోచనలో పడ్డాడు రామారావు. వంట ప్రారంబించాడు. అది క్రమంగా రుచిని సంతరించుకుంది. మిత్రులు కూడా వాళ్ళు పంపించే నాన్ వెజ్‌ని తిరస్కరించి కుడుములు మాత్రమే తీసుకుంటున్నారు. కారణం తెలుసుకున్న ఒకరిద్దరు అతని వంటని రుచి చూశారు. రాణికి తెల్పారు.

ఆమె జిహ్వాకి ఈ కొత్త రుచి నచ్చింది. అంతే. రామారావుకి వంటవాడిగా ప్రమోషన్ వచ్చేసింది. మిత్రులు వద్దన్నా రామారావు నీటి మోతకి వెళ్తూనే ఉన్నాడు రామారావు.

●●●

ఐదేళ్ళ పాపకి జ్వరం తగిలింది. అది పెరిగి ఫిట్స్‌లా వచ్చింది. ఆ స్థితిలో ఆమెను ఎవరూ కాపాడలేరని వాళ్ళ భావన. అందుకే అంతా చేతులెత్తి ఆ బాలిక తమని వీడిపోతున్నందుకు బాధగా ఏదో చదువుతున్నారు.

అప్పుడే డేవిడ్ పరుగెత్తుకు వచ్చాడు. తన జేబులో నుండి ఏవో మాత్రలు తీశాడు. రాణీ పాదాల దగ్గర ఉంచిన పాపని తీసుకుని, ఒళ్ళోపెట్టుకుని మాత్రలు బలవంతంగా పాపనోట్లో కుక్కాడు. పాప ముఖంమీద కాసిని నీళ్ళు చిలకరించి కాసిని గొంతులో పోశాడు. పావుగంటకల్లా పాప్‌కి ఫిట్స్ తగ్గి కళ్ళు తెరచి చూసింది. అంతే. అక్కడి వాళ్ళకి అతను దేవుడిలా కనిపించసాగాడు.

●●●

"ఇక్కడి వారికి దేవుడు కాదు. దేవత మాత్రమే ఉంది. ఆమె చంద్రుడు" అన్నాడు రామారావు.

"అవును. చంద్రుడు నెలకి మూడురోజులు కనిపించడు. చతుర్దశి, అమావాస్య, పాఢ్యమి అవి ఆమెకి అంటే చంద్రదేవతకి నెలసరి రోజులు.

స్త్రీతో చందమామకి చాలా దగ్గరి పోలికలున్నాయి గనక స్త్రీలంతా దేవతలని వీళ్ళ అభిప్రాయం. కొద్దిగా గోసంపద ఉన్నా గోవులన్నీ తెల్లనివి. చంద్రుని లాంటివి కనుక వాటితో పనిచేయించరు. అందుకే వీళ్ళకి బానిసలు తప్ప గోవులని కట్టి బండ్లు ఉపయోగించి తేవాలనే ఆలోచన వీరికి వచ్చిఉండదు."

"మంచిదేకదా? ఈ ప్రపంచంలో ఏ ఒక్కచోటైనా స్త్రీని దేవతగా గుర్తించి ఆదరించే వ్యవస్థ ఉన్నది. మన నాగరిక ఛాయలు వీరి మీద పడితే చాలా ప్రమాదం" అన్నాడు ఫెరోజ్, తండ్రి బహుభార్యత్వం, వితండవాదం, అనాగరిక ప్రవర్తన అతణ్ణి నాస్తికుడిగా చేశాయి.

"అది సరేగానీ వీధులన్నీ అలంకరిస్తున్నారు ఎందుకో ఏమిటో తెలుసా?"

"ఆం రాబోయే పౌర్ణమినాడు రాణి పుట్టినరోజుట. ఆమె పౌర్ణమి రోజు పుట్టింది. కనుక వీరి దృష్టిలో ఆమె దేవత. "

"మిస్టర్ చాంగ్ మీరు మరో విశేషం గమనించారా? ఆ దేవత ఈ బుద్దుడిని అలవోకగా చూస్తోంది" రామారావు వంక వేలు చూపాడు.

"పాపం ఆ స్థానం కోసం మరో 'దేవత క్యూలో ఉండి వెళ్ళిందని ఈమెకి తెలీదు" అన్నాడు ఫెరోజ్.

రామారావుని గురించిన వివరాలు భారత్‌కి వచ్చినప్పుడే పేపర్లో చదివాడు చాంగ్. రామారావు నడిగి మరికొన్ని వివరాలు తెలుసుకున్నాడు. సిరి విషయం తప్పించి మిగిలిన వివరాలు అరకొరగా చెప్పాడు రామారావు. చాంగ్ సిరిని గురించి అడిగితే "వదిలేయండి" అని ఊరుకుంటాడు. తనకి తెలిసిన వివరాలు మిత్రులకు చాటుగా చెప్పాడు చాంగ్.

సిరి విషయం వచ్చినప్పుడు రామారావు మనసులో ఏదో బాధ. "చర్యకి ప్రతిచర్య ఉంటుంది. ఆమెను మానసికంగా బాధపెట్టినందుకే నాకీ మానసిక, శారీరక బాధ కలిగివుంటుంది" అనుకుంటాడు.

"ఆమెని నువ్వు ఇప్పటికీ ప్రేమిస్తున్నావ్" అన్నాడు చాంగ్.

"ఎవరిని?' నిదానంగా అడిగాడు.

"నా దగ్గర నాటకాలా?" చాంగ్ ఎద్దేవా చేశాడు. రామారావు పలుకలేదు. ఓనాడు అన్నాడు చాంగ్.

"రామారావ్! మీరు సరేనంటే మిమ్మల్ని సురక్షితంగా మీ ఊరు పంపగలను. ఎలా ఏమిటి అని అడగొద్దు. "

రామారావు ఆశ్చర్యంగా చూశాడు. "మీరు నాస్తికవాది. నమ్మకపోవచ్చు. కానీ నేను సాధించిన సర్వశక్తుల్ని ధారపోస్తే మిమ్మల్ని పంపించాం నాకు అసాధ్యమేమీ కాదు."

"వెళితే నేనొక్కడినే ఎందుకు? మనం ఆరుగురుం వెళ్ళాలి."

"అది నావల్ల కాదు."

"మరి నేనొక్కడినే ఎందుకు వెళ్ళాలి?"

"మీవల్ల మీ దేశానికి, సమాజనికి ఎంతో మేలు జరుగుతుంది"

"మీకు తెలుసో లేదో ఈ భూమి మీద ఉండే ప్రతి ప్రాణివల్ల సమాజానికి మేలు జరుగుతుంది."

"ఎలా?"

"ఒక కొత్తరోగి వల్ల ఆ రోగానికి మందు కనుక్కోబడుతుంది. హంతకుడి వల్ల జనాలు జాగ్రత్తలు నేర్చుకుంటారు. దొంగవల్ల దాచుకోవడం ఇలా ఈ భూమికి సకల జనుల అవసరం ఉంది. కనుక లోకానికి నా అవసరం ఎంతుందో మీ అవసరం అంతే ఉంది. నాకు తెలీకుండా నన్నెక్కడికి పంపించినా తిరిగి వెదుక్కుంటూ ఇక్కడికే వస్తాను. ఇక్కడినుండి వెళితే ఆరుగురం. పోతే ఆరుగురం. గుర్తుంచుకోండి" అన్నాడు స్థిరంగా.

●●●

అర్ధరాత్రి మెలుకువ వచ్చింది రామారావుకి. ప్రక్కన చూస్తే స్టాయ్ లేడు. బాత్రూంకి వెళ్ళాడని కాస్సేపు చూశాడు. చాలాసేపు చూసినా అతని జాడలేదు. లేచి బయటకి వచ్చి చుట్టుప్రక్కలంతా వెదికాడు. అతని జాడలేదు. ఈలోగా ఒక్కొక్కరుగా అందరూ లేచారు. విషయం విని అందరూ వెదికారు. అంతా వెతుకుతున్నారు. అందరికీ ఆదుర్దాగా ఉంది. ఎక్కడెక్కడో వెదికారు.

అతని జాడలేదు. అప్పటికి తెలవారవస్తోంది. మసకచీకటిగా ఉంది. మిత్రులకి దుఃఖం తన్నుకు వస్తోంది. "స్టాయ్!" అని పిలుస్తున్నారు. పెద్దగా పిలవడానికి లేదు. దీవివాసులకి నిద్రాభంగం జరిగితే ఏమంటారో తెలీదు.

చెట్లు, పుట్టలు రాళ్ళు, రప్పలు అన్నీ వెదుకుతున్నారు.

దీవికి నడిమధ్యన ఎత్తైన అరుగు కట్టబడి ఉంది. అది దీవి వాసుల రచ్చబండ.

మన జానపద చిత్రాలలో సభాభవనంలాంటిది. అరుగుకి పై భాగాన కప్పువేశారు. గడ్డి, ఆకులు పరిచారు.

రాణి అక్కడే కూర్చుని రాజ్యపాలన చేస్తుంది. అరుగుకి కొద్దిదూరంలో ఓ చెట్టు ప్రక్కనుండి వెళ్తున్న స్టాయ్‌ని చూపి "అడుగో" అన్నాడు మైఖేల్. అంతా అక్కడికి చేరారు. ఓ లోహపాత్రలో నీళ్ళు నింపి, దాన్ని అటు ఇటు తాళ్ళతో కట్టి, రెండు చేతులతో రెండువైపులా పట్టుకుని నెమ్మదిగా లాగుతూ నడుస్తున్నాడు. మిత్రులు ఐదుగురు ముఖముఖాలు చూసుకున్నారు.

తదేక దీక్షతో చేస్తున్న పనిలో నిమగ్నమయి ఉండడం వల్ల మిత్రులు రావడం గానీ, తనని అనుకరించడంగానీ అతనికి తెలీదు. ఉన్నట్టుండి ఓ చోట పాత్రలోని నీళ్ళలో అతని చేతిలో కదలిక వచ్చింది. మరో రెండడుగులు వేశాడో లేదో పాత్ర నేలై తాకి అటూ

ఇటూ పొర్లింది. ఒలికిపోయయి. "యా!" అంటూ అరిచాడతను. ఓ చెట్టుకొమ్మని విరిచి ఆ చోట నేలని కొద్దిగా తవ్వి కొమ్మని పాతేశాడు. అంతలో స్నేహితులని చూసి "మైడియర్ ఫ్రెండ్స్. నే కనుకున్నాను" అన్నాడు.

వాళ్ళు ఆశ్చర్యంగా చూశారతనివేపు. "నీళ్ళు... నీళ్ళు కనుగొన్నాను. ఇక్కడ ఈ స్థలానికి అరమీటరు వైశాల్యంతో తవ్వితే పాతిక ఫీట్ల లోతులో నీళ్ళున్నాయి. నే వచ్చినప్పటినుండీ వెదుకుతున్నాను. దీవి అంతా గాలిస్తున్నాను. ఎక్కడా నీరులేదు. భూమిలో పెద్ద కొండలు ఉన్నాయి జల లేదు. అందుకే దీవివాళ్ళ పూర్వీకులు బావులు తవ్వించి ఉండరు. నేటితో వీళ్ళకి నీటి కొరత ఉండదు" అన్నాడు. అతను చాలా సంతోషంగా ఉన్నాడు. మిత్రులతో నీళ్ళకోసం వెళ్తున్నారు.

వెళ్తూ వస్తూ చర్చించుకున్నారు. 'బావి తవ్వడానికి దీవివాసులు ఒప్పుకోరు. కనుక కొంతకాలం ఆగాలి' అని తేల్చారు. స్టొయ్ ముందుగా దిగులుపడ్డాడు. తరువాత ఏ భాషా తెలీని వీరికి బావుల్ని గురించి చెప్పి, ఒప్పించి, బావి తవ్వి నీళ్ళు రప్పించడం అంత సులభమేం కాదని గ్రహించాడు. "మీరన్నట్టుగా బావి తవ్వడానికి కొంతకాలం ఆగాల్సిందే" అన్నాడు.

చాంగ్ అన్నాడు. "మనం ఆలోచించాల్సింది నీటిని గురించి కాదు. రామారావుని గురించి అతి తొందరలో అతనేదో ఆపదలో చిక్కుకోనున్నాడని నాకు అనిపిస్తోంది. కనుక తనని ఒప్పించి ఇక్కడినుండి తప్పించాలి. "

అందుకు రామారావు అన్నాడు "ఆపద రానీ, ప్రాణం పోనీ మీరు ఐదుగురూ లేకుండా నేనీ దీవి దాటను. నాకు తెలీకుండా నా వెనుక మీ మాటలు, సైగలు నాకర్థమవుతున్నాయి. నేను ఎక్కడికీ వెళ్ళడం లేదు"

చాంగ్ అతని వంక అసహాయంగా చూశాడు. మరునాడు పౌర్ణమి. కార్తీక పౌర్ణమి!! రాణి పుట్టినరోజు. ఆపద రానే వచ్చింది.

●●●

**ఉన్న ఊరికీ, కన్నవారికీ** దూరంగా, ఖండాంతరాలకి ఆవల రామారావు బానిస బ్రతుకు గడుపుతున్నాడు. కానీ భారత్ బాగుపడింది. అగ్రరాజ్యాల ప్రక్కన కూర్చోవడానికి తయారుగా ఉంది. అందుకు కారణం రామారావు. అతను అమెరికా వెళ్ళక ముందు కేంద్రమంత్రి నుండి పిలుపు వచ్చింది. వెంటనే ఢిల్లీ వెళ్ళాడు రామారావు.

'పెద్ద 'వారంతా కలిసి రప్పించారు అతన్ని. "బాబూ! నీ వల్ల మా పదవులు పోబోతున్నాయి. ఐనాకూడా బాగా ఆలోచించాము. ఇంకా ఎన్నాళ్ళిలా అనిపించింది. ఐతే మేం పదవి దిగేముందు ఈ దేశ ప్రజలకు, దేశానికి గొప్ప ఉపకారం చేయాలనిపించింది. మా దగ్గరున్న ఐ.ఏ.యస్, ఐ.పి.యస్ బుర్రల్ని సంప్రదించాం. వాళ్ళిచ్చిన సలహాలతో పాటు నీవూ కొన్ని సలహాలియ్యగలవని పిలిపించాం. దేశ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉంది.

అవినీతి, విదేశీ బ్యాంకుల్లో ధనం, దొంగనోట్లు, అక్రమార్జనలు, ఎటు చూసినా దేశపరిస్థితి బాగోలేదు. దీనికి తోడు ఉగ్రవాదులు, తీవ్రవాదుల దాడి. ఏం జరిగినా ప్రభావం దేశ ఆర్థిక స్థితిపై పడుతోంది. అన్నింటా పనిచేసే ఏకసూత్రం ఏదైన ఉంటే చెప్పు. మేం పదవి దిగేలోగా అమలు చేసి వెళతాం. భారత్‌ని బాగుచేశాం అనే తృప్తితో రిటైర్మెంట్‌ని ఎంజాయ్ చేస్తాం" అన్నారు.

అందుకు రామారావు చాలా సంతోషించి అన్నాడు. "సార్. మాకు తెలుగులో ఓ సామెత ఉంది. 'రోగి కోరిందే వైద్యుడు ఇచ్చాడు' అని. రోగి ఏ పదార్థాన్ని తినాలని కోరుకున్నాడో వైద్యుడు పత్యంగా అదే తినమని చెప్పాట్ట.

ఈ విషయానిక్కూడా నేను న్యాయస్థానం తలుపులు తట్టాలేమోననుకున్నాను. కానీ మీ ఉన్నతస్థితిలో ఉన్నవారే నన్ను పిలిపించారు. నాకు సంతోషంగా ఉంది" అంటూ చెప్పడం ప్రారంభించారు. ఏం చేయాలో, ఎలా చేయాలో అంతా అనుకున్నారు. అనుమానాలు అడుగుతున్నారు. అన్నింటికీ సమాధానం చెప్పాడు. ఇంటికి వచ్చాడు. అపుడు అత్యున్నత న్యాయస్థానపు న్యాయమూర్తులు, రిజర్వ్ బ్యాంక్‌కి చెందిన పై అధికారులు, రాష్ట్రపతి, ప్రధాని, ఆర్థిక మంత్రిగా గల గొప్పవారంతా రహస్య సభ చేశారు.

కొన్ని తీర్మానాలని ప్రతిపాదించుకున్నారు. రామారావు ఆ దీవిలో చిక్కుకున్న వేళ జీవో అయింది. 'దేశ ప్రజలకి తెలియజేయడం ఏమంటే నేటినుండి నెలరోజుల తరువాత వందలు, ఐదువందలు, వేయి రూపాయల నోట్లు చెల్లవు. కనుక ఇలాంటి నోట్లు కలిగిన వారంతా ఆ డబ్బుని బ్యాంక్‌లో జమచేయండి. 'మనీకార్డ్' తీసుకోండి. ప్రభుత్వ బ్యాంక్‌ల్లోనూ, క్రింద సంబంధించిన ప్రైవేటు బ్యాంకుల్లోనూ మీ డబ్బు ఇచ్చి కార్డ్ పొందండి. తరువాత మీ డబ్బు వృధా అవుతుంది. గడువు ముగిశాక మీ 'పచ్చ' కాగితాలు (కాగితం) పడవలు చేసుకోవడానికే పనికొస్తాయి.

అంతే! ప్రజలంతా బెంబేలు పడిపోయారు. 'ఇంత' డబ్బుకి ఈ బ్యాంక్, అంత డబ్బుకి ఎక్కువైతే ఫలానా బ్యాంక్, అంతకన్నా ఇంకా ఎక్కువుంటే ఇదో ఇంకో బ్యాంక్ అంటూ ప్రకటించారు. కాలనీల కూడళ్ళలోనూ, చిన్న బస్తీల సెంటర్ల వద్దా చిన్న, బుల్లి శాఖలను ఏర్పాటు చేశారు. బ్యాంక్ సిబ్బందికి ఏ ఆదేశాలిచ్చారో ఏమో పనులన్నీ చకచకా జరిగిపోతూ క్యూలు త్వరగా కదులుతున్నాయి.

డబ్బు డిపాజిట్ చేసినపుడు వ్యక్తి ఫోటో మాత్రమే కాదు. వారి ఎముకలు, గుండె, వేలిముద్రలు, అన్నీ నమోదు చేయబడినాయి. ఇందుకోసం సిబ్బంది కొంత ఇబ్బంది పడ్డా చాలావరకు రిస్కులు కంప్యూటర్ గారే చూసుకున్నారు. రూపాయి, రెండురూపాయలు, ఐదు, పది, ఇరవై, యాభై నోట్లు మాత్రమే చెల్లుతాయి. అవి మాత్రమే ప్రజల దగ్గరున్నాయి. మిగిలిన పెద్ద నోట్లన్నీ 'ప్లాస్టిక్'లాగా మారిపోయాయి. దేశంలోని ప్రతి వ్యక్తికి (ఇండియన్ మనీకార్డ్) ఐ.యమ్.సి వచ్చేసింది. డబ్బుకి సంబంధించిన లావాదేవీలన్నీ కార్డ్ ద్వారానే.

ప్రతి ఒక్కరికి వ్యక్తిగత కోడ్ ఇవ్వబడింది. బ్లడ్ గ్రూప్. గుండె తీరు, అరిచేతులు, అరికాళ్ళు, ముద్రలతో సహా కార్డ్ మీద లిఖించబడింది. ఆ వ్యక్తి తప్ప మరొకరు కార్డ్ 'స్వైప్' చేశారంటే 'బఁయ్యి'మని మోత వస్తోంది. అంతే! ఈ చర్యతో ప్రజలు పేదవారు కాలేదు. కానీ ప్రభుత్వం ధనమైంది. ప్రజలకు ధనం ఉంది. కానీ అది ప్రభుత్వ ఖజానాలో ఉంది. జనానికి తమ డబ్బువాపసు ఇచ్చే హక్కుంది. కానీ లెక్కలన్నీ బాహాటం. 'నల్ల'ధనానికి, నల్లని తనానికి చోటులేదు.

బ్లాక్ మనీ చిన్నబోయింది. విదేశీ బాంకుల్లో మగ్గుతున్న డబ్బు విస్తుబోయింది. ఇన్‌కంటాక్స్ 'కట్' అయ్యాక మిగిలిన డబ్బే ప్రజలకు చెందుతోంది. ప్రభుత్వం ఈ చర్య తప్పని అరిచి రోడ్డుమీద గొడవ చేద్దామని ఒకరిద్దరు బైలుదేరక పోలేదు. ఐతే అలా వచ్చిన వారి ఫోటోలు తీసి వారికి కార్డ్ ఇవ్వద్దని హుకుం జారీ అయింది. టాక్స్ వేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేకుండా పోయింది. ప్రభుత్వ ఖజానా నిండి, పొంగి పొరలుతున్నది. డబ్బు నిలువ పనులు ఎంత త్వరగా పూర్తవుతున్నా ఇంకా బ్యాంక్‌ల ముందు క్యూలు ఉంటున్నాయి.

కొందరు 'పెద్ద'లు ఇపుడు ఏం చేయాలన్న ఆలోచనలో పడిపోయారు. ప్రతి ఒక్కరికి తాము అనగా తన డబ్బుని తాను రక్షించుకోవడమే తక్షణ కర్తవ్యంగా తోచింది. 'ప్లాస్టిక్ మని' ప్రభంజనాలని సృష్టించింది. దేశంలోని డబ్బునంతా సూదిని అయస్కాంతం లాగినట్టు మని కార్డ్ లాగేసింది. ఇంతకన్నా ఎక్కువ మొత్తం ఉన్నవారికి మాత్రమే 'ఇన్‌కంటాక్స్' అన్నారు. పేదలు ఊపిరి పీల్చుకున్నారు. పెద్దలు గుండెలు బాదుకున్నారు.

రామారావుని చేరదీసి మీటింగు పెట్టిన 'పెద్దలు' విస్తుబోతున్నారు. అంతా అతను చెప్పినట్టే జరుగుతోంది. ఇపుడు చేయాల్సింది మరోటి ఉంది. ప్రతీ గుడిలోనూ ప్రభుత్వం వారు పెద్ద పెద్ద హుండీలు ఏర్పాటు చేశారు. తిరుపతిలోని వెంకన్న గుడి హుండీలకన్నా పెద్దవి అవి. తిరుపతి, శ్రీశైలం, కాని, మధుర వంటివే కాక.. నూకాలమ్మ, అంకాలమ్మ, పోచమ్మ మైసమ్మ వంటి గ్రామదేవతల గుడివరకూ. అన్నింటా పెద్దపెద్ద హుండీలు .

చాలా చిత్రంగా ఆ హుండీలు కూడా నిండడం ప్రారంభించాయి. ఎవరు వేస్తున్నారో తెలీదు. గుళ్ళ హుండీలన్నీ నోట్ల కట్టల చెరువులుగా మారాయి. ఎక్కడా చిల్లర లేదు. అన్నీ వందలనుండి పైనున్న నోట్లే.

పెద్ద గుళ్ళలో చెప్పాల్సిన పనిలేదు. హుండీ గదులు వెలిశాయి. అవి రోజురోజుకీ నిండుతున్నాయి. 'అమ్మ రామారావు!' అనుకున్నారు 'ఆ' పెద్దలంతా. అంతే. పెద్ద పెద్ద ఇంజనీర్లు రప్పించబడ్డారు. ధనమున్న ప్రభుత్వం మరి. ఉద్యోగులని శాసించింది.

పెద్ద పెద్ద నదులన్నీ అనుసంధానం చేయబడినాయి. చుక్కనీరు కూడా సాగరం పాలుకాకుండా బుల్లి వంతెనలు, చిన్న వంతెనలు, భారీ డామ్‌లు నిర్మించబడ్డాయి. ప్రాజెక్టులు కట్టబడినాయి. అందుకోసం వాడిన సిమెంట్ అత్యంత ఖరీదైనది. ఎక్కడా లూటీకి అవకాశం లేదు. అబద్దాల లెక్కలకి ఛాన్సులేదు. గతంలో ఇలాంటి ఖర్చు భరించే శక్తి ప్రభుత్వానికి లేదు. కాని నేడు ప్రభుత్వం ఒక ధనశక్తి. సిరిగల ప్రభుత్వం.

మంచి సిమెంట్. అందుకు తగిన మిగిలిన సరుకు. అనుకున్న దానికన్నా ముందుగా ప్రాజెక్ట్ తయారయ్యాయి. దేశంలోని ప్రజల నీటి కటకట తీరింది. దేశంలో ఉన్న నీరంతా ప్రాంతాల పోట్లాట లేకుండా ప్రజలందరికీ పంచబడింది. నీటి ఎద్దడి లేదు గనక పంటలు పండుతున్నాయి. రైతుల కష్టాలు తీరాయి. వ్యవసాయాభివృద్ధి వేగంగా జరిగింది.

ఇండియాలో రోడ్లు విదేశాల రోడ్లుగా మారాయి. ఎక్కడి కక్కడ ఫ్లై ఓవర్లు వెలిశాయి. డ్రైనేజీ సిస్టమ్‌లో మార్పులు జరిగాయి. రోడ్లమీద గుంటలు, గోతులు, మురికి నీరు లేదు. వృథాగా ఉన్న పాలిథిన్ కవర్లు 'క్రష్' చేయబడి, రోడ్లమీద పరచబడి దానిపై తారురోడ్డు పోయబడింది. ప్రతి ఇంటి ప్రక్కన రోడ్డుమీద భూమిలోపలికి చెత్త డబ్బాలు ఉంచబడినాయి. ఏ ఇంటి డబ్బాలోనైనా పాలిథిన్ కవరుంటే ఆ చెత్త తీసెయ్యబడదు.

రోడ్ల మీద ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ఎక్కడికక్కడ కెమెరాలుంచబడినాయి. 'ఇంకా కీ రూల్స్ ఏవో వస్తాయిట' పుకారు మొదలయింది. ప్రజలు భయపడుతున్నారు. రూల్స్ పాటిస్తున్నారు. నియమ నిబంధనలకు లోబడి ఉంటున్నారు. భూ గర్భజలాలు పుష్కలంగా ఉన్నాయి. కారణం నది నీరు పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా పంచబడింది. చెట్లు, పచ్చదనం హరితమయ భారతం.

'ఐతే తెలివైన వారు బంగారం, వెండి, వజ్రాలు కొనుగోలు చేశారు. వాటిపై నియంత్రణ, వ్యాట్, పన్నులు విధించండి' రామారావు సలహా పెద్దలకు గుర్తొచ్చింది. అమ్మకాలు, కొనుగోళ్ళు ప్రభుత్వానికి తెలిసేట్టు జరుగుతున్నాయి. దాచుకోవాలనుకునే వారు పన్ను కడుతున్నారు.

ఓ శాస్త్రవేత్త వచ్చారు. 'కెమికల్ కంపెనీలు విడిచే నీటివల్ల వాతావరణ కాలుష్యం కలుగుతోంది. కేవలం చెడునీటిని మాత్రమే పీల్చుకునే మొక్కల్ని కనుకున్నాను. కెమికల్స్ నీరంతా తొట్లలో నిలవుంచి ఆ చెట్లు నాటితే నీటిని శుభ్రపరచడమే కాదు. అవి కెమికల్స్‌ని లాక్కుని పెరిగి చిన్న చిన్న చెట్లుగా తయారై, మంచిగాలిని, ఆక్సిజన్‌ని విడుస్తాయి' అన్నాడు. కెమికల్ వాటరంతా రీ సైక్లింగ్ చేయబడి అప్పుడు విడువబడుతోంది. మిగిలిన కాలుష్యంతో మొక్కలు పెరగసాగాయి. చెడువాసన పీల్చుకుని ఆ చెట్లు పరిమళాలని వెదజల్లుతున్నాయి. లంచాలు పోయాయి. లంచగొండులు పోయారు.

విదేశాల్లో 'మన' ధనం హుండీల్లో నిండి తెల్లగా మారింది. కొంత ప్రభుత్వ ఖజానాల్లో నిండింది. స్కామ్‌లు ఎందుకు? ధనం కోసం ధనం ఎందుకు? దాచడానికి. దాచిన ధనం మురిగిపోతుందంటే? దానికి కాలం చెల్లిందంటే? విదేశీ బ్యాంకుల వాళ్ళు ముక్కున వేలేసుకున్నారు.

'ఔరా! ఇండియా!' అనుకున్నారు. కారణం అక్కడ దాచిన కరెన్సీ కట్టలన్నీ మాయమయ్యాయి. దాన్ని 'మనీ కార్డ్'గా మార్చలేకపోయిన వారు పుణ్యంగా మార్చాలనుకున్నారు. అక్రమార్కులంతా విక్రమార్కులై దేవుడి హుండీలని బరువెక్కించారు.

బంగారాన్ని ధరించేది అందం, అలంకరణ కోసమేనా? వాటిని తలదన్నిన చక్కదనం గల నగలు వచ్చాయి. కానీ అందరికీ బంగారం కావాలి. ఎందుకు? బంగారం శరీరం మీద కదిలొచ్చే కరెన్సీ ఎప్పుడైనా బంగారం ధర ఇత్తడికి సమంగా పడిపోతే అపుడు బంగారం కొంటారా జనం? కొనరు. దాని విలువ పచ్చ కాగితాలలో ఉంది గనక అది పొదుపుకి, మదుపుకి అక్కరకొచ్చే పరికరం.

'కొనుగోలైన ప్రతీ గ్రాము బంగారానికి లెక్క, పత్రాలు చూపాలి' ప్రభుత్వ ఆజ్ఞ కొనుగోలు తగ్గాయి. పిచ్చి వ్యామోహం తగ్గింది. అంతే! 'పచ్చ'దనంతో జరిగే 'నల్ల' వ్యాపారం తగ్గింది. 'ఏం బంగారం లెద్దూ' అనుకుంటున్నారు జనం. నకిలీ నగలు ధరిస్తున్నది పేదతనం.

'ఓ ఐడియా జీవితాన్ని మార్చేస్తుందా?' ఏమో! రామారావు సలహా ఇండియాని మార్చేసింది.

పదిమంది ఉన్నచోట ఓ వ్యక్తి కొన్ని చిన్న తెల్లవి కాగితాలు లెక్కించుతూ ఉంటే ఎవరైనా అటు చూస్తారా? లేదు. కానీ ఓ వంద 'పచ్చ'నోట్లు లెక్కిస్తుంటే కోటీశ్వరులైనా అటు చూడకమానరు. పదిరోజులనుండి ఉపవాసమున్నవాడు కమ్మని భోజనాన్ని చూసినట్టు అంతా చూస్తారు అటువేపు. ఎందుకు? ఆ 'రెప రెప' అలాంటిది.

మన బ్యాంక్ ఎకౌంట్‌లో పాతిక లక్షలుండచ్చు. పదికోట్లు ఉండచ్చు. కానీ ఓ పాతిక వేలు తెచ్చుకున్నాక దాన్ని తాకిన ఆనందం, లెక్కించినపుడు కలిగే సంతోషం వేరుగా ఉంటాయి. ఒకటికి రెండుసార్లు లెక్కించుకుంటాం. కారణం ఆ డబ్బుని తాకి అనుభూతి చెందుతాం. కొంతమంది ఖర్చు చేయకుండా కేవలం లెక్కించడానికే డబ్బుకూడబెడుతారన్నది నిజం. డబ్బు ఆకర్షణ అలాంటిది.

ఓసారి సిటీబస్సులోని ఓ వ్యక్తి చేతిలోని సూట్ కేసు క్రిందపడింది. అపుడు దాని మూతవీడి అందులో డబ్బంతా రోడ్డుమీద పడిపోయింది. అంతే బస్సు ఆగింది. ప్రయాణీకులు, డ్రైవర్, కండక్టర్ దిగారు. ఆ సమయానికి రోడ్డుమీద జనంగానీ, వాహనాలుగానీ లేవు. జనం అంతా డబ్బుని ఏరుతూ అతనికి ఆ డబ్బు తమది కాకపోయినా నేలమీద పడిన నోట్లు అందుకోవడంలో అనిర్వచనీయమై ఆనందం కలిగిందిట కొందరికి.

అది తమది కాదని తెలిసినా, అతనికివ్వాల్సిందేనని తెలుసున్నా ఇద్దరు ముగ్గురు తప్పించి నోట్లు ఏరారు. ఇది మనీ హిస్టీరియా. అది కళ్ళముందుంటే చూడకుండా, అందుబాటులో ఉంటే తాకకుండా ఉండలేకపోవడం. అలాంటి డబ్బు కళ్ళకి కనిపించడంలేదు. అవసరానికి కావల్సిన వస్తురూపం తప్ప డబ్బు రూపంలో కానరావట్లేదు. గూండాలు, రౌడీలు దిక్కు తోచకుండా ఉండిపోయారు. డబ్బు చూడకపోవడంతో తాగినా 'కిక్' రావడం లేదని ఓ తాగుబోతు వాపోయాడు. మన సంపాదన మన కళ్ళకి ప్లాస్టిక్ కార్డ్ రూపంలో కనిపించడం ఏంటని చాలామంది వాపోయారు. కనిపించడం వల్ల ఎన్ని అనర్థాలో రోజూ ప్రింటింగ్, (మరియు దృశ్య) మీడియా ద్వారా మేధావులు చెబుతున్నారు. ప్రజల్ని వెన్నుతడుతున్నారు.

ఏకపేటీ, దోపేటీ అని పెట్టెలు మారడం తగ్గింది. అరాచకాలు తగ్గాయి. దీనికి విరుగుడు కనుక్కునే దొంగలు, లొసుగులు వెదికే వారూ బయల్దేరకపోలేదు. అపుడు ప్రభుత్వ ప్రకటన వచ్చింది. "ఎవరూ అడ్డదార్లు తొక్కద్దు. అలాంటి కేసులు నాలుగు చూశామంటే ప్లాస్టిక్ కార్డ్ ప్లాన్ మార్చి నిముషాల్లో మరో కొత్త పద్ధతి ప్రవేశ పెట్టబడుతుంది."

ఒకప్పుడు ధనవంతులైన ప్రజలు, పేద ప్రభుత్వం. ఇపుడు? అలాగే ఉన్న ప్రజలు. సంపన్న ప్రభుత్వం. అందుకే ప్రభుత్వ బలంగా ఉంది. ప్రజల్ని శాసించగలుగుతోంది. దేశం బాగుంతుంది.

కానీ రామారావు ఇంట్లో విషాదం నెలకొంది. అతని కుటుంబ సభ్యులు ముగ్గురూ జీవచ్ఛవాలుగా బ్రతుకీడుస్తున్నారు. రామారావుకోసం వెదకని చోటులేదు. చేయని ప్రయత్నం లేదు. అతనే ఇంత అభివృద్ధికి కారణమని ఇంటి వాళ్ళకి తెలీదు. రాష్ట్ర, కేంద్రమంత్రుల్ని కలిశారు. వినతిపత్రం సమర్పించారు. అంతా అతన్ని వెదికే పనిలో ఉన్నారు. ఎవరి ప్రయత్నాలూ ఫలించలేదు.

చంద్రశేఖర్ ఇంకా వెదికిస్తున్నాడు. తన వల్ల అమెరికా వెళ్ళి అక్కడ మాయంకావడం ఏమిటి? అమెరికన్ పోలీసులని కలిశాడు. ఇక్కడి పైవారిని సంప్రదించారు. "మీ బిడ్డ సురక్షితంగా మీ ఇంటికి చేరుస్తాన"ని జయకి హామీ ఇచ్చాడు. చాటుగా దుఃఖించాడు. రామారావుని చంపేసి ఎక్కడో పడేసి ఉంటారు అనుకున్నాడు. ఐతే శవం దొరకలేదు కనుక కొంత ఆశగా ఉంది. 'అతను ఏనాటికైనా తిరిగి వస్తాడు'

భారత్ భూతల స్వర్గంలా మారింది. కానీ ఈ కలగన్న వ్యక్తి ఎక్కడో.. దూరంగా.

●●●

రాణి పుట్టినరోజు వేడుకలు. ఘనంగా ఏర్పాట్లు. ఆ దీవికి బానిసల్ని చేరవేసే వ్యక్తి 'టు'. తరతరాలు అతని కుటుంబమే బానిసల వ్యవహారం చూసుకుంటున్నది. ఆ వంశంలోని మగపిల్లలలో ఒకడిని ఎంచుకుని పడవ ఎక్కించి, ఓ చోట దించి వస్తారు. అక్కడ నుండి ఆ పిల్లవాడు పలు కష్టాలకి నాగరిక ప్రపంచంలోకి అడుగెడతాడు. చదువుకొద్దిగానూ, లోక జ్ఞానం కావల్సినంతాను, కొద్ది చదువూ నేర్చుకుంటారు. ఇదంతా బానిసలను కొనుగోలు చేయగల నైపుణ్యం వచ్చేంతవరకే. అతనికి అవసరం ఉన్నపుడు మాత్రమే దీవి వాళ్ళు అతన్ని బైటికి విడుస్తారు. 'టు' తరంలో అతనే చిన్నవాడు, చివరివాడు కూడా. అతనికి పదేళ్ళ వరకు సంతానం కలుగలేదు. పదేళ్ళ తరువాత ఓ కొడుకు పుట్టాడు. అతనికి పదేళ్ళురాగానే బానిసల వ్యవహారాన్ని నేర్పించి బయట ప్రపంచానికి పంపవలసిందని ఆదేశించారు. ఐతే ఈ వ్యవహారంలో ఆపదలు కూడా ఉండడంతో 'టు' ఈ వారసత్వాన్ని వదిలేసుకుంటానన్నాడు.

మరొకరిని చూసుకోమని బ్రతిమాలాడు. ఎవరూ అతని మాటని వినిపించుకోకుండా 'టు'ని బైటికి పంపించేశారు. రాణి పుట్టినరోజు సందర్భంగా బైటి ప్రపంచానికి వెళ్ళి మంచి డ్రెస్సూ, గౌను పండ్ల మిఠాయిలు, ఇంకా చాలా తినుబండారాలు తెచ్చిన 'టు' తన కొడుకుని కూడా తీసుకువచ్చి వేడుకలకి దీవి అంతా అలకరించబడింది. ఎత్తైన వేదిక. దానిపై సింహాసనం వంటి ఆసనం.

క్రింద రకరకాల తినుబండారాలు అన్నీ సిద్ధం. రాణి అందంగా అలంకరించుకుని, కొత్త గౌను తొడుక్కుని వచ్చింది. సింహాసనం పై కూర్చుంది.

'టు'కి మరో కొడుకు ఉన్నాడు ఐదేళ్ళవాడు. బలహీనంగా, సన్నగా ఉంటాడు. అంతా ప్రార్ధన చేస్తుండగా అక్కడ పరిచి ఉన్న స్వీట్ల నుండి ఓ ముక్కని తుంచి తినేశాడు. ఆదృశ్యం రాణి కళ్ళలో పడింది. అంతే. ఆమె కోపంతో ఊగిపోయింది. ఆ రోజు ఏ పదార్ధమైనా ముందుగా తినాల్సింది రాణి. చాలాసేపు ఆమె అరిచింది. గొడవచేసింది. పిల్లాడిని నాలుగు బాదింది. తరువాత వాదనలు జరిగాయి. చివరకి తేలిందేమంటే పిల్లాడికి సన్నని బెత్తంతో దెబ్బలు తినే శిక్షపడింది. 'టు' బ్రతిమాలాడు. తన పిల్లాడు అర్భకుడనీ, అలా చేస్తే చనిపోతాడని ఏడ్చేశాడు.

అతని పెద్దకొడుకు 'రి' కూడా తమ్ముణ్ణి క్షమించమని వేడుకున్నాడు. తండ్రీ కొడుకులని అక్కడి నుండి లాగి పిల్లాడిని అక్కడికి తెచ్చారు. వాడు ఏడుస్తూ, ఒళ్ళంతా చమటలతో, భయంతో స్పృహ తప్పి ఉన్నాడు. పిల్లవాడి తల్లి, తండ్రి, అన్న వాడికోసం విలపిస్తున్నారు. అక్కడ కొంతమందికి కూడా ఈ శిక్ష కఠినంగా తోచింది. అంతే. అంతవరకు చూసిన రామారావు ఇక తట్టుకోలేకపోయాడు. జనాల్ని తీసుకుని అక్కడికి చేరాడు. పిల్లాడికి అడ్డంగా నిల్చున్నాడు. వాడిపై పడవల్సిన దెబ్బ రామారావు మీద పడింది.

పిల్లాడిని తీసి 'టు'కి అందించాడు. అంతా 'హాహా'కారాలు చేశారు. "మిస్టర్ టు. ఆ పిల్లాడికి బదులు ఆ దెబ్బలు నేను తింటాను. చెప్పు మీ రాణితో అన్నాడు ఆంగ్లంలో. "వద్దు అలా చేస్తే నా పిల్లాడికి శిక్ష తప్పుతుంది. కానీ నీకు మరణ శిక్ష పడుతుంది" అన్నాడు టు. "పర్లేదు చెప్పు" అరిచాడు రామారావు విషయం చెప్పాడు టు తన భాషలో. రామారావుని మన్నించమని ప్రార్ధించాడు. రామారావుకి మరణ శిక్ష పడింది. 'టు'ని ప్రక్కకి లాగేశారు.

కొద్దిసేపటికి పెద్ద వైశాల్యం కలిగిన ఓ బోను పులితో సహా వచ్చేసింది. ఆ శిక్ష చాలా మందికి కఠినంగా తోచింది. చిరు సంధ్యలు కమ్ముకుంటున్నాయి. చంద్రుడు అప్పుడే ఉదయిస్తున్నాడు. ఆ ప్రాంతమంతా దివిటీల వంటివి వెలుగుతున్నాయి. ఆ వెలుగులతో ప్రకాశిస్తోంది. ఓ బలవంతుడు రామారావుని పులిబోను దగ్గరకి లాక్కువచ్చాడు. ఆ దృశ్యం చూడలేని చాలామంది తమ ఇళ్ళలోకి పరుగెత్తారు. కొందరు దూరంగా వెళ్ళి నిల్చున్నారు.

చాంగ్ తన మిత్రులతో తమ నివాసంలోకి పరుగు తీశాడు. దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు. ఎప్పుడూ దేవుడు లేడని వాదించే ఫెరోజ్ "యా అల్లా!" అంటూ దోసిలిపట్టి ప్రార్థన చేశాడు. "జీసస్! అతన్ని రక్షించు" అన్నారు మైఖేల్, డేవిడ్ స్టాయ్ కళ్ళుమూసుకుని రోదిస్తున్నాడు. ఓ పదిమంది, రాణి తప్ప అక్కడ జనం లేరు.

తనని పులిబోనులోకి నెట్టే చివరి నిముషం అనిపించింది రామారావు. 'నేనెలానూ పోతాను. పోయేముందు పులిని బెదరించాలి. ఇలా అనుకుని ప్రక్కనే వెలుగుతున్న దివిటీని గబాలున చేతిలోకి తీసుకున్నాడు. ఈ చర్యని గమనించని బలాఢ్యుడు రామారావుని బోనులోకి నెట్టడానికి బోను తలుపు తెరిచాడు. ఐతే అతని చేతిలోని మంటని చూసి అతను బోను తలుపు మూయడం మరచి చూస్తూండి పోయాడు. లోనికి వచ్చిన రామారావు చేతిలోని మంటని చూసిన పులి అదురుకుని బయటికి దూకింది. పులిగాండ్రింపు విని ఆ వ్యక్తి పరుగెత్తుకుంటూ వెళ్ళి ప్రక్కనున్న చెట్టు ఎక్కేశాడు. పులి చుట్టూ గమనిస్తోంది.

●●●

"నేను ఎంతగా చెప్పినా వినలేదు రామారావు" అన్నాడు చాంగ్ విలపిస్తు. "అతనో మొండివాడు" అన్నాడు మైఖేల్. తలో మాటా అంటున్నారు. కళ్ళు మూసుకున్నాడు చాంగ్. మరుక్షణం కళ్ళుమూసుకుని తెరచి "పదండి" అన్నాడు.

"ఎక్కడికి?" అడిగారు వాళ్ళు.

"రామారావు ఈ ఆపదనుండి తప్పుకుంటాడని సంకేతాలు అందుతున్నాయి నా మనస్సుకి. అది ఏమిటో తెలీడం లేదు."

"సరె ఓ పని చేద్దాం. మనం ఆరుగురుం కలిసి పోరాడుదాం. చంపితే పులిని చంపేద్దాం. ఉంటే అందరం బ్రతికుందాం. ఇక్కడి నుండి తప్పించుకుందాం పదండి."

"ఆఁ పదండి. మనల్ని విడిచి అతను వెళ్ళనన్నాడు. అతన్ని ఒంటరిగా విడిచి మనం ఎలా వెడతాం. అంతే. ఈ మాటనుకుని ఐదుగురు పరుగులతో అక్కడికి చేరారు. సరిగా వారు చేరే సమయానికి బలవంతుడు చెట్టు ఎక్కడం పులి చుట్టూ చూస్తూండడం కనిపించింది. విషయం అర్థమయింది. అందరూ తలా ఒక దివిటీ అందుకున్నారు. రామారావు బోనులో ఉన్నాడు. తలుపు లోపలి వైపు మూసుకున్నాడు. ఐదుగురు మిత్రులున్నారు. కానీ వాళ్ళ చేతిలో దివిటీలున్నాయి.

రాణి ఆశ్చర్యపోతూ చూస్తోంది. ఆమెకి ఏం చేయాలో పాలుబోవడంలేదు. పరుగెత్తడానికి లేదు పెద్దగౌను. బోల్డు ఆభరణాలు. పూసలు. కాళ్ళకి బూట్లు. ఏమీ చేయలేని స్థితి. పులి గమనించింది. నోటికి అందిన బువ్వ జారిపోయింది. అదిప్పుడు రాణి రూపంలో దక్కబోతుంది. ఒక్కసారిగా గాండ్రించి రాణివేపు వెళ్తోంది. రాణి కూడా ఓ దివిటీ అందుకుంది.

అది గమనించాడు రామారావు. అంతే. బోను తలుపు తీసుకుని బయటికి ఉరికాడు. ప్రక్కనే ఉన్న మరో దివిటీని అందుకుని పులి రాణిని సమీపించబోతూండగా పరుగెత్తుకు వెళ్ళి దానిపై విసిరాడు. పులి పెద్దగా అరుస్తూ అది వెనుతిరిగింది. రాణికి చెట్లు ఎక్కడం వచ్చు. కానీ ఆ సమయంలో ఆమెకా అవకాశం లేదు. అన్ని ఇళ్ళ తలుపులు మూసి ఉన్నాయి.

రాణి శరీరంలో నీరసం, కాళ్ళలో వణుకు ప్రారంభమయ్యాయి. ఆమె కళ్ళలో నీళ్ళు ధారగా ప్రవహిస్తున్నాయి. తన ప్రాణాలు పోవడం ఖాయం అనుకుందామె. పులి గాండ్రింపులకి ఆ చేతిలోని దివిటీ క్రిందపడింది. కంపించిపోసాగిందామె. గౌను తట్టుకుని బోర్లా పడిపోయింది. ఆరుగురి చేతిలో రెండేసి దివిటీలున్నాయి. వెనుదిరిగిన పులికి తిరిగి రాణి దగ్గరికి వెళ్ళాలనిపించి అటుగా వెళ్ళబోయింది. అంతే దాని తలపై మరో దివిటీ.

రాణికి అడ్డుగా వచ్చాడు రామారావు. అతని చేతిలో రెండు మంటల దివిటీలున్నయి. రాణి లేచి అతని వెనకాల వచ్చింది. ఈలోగా మిత్రులు ఐదుగురు పది దివిటీలతో అతనికి అండగా నిల్చారు. దానిపైకి మంటలని విసురుతున్నారు. గాయాల బాధతో అరుస్తూ

పులి ఆ చోటు విడిచిపారిపోయింది. దాన్ని చాలా దూరం తరిమి వెనక్కి వచ్చారు మిత్ర బృందం. పులివెళ్ళి పోగానే కళ్ళు తిరిగిపడిపోయింది రాణి. ఆమె ముఖం మీద నీళ్ళు చల్లారు. కాసిని ఆమె చేత తాగించారు.

చెయ్యిచ్చి సింహాసనం మీద ఎక్కించాడు రామారావు. ఆమె ఒక్కో అడుగుతో సింహాసనం దగ్గరికి వస్తున్నప్పుడు ఆమె మనసంతా రామారావు. ఎవరు వీళ్ళు? ఎక్కడి వాళ్ళు? 'టు' కొడుకు కోసం ఇతనెందుకు దెబ్బలు తినాలి? ఎందుకు శిక్షని అనుభవించాలి? పిల్లవాడికి ప్రాణాలివ్వాలన్న ఆలోచన వాడి తండ్రికి కూడా రాలేదు. ఇతనికి ఎలా వచ్చింది?

మరణ దండన విధించిన తనని ప్రాణాలకి తెగించి ఎందుక్కాపాడాడు? తనని దేవతగా కొలిచే తన వాళ్ళంతా పారిపోయారు. ఇతనికి తను శత్రువు. ఐనా ఎందుకు రక్షించాడు?'

●●●

మర్నాడు సమావేశం 'టు'ని అనువాదకుడుగా వాళ్ళతో చాలాసేపు మాట్లాడింది రాణి. "ఏం ఆశించి చేశావిదంతా?" అడిగింది. "కళ్ళ ముందు ఓ మనిషి ప్రాణం పోతుంటే ఎలా చూడగలం? నువ్వు కాదు. నన్ను బోనులోకి పెట్టినవాడు నీ స్థితిలో ఉన్నా అదే చేస్తాను"

"మరినేన్నీకు అపకారినీ, శత్రువుని కదా? నీకు మరణ దండన విధించాను కదా?"

"నే చనిపోలేదు కదా? బ్రతికే ఉన్నాను. పైగా నా మనసులో ఎవరి మీదా శతృత్వం ఉండదు"

"నువ్వున్న చోట జనాలంతా ఇంత మంచి వారుగానే ఉంటారా?"

"ఉండరు. అందరూ మామూలుగా ఇదిగో ఈ దీవి వాళ్ళలాగే ఉంటారు. కాని ఇతనో మంచివాడు. మంచి మనసున్నవాడు" అన్నాడు చాంగ్. "సరే! ఈ క్షణంలో ఈ రాణి గిరిని వదులుకుంటే నన్ను పెళ్ళాడతావా?"

"లేదు. నాకు పెళ్ళయింది. నా భార్య చనిపోయింది. ఒకే పెళ్ళి అనేది నా నియమం"

"నీవు నా ప్రాణదాతవి. నిన్ను విడుదల చేస్తున్నాను. టు దారి చూపుతాడు. వెళ్ళిపో"

"లేదు.. ఈ ఐదుగురినీ విడిస్తేనే నేను వెళతాను. లేదంటే ఇక్కడే ఉండిపోతాను."

"ఎందుకలా? నీ సంగతి నువు చూసుకో. నా మనసు మారి నిన్ను కూడా విడువనేమో."

"విడిచినా నేనొక్కడినీ వెళ్ళను."

"మిమ్మల్నందరినీ విడిస్తే మాకు నీళ్ళు ఎలా? ఆ నీళ్ళు తేవడం మా వల్ల కాదు.

"నీళ్ళు మీ ముంగిటకి వచ్చే ఏర్పాటు మేం చేస్తాం. మీరు ఊఁ అనండి చాలు."

"మీమీద నమ్మకంతో ఒప్పుకుంటున్నాను. మమ్మల్ని మోసం చేయరు గద?"

"చేసి ఎక్కడికి వెళ్ళగలం?"

రాణి ఒప్పుకుంది. ఆ రోజే స్టాయ్ చెప్పిన చోట తవ్వకాలు ప్రారంభమయ్యాయి. దీవి వాళ్ళంతా తవ్వుతున్నారు. రెండు రోజులకే నీటి జల పడింది. లోతుగా తవ్వించి మురికి నీరు పారబోయించారు. బావి చుట్టూ రాతిగోడ, కొయ్య గిలక, చేద, తాడు ఏర్పాటు చేసి నీళ్ళు తోడి చూపించాడు స్టాయ్. అక్కడి జనమంతా ఆనందంతో కేరింతలు కొట్టారు. పోటీలు పడి నీళ్ళు తోడారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు నీళ్ళు చల్లుకున్నారు. ఈ ఆరుగురినీ చంద్రదేవత పంపించిందని భావించి ఊరేగించారు.

●●●

మైఖేల్ ద్వారా గోబర్ గ్యాస్ ప్లాంట్ తయారైంది. ఇంటికో బల్బ్ వెలిగింది. వంట గ్యాస్ తయారైంది. ఫెరోజ్ పిల్లల్ని చేరదీసి పాఠశాల ప్రారంభించాడు. చక్కగా బట్టలు ధరించడం, ఇంగ్లీష్ నేర్చుకోవడం చిన్న చిన్న పదాలు పలకడం చూపించాడు. కొంతమంది యువతీ యువకులు త్వరగా నేర్చుకున్నారు. వారిని టీచర్లుగా నియమించారు.

అవసరమైన సరుకు సరంజామ 'టు' ద్వారా తెప్పించుకుంటూ దీవిని బాగుచేశారు. డేవిడ్ తనకి తెలిసిన మూలిక వైద్యం కొంతమందికి నేర్పించి ఎలా వాడాలో, ఎలా తయారు చేయాలో రాసిచ్చాడు. చాంగ్ ధ్యానం, ఆసనాలు, యోగా నేర్పించాడు.

ఆరు నెలల్లో దీవి స్వరూపమే మారిపోయింది. రాణీ కూడా ఇంగ్లీష్ నేర్చుకుంది. చిన్న చిన్న పదాలు పలుకుతోంది. దీవి వాసుల్ని పిలిచి రామారావు వాళ్ళని విడుదల చేస్తున్నానని ప్రకటించింది. అంతా సంతోషంతో ఒప్పుకున్నారు. "ఇంక మరెవ్వరినీ బానిసలుగా తెచ్చుకోము" అంది రాణి.

పడవ ఎక్కబోతుండగా రామారావుకి షేక్‌హేండిచ్చి చెప్పింది. "చంద్రదేవత దయవల్ల మళ్ళా జన్మంటూ ఉంటే నిన్నే పెళ్ళాడుతా!"

"చంపావుపో. ఈ జడపదార్థం ఎందుకు? నాలాంటి వాడిని చేసుకోవచ్చుకదా" డేవిడ్ అన్నాడు.

"ఆపై జన్మలకి నువ్వు. ఇప్పటి నుండీ తపస్సు చెయ్యి" అందామె.

దీవి వాళ్ళు కన్నీళ్ళతో వీళ్ళకి వీడ్కోలు పలికారు.

ఆరుగురూ కలిసి ఆనందంగా పడవలో ప్రయాణించారు.

●●●

"హలో"

"రేయ్ శివా! నేనురా!"

"రేయ్! రేయ్ నువ్వు బ్రతికే...బ్రతి.."

"ఆఁ! నేను జీవించే ఉన్నాను. ఢిల్లీ విమానాశ్రయంలో ఉన్నాను. మరో ఐదునిమిషాలకి ఫ్లైట్ ఎక్కబోతున్నాను. నువ్వు శంషాబాద్ వస్తావా? నేను టాక్సీలో రానా?"

"ఒద్దొద్దు. నేనే వస్తాను" అన్నాడు. అంతే ఆ ప్రాంతానికంతా చైతన్యం వచ్చేసింది. అన్నం నీళ్ళు మాని ప్రాణాలుగ్గబట్టుకున్న ఆ కుటుంబం వారంతా ఈ వార్తతో ఒక్కసారిగా ఉత్సాహవంతులయ్యారు.

కడుపు నిండా టిఫిను చేశారు. కాఫీలు తాగారు. క్షణాల్లో ఈ వార్త అందరికీ చేరింది. ఆరు కార్లలో అంతా శంషాబాద్ చేరుకున్నారు.

●●●

"అందుకే బావా! చాలా చిక్కిపోయావు. ఇంతకీ మీ మిత్రులు అదే చాంగ్ వాళ్ళు అంతా ఎక్కడికి వెళ్ళారు?" జరిగిన కథంతా చెబుతున్న రామారావుతో అంది మేఘ.

"వాళ్ళు వాళ్ళ దేశాలకి వెళ్ళిపోయారు. చాంగ్ మాత్రం దలైలామాని కలవడానికి మనదేశానికి వచ్చాడు. తమకి వీలున్నప్పుడు అంతా వస్తామన్నారు. "

"మరి పడవ దిగాక మీకు డబ్బులు ఎలా? ఇక్కడివరకు ఎలా రాగలిగారు?"

''అదంతా 'టు' చూసుకున్నాడు. మా వీసా, పాస్‌పోర్ట్ ఎవరిదగ్గరున్నాయో అతనికి తెలుసు. అవి తెచ్చి మా చేతికిచ్చాడు. డబ్బు కూడా ఇచ్చాడు. అతను తన దీవికీ, మేం మా దేశాలకీ వచ్చేశాం.''

''బావా! నీ మంచి మనసే మరలి రాలేని దీవుల్నుండి నిన్ను తిరిగి వచ్చేట్టు చేసింది.''

''అందరికీ మంచి మనసుంటుంది మేఘా! కాకపోతే ఆ సమయానికి నాకలా కలిసొచ్చిందంతే.''

''ఏమన్నా అనరా బై నువ్వో దీపానివి. నువ్వు లేకుంటే మేమంతా చీకటి బతుకు గడిపినం.''

''నర్సిమ్మన్నా! నేను వెలుగుని కాదు. అదృష్టవంతుడిని. అందుకే నాకింత మంది బంధువులు.''

●●●

''అమ్మా! రామారావు బాబు ఉన్నారా?'' ఎవరిదో కేక. జయ బైటికి వచ్చింది.

''మీరు..ఆఁ మా అబ్బాయి అత్తగారూ, మామగారూ కదూ? రండి లోపలికి'' అంది.

''లేదమ్మా మేం ఊరు వెళ్తున్నాం. ఈ బట్టలు, ఈ ఫోటోలు మూడు బాబు పెళ్ళినాటివి. బాబుకి ఇవ్వండి. ఇవిచ్చి వెళ్దామని వచ్చాం'' అంటూ ఎంతగా బలవంత పెట్టినా ఇంట్లోకి కూడా రాకుండా వెళ్ళిపోయారు.

రామారావు వచ్చాక అతనిచ్చిన బ్యాగ్ అలాగే అందించి విషయం చెప్పింది జయ.

తన గదిలోకి వెళ్ళి ఫోటోని చేతిలోకి తీసుకున్నాడు. మాస్టర్ రామారావుకి ఓ బేబీతో పెళ్ళి. పెళ్ళి కూతురు చాలా బాగుంది. ఆమె ముఖాన్ని తడిమి తడిమి చూసుకున్నాడు.

వెంటనే సిరియాళ్ వాళ్ళింటికి వెళ్ళి ''సిరియాళ్ ఈమె నా భార్య. ఎప్పుడో చిన్నతనంలో చూశాను. ఊహ తెలిశాక చూసేసరికి పోలికలు లేకుండా మృత్యుముఖంలో ఉంది. అందుకని ఈమె యవ్వనంలో ఎలా ఉంటుందో ఓ బొమ్మ వెయ్యి. నాకీ సాయం చెయ్యి'' అన్నాడు.

''అదేంటి భయ్యా! రేపుదయం బొమ్మతో నీ గుమ్మంలో ఉంటాను'' అంటూ ఫోటోలు తీసుకున్నాడు సిరియాళ్.

ఐతే మర్నాడు ఉదయం జయ ముగ్గు వేస్తుండగా హడావుడిగా వచ్చాడు సిరియాళ్. ''ఆంటీ! చంద్రశేఖర్ గారు నన్ను అర్జంటుగా బొంబాయి వెళ్ళమన్నారు. రాత్రి బట్టలు అవీ సర్దుకుని పడుకునే సరికి ఆలస్యమయింది. బొమ్మ వేయలేకపోయాను. భయ్యాకి చెప్పండి. నా మిత్రుడు ఓ ఆర్టిస్ట్ ఉన్నాడు. అతను నాకన్నా బాగా వేయగలడు. అతని విజిటింగ్ కార్డ్ ఇదిగో. ఇదిచ్చి భయ్యాని ఇతన్ని కలవమని చెప్పండి'' అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

జయ అతను వెనక్కిచ్చిన ఫోటోలు, విజిటింగ్ కార్డ్ రామారావుకి ఇచ్చి జరిగింది చెప్పింది. ఈ రోజు సాయంత్రమే అతన్ని కలుస్తాను అనుకున్నాడు రామారావు. సాయంత్రం ఆర్టిస్ట్‌ని కలిసి మూడు ఫోటోలు ఇచ్చి మూడు బొమ్మలు వేయమని అడ్వాన్స్‌గా మొత్తం డబ్బు ఇచ్చి వచ్చేశాడు రామారావు. ఆ రాత్రి అతనికి నిద్ర రాలేదు 'నా శ్రీమతి యవ్వనంలో ఎలా ఉండేదో త్వరలో చూడగలను' అన్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది అతని మనసు.

●●●

''హలో రామారావుగారా?''

''అవునండీ!''

''నేను ఆర్టిస్ట్ అరవింద్‌ని. మీరు చెప్పిన బొమ్మ వేశాను. వచ్చి తీసుకువెళ్ళండి.''

''అలాగే. ఈ రోజు సాయంకాలం వస్తానండీ''

రామారావు అరవింద్‌తో మాట్లాడి సాయంత్రం వెళ్ళాడు. అప్పటికి ఆర్టిస్ట్ అతను వేసిన మూడు బొమ్మలని ప్యాక్ చేసి ఉంచాడు. అవి తీసుకుని ఇంటికి వచ్చాడు. అప్పుడు సిరి ఉంది ఇంట్లో. ఆ రోజు వెళ్ళిన ఆమె మళ్ళీ ఇదే రావడం. "ఆమె వైవాహిక జీవితం ఎలా ఉందో?" అనుకున్నాడు. ఇలా అనుకోవడం అతనికి నచ్చలేదు.

ఆమెని చూశాక అతని మనసంతా అదోలా అయింది. ఆమె వెళ్ళాక కూడా ఎలాగో ఉన్నాడు. "తలనొప్పిగా ఉందమ్మా" అంటూ గదిలో తలుపేసుకుని పడుకున్నాడు.

మర్నాడు, ఆ పైరోజుకూడా ఏవో పనులలో ఉండిపోయాడు. తను ఇష్టపడి గీయించుకున్న చిత్రాన్ని చూడలేదు. సిరిని చూశాక ఎందుకో అవి చూడాలనిపించలేదతనికి.

మూడోరోజు ఇంట్లో ఎవరూ లేరు. ఏదో పెళ్ళికి వెళ్ళారు. రామారావు తన గదిలో ఎలుక కనిపించింది. ఎలుకలంటే అతనికి అసహ్యం. ఇంట్లో ఒక్క ఎలుకని చూసినా దానికోసం ఇల్లంతా గాలించేస్తాడు. "ఇంతపెద్ద ఎలుక నా గదిలోకి ఎలా వచ్చిందో?" అనుకుని తలుపు మూసి ఎలుక వెంటపడ్డాడు.

మంచి బట్టలు, అవసరమైన కాగితాలు ఎలుకగారికి ప్రియం. అదే అతని భయం రామారావు ఎలుక వెంటపడ్డాడు. అది అక్కడక్కడే తిరుగుతున్నది. కిటికీ గుండా బయటకి పంపాలని అతని ఉద్దేశ్యం. సామాన్లు, పుస్తకాలు తీసి ఓ దుప్పటిలో కట్టి దానివెంట పడ్డాడు. అదేమో తలుపు గుండా బైటికి వెళ్ళాలని చూస్తోంది.

ఓ క్షణం ఆలోచించి తలుపు దగ్గర ఖాళీ చేసిన బియ్యపు సంచి ఉంచాడు. ఎలుక దానిలోకి దూరగానే సంచిని మూసి బైక్ మీద సంచిని వేసుకుని బైలుదేరాడు. చాలా దూరం ఓ పాడుబడిన బావిలో దాన్ని గిరాటేసి వచ్చాడు.

తిరిగి వచ్చి తన గది సర్దుకునేసరికి పెద్దలు గుర్తొచ్చారు. ఇందాక కట్టిన మూట అక్కడ ఉంది. సరే పాత పేపర్లు అడుగున పరిచి అవి సర్దుదాం అనుకుని హాల్లో చూస్తే లేవు. నిన్న అమ్మేసినట్టున్నారు. సిరి ఉండి వెళ్ళిన గదికి వెళ్ళాడు. అల్మారా పైన పాత పేపర్ కనిపించింది. తీసి చూస్తే అది సిరి డైరీ. మాములుగా పేజీలు తిప్పాడు. వద్దనుకుంటునే చదివాడు.

అవి అక్షరాలు కాదు. సిరి ఆలోచనా తరంగాలు.

అందులోని ప్రతి అక్షరం రామారావుని గురించి రాధ వంటి ఆరాధన.

అతని మాట, పలుకు, అన్నీ ఆమె గుండెల్లో నిలుపుకున్నది.

- పైకి మామూలుగానే ఉంటున్నాను. కాని అహర్నిశలూ అతని తలుపులే.

నా ఈ వింత భావన పిచ్చా? అయి ఉంటుంది.

లేదంటే ఓ వ్యక్తిని గురించి మరొకరు ఇంతగా ఆలోచించడం ఉంటుందా?

"ఓ దైవమా! రామారావుతో నాన్నకున్న గొడవేమిటో నాకు తెలీదు. అందుకని నన్ను తను స్వీకరించడని నాకు తెలుసు. ఫ్రేమ్‌లో బంధించబడిన ఫోటోలా అతని రూపం నామదిలో ఇలా నిలిచి ఉంటున్నది. ఎందుకు?"

"ఓ ప్రభూ ఒక్కరోజైనా అతని భార్యగా ఉంటే చాలు. ఆ వరం ఇవ్వు." -

డైరీ నిండా ఇలాంటి కోరికలే. ఈ రకమైన విన్నపాలే. ఇలా సాగిన ఊహలే.

డైరీ చదివే కొద్దీ ఆమె రూపం అతని మనో నేత్రాల్లో పెరగసాగింది. ఏదో చదువుతున్నాడు అది మెదడుకి చేరడంలేదు.

ఏదో ఆలోచిస్తున్నాడు అది కళ్ళు గమనించడం లేదు.

డైరీలో పేజీలు దొర్లుతున్నాయి. రామారావు మనస్సులో ఆలోచనలూ దొర్లుతున్నాయి. తెలుగు వేగంగా చదివే రామారావు డైరీ చదవడం పూర్తిచేశాడు. డైరీ మీద సిరి కనిపించింది. ఇందాక ఈ ఫోటో లేదే అనుకున్నాడు. అపుడు అక్షరాల్లో కనిపించింది. గోడమీద, ఇంటిపై కప్పుకీ, సినిమాల్లోలా సర్వత్రా ఆమె రూపం కనబడుతోంది.

తన గదికి వచ్చాడు. గదినిండా, బెడ్ మీద, ఫైల్స్‌లోనూ, అల్మారా మీద, అంతా సిరిమయం.

ఏమిటీ? తన సిరికి పిచ్చిపడుతోందా? ఆ సూచనలేనా ఇవి?

"బాబోయ్" అనుకుని నీళ్ళ గ్లాసు తీశాడు.

గ్లాసులోని నీళ్ళతో "నాకేదో అయ్యింది" అన్నాడు.

నీళ్ళ గ్లాసు పక్కన పెట్టాడు.

అమ్మతో మాట్లాడితే బాగుండు అనుకున్నాడు. ఎవరూ ఇంట్లో లేరు. దుప్పటిలో ఇందాక పరిచిన సామాను తీశాడు. అన్నీ సర్దేశాడు. చేతిలోకి తీసుకున్న ప్రతివస్తువులోనూ సిరి. గబగబా అన్నీ సర్దాడు. గది చిమ్మాడు. గది శుభ్రంగా ఉందిప్పుడు. ఇంకేం? గదినిండా సిరి. ఇలాక్కాదని పుస్తకం తీశాడు. పేజీ పేజీలోనూ ఆమె రూపం. పుస్తకం గూట్లో పెడుతుండగా ఇందాక ఆర్టిస్ట్ ఇచ్చిన ప్యాక్ కనిపించింది.

లామినేషన్ చేసి ఉంచిన ఆ మూడు చిత్రాలు తీశాడు. మూడింటిలోనూ సిరి. తలవిదిల్చి వాటిని తిరిగి మూసి బాత్రూంలో దూరాడు. వేడినీళ్ళతో తల స్నానం చేశాడు. ఐనా తలంతా ఏదో అవుతున్న అనుభూతి. టిక్కెట్టులోనూ, సబ్బుమీద, మగ్‌లోనూ సిరి.

గబగబా బైటికి వచ్చాడు. బట్టవేసుకున్నాడు. "ఇంట్లో ఉంటే నాకు పిచ్చి పడుతుంది. తప్పదు" అనుకుని అలా బైటికి నడిచాడు. అంబరీష్ కనిపించాడు.

"భయ్యా! నేను కూడా చాలా బొమ్మలు వేస్తున్నాను. రండి చూపుతాను" అన్నాడు. సిరియాళ్ లేడు. వాళ్ళమ్మగారికి పూర్తిగా ఆరోగ్యం చేకూరింది. ఆమె మాములుగా అయింది.

"రా బాబూ" అంది. టిఫిన్ పెట్టి కాఫీ ఇచ్చింది. అంబరీష్ తన గదిలోకి తీసుకు వెళ్ళాడు. బోల్డు కబుర్లు చెప్పాడు. తను వేసిన బొమ్మలు చూపాడు. సిరియాళ్ గదిలోకి తీసుకు వెళ్ళాడు. వాళ్ళన్నయ్య గురించి చెప్పాడు.

"భయ్యా, మా అన్నయ్య వేసిన బొమ్మలు కూడా చూడండి" అంటూ సిరియాళ్ వేసిన, వేస్తున్న బొమ్మలు చూపాడు. ఆ పిల్లాడితో మాట్లాడాక రామారావు మనస్తాపం తీరింది. కాస్త బుద్ధి నెమ్మదించింది. చిరునవ్వుతో తన ఇల్లు చేరాడు.

అప్పటికి జయవాళ్ళు వచ్చి ఉన్నారు. మేఘ, విభీషణ, శివవాళ్ళు అంతా వచ్చారు.

"రేయ్! ఈ మధ్య మనందరం కలిసి చాలారోజులయింది. అంతా కలిసి ఎక్కడికైనా వెళదాం" అన్నాడు శివ.

"నీ ఇష్టం. నాకూ పెద్దగా పనులేమీ లేవు" అన్నాడు రామారావు.

"రేపు వచ్చే ఆదివారం మా వారి పుట్టినరోజు. అందరికీ మా ఇంట్లో విందు" అంది జయ.

"అయ్యో! మామయ్యా! ఆదివారం శెలవు కదా? ఎలా పుట్టారు?" అంది మేఘ.

"నేను ఇంత గొప్ప వ్యక్తిని పుట్టాననే ఆదివారం శలవు ఇచ్చారు" అన్నాడు సూర్యం.

"అందరికీ ఆదివారం రమ్మని కబురు అందజేయి" అన్నాడు విభీషణ మేఘతో.

ఆదివారం వచ్చింది. అందరూ వచ్చారు. ఆ రోజు బోల్డు పెళ్ళిళ్ళున్నాయి. మంచి ముహూర్తం అట. టీవీలు, పత్రికలు నినదించాయి. ఇల్లంతా సందడిగా ఉంది. సిరియాళ్ అదేరోజు వచ్చాడు. అంతా హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. మంజు, మేఘ, చెరో గ్రూపుగా చేరి అంత్యాక్షరి ఆడుతున్నారు. వంటావిడ అందరికీ కాఫీ, టిఫిన్లు ఇచ్చింది.

''ఇల్లంతా పెళ్ళి సందడి వచ్చేసింది'' అన్నాడు ప్రభాకర్.

''పెళ్ళికొడుకే పప్పన్నం పెట్టట్లేదు'' అంది మంజు.

''పప్పన్నమంట ఏందిరా భయ్'' అన్నాడు నరసింహ.

''ఏమ్మా! మధ్యాహ్నం భోజనంలో పప్పు వండించడంలేదా?'' రామారావు చిర్నవ్వుతో అన్నాడు.

''ఉత్త పప్పన్నమా? గది మా ఇంట్ల లేదా? గీడికెందుకు రావాలె?''

ఇలా ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడేసుకుంటున్నారు.

అప్పుడు రామారావు చెప్పులు వేసుకుంటూ ''నేను బైటికి వెళ్తున్నాను. రెండు గంటల్లో వచ్చేస్తాను. మీకు ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగించే పని చేయబోతున్నాను. అదేంటో నే వచ్చేలోగా ఊహించండి'' అంటూ బైటపడ్డాడు.

●●●

గేటు తీసుకుని లోపలికి వస్తున్న రామారావుని చూసి ''సాప్‌లోగ్ ఫల్ మే నయ్యే'' అన్నాడు గూర్ఖా.

''కహాఁగయే?''

చెప్పాడు గూర్ఖా. బండి వెనక్కి తిప్పాడు రామారావు. వినాయకుడి గుడి చేరాడు. గుడిపాతదే దాన్ని ఇటీవలే రిపేర్ చేయించారు భక్తులు. సిటీకి దూరంగా ఉందాచోటు. ఐదెకరాల స్థలం. అందులో తోట. నడి మధ్యన గుడి.

తోటలో రకరకాల చెట్లు, పక్షులు. అవి చేసే సందడులు. రామారావు గుడి అంతా వెదికాడు. తోటంతా వెదికాడు ఆ తోటలో, వేపచెట్టు క్రింద వేసిన అరుగుపైన కుర్చుని కనిపించారు వాళ్ళు. తమవేపుకి వస్తున్న రామారావుని చూసి ప్రపంచంలోని పదో వింత చూస్తున్నట్టుగా శిలల్లా అయిపోయారు. రామారావు వాళ్ళని చేరాడు.

ఆయన్ని సమీపించి ''మీరు పెద్దలు. నా కఠిన చర్యలు మన్నించండి. నన్ను క్షమించండి.'' అన్నాడు ఆయనకి నమస్కరిస్తూ. ఆయన రామారావు చేతులు అలాగ ఆపి అతన్ని గాఢాలింగనం చేసుకున్నాడు.

''నేను. నేను మా వాళ్ళందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతానని ఇలా వచ్చాను'' అన్నాడు.

ఆయన ''ఆశ్చర్యమా?'' అని ఆగి ''ఓ.. ఆనందాశ్చర్యాలు కలిగిద్దాం''. మీరు మాట్లాడుతూ ఉండండి అంటూ జేబులో నుండి సెల్‌ఫోన్ తీసి ఏదో మాట్లాడుతూ ముందుకు కదిలాడు ఆయన.

కొద్దిసేపు ఆయన వెళ్ళిన వంక చూసి వెనుదిరిగాడు రామారావు.

''పేజీలు పేజీలు డైరీలు వ్రాయడంగాదు. ప్రియమైన పలుకు ఒక్కటి పలుకు'' అన్నాడు. ఆమె అతన్ని పరీక్షగా చూస్తోంది. అతన్నికాదు. అతని వెనుక జనాలని.. హడావుడిగా వస్తూ, హడావుడి చేస్తూ రంగప్రవేశం చేశారు.

●●●

''బావ మనకి మాయ మాటలు చెప్పి ఏ సమాజ సేవకో చెక్కేశాడు. ఇప్పట్లో రాడుగానీ పెళ్ళి ఊరేగింపు వస్తోంది. చూద్దాం పదండి'' అంది మేఘ. ఆమెతో పాటు కొంతమంది జనాలు బైటికి వచ్చారు.

మేఘు వెంటనే "అత్తయ్యా! మామయ్యా! వెంటనే రండి" అని అరుస్తూ పిలిచింది" అంతా బిలబిల మంటూ వచ్చేశారు.

బ్యాండ్ మేళం ఇంటి ముందుకి వచ్చేసింది. ఇల్లు దాటి ముందుకి వెళ్ళింది కానీ ఓపెన్ టాప్ కారు ఇంటిముందు ఆగింది. అంతా చూస్తున్నారు కళ్ళు అప్పగించి. మతులు పోయిన వాళ్ళలా, శిలాప్రతిమల్లా నిల్చుండిపోయారు. కారులో నుండి దిగుతున్న వధూవరులు సిరి, రామారావు.

"అత్తయ్యా! నన్ను గిల్లు" అంది మేఘు.

"అక్కర్లేదు. ఇది వాస్తవమే కలకాదు" అన్నాడు రామారావు నవ్వుతూ.

●●●

**రామారావుకప్పుడు పదేళ్ళు.** ఓరోజు సాయంత్రం బస్టాపులో బస్సుకోసం నిరీక్షిస్తున్నాడు. బడి వదిలారు అప్పుడే 'ఇంటికి వెళ్ళాలి' పిల్లల్లో ఉత్సాహం. ఓ బస్సు వచ్చి అందులో చాలామంది పిల్లలు ఎక్కారు. బస్టాప్‌లో ఇద్దరు ముగ్గురు తప్ప జనాలు లేరు.

రామారావు మరో బస్సు కోసం చూస్తున్నాడు. "బాబూ! ఓ పావలా ఉంటే ఇవ్వు. టీ నీళ్ళు తాగుతాను. " ఏదో మగ కంఠం. జాలేసి జేబులో చేయిపెట్టాడు. అంతే. ఏమయిందో తెలీదు. కళ్ళు మూతలుపడ్డాయి. మెలుకువ వచ్చేసరికి బెడ్‌లైటు వెలుగు. చుట్టూ జనాలు. వాళ్ళు ఆడామగా కానివారు. లేవబోయాడు. అతనిమీద ఏదో బలమైన చేయి ఉంది. నెమ్మదిగా చెయ్యితీసి పక్కనుంచాడు. అపుడు చూసుకున్నాడు. ఒంటిమీదుండాల్సిన బట్టలు గోడకి తగిలించి ఉన్నాయి. భయమేసింది. వణుకుతున్నాడు. అలాగే లేచి అందర్నీ దాటుకుంటూ తలుపు చేరి లాగాడు. నెమ్మదిగా తెరుచుకుందది. గదంతా సీసాలు, బాగా మైకంలో పడున్న జనాలు. బైటపడి రోడ్డు చేరాడు. అర్థరాత్రి కాబోలు. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. ఒకటి రెండు ఆటోలు వచ్చాయి. వణుకుతూ చెయ్యి చాచాడు.

అతని అవతారం చూసి ఎవ్వరూ ఆపలేదు. అటూఇటూ చూశాడు. ఎవరో తినిపడేసిన పేపర్లు, పాలిథిన్ కవర్లు. ఓ పక్కగా వెళ్ళి అవి చుట్టుకున్నాడు. మళ్ళీ వెదుక్కుంటూ వాళ్ళు వస్తారని భయం. సందుల్లో నుండి నడుస్తూ రోడ్డు చేరాడు.

అక్కడ ఓ ఆటో ఆగి ఉంది. అందులో ఎక్కాడు. డ్రైవర్ వచ్చాడు. అతన్ని చూడలేదు. ఆటో వెళ్తోంది. ఇంక 'వాళ్ళ' నుండి తనకి ఆపదలేదని తెలుసుకుని చాలాదూరం వచ్చాక "అంకుల్" అన్నాడు.

డ్రైవర్ వెనుతిరిగి చూసి "ఎవర్నువ్?" అన్నాడు. రామారావు చెప్పాడు.

"అలాగా!?" అంటూ తన కోటు విప్పి ఇచ్చాడు.

"నీకేం భయంలేదు. నేను ఏమనను చెప్పు. మీ ఇల్లు ఎక్కడ?" అడిగాడు.

"నేను... నేనిలా మా ఇంటికి వెళ్ళలేను. ఇలా రోడ్డు మీద దించండి" అన్నాడు.

"ఎందుకు?"

"అసలే మా వాళ్ళకి భయం. నన్నిలా చూస్తే తట్టుకోలేరు. రేపట్నుండి బైట కాలుపెట్టనీయరు.

"సరే! మా ఇంటికిరా!" అంటూ తనింటికి చేర్చాడు. అతని భార్యతో ముందీ బాబుకి వేడివేడి నీళ్ళతో స్నానం చేయించు. భోజనం పెట్టు. ఉతికిన బట్టలివ్వు" అని చెప్పి మూలనున్న గొడ్డలి పట్టుకుని పక్కింటి తలుపు తట్టాడు. "యాదన్నా!" అంటూ. అతని పేరు నారాయణ.

అంతే క్షణాల మీద రెండు ఆటోల్లో పదిమంది నిండి రామారావు ఎడ్రస్ చెప్పిన చోటుకి వెళ్ళారు. కష్టపడి ఆ గది కనుక్కున్నారు. కానీ అప్పటికే ఆ గది ఖాళీగా! "తప్పించుకున్నారు ధూర్తులు" అన్నాడు. అంతా ఇళ్ళు చేరారు. అప్పటికి రామారావు ఉన్నాడు.

మర్నాడుదయం ఇంటికి వచ్చి స్నేహితుడింట్లో ఉన్నానని చెప్పాడు. "ఇవి నా బట్టలే" అన్నాడు. అపుడు చూసుకున్నాడు కాలిదెబ్బ. రాత్రి చీకట్లో పడిపోయినప్పుడు తెలియలేదు. ఇపుడు భయం లేదు గనక బాధ తెలుస్తోంది.

జయ వాళ్ళ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు. డాక్టర్ కట్టు కట్టి ఎక్కువగా నడవద్దన్నారు. బడి నుండి ఆటో నారాయణ ఇంటికి వెళ్ళాడు. రోజూ తనని స్కూలునుండి ఇంటికి, ఇంటినుండి స్కూలుదాకా దించడానికి ఆటో మాట్లాడాలని తండ్రి అనుకుంటూండగా విని "నాన్నా! నాకు తెలిసిన ఆటో అంకుల్ ఉన్నారు" అంటూ నారాయణని ఇంటికి పిలిచాడు. అతనే రెండునెలల దాకా దించాడు స్కూల్లో. అతనికి ఓ కొడుకూ, కూతురు. కొడుకు ఈ మధ్య యాక్సిడెంట్‌లో పోయాట్ట.

కాలునొప్పి తగ్గాక కూడా ఏదో ఓ సాకు శివకి చెప్పి స్కూలునుండి నారాయణ ఇంటికి వెళ్ళేవాడు. ఓ రోజు అతను వెళ్ళేసరికి ఓ అందమైన పాప ఉంది వాళ్ళింట్లో. సిటీలో ఉండే ట్రాఫిక్‌కి దడిసి పాపని ఊళ్ళో బామ్మ, తాతయ్యల వద్ద ఉంచానన్నాడు. ఆ పాప ఈమె అయి ఉంటుందనుకుని "మీ పాపా?" అనడిగాడు.

వాళ్ళు 'ఔ'నన్నారు.

రామారావు వెళ్ళేసరికి ఆ పాప వాకిట్లోని వేపచెట్టుకి ప్రదక్షిణ చేస్తూ ఉంది. వాకిట్లో ఎవరో పండితుడు కూర్చుని ఉన్నాడు. ఆయన ముఖం తేజస్సుతో వెలుగుతూంది. "ఇవేవీ కలవలేదు" అంటున్నాడాయన. ఆయన చేతిలో ఏవో కాగితాలున్నాయి.

రామారావుని చూసి "బాబూ! ఇలారా" అన్నాడాయన.

రామారావు చెయ్యి అందుకుని చూసి, కళ్ళు పెద్దవి చేసి "నారాయణా!" అన్నాడు.

"అయ్యా!"

"అమ్మాయిని గనక ఈ అబ్బాయికిచ్చి పెళ్ళిచేస్తే ఆమెకి అపమృత్యుగండం తప్పుతుంది. సౌభాగ్యవతిగా వర్ధిల్లుతుంది."

"కానీ.. కానీ.. అయ్యగారూ!"

"ఆలోచించకు. మనకి సమయం లేదు. అతనితోనే మాట్లాడతాను."

"సరే నేను ఈ బాబుతో మాట్లాడి వస్తాను." అంటూ రామారావుని వాకిట్లోకి తీసుకువెళ్ళి "బాబూ ఆ పాపకి అపమృత్యుదోషం ఉంది. త్వరలోనే చనిపోతుందిట" అన్నాడు.

"అంకుల్ ఈ కాలంలో కూడా మీరిలాంటివి నమ్ముతారా? అదంతా బూటకం. ఆ పెద్దాయనకి ఏదో కొంత డబ్బు ఇచ్చి పంపించండి"

"అలా అనకు. ఆయనేమీ పుచ్చుకోరు. నాకూ ఇలాంటి నమ్మకాలు లేవు. కానీ నా కొడుకుని గురించి ఆయన చేసిన హెచ్చరికలు విని ఉంటే ఈనాడు వాణ్ణి దూరం చేసుకుని ఉండను.

'కనీసం ఒక నెలరోజులు బడికి పంపించకు' అన్నాడు. నేను నవ్వి ఊరుకున్నాను. ఇనుప వస్తువు వల్ల వాడికి ప్రాణగండం ఉందని చెప్పాడు.

వాడు స్కూలు నుండి వస్తుండగా కొత్తగా కడుతున్న మేడ ఇనుప ఊచలు జారిపోయి వాడి తలపై పడి అక్కడికక్కడ చనిపోయాడు. ఇది నిజంగా నిజం" ఆయన దుఃఖించాడు.

"అంకుల్.. నాకెంతో సాయం చేసిన మీకు నేనేం చేయగలనో చెప్పండి."

"ఐతే విను. ఆ అమ్మాయిని నువ్వు పెళ్ళిచేసుకుంటే ఆ గండం గడచిపోతుందిట."

"పెళ్ళి అంటే ఏంటంకుల్? నేను చిన్నవాడిని. అమ్మా, నాన్నా, తాతయ్య ఒప్పుకుంటారా? ఒక వేళ మీరు వాళ్ళని ఒప్పించినా నా వయస్సేంటి?"

"పోనీలే బాబూ ఎవరి ప్రాప్తం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అతని కళ్ళలో నీరు.

"అంకుల్ నాకు ఏమీ చేయని వారికే ఏదో ఒకటి చేయాలనిపిస్తుంది. నా ప్రాణదాత మీరు మీకు సాయం చేయాలని ఉంది. చెప్పండి. నేనేం చేయాలి?"

"ఆ పాపని పెళ్ళాడు."

"మీరేం చెబితే అది చేస్తాను. కానీ రహస్యంగా అమ్మవాళ్ళకి తెలీకుండా..!?"

"సరే! ముహూర్తం కూడా ఈ రోజే. మరో అరగంటలో ఉందిట."

"మీరేం చెయ్యమన్నా చేస్తాను."

రామారావుని గబగబా తయారు చేసి పెళ్ళి బాసికం కడుతుండగా అడిగాడు నారాయణ

"బాబూ! నిన్నిలా ఇబ్బంది పెడుతున్నందుకు నామీద కోపంగా ఉందా?" అని.

"లేదంకుల్. ఆనాడు మీరు రక్షించకుంటే నాకు బ్రతుకే లేదు. మనస్ఫూర్తిగా మీకు సాయపడాలనే అనుకుంటున్నాను" అన్నాడు రామారావు.

పెద్దాయన దగ్గరుండి పెళ్ళి తంతు జరిపించాడు. బంధువులు పెద్దగా లేరు. ఓ ఐదారుగురు ఉన్నారంతే. తాళి అలా కట్టీకట్టగానే సత్యనారాయణ వచ్చాడు కార్లో. పెళ్ళి మంటపంలోకి వచ్చిన ఆయన రామారావుని చూసి

"వీడా! వీడెక్కడ దొరికాడు నారాయణా! నీకు? ఈ కొరకరానికొయ్యకిచ్చి చేశావా? అయ్యో!" అంటూ తలపట్టుకున్నాడు.

"అంకుల్ ఈయనెందుకు వచ్చాడు?" అన్నాడు రామారావ్.

"ఈయన.. ఈయన.." అంటూ సత్యనారాయణ ముఖం చూసి ఓ నిముషం ఆగి "ఈయన మాకు బాగా తెలిసినవారు. కొద్దిసేపు ఉండి వెళ్ళిపోతారు" అన్నాడు నారాయణ. పెళ్ళి తంతుకాగానే పెద్దాయన వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ రామారావుని పిలిచి అతని తలపై చేయి ఉంచి "బాబూ! నువ్వు అంతర్జాతీయ ఖ్యాతినార్జించుతావు. దేశానికి ఉపకారివి. ఈమె నీ భార్య. కానీ ఈమె జాతకం వల్ల మీకు వియోగం ఉంటుంది. ఈమెకి పెద్ద ప్రాణ గండం ఉంది. అది నీవల్ల గడిచి గట్టెక్కుతుంది. ఆ తరువాత మీరు కలిసి ఉంటారు. నా వాక్కు పొల్లుబోదు. నీకు శుభం జరుగుతుంది" అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

అంతా భోజనాలు చేస్తున్నారు. అంతలో వాకిట్లో పోలీసు జీపు ఆగింది. మైక్‌లో అరుస్తున్నారు. "వినండి ఈ బస్తీలో ఎవరింట్లోనో దుండగులు బాంబు పెట్టారట. అందుకని అంతా ఇల్లు ఖాళీ చేసి వెళ్ళండి. వెంటనే వెళ్ళండి. ఎక్కువ టైమ్ లేదు"

అంతే జనాలంతా ఉరుకులు పరుగులతో పారిపోతున్నారు.

నారాయణ కుటుంబాన్ని, రామారావునీ తన కార్లో ఎక్కించుకున్నాడు సత్యనారాయణ.

చాలా దూరం వచ్చాక "నేనిక ఇంటికి వెళతాను" అన్నాడు రామారావు.

కార్లో ఉండగానే అతని ముఖానికున్న పెళ్ళి బొట్టు, తలపై జీలకర్రా, బెల్లం అన్నీ తీసి అతని బట్టలు అతనికి తొడిగాడు నారాయణ. "బాబూ అప్పుడప్పుడు వస్తూండు" నారాయణ చెప్పాడు. తువ్వాలుతో అతని ముఖాన్ని మరోసారి తుడిచి "ఇపుడు మామూలుగా ఉన్నావు. ఎవరికీ అనుమానం రాదు" అన్నాడు.

"వస్తా అంకుల్" అంటూ కారుదిగి రోడ్డు దాటాడు రామారావు. తరువాత నాలుగురోజులకి వెళ్ళాడు నారయణ ఇంటికి. ఐతే బాంబుని పోలీసులు కనుక్కోలేకపోవడం వల్ల అది పేలింది. ఆ ఇల్లు నారాయణ పక్కిల్లు. నారాయణ పెంకుటిల్లే కాక ఆ చుట్టుప్రక్కల మరో ఐదారిళ్ళు కూడా నేలమట్టమయ్యాయి.

చాలారోజులు ఆ మొండి గోడల్లో తిరిగి తిరిగి, ఇక నారాయణ రాడని, సత్యనారాయణ అతన్ని ఎక్కడికో తీసుకు వెళ్ళి ఉంచాడని భావించి ఆయనపై కోపం పెంచుకున్నాడు రామారావు. అపుడు రవిని చంపాడు. ఇపుడు నారాయణని తనకి దూరం చేశాడు అంటూ చాలారోజులు ఆలోచిస్తూ గడిపాడు.

రవి రామారావు తోటి విద్యార్థి. రోజూ కార్లో వచ్చేవాడు. "రామం మామయ్య నన్నెప్పుడో చంపేస్తాడు. 'ఇది తిను, అది తినకు' అంటూ ఆంక్షలు పెడతాడు. ఏమీ తిననీడు. ఆడుకోనీడు" అంటూ చెప్పేవాడు.

ఓరోజు "మీ హెడ్ మాస్టర్ గారికివ్వు" అంటూ వెయ్యిరూపాయలు ఇచ్చాడు. అవి కాస్తా రవి ఎక్కడో పోగొట్టాడు. వాటికోసం స్కూలంతా వెదికి వెదికి "రామం మామయ్య నన్ను చంపిపారేస్తాడు. చూడు రేపు నేను స్కూలుకి రాను. రేపుకాదు. ఎప్పుడూ రాలేను" అంటూ చాలాసేపు ఏడ్చాడు. అతనసలే బలహీనంగా నీరసంగా ఉంటాడు. ఏదో జబ్బుపడిన వాడిలా కనబడతాడు. చాలా ఏడ్చాడేమో జ్వరంకూడా ఉంది.

బడి విడిచాక అన్నాడు "రామం నే వెళ్తున్నారా! మళ్ళీ నీక్కనిపించను. అమ్మా, నాన్నాలేని అనాధని. మామయ్య నన్ను పెంచుతున్నాడు. ఈరోజు ఆయనకి కోపం తెప్పించాను. నన్ను మా అమ్మా నాన్నల దగ్గరికే పంపేస్తాడు" అంటూ పడిపోయాడు. అంతలో కారు వచ్చింది. డ్రైవర్, ఇంకా సత్యనారాయణ పిల్లవాడిని కార్లో ఎక్కించారు.

అంతే. తెల్లవారినుండి రవి బడికి రానేలేదు. ఆరునెలలు గడిచాక ఓరోజు స్కూల్ నుండి వస్తుండగా రోడ్డుప్రక్కన కారు దగ్గర నిల్చున్నాడు సత్యనారాయణ. డ్రైవరేమో కారు టైరు మారుస్తున్నాడు. రామారావు ఆయన దగ్గరకి వెళ్ళి "మీరు రవి మామయ్య కదా!" అన్నాడు.

"అవును. నువ్వు?" అడిగాడాయన.

"నాపేరు రామారావు. రవి స్నేహితుడు. వాడు స్కూలుకి ఎందుకు రావడంలేదు?" అడిగాడు.

"వాడికి ఒంట్లో బాగోలేదు బాబూ! అందుకని ఆపరేషన్ కోసం లండన్ పంపించాను."

"కాదు. వాడిని మీరు చంపేశారు."

"ఏంటీ? వాణ్ణి చంపానా?"

●●●

**ఔను. వాడు మీరిచ్చిన వెయ్యిరూపాయలు పోగొట్టాడు.** అప్పుడే చెప్పాడు. మీరు తన్ని చంపేస్తారనీ, ఇక స్కూల్కి రాలేననీ ఆనాడే చెప్పాడు. మీరు హంతకుడు" పెద్దగా అరిచాడు. అంతే! ఆయన రామారావు చెంపమీద ఛెళ్ళున చరిచి "చంపేస్తాను జాగ్రత్త. ఇలాంటి పిచ్చి వాగుడు వాక్కు" అంటూ కారెక్కి వెళ్ళిపోయాడు.

అలా రెండు మూడుసార్లు రామారావు ఆయన్ని వేధించాడు. తన స్నేహితుడ్ని ఏం చేశావని అడిగాడు.

ఓసారి "బాబూ! వాడు నా మేనల్లుడురా! నా చెల్లెలి కొడుకు. గుండె ఆపరేషన్కి లండన్ పంపించాను. వాణ్ణి నేనెలా చంపుకుంటానురా!" అన్నాడు అనునయంగా.

"లేదు మీరు చంపే ఉంటారు. లేదంటే వాడు నాకు ఉత్తరమైనా వ్రాసి ఉండేవాడు" అంటూ పోట్లాడాడు రామారావు.

"ఛీ! కొరకరాని కొయ్య వెధవ!" అంటూ కసిరి కారెక్కాడు ఆయన.



కౌముది

●●●

"ఇదీ జరిగిన కథ." అన్నాడు సత్యనారాయణ.

"వావ్! అంతా బాగుంది. కానీ ప్రాణం పోయినా నీతి పోరాదనే బావ నారాయణగారి కూతురు చనిపోయాక అపుడు ఏకపత్నీవ్రతమని ఫోజులు కొట్టి ఇపుడు సిరిని ఎందుకు పెళ్ళాడి వచ్చారు?" అంది మేఘ.

"ఇపుడు పెళ్ళాడ్డం ఏమిటమ్మా. ఇతను ఆరోజు పెళ్ళిచేసుకుంది నా కూతురు సిరినే"

"వ్వా..వ్వా..వ్వాట్?"

"ఆ ఆటో డ్రైవర్ మా ఊళ్ళో మా ప్రక్కింటి వాడు. నా చిన్ననాటి స్నేహితుడు. నాకు ప్రియమైనవాడు. వాడి పేరు నారాయణ అని ఉందని మా స్కూలు రిజిస్టర్‌లో మా వాళ్ళు పెట్టిన చిదంబరరావు అనేపేరు తీసేసి సత్యనారాయణరావు అని పేరుపెట్టుకున్నాను. ఆ ఊరు విడిచినా అప్పుడప్పుడు వెళ్ళేవాడిని. నాకు సిరి పుట్టాక కలిసొచ్చి రెండు చేతులా సంపాదించి కోట్లకి పడగలెత్తాను. వాడేమో వరదలు, తుఫానుల వల్ల సంసారం చివికి రోడ్డున పడ్డాడు. సాయం చేస్తే పుచ్చుకోని ఆత్మాభిమానం. అందుకే ఆటో కొనిచ్చాను. ఆ ఇల్లు కొని సగం డబ్బు నేనే కట్టాను. నేను జర్మనీ వెళ్తూ నా కూతుర్ని వాడిదగ్గరుంచి వెళ్ళాను. అప్పుడే మా ఇద్దరికీ ఇష్టుడైన మృత్యుంజయ శర్మ నా కూతుర్ని చూసి యమగండం ఉందని చెప్పాట్ట. నారాయణ నాకు ఫోన్ చేసి చెప్పాడు. నివారణ కోసం మంచి జాతకుడితో పెళ్ళి చేయాలని నేను ఫోన్ చేయగా నాకు చెప్పాడాయన.

ఆ బాధ్యత నారాయణ మీద పెట్టాను. వాడు ఎవరిని చూసినా నా కిష్టమేనన్నాను. నాకేమో అక్కడ చాలా ముఖ్యమైన పని. పెళ్ళిరోజు వస్తానన్నాను. పెళ్ళయ్యాక వచ్చాను. ఏ అనామకుడైనా సరే వాడివల్ల నాకూతురు బ్రతికితే వాణ్ణే నా ఆస్తికి వారసుడిగా చేసి ఆదరిస్తాననుకుని వచ్చిన నాకు ఈ రామారావే కనిపించడం పెద్దషాకు. అదీ అల్లుడిగా."

"మరి ఆ రోజు మేం చూసిన ఆమె?"

"ఆమె నారాయణ కూతురు. భర్త ఆమెని విడిచి వెళ్ళి సన్యాసం తీసుకున్నాడు. ఆ దిగులుతో రోగాన పడిందామె. సరిగ్గా ఆ సమయంలోనే నారాయణ రామారావు కంటపడ్డాడు. అప్పటికి ఎలాగో తప్పుకున్న నారాయణ నన్ను కలిసి విషయం చెప్పాడు. అప్పటికి సిరి రామారావు ఇంట ఉంది. ఆమే ఆనాటి పెళ్ళికూతురని తెలిస్తే సిరిని ఇంటినుండి పంపేస్తాడనుకుని అపస్మారక స్థితిలో ఉన్న వాడి కూతుర్ని చూపమన్నాను. జరిగింది మరిచిపోతాడనుకున్నానుగానీ ఇలా ఏకపత్నీవ్రతం ఆచరిస్తాడని ఎవరికెరుక?"

"అది సరే. రవి..రవి ఏమయ్యాడు?"

"వాడు నా చెల్లెలు కొడుకు. చెల్లీ బావగారు పోయాక వాణ్ణి తెచ్చుకున్నాను. కానీ చిన్ననాడే తెలిసింది. వాడి గుండెకి చిల్లట. అందుకని అవీ ఇవీ తినద్దని కట్టడి చేసి, కఠినంగా మాట్లాడేసరికి వాడు నన్ను అపార్థం చేసుకున్నాడు. వాణ్ణి లండన్ తీసుకెళ్ళి ఆపరేషన్ చేయించి అక్కడే మా అక్క దగ్గర ఉంచి చదివించాను. వాడే ఈ రవి" తన పక్కనున్న యువకుడిని చూపాడు.

రామారావుని అడిగింది "బావా! నువ్వు ఇప్పటికైనా నోరు విప్పు. ఈ చిక్కుముడి ఎలా వీడింది?" మేఘ.

"ఆనాడు ఆర్టిస్ట్ ఇచ్చిన చిత్రాలు వెంటనే నే చూడలేదు. అలా ప్యాకెట్ తెచ్చి నా గదిలో పెట్టాను. సిరియాళ్ కూడా బొమ్మ వేశాడు. వేశాక చూస్తే అది సిరి. నేనేదో అంటానని భయపడిన సిరియాళ్ ఊరికి పారిపోయాడు. సిరిని చూడని మరో వ్యక్తి వేస్తే అది నమ్ముతానని అరవింద్ అడ్రస్ ఇచ్చి వెళ్ళాడు. అవైనా ఆరోజు ఎలుకగారి దయవల్ల చూడగలిగాను కానీ తీరా వేయించాక నేనసలు చూడకూడదనీ, ముసలితనంలో తప్పు చూడరాదని నిర్ణయించుకున్నావాడిని. సిరి డైరీ చూసి, ఆమెని మనసులో నుండి తీసెయ్యడానికి నా భార్య ఫోటో చూడాలనుకున్నాను.

అప్పుడు కనిపించింది ఆర్టిస్ట్ వేసిన బొమ్మ. ఒకటికాదు మూడు. అవి సిరివి. తరువాత సిరియాళ్ ఇంటికి వెళితే అంబరీష్ సిరియాళ్ వేసిన బొమ్మలు చూపాడు. అందులో కొత్తగా వేసిన సిరి బొమ్మ కనబడింది. అంతే. నా అనుమానం తీరింది. నా పెళ్ళి ఫోటో తీసి చూసుకున్నాను. బుల్లి సిరి గొంతుక మీద గరళం వంటి శనగ గింజంత పుట్టుమచ్చ దొండకాయల బుట్ట దొర్లిన రోజు సిరికంఠం మీద మచ్చ చూశాను. కానీ అది ఫోటోలో ఉన్నట్టుగానీ, నా పెళ్ళికి ఫోటోలంటూ తీశారనిగానీ నాకు తెలీదు.

నారాయణ అంకుల్ ఫోటో ఇచ్చి వెళ్ళిననాడు కూడా నేనా మచ్చని గమనించకపోవటం నా భార్య జబ్బుతో ఉందన్న దిగులు వల్లనే కాబోలు" అన్నాడు రామారావు.

●●●

కళ్యాణ మంటపం అంతా సందడిగా ఉంది. జనాలంతా హడావిడిగా తిరుగుతున్నారు.

"హలో అండీ! నమస్తే. మీరు..? మీ పరిచయం?"

"ణేణు గ్రామ్మారావ్ డోస్టాణి"

"ఏంటండీ బాబూ మీ తెలుగిలా తగలడింది. 'ఇంకా నయం ఈ మాటలు పైకి అన్నానుగాదు. తనకి పల్వరస లేదనే కోపంతో ముసలాయన నా పళ్ళు రాలగొట్టేవాడు.'

'ఆఁ వెలిగింది బల్బ్. ముసలాయనకి పల్వరస ఊడిందికదూ! అందుకే ఆయన తెలుగు అలా..'

"ఎవరండీ మీరు?" ముసలాయనోవాచ

"నా పేరు రచయిత అండీ."

"ఆఁ చెప్పాడు చెప్పాడు. మా స్నేహితుడు రామారావు చెప్పాదు. మీరు తన కథ వ్రాస్తానంటే తాను వద్దన్నానని చెప్పాడు. ఇందాక నా కట్టుడు పల్వరస జేబులో పెట్టుకుని మరిచాను. అవిపుడు నా నోట్లోకి వచ్చాయి."

"అవునూ! ఇంతకీ మీరు మామిడి చెట్టు ఎక్కారా?"

"ఆ! మా అమ్మే ఓరోజు బలవంతం చేసి నన్ను చెట్టెక్కమంది. నెమ్మదిగా ఎక్కాను. ఆ రోజు రాత్రి మా అమ్మ పోయింది."

"ఇపుడు మీరు ఎలా ఉన్నారు?"

"నా కొడుకులు, మనవలు అంతా మామిడి చెట్టు ఎక్కచ్చని చాటుతున్నాను."

"ఓ.కే. అందర్నీ కలవాలని వచ్చా. వస్తా. హలో జయగారూ! బాగున్నారా? నేను రచయితని."

"ఆఁ మీ గురించి విన్నాను"

"ఔనూ ఏంటీ పెళ్ళి హడావుడి? ఎవరికి పెళ్ళి?"

"మంజు ఆడపడచుని విభీషణ పెళ్ళాడుతున్నాడు."

"ఆమె బిడ్డతో సహా స్వీకరిస్తున్నాడా?"

"ఔనండీ! ఆ బిడ్డని దత్తత చేసుకున్నాకే పెళ్ళిచేసుకుంటున్నాడు. వాడి మాటల్లో చెప్పాలంటే అచ్చుల్లో వాడు విభీషణుడు - హల్లుల్లో విలక్షణుడు." అంది సుబ్బాయమ్మగారు.

"హల్లో సార్! సూర్యంగారూ మీరిప్పుడు ఎలా ఉన్నారు? ఆనందంగా...?"

"ఆఁ కానీ కొద్దిగా .. చిన్నగా.. ఇంచుకంత బాధ."

"ఎందుకని?"

"నాకేమో అక్కడక్కడ తెల్ల జుట్టు. మాఆవిడేమో నిన్నటి హీరోయిన్‌లా ఎంతబాగుందో..."

"ఆమె ముఖానికి నల్ల రంగైనా వేసుకోమనండి. జుట్టుకి తెల్ల రంగైనే వేసుకోమనండి."

"ఓ ఇది ఆలుమగల మధ్య తగవు. మధ్యలో వెళ్ళానంటే నా వీపుపై దరువు. హలో తాతగారూ బాగున్నారా? నేను.."

"మీరు రచయితని పెళ్ళిమంటపంలో అందరికీ తెలిసిపోయింది. మీకు తెలియంది అక్కడ జరుగుతోంది. రండి.. రండిలా"

●●●

"రేయ్ బుద్ధిలేదూ? ఆడపిల్ల అంత చక్కగా ఆడుతూంటే పూబంతిని మూడుసార్లు విడిచేశావ్. మూడోసారి విడిచేస్తే పనిష్మెంట్ ఇస్తామని చెప్పలేదూ?"

"చెప్పావు. ఇపుడేం చేసేది? గుంజిళ్ళు తీసేదా?"

"గుంజిళ్ళు వద్దు. నువ్వో కవివని ఫీలైపోతుంటావుకదా! విను. తెలుగు భాషలో నాలుగు ప్రాసపదాలున్నాయి. అవి ఒక చోట చేర్చి పలికితే అసభ్యకరమైన, అభ్యంతరకరమైన శృంగారార్థం వస్తుంది. ఆ పదాలేమిటో కనుక్కొని వాటితో శృంగారార్థం కాకుండా మరేదైనా అర్థం వచ్చేలా పద్యం చెప్పాలి.

" 'మ'కార ప్రీతి కరుడివి కనుక కనీసం మూడు మకారాలైనా ఉండాలి." అంది మేఘ.

"సరే ప్రయత్నిస్తాను."

"పందరోజుల సమయం ఇవ్వరమ్మా! ఈ బంతాటకు బ్రహ్మగారు (పౌరోహితులవారు) ఇచ్చిన సమయంలోనే ఆలోచించుకుని, మిగిలిన పెళ్ళితంతుకి పిలిచేలోపు చెప్పాలి"

"అలాగేలేవే తల్లీ! ఇది అచ్చుల్లో మేఘ. హల్లుల్లో కందిరీగ. కుట్టేదాకా వదల్దు" నవ్వుతూ అన్నాడు విభీషణ.

పదినిమిషాలు పోయాక బ్రహ్మగారు పిలిచారు. "మిగిలిన పెళ్ళితంతు పూర్తిచేయాలి విభీషణగారూ రండి."

వధూవరులు పెళ్ళి పీటలమీద కూర్చోబోతూండగా అంది మేఘ "పద్యం" అని.

"సరే విను.

***ఉ. పట్టెను భామ చేతులను పార్థుడు గాజులవాడు తను చూ***
***పెట్టెను పూలగాజులను పెళ్ళి కుమార్తెకు ముందు వేళ్ళతో***
***కొట్టెను వాటిపైన ఇవి కోరిన చిక్కని కంకణాలనీ***
***నెట్టెను పెట్టె చూడమని నేర్పుగ మాటలు చెప్పె యొప్పుగన్"***

అంటూ పద్యం చదివాడు. బ్రహ్మగారితో సహా అంతా చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు.

మేఘ అంది. "'మ'కారాల మాటేంటి బాబూ! ఒక్కటీ కనబడ..సారీ వినబడదే?" అని.

"'మ'కారమంటే నాకు మమకారం, ప్రాణం. ఓంకారానికి రామ్‌నామ్‌కీ చివరి అక్షరం అది. దాన్నెలా విడుస్తాను. నా ప్రాణమైన మకారాన్ని పంచప్రాణాలు చేసి ఐదుమకారాలతో చెప్పాను పద్యం. కావాలంటే రాసుకుని చూసుకో"

"అక్కర్లేదు. నేనిందాకే వ్రాశాను. ఐదు మకారాలున్నాయి" ప్రభాకర్ చెప్పాడు.

"ఇదిగో కావాలంటే చూడమ్మా" పేపర్ మేఘ చేతికిచ్చాడు.

మేఘ సంతోషంగా అంది. "వీడు అచ్చుల్లో విభీషణ. హల్లుల్లో మకారాయణ."

"మేఘగారు!"

"చెప్పండి రచయితగారూ!"

"మీ పెళ్ళి ఎప్పుడు జరిగింది?"

"నెలరోజుల క్రితం."

"మీ ఆయన ఎక్కడ?"

"ఇదిగో నా చీరకొంగు. దానికి చివరన అక్కడే ఎక్కడో ఉంటారు వెతుక్కోండి"

"అల్లాగే.... ఓ సిరియాళ్ భయ్యా! తమరిక్కడ? పట్టుచీర కొంగు పట్టుకుని?"

"కొంగులో ఉంగరం దాగుంది రచయితగారూ"

"పోతే పోనీ సిరియాళ్ భయ్యా! మీ స్వేచ్ఛకన్నా ఎక్కువా? విడిచి అలా గాడిపొయ్యి దగ్గరికి పారిపోవాల్సింది."

"పారిపోవాల్సిన వాడినే. ఆ ఉంగరంలో నా వేలు లేకుంటే" అన్నాడు సిరియాళ్ నవ్వుతూ.

"బాధపడకు భయ్యా! తప్పులు చేయడం మానవ సహజం."

"సిరియాళ్‌జీ!"

"జీ!"

"తప్పులు అంటే?"

"తప్పులు అంటే ఏంలేదు. మనుగడ కోసం మనిషి పడే తిప్పలు. తరువాత కాలంలో అవే తప్పులు."

"గుడ్! బాగా చెప్పావు భయ్యా! అలా ముందుకి వెళ్తాను. ఓ విజాతి ధ్రువాలు ఇక్కడే కనిపించారు. వందనాలు. మీరిద్దరూ చెరో మాటల విసురు విసిరారంటే ఆ గాలికి మరోచోటుకి కొట్టుకుపోతాను."

"ఓ.. మా ఆవిడనడగండి. చాలా బాగా మాట్లాడుతుంది. ఐనా ఆడవాళ్ళు మాట్లాడేది, మాట్లడగలిగేది రెండేవిషయాలు సుమా! పరనిందా, ఆత్మస్తుతి" అన్నాడు శివ దివ్య వ్మెక చూస్తు.

"అయ్యో పాపం మీకు ఓ విషయం తెలుసా? మగవారికి సద్భావనలేశం, తద్భ్రాంతిమిక్కుటం" దివ్య వెంటనే అంది.

"థాంక్యూ పొట్ట నిండింది. పదండి ముందుకు."

"ఇక్కడ తగవులెట్టి పొట్టనిండిందంటారు. మీరు రచయితా, నారదుడా?"

"ఇవి జగడాలు కావండీ బాబూ మాటల చమకుల చురకలు."

"తగిలాయంటే వాతలు పడతాయి జాగ్రత్త వెళ్ళండలా చూస్తూ చూస్తూ"

"అస్తు.. అస్తు. ఇంతకీ హీరోయిన్ ఎక్కడ?"

"హీరోయినా? కథానాయిక. అంటే సిరి. ఆ గదిలో విరహగీతాలు పాడుకుంటోంది" శివ జవాబు.

"విరహగీతాలేంటి నా ముఖం. ప్రేమగీతాలై ఉంటాయి."

"కాదు. అవి విరహగీతాలే. ఎందుకంటే ఇందాకే మా వాడికి రైల్వే మినిష్టర్ నుండి ఫోనొచ్చింది. ఆయన్ని కలవడానికి వెళ్ళాడు."

"ఔను. ఆడ ఏంజేసుకొస్తడోనని ఎన్నాల్లకొస్తడోనని మర్దల్‌పిల్ల పరేషాన్ గుంది."

"ఓ! నిన్ను మరిచిన్నే నర్సిమన్నా! మంచిగున్నావ్?"

"బాగున్న తమ్మీ! కథలు రాసేటాయ్నవంటగద? మావోని కథ మంచిగ రాస్తున్నవా"

"రాస్తనని వస్తే మీవోడు ఒద్దన్నడుగద."

"గట్లనా? ఆన్కి చెప్పేదేంది బై. నువ్ సాటుంగ రాసుకో. ఆడు నిన్నేమన్న అంటే నేన్జూసుకుంట. మంచిగ రాయి మరి."

"ఔనన్నా! బాబిని జర పరిచయం చెయ్యరాదె?"

"నా పెల్లాం పోరినా? జర ఉండు. ఓ...ఓ..ఓ.. లచ్చిమే.."

"అబ్బ! ఇంత పెళ్ళి సందట్లో అంత పెద్ద కేకలేంటీ? ఎందుకు పిలిచారు?"

"ఇగ్గో ఈన కథలు రాస్తరు సూడు. ఆయ్నంట. నిన్ను జూస్తనంటె పిల్చిన."

"భాబీజీ! నమస్తే. నేను రచయితని."

"నమస్తే. మీగురించి ఇందాకట్నుండి వింటున్నాను. ఇపుడు చూస్తున్నాను. మావారి గురించి మంచికథ రాయరాదుటండీ. బోల్డు మ్యాటర్ నేనిస్తాను."

"ఇగ్గో లచ్చిమే. నన్నేమైనా చెయ్యి. కొట్టు, తిట్టు, కాల్మొక్కించుకో, ఏదన్నా చెయ్యిగాని ఈరో (హీరో)ని చెయ్యకు. జీరోనైపోత. ఇగ్గో కథలతమ్మీ నువ్వు గసుంటబో. నీకు శానమంది ఈరోలు దొర్కుతరు."

"అదిగో! అసలు హీరోనే వచ్చాడు. రామారావుగారూ నమస్తే. ఆ చిరునవ్వుకీ, సంతోషానికి కారణం చెబితే మేమూ ఆనందిస్తాం."

"రైల్వే మంత్రిగారు నన్ను పిలిపించి నేనేమీ చేయకపోయినా సరే నా వల్లే దేశం బాగుపడిందని మెచ్చి, మేకతోలు కప్పి, స్పెషల్ కేసుగా స్వీకరించి గూడ్స్ రైలు డ్రైవర్ ఉద్యోగం ఇచ్చారు."

"అబ్బో మీ చిరకాల వాంఛ ఈడేరింది మరి ఆ బొగ్గు, మంట, నిప్పులు, అవన్నీ మీవల్ల అవుతుందా?"

"క్రొత్త రైళ్ళు ప్రవేశపెట్టబడినాయి. సోలార్ సిస్టమ్‌తో నడుస్తాయి. ఏసీలో కూర్చుని హాపీగా దూసుకుపోవచ్చు."

"బాగుంది రామారావుగారూ! ఇంతకీ మీ శ్రీమతి సిరిని పరిచయం చేయలేదు మీరు."

"అవును. ఇప్పుడే తీసుకు వస్తానుండండి. సిరీ!.. సిరీ.."

"గాడ... గాముల రూమ్ల కలవరమాయే మదిలో అని పాట పాడ్తాకూసుందిరా బై పో. పోయిగామెనంట తీస్కరాపో.."

"అక్కడా నర్సిమ్మన్నా.. ఆం వెళ్తున్న."

●●●

రామారావు వెళ్ళి అరగంట అయింది. ఇప్పుడే వస్తానని ఇంకా రాడేంటి?"

"గీడు రానీకి లేటైందని ఆమె అల్గి ఉంటది. గామె సత్తెబామై కూసుంటుది. గీడు కిష్టమూర్తై కాళ్ళు మొక్కుతుంటడు. నీ పరేషానేంది. నీ లొల్లి ఏంది? ఎల్లిర బై"

"అవునన్నోయ్! వస్తా.!"

"రాతమ్మీ! మల్లీ ఎప్పుడైనారా. కానీ నాకథ మట్టుకు రాయకు. తెల్సిందా?"

"తెల్సిందన్నా! బాగ తెల్సింది."

**సమాప్తం**